
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి

మంగళవారం | 8-1-2019 | పేజీలు: 16 + 20 | వెల: రూ.6.50 | సంపుటి: 15 సంచిక: 183 | శ్రీవిళంబినామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, పుష్యమాసం, శుక్లపక్షం; తిథి: విదియ ఉ. 11.55 తదుపరి తదియ; నక్షత్రం: శ్రవణం రా. 11.41 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: తె. 4.12-6.01; దుర్ముహూర్తం: ఉ. 9.05-9.49, రా. 10.08-10.59; అమృతఘడియలు: ఉ. 11.56-1.45; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.54; సూర్యాస్తమయం: 5.51 | నిజామాబాద్ సిటీ*

Nizamabad | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Anantapur | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Kakinada | Khammam | Kadapa | Ongole | Nallagonda | Bangalore and Chennai

అగ్రవర్ణ పేదలకు 10% రిజర్వేషన్



అనూహ్యం.. సంచలనం.. మోదీ రాజకీయ చాణక్యం

3 రాష్ట్రాల్లో ఓటమితో, విపక్షాల దాడితో ఆత్మరక్షణలో పడ్డట్టు కనిపించిన ప్రధాని మోదీ ఒక్కసారిగా ఎదురు దాడి చేశారు. 4 నెలల్లో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్న తరుణంలో.. అగ్రవర్ణపేదలకు 10% రిజర్వేషన్లు ప్రకటిస్తూ రాజ్యాంగ సవరణకు సిద్ధమయ్యారు. స్వాతంత్ర్య భారత చరిత్రలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించడం ఇదే తొలిసారి! తద్వారా మోదీ విపక్షాలకు మాస్టర్ స్ట్రోక్ ఇచ్చారు! అవి మింగలేని, కక్కలేని పరిస్థితి సృష్టించి, కోటాకు మద్దతివ్వక తప్పని అనివార్యతను కల్పించారు. ఒకప్పుడు తమ మద్దతుదార్లుగా ఉండి.. దూరమైన అగ్ర వర్ణాలను తిరిగి దగ్గర చేసుకునేందుకు మోదీ వేసిన ఈ ఎత్తు 2019 ఎన్నికల నినాదాన్నే మార్చవచ్చు. రాఫెల్ ఆరోపణలు, రుణమాఫీ హామీల నుంచి ఎజెండాను కోటా బాట పట్టించవచ్చు. 50 శాతానికి మించి కోటాను సుప్రీం ఆమోదిస్తుందా? ఇది ప్రతిభను మరింత నిరుత్సాహ పరుస్తుందా? ఆర్థిక వెనుకబాటు ప్రాతిపదికకు రాజ్యాంగం అనుమతిస్తుందా? మోదీ చర్య ద్వారా రిజర్వేషన్ల స్థూల ప్రాతిపదికే 'సామాజికం' నుంచి ఆర్థికానికి మారుతుందా? బీసీలు ఆమోదిస్తారా? ఆగ్రహిస్తారా? అన్న సందేహాలున్నప్పటికీ... బిల్లుకు కాంగ్రెస్ కూడా మద్దతు ప్రకటించడంతో ఆమోదం లాంఛనంగానే కనిపిస్తోంది!

అర్హతకు ఆస్తి పరిమితి

- **8** లక్షలలోపు వార్షిక ఆదాయం
- **5** ఎకరాల్లోపు సాగు భూమి
- **1000** చదరపు అడుగుల్లోపు సొంత ఇల్లు
- **100** గజాలలోపు నివాస స్థలం నోటిఫైడ్ మున్సిపాల్టీ పరిధిలో
- **200** గజాలలోపు స్థలం నాన్ నోటిఫైడ్ ఏరియాలో



ఎన్నికల ముందు మోదీ బ్రహ్మాస్త్రం

విద్య, ఉద్యోగాల్లో 10 శాతం కోటా.. 50 శాతానికి ఇది అదనం

కేంద్ర ప్రభుత్వ సంచలన నిర్ణయం.. ఆమోదముద్ర వేసిన కేబినెట్

నేడు లోక్‌సభకు రాజ్యాంగ సవరణ బిల్లు.. మద్దతు పలికిన కాంగ్రెస్

60 శాతానికి చేరనున్న మొత్తం రిజర్వేషన్లు

రాజ్యసభ కార్యకలాపాలు మరోరోజు పొడిగింపు.. ఎంపీలకు విప్ జారీ చేసిన బీజేపీ, కాంగ్రెస్

ముస్లింలు, క్రైస్తవులకూ రిజర్వేషన్లు: సాంప్లా.. కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థలు, ఉద్యోగాలకు వర్తింపు

రాష్ట్రాలు కావాలనుకుంటే చట్టాన్ని అనువర్తింప చేసుకోవాలి.. మరి తెలంగాణ ఏం చేస్తుంది?



న్యూఢిల్లీ, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అగ్ర వర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. విద్య, ఉద్యోగాల్లో వారికి 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలని తీర్మానించింది. సంబంధిత ప్రతిపాదనకు ప్రధాని మోదీ అధ్యక్షతన సోమవారం సమావేశమైన కేంద్ర మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. అన్ని మతాల్లోని అగ్రవర్ణ పేదలూ ఈ కోటాకు అర్హులే. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ తదితర వర్గాలకు ఇప్పటికే 49.5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్న విషయం తెలిసిందే. వీటికి అదనంగా 10 శాతం కోటాను అగ్రవర్ణ పేదలకు కల్పించనుంది. దాంతో, మొత్తం

మిగతా 14వ పేజీలో...

- మతాలకు అతీతంగా అగ్రవర్ణ పేదలందరికీ ఈబీయూసీ (ఎకనామికల్లీ బ్యాక్‌వర్డ్ అప్పర్ క్యాస్ట్) రిజర్వేషన్లు వర్తిస్తాయి.
- ఇప్పటికే రిజర్వేషన్ల పరిధిలో ఉన్న వర్గాలు మినహా.. మిగిలిన అన్ని వర్గాల్లోని పేదలూ ఈ కోటా పరిధిలోకి వస్తారు.
- రాజ్‌పుత్రులు, భూమిహార్లు, బనియాలు, జాట్‌లు, గుజ్జర్లు, బ్రాహ్మణులు, మరాఠాలు, కాపులు, కమ్మలు, రెడ్లు, తదితర అగ్రవర్ణాల్లోని పేదలు లబ్ధిదారులు కానున్నారు. అలాగే, క్రైస్తవులు, ముస్లింలు తదితరులు కూడా అర్హులే.



కేసీఆర్‌తో ఉత్తమ్ కుమ్మక్కు

కేసులకు భయపడి రాజీ

గెలుపు అవకాశాలున్నా కాంగ్రెస్‌ను ముంచాడు 2

13 మంది ఎమ్మెల్యేలు టీఆర్ఎస్‌లో చేరతారు: సర్వే

'నవోదయ'లో మరో 5 వేల సీట్లు 14

మంత్రాంగం ఎవరిది?

17న ఉదయం 11.30కు అసెంబ్లీ ప్రారంభం.. నోటిఫికేషన్ జారీ

శాసనసభ వ్యవహారాలు ఎవరు చూస్తారు?.. పార్టీలో ముమ్మర చర్చ

18న మంత్రివర్గ విస్తరణ?.. లేదంటే 30న మరో ముహూర్తం



ఆంగ్లో ఇండియన్ సభ్యుడిగా మరోసారి నామినేట్ అయిన స్టీఫెన్సన్ కేసీఆర్‌తో

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాలు ఈనెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఆరోజు ఉదయం 11.30 గంటలకు అసెంబ్లీ హాల్లో మొదలవుతాయి. ఈ మేరకు గవర్నర్ నరసింహన్ పేరిట అసెంబ్లీ కార్యదర్శి వేదాంతం నర్సింహాచార్యులు సోమవారం నోటిఫికేషన్ జారీ చేశారు. నాలుగు రోజులపాటు సమావేశాలు జరగనున్నాయి. వరుసగా ఎమ్మెల్యేల ప్రమాణ స్వీకారాలు, స్పీకర్ ఎన్నిక, ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగం, ధన్యవాదాల తీర్మానంపై చర్చ వంటి కీలక పరిణామాలు జరగనున్నాయి. మరి, ఇంత కీలక సమయంలో శాసనసభ వ్యవహారాలను ఎవరు

మిగతా 5వ పేజీలో...

కలప స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం!

పీడీ చట్టం ప్రయోగించండి

టీఆర్ఎస్ నేతలైనా వదలొద్దు

సహకరించే అధికారులపై చర్యలు తీసుకోండి: సీఎం 5

హామీల అమలుకు సర్కారు భరోసా

గవర్నర్ ప్రసంగంతో వెల్లడి

ఈ సంవత్సరమే అమలు

సిద్ధమైన ప్రసంగ పాఠం

తొలి కేబినెట్ భేటీలో ఇద్దరే

కేసీఆర్, అలీ సమావేశం

ఆంగ్లో ఇండియన్ సభ్యుడిగా రెండోసారి స్టీఫెన్సన్



టీఆర్ఎస్ భవన్‌లో రామగుండం ఎమ్మెల్యే చందర్‌ను పార్టీలోకి ఆహ్వానిస్తున్న కేటీఆర్

16 ఎంపీ సీట్లు కేసీఆర్‌కు ఇవ్వండి

ఢిల్లీ గద్దెపై ఎవరు ఉండాలో మనమే తేల్చేద్దాం

కేటీఆర్ పిలుపు.. కారెక్కిన ఎమ్మెల్యే చందర్

హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): "కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు కావాల్సిన మేజిక్ ఫిగర్ 273. కాంగ్రెస్, బీజేపీ.. రెండింట్లో ఏ పార్టీకీ అన్ని సీట్లు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. రెండు పార్టీలకు కలిపినా కూడా అన్ని సీట్లు రాకపోవచ్చు. రాష్ట్రంలో 16 ఎంపీ స్థానాల్లో టీఆర్ఎస్‌ను గెలిపించి కేసీఆర్‌కు ఇవ్వాలి. అప్పుడు ఢిల్లీ గద్దెపై ఎవరుండాలో తెలంగాణ ప్రజలే నిర్ణయిస్తారు. అసెంబ్లీ

మిగతా 2వ పేజీలో...



ఆసీస్‌తో టెస్టు సిరీస్ విజయం తర్వాత భార్య అనుష్క శర్మతో కలిసి సిడ్నీ స్టేడియంలోకి వచ్చిన విరాట్ కోహ్లి

ఆసీస్‌ను గెలిచేశాం 15

2-1తో సిరీస్ భారత్ కైవసం.. కంగారులపై తొలిసారి

నాలుగో టెస్టు డ్రా.. మ్యాన్ ఆఫ్ ద సిరీస్ పుజారా

నేడు, రేపు కార్మికుల దేశవ్యాప్త సమ్మె

పాల్గొననున్న 20 కోట్ల మంది

బ్యాంకింగ్, రవాణాపై ప్రభావం

ఆర్టీసీ కార్మికులూ సమ్మెకు సై



ఆర్టీసీ భవన్ వద్ద సమ్మె పోస్టర్‌ను విడుదల చేస్తున్న కార్మిక సంఘాల నేతలు 14

ఈశాన్యంలో గేట్లెత్తిన భారత్!

3 దేశాల ముస్లిమేతర వలసదార్లకు 'పౌరసత్వం'

కేంద్ర కేబినెట్ ఆమోదం.. నేడు లోక్‌సభకు బిల్లు

అసోంలో నిరసన.. బీజేపీ సర్కారుకు ఏజీపీ గుడ్‌బై

విపక్షాల ఆగ్రహం.. నేడు 'ఈశాన్యం'లో బంద్





Paramjyothi
పరంజ్యోతి

వస్తువులను కాదు.. వాటిపై వ్యామోహాన్ని వీడాలి



కోరికలకు లొంగిపోయేది కేవలం గృహస్థులేనా? సర్వసంగ పరిత్యాగులమనే భ్రమలో ఉన్న సన్యాసులు కూడా వాటికి లొంగిపోతారట. కోరికల గందరగోళంలో పడిపోతారట. ఆదిశంకరాచార్యులవారి శిష్యుడైన హస్తామలకుడు అలాంటివారి గురించి చెప్పిన పద్యమిది..

అగ్రే వహ్నిః పృష్ఠే భానూ
రాత్రౌ చుబుక సమర్పిత జానుః
కరతల భిక్షస్తరుతల వాసః
తదపిన ముంజత్యాశా పాశః

అగ్రే వహ్నిః.. అంటే ఎదురుకుండా చలిమంట ఉంటుంది. పృష్ఠే భానూ.. వీపుపై సూర్యుని కిరణాలు పడేటట్లు కూర్చుని ఉంటారు. రాత్రులందు మోకాళ్ల గడ్డానికి ఆనించి కూర్చుంటారు. రెండు అరచేతులూ కలిపి దొప్పలాగా చేసుకుని.. భిక్షాటన చేసి అందులోనే తింటారు. చెట్టు నీడన నివాసం ఉంటారు.. ఇలా జీవిస్తున్నప్పటికీ ఆశలనే సంకెళ్లను మాత్రం వదలరని దీని అర్థం. ఇంకా వివరంగా చెప్పుకోవాలంటే.. సన్యాసులంటే అన్ని భోగాలూ విడిచిపెట్టినవారు. తిండి, బట్ట, ఇల్లు.. అనే కనీస సౌకర్యాలను కూడా పట్టించుకోరు. శీతోష్ణాలను తట్టుకోవడానికి వీపును సూర్యునికెదురుగా ఉంచి కూర్చుని, తనకెదురుగా చలిమంట వేసుకుంటారు. దానితో ముందూ వెనుకా చలి బాధ తప్పిపోతుంది. రాత్రుళ్లు నిద్రపట్టకపోతే మోకాళ్లకు గడ్డాన్ని ఆనించి ముడుచుకు కూర్చుంటారు. తిండి తినడానికి బొచ్చె కూడా ఉండదు. అందువల్ల.. తెచ్చుకున్న భిక్షను దోసిలిలో పెట్టుకొని తింటారు. ఇక పడుకొని నిద్రపోవడానికి మంచం, పరుపు, దిండ్లు దుప్పట్లు ఉండవు కనుక ఏ చెట్టు కిందో తలకింద చేయిపెట్టుకుని కిందనే పరుండి నిద్రపోతారు. ఇలా సర్వసంగ పరిత్యాగిలా జీవిస్తున్నప్పటికీ.. వారిలో కూడా ఏవో కోరికలు ఉంటూనే ఉంటాయి. వారూ ఆశ అనే పాశాలతో బంధించబడి ఉంటారు. ప్రాపంచిక వస్తువులను వదిలి ఏకాంత ప్రదేశాలకు వెళ్లి, అహంకారాన్ని నశింపజేసుకోవడానికి భిక్షాటన చేస్తూ సామాన్యమైన జీవితాన్ని గడుపుతుంటారేగానీ మనసులో కోరికల బీజాలు అలాగే ఉండి కలకలం రేపుతాయి. కనుక వస్తువులను, భోగాలను వదిలినంత మాత్రాన సరిపోదు. ఆ వస్తువుల కొరకు, భోగాల కొరకు మనసులో తపన ఉండకూడదు. వాటిపై వ్యామోహం చెందకూడదు. వస్తువులను వదలడం కాదు. వాటిపై వ్యామోహాన్ని వదలాలి. అసక్తిని వదలాలి. మమతను వీడాలి. పురాణ, ఇతిహాసాల్లో రాక్షసులు అన్నీ వదిలి బ్రహ్మదేవుని గురించిగానీ, మహేశ్వరుని గురించిగానీ కఠినమైన తపస్సులు చేస్తారు. కానీ మనసు నిండా భయంకరమైన కోరికల పుట్టలు. అందుకే ఆ భగవంతుడు ప్రత్యక్షమై వారికి వరాలిచ్చినా చివరకు వారికి సర్వనాశనమే మిగిలేది. మనసులో తీరని కోరికలు పెట్టుకొని, పైకి మాత్రం వైరాగ్యం ప్రదర్శించే వారిని మిథ్యాచార్యులు, కపటాచారులు అని గీతాచార్యులు తెలియజేశారు. అందువల్ల మనసులోని కోరికలను, వ్యామోహాలను వదలడం ప్రధానం.

- దేవిశెట్టి చలపతిరావు, 8008539770

కేసీఆర్‌తో ఉత్తమ్ కుమ్మక్కు

- కేసులకు భయపడి రాజీ కుదుర్చుకున్నాడు
- ఉత్తమ్, ఖుంటియాకు నిజంగానే సిగ్గు శరం లేదు
- వారు రాజీనామా చేసేంత వరకు నిద్రపోను: సర్వే



హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి.. సీఎం కేసీఆర్‌తో కుమ్మక్కయ్యారని కాంగ్రెస్ సీనియర్ నేత, కేంద్ర మాజీమంత్రి సర్వే సత్యనారాయణ ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్రంలో మంత్రిగా ఉన్నప్పుడు నమోదైన కేసులు, 2014 ఎన్నికల్లో డబ్బు తరలింపు తదితర కేసులను తిరగతోడుతారన్న భయంతో లొంగిపోయారని అన్నారు. ఓ బడా కాంట్రాక్టర్ సాయంతో కేసీఆర్‌తో రాజీ కుదుర్చుకున్నారని, పథకం ప్రకారం కాంగ్రెస్‌ను నిర్వీర్యం చేస్తున్నారని దుయ్యబట్టారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచే అవకాశాలు ఉన్నా.. కేసీఆర్ ఆదేశాల మేరకు పొత్తులు, టికెట్ల కేటాయింపును నామినేషన్ల చివరి రోజు వరకు కూడా తేల్చలేదని ఆరోపించారు. దీంతో కాంగ్రెస్ నాయకత్వంపై ప్రజల్లో నమ్మకం పోయిందన్నారు. ఓటమికి నైతిక బాధ్యత వహించి టీపీసీసీ అధ్యక్ష పదవికి ఉత్తమ్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఉత్తమ్ సిగ్గుశరం లేని నేత అని కేసీఆర్ అనడం కరెక్టేనని అనిపిస్తోందన్నారు. ఆదివారం గాంధీభవన్‌లో చోటుచేసుకున్న పరిణామాలు, తదనంతర పరిస్థితులపై సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఏఐసీసీ సభ్యుడినైన తనపై చర్యలు తీసుకునే అధికారం కేవలం సోనియా, రాహుల్‌లకు, ఏఐసీసీ క్రమశిక్షణా సంఘానికి మాత్రమే ఉందన్నారు. లోక్‌సభ ఎన్నికల టికెట్లను, డీసీసీ అధ్యక్ష పదవులను అమ్ముకునేందుకు ఉత్తమ్, ఖుంటియా కుట్ర చేస్తున్నారని ధ్వజమెత్తారు. తనతోపాటు కొల్హాపూర్, భువనగిరి, పాలేరు వంటి చాలా చోట్ల కాంగ్రెస్ అభ్యర్థులను ఓడించేందుకు ఉత్తమ్ ప్రయత్నించారని ఆరోపించారు. పొత్తుల పేరుతో చంద్రబాబును, కోదండరాంను అభాసుపాలు చేశారన్నారు. గెలిచిన కాంగ్రెస్ ఎమ్మెల్యేల్లో 13 మంది దాకా టీఆర్ఎస్‌లో చేరేందుకు సిద్ధమైనట్లు తెలిసిందన్నారు. ఉత్తమ్, ఖుంటియా బర్తరఫ్ అయ్యేంత వరకు నిద్రపోనని, ఉత్తమ్ అక్రమాలను త్వరలోనే ఆధారాలతో సహా బయటపెడతానని ప్రకటించారు. ఇంకా చాలామంది నేతలు వారిని నిలదీయనున్నారని చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో తాను పోటీ చేయబోనన్నారు.

'ఎన్నికల' పైసలివ్వరూ!

- సీఈవోకు రిటర్నింగ్ అధికారుల వినతి

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): 'నాలుగున్నరేళ్ల కిందట జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గానికి రూ.1.30 కోట్లు ఇచ్చారు. అప్పటి కన్నా ఇప్పుడు పని మూడింతలు ఎక్కువ చేయించారు. ఫ్లయింగ్ స్క్వాడ్, సెక్టోరల్ అధికారులకు నిధులే ఇవ్వలేదు. రూ.45-60 లక్షలిచ్చి చేతులు దులుపుకుంటే బకాయిలెలా కట్టాలి?' అంటూ రిటర్నింగ్ అధికారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడి దాదాపు నెలరోజులు పూర్తవుతున్నా ఎన్నికల నిర్వహణ నిధులు పూర్తిస్థాయిలో విడుదల చేయకపోవడంపై మండిపడుతున్నారు. ఎన్నికల నిర్వహణ నిధులన్నీ విడుదల చేయాలని తెలంగాణ తహసీల్దార్ల సంఘం కోరింది. ఈ మేరకు సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు వి.లచ్చిరెడ్డి, అధ్యక్షుడు కె.గౌతంకుమార్, ప్రతినిధులు సోమవారం సీఈవో రజత్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. కార్యాలయ ఖర్చు, వాహనాల అద్దెలు, ఇంధన చార్జీలు, టీఏ, డీఏలకే ఒక్కో నియోజకవర్గంలో రూ.1.50 కోట్ల దాకా ఖర్చయ్యాయని, వెంటనే నిధులివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు సజావుగా నిర్వహించినందుకు గాను రెవెన్యూ ఉద్యోగులకు ఒక నెల వేతనం అదనంగా ఇవ్వాలని కోరారు.

పార్టీలతో విడివిడిగా సమావేశాలు వద్దు

- ఎన్నికల సంఘానికి కాంగ్రెస్ డిమాండ్

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాజకీయ పార్టీలతో విడివిడిగా కాకుండా.. ఉమ్మడి సమావేశాన్ని నిర్వహించాలని ఎన్నికల సంఘాన్ని కాంగ్రెస్ డిమాండ్ చేసింది. మంగళవారం జరగనున్న ఈ సమావేశం సందర్భంగా.. గతంలో ఎన్నడూ లేని సంప్రదాయాలను పరిచయం చేస్తున్నారని టీపీసీసీ ఎన్నికల సమన్వయ కమిటీ నేత నిరంజన్ ఆరోపించారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 'ఓటరు సవరణకు ముందే రాజకీయ పార్టీలతో ఉమ్మడి సమావేశాన్ని ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈసీ దాన్ని వాయిదా వేసింది. ఎన్నికల సంఘం తీరు అనుమానాస్పదంగా ఉంది. టీఆర్ఎస్ అనుకూల విధానాలను పాటిస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంలో అవకతవకలను ఎన్నికల సంఘం దృష్టికి తెచ్చినా చర్యలు తీసుకోలేదు' అని దుయ్యబట్టారు.



కొండచిలువతో ఫొటో దిగిన ప్రవీణ్

కొండచిలువ అమ్ముతామంటూ
ఫేస్'బుక్కయ్యారు'!

పాములు విక్రయించేందుకు యత్నించిన ఇద్దరు యువకుల అరెస్టు

హైదరాబాద్, జనవరి7(ఆంధ్రజ్యోతి): కొండచిలువతో ఫొటోలకు పోజులిచ్చాడు.. దాన్ని రూ.24 వేలకు అమ్ముతామంటూ ఫేస్‌బుక్‌లో పోస్టు పెట్టాడు.. మరో స్నేహితుడితో కలిసి కొండ చిలువను అమ్మేందుకు వాట్సాప్‌లో బేరసారాలు జరిపాడు. అతడి ఫొటోలు ఫేస్‌బుక్‌లో వైరల్ కావడంతో విషయం అటవీశాఖ దాకా వెళ్లింది. అప్రమత్తమైన అధికారులు సోమవారం మఫ్టీలో హైదరాబాద్ శివారులోని ఘట్‌కేసర్ మండలం చౌదరిగూడలోని వెంకటాద్రి టౌన్‌షిప్‌కు వెళ్లారు. ఫేస్‌బుక్‌లో ఫొటోలు పెట్టిన ప్రవీణ్ ఇంటికి చేరుకున్నారు. అతడి ఇంట్లో జరిపిన తనిఖీల్లో కొండ చిలువ, చెట్టు పామును స్వాధీనం చేసుకున్నారు. ప్రవీణ్‌తో పాటు అతడి స్నేహితుడు శరణ్ మోసస్‌ను అదుపులోకి తీసుకొని విచారించగా, ఇద్దరూ కలిసి మరో వ్యక్తి వద్ద పాములు కొన్నట్లు అంగీకరించారు. వీరిపై వన్యప్రాణి సంరక్షణ చట్టం కింద కేసు నమోదు చేసి, రిమాండుకు తరలించినట్లు అటవీ అధికారి రమేశ్ కుమార్ తెలిపారు.

మనమే తేల్చేద్దాం

(మొదటి పేజీ తరువాయి)

ఎన్నికల్లో ప్రదర్శించిన స్ఫూర్తి పార్లమెంటు ఎన్నికల్లోనూ కొనసాగించాలి" అని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పంచాయతీ ఎన్నికల్లో వీలైనన్ని ఏకగ్రీవమయ్యేలా చూడాలని సూచించారు. ఏ ఎన్నికలు జరిగినా గులాబీ జెండా రెపరెపలాడేందుకు శ్రమించాలని పిలుపునిచ్చారు. రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సోమవారం తెలంగాణ భవన్‌లో కేటీఆర్ సమక్షంలో తిరిగి టీఆర్ఎస్ గూటికి చేరారు. ఈ సందర్భంగా చందర్ భావోద్వేగానికి లోనై కంటతడి పెట్టారు. నాగార్జున సాగర్ ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య ఆధ్వర్యంలో పలు పార్టీల కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా జరిగిన వేర్వేరు కార్యక్రమాల్లో కేటీఆర్ మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో టీఆర్ఎస్ సాధించిన విజయం సామాన్యమైనది కాదన్నారు. కాంగ్రెస్ నేత జానారెడ్డి ఓటమిలో 76 తండాలు ప్రముఖ పాత్ర పోషించాయని చెప్పారు. సమష్టిగా పనిచేయాలని చందర్, మాజీ ఎమ్మెల్యే సోమారపు సత్యనారాయణ అనుచరులకు సూచించారు.

పదోన్నతులు కల్పించండి: టీటీఎఫ్

హేతుబద్ధమైన సర్వీసు నిబంధనలు రూపొందించి ఉపాధ్యాయుల పదోన్నతికి చర్యలు తీసుకోవాలని కోరుతూ కేటీఆర్‌ను టీటీఎఫ్ అధ్యక్షుడు రఘునందన్, ప్రధాన కార్యదర్శి రమణ కోరుతూ వినతిపత్రం అందజేశారు. రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని కేటీఆర్ తెలిపారు. డీలర్ల సంఘం అధ్యక్షుడు నాయకోటి రాజు, ప్రతినిధుల బృందం సోమవారం కేటీఆర్‌ను కలిసింది. వరంగల్ తూర్పు నియోజకవర్గానికి చెందిన 25 చేనేత సహకార సంఘాలు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ఆధ్వర్యంలో కేటీఆర్‌ను కలిశారు. సిరిసిల్ల మాదిరిగా వరంగల్ కార్మికులకు ఉపాధి కల్పించాలని నరేందర్ కోరారు. పోలియోతో రెండు కాళ్లూ దెబ్బతిన్న రామగుండానికి చెందిన శివసాయి అనే బాలుడికి అండగా నిలుస్తానని కేటీఆర్ భరోసా ఇచ్చారు. ఆ బాలుడు ఎమ్మెల్యే కోరుకంటి చందర్ సహాయంతో కేటీఆర్‌ను కలిశాడు. అతడి బాధ విన్న కేటీఆర్... వెంటనే ఆసుపత్రిలో చేర్పించాలని నాయకులను ఆదేశించారు. వైద్యానికయ్యే ఖర్చు భరిస్తామని చెప్పారు.

సీఎం.. కేటీఆర్!

రామగుండం నుంచి టీఆర్ఎస్‌లో చేరేందుకు వచ్చిన పలు పార్టీల కార్యకర్తలు కేటీఆర్ ప్రసంగిస్తుండగా 'సీఎం... కేటీఆర్'అని నినాదాలు చేశారు. 'సీఎం అక్కడ (ప్రగతి భవన్‌లో) ఉన్నారు' అంటూ కేటీఆర్ వారిని వారించారు. సోమారపును ప్రసంగించాలని చందర్ కోరినప్పుడు పలువురు కార్యకర్తలు 'వద్దు.. వద్దు.. అవసరం లేదు' అంటూ కేకలు పెట్టారు. కేటీఆర్ వారికి సర్ది చెప్పారు. సోమారపు మాట్లాడుతున్నప్పుడు కూడా పలువురు కార్యకర్తలు 'ఇంక చాలు. ఇంక చాలు' అని అడ్డుతగిలారు. కేటీఆర్ మళ్లీ వారిని వారించారు. 'నేను కూడా జై చందర్ అని అంటున్నా. అంతా కలిసి మెలిసి పనిచేయండి' అని చెప్పారు.

నేను మంత్రిని కాదు.. హామీలివ్వలేను: కేటీఆర్

హైదరాబాద్ సిటీ: "నేను ఇప్పుడు మంత్రిని కాదు. హామీలు ఇవ్వలేను. ప్రభుత్వం దృష్టికి సమస్యలను తీసుకెళ్తానని మాత్రమే చెప్పగలను" అని కేటీఆర్ అన్నారు. రాష్ట్రంలో నిరంతర విద్యుత్తు అందించిన ఘనత ఆ శాఖ ఉద్యోగులదేనని కొనియాడారు. ఖైరతాబాద్ మింట్ కౌంపౌండ్‌లో సోమవారం తెలంగాణ ఎలక్ట్రిసిటీ ఇంజనీర్స్ అసోసియేషన్ 12వ వార్షికోత్సవంలో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 2019 ఇంజనీర్స్ డైరీని ఆవిష్కరించారు. డిస్ట్రిబ్యూషన్ కంపెనీలను ప్రైవేటుపరం చేయబోమని చెప్పారు. విద్యుత్ శాఖలో ఉద్యోగులంతా వారంలో ఒక రోజు చేనేత వస్త్రాలు ధరిస్తామంటూ కేటీఆర్ సమక్షంలో ప్రతిజ్ఞ చేశారు.

అక్రమాలు చేస్తే అంగన్‌వాడీలు దేశద్రోహులే

చిన్నారుల ఆహారాన్ని దొంగిలిస్తే చర్యలు: మేనకాగాంధీ.. ఉద్యోగ భద్రత కావాలి: అంగన్‌వాడీలు

న్యూఢిల్లీ/ఏన్కూరు/వికారాబాద్, జనవరి 7: చిన్నారుల కోసం అందిస్తున్న ఆహారంలో అక్రమాలకు పాల్పడే అంగన్‌వాడీ కార్యకర్తలు దేశద్రోహులేనని కేంద్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి మేనకాగాంధీ అన్నారు. అంగన్‌వాడీ లబ్ధిదారుల్లో నకిలీలు భారీ ఎత్తున వెలుగులోకి రావడం పట్ల ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. చిన్నారుల ఆహారాన్ని దొంగిలించడమంటే ప్రభుత్వానికి భారీగా నష్టం చేస్తున్నట్లేనని, వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. దేశవ్యాప్తంగా ఉత్తమ సేవలందించిన 97 మంది అంగన్‌వాడీ కార్యకర్తలకు సోమవారం జాతీయ అవార్డులు అందించారు. తమ ఉద్యోగాన్ని పర్మినెంట్ చేయాలని, రూ.18 వేల గౌరవ వేతనం ఇవ్వాలని కేంద్ర మంత్రిని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. వేతనాన్ని రూ.1500 పెంచుతున్నట్లు ప్రధాని మోదీ ఇచ్చిన హామీ ఇంకా కార్యరూపం దాల్చలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

తెలంగాణ తరఫున సుశీల, విజయలక్ష్మికి అవార్డు

రాష్ట్రానికి చెందిన అంగన్‌వాడీ టీచర్లు అమరనేని సుశీల(ఖమ్మం జిల్లా ఏన్కూరు), మల్లెగారి విజయలక్ష్మి(వికారాబాద్ జిల్లా సిద్దులూరు)కి జాతీయ అవార్డుతో పాటు రూ.50 వేల నగదు లభించింది. తాను 1992 నుంచి అంగన్‌వాడీ టీచర్‌గా పని చేస్తున్నానని సుశీల 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. 22 ఏళ్లుగా అంగన్‌వాడీ టీచర్‌గా విధులు నిర్వహిస్తున్న విజయలక్ష్మి జిల్లా స్థాయిలో 7 అవార్డులు అందుకున్నారు. 6బాల్య వివాహాలను నిలిపివేయడం, 102 మందికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించడం, వలస కూలీల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించడం, అనాథలను స్కూళ్లలో చేర్పించడం వంటి ఎన్నో సేవలు అందించారు. ఈ అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని విజయలక్ష్మి 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్‌లో చెప్పారు.



కేంద్రమంత్రి మేనకాగాంధీ నుంచి అవార్డు అందుకుంటున్న సుశీల

తమిళనాడు ప్రమాద మృతులు 10 మంది

- మరణాల సంఖ్యపై వీడిన గందరగోళం
- నేడు మృతదేహాలు స్వగ్రామాలకు



మృతదేహాలతో నర్సాపూర్ బయల్దేరిన ప్రత్యేక అంబులెన్స్‌లు

నర్సాపూర్/మెదక్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అయ్యప్ప స్వాములు శబరిమల వెళ్లి వస్తుండగా ఆదివారం ఘోర రోడ్డు ప్రమాదం. ఎదురుగా వస్తున్న కంటెయినర్ లారీ ఢీకొనడంతో టెంపో ట్రావెలర్ వ్యాన్ నుజ్జునుజ్జయింది. ఈ ప్రమాదంలో మరణించింది పది మందా? 11 మందా? అనే గందరగోళం నెలకొంది. అయితే, ఈ ప్రమాదంలో మరణించింది పది మందేనని మెదక్ నుంచి తమిళనాడు వెళ్లిన ప్రత్యేక బృందం ధ్రువీకరించింది. ప్రమాద సమయంలో 14 మంది మెదక్ జిల్లా యాత్రికులు, హైదరాబాద్‌కు చెందిన వ్యాన్ డ్రైవర్ ఒకరు ఉన్నట్లు బృందం తరఫున వెళ్లిన టీఆర్ఎస్ నాయకుడు మురళీధర్‌యాదవ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. వీరిలో నర్సాపూర్ మండలానికి చెందిన 9 మంది, హైదరాబాద్‌కు చెందిన వ్యాన్ డ్రైవర్ మృతి చెందారని పేర్కొన్నారు. తిరుమయం ఆస్పత్రిలో మృతదేహాలకు పోస్టుమార్టం నిర్వహించి పది ప్రత్యేక అంబులెన్స్‌ల్లో స్వగ్రామాలకు తరలించినట్లు చెప్పారు. మంగళవారం ఉదయం 9 గంటలకల్లా మృతదేహాలు స్వగ్రామాలు చేరుకునే అవకాశం ఉందన్నారు. క్షతగాత్రులకు మరో నాలుగైదు రోజులు పుదుక్కట మెడికల్ కాలేజీలో చికిత్స అందిస్తారని తెలిపారు. కాగా, తిరుమయం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదానికి కంటైనర్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమని తమిళనాడు పోలీసులు నిర్ధారించారు. వేగంగా లారీ ఎదురుగా రావడంతోనే ప్రమాదం జరిగిందని తమిళనాడు అధికారులు చెప్పినట్లు అక్కడికి వెళ్లిన నర్సాపూర్ సీఐ సైదులు 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్‌లో తెలిపారు. కాగా, తిరుమయం వద్ద రహదారి ఇరుగ్గా ఉండటం, డివైడర్ లేకపోవడంతో చాలా ప్రమాదాలు జరిగాయని తమిళనాడు అధికారులు చెప్పారని మెదక్ జిల్లా అధికారులు చెబుతున్నారు. కాగా అయ్యప్ప భక్తులు మరణించిన ఘటనతో రహదారి విస్తరణకు అధికారులు సిద్ధమయ్యారన్నారు.

మా బిడ్డను చూపించరూ..

- అమెరికా వీసాలు ఇప్పించండి
- సాయికృష్ణ తల్లిదండ్రుల ఆవేదన
- సుష్మాస్వరాజ్, కేసీఆర్, కేటీఆర్‌కు లేఖలు
- సాయం అందించాలని సుష్మను కోరిన సీతారాంనాయక్

మహబూబాబాద్/హైదరాబాద్ సిటీ/మెదక్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): 'దుండగుల చేతిలో గాయపడి అమెరికా ఆస్పత్రిలో చావుబతుకుల మధ్య ఉన్న మా కొడుకును చూడాలని ఉంది. అమెరికా వెళ్లేందుకు వెంటనే వీసాలు ఇప్పించండి' ఇది ఈ నెల 3న అమెరికాలోని మిషిగన్ రాష్ట్రం డెట్రాయిట్‌లో దుండగుల చేతిలో గాయపడ్డ మహబూబాబాద్ జిల్లాకు చెందిన పూస సాయికృష్ణ తల్లిదండ్రులు పూస ఎల్లయ్య-శైలజ ఆవేదన. తమ కొడుక్కి మెరుగైన చికిత్స అందించడంతోపాటు, ఆర్థిక సాయం చేయాలని విదేశాంగశాఖ మంత్రి సుష్మాస్వరాజ్‌తో పాటు భారత, అమెరికా రాయబార కార్యాలయాలు, సీఎం కేసీఆర్, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు లేఖలు రాశారు. సాయికృష్ణకు వైద్య సాయం అందించాలని సుష్మాస్వరాజ్‌ను ఎంపీ సీతారాం నాయక్ సోమవారం ఢిల్లీలో కలిసి విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన సుష్మా.. అమెరికాలోని భారత రాయబార అధికారులతో మాట్లాడారు. తమ వంతు సాయం చేయాలని తెలంగాణ సీఎం కార్యాలయ అధికారులను కూడా సీతారాం నాయక్ కోరారు. మరోవైపు సాయికృష్ణ కుటుంబసభ్యులను మానుకోట ఎమ్మెల్యే శంకర్‌నాయక్ పరామర్శించారు. ప్రభుత్వం తరఫున తనవంతు సాయం అందేలా కృషిచేస్తానని భరోసా ఇచ్చారు.



ఢిల్లీలో సుష్మాస్వరాజ్‌ను కలిసిన ఎంపీ సీతారాం నాయక్

లోకం తీరు



చలికాలం

కేంద్రం	కనిష్ఠం	గరిష్ఠం
ఆదిలాబాద్	13.7	29.9
రామగుండం	14.4	28.0
హైదరాబాద్	15.7	29.7
వరంగల్	16.0	28.0
నల్లగొండ	16.4	29.4



టెక్నాలజీ ఉద్యోగాలను చంపదు.. పెంచుతుంది

"కృత్రిమ మేధ వంటి అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ ఉద్యోగాలను చంపదు.. మరిన్ని ఉద్యోగాలను సృష్టిస్తుంది. కంప్యూటర్ సైన్స్‌లో ప్రధానంగా చెప్పుకోదగినదీ కృత్రిమ మేధ. దీని అభివృద్ధి వల్ల మానవులు మరింత సౌకర్యంగా జీవించగలుగుతారు."

- ఎన్ఆర్ నారాయణమూర్తి, ఇన్ఫోసిస్ సహవ్యవస్థాపకుడు



మెక్సికో సరిహద్దులో గోడ కాదు ఉక్కు కంచె!

మెక్సికో సరిహద్దులో కాంక్రీటు గోడకు బదులుగా ఉక్కు కంచె ఏర్పాటు చేస్తాం. గోడతో పోలిస్తే దీనికయ్యే వ్యయం ఎక్కువే అయినా కంచె బాగా దృఢంగా ఉంటుంది. వలసదారులను సమర్థంగా అడ్డుకుంటుంది.

- డొనాల్డ్ ట్రంప్, అమెరికా అధ్యక్షుడు

నేటి పెట్రో ధరలు (లీ.)


పెట్రోల్	డీజిల్
పాత ధర రూ.72.67	పాత ధర 67.66
కొత్త ధర రూ.72.67	కొత్త ధర 67.66

మార్పులేదు



మన మేను.. మధుమేహాన్ని మాన్పు!

లండన్, జనవరి 7: మన శరీరంలో కోటానుకోట్ల కణాలు.. సాంకేతికత గొప్పగా అభివృద్ధి చెందినా వాటన్నింటిపై మనకు పూర్తి అవగాహన లేదు. ఇంకా ఎన్నో అంతుచిక్కని కణాలు శరీర వ్యవస్థలో దాగుడు మూతలు ఆడుతున్నాయి. వాటిలోంచి కొన్ని కణాలను నార్వేలోని యూనివర్సిటీ ఆఫ్ బెర్గెన్ శాస్త్రవేత్తలు గుర్తించారు. అవి ఇన్సులిన్‌ను ఉత్పత్తి చేసే పాడైన కణాలను తమ ఆధీనంలోకి తీసుకుంటాయట. అంటే.. ఇన్సులిన్ ఉత్పత్తికి ఆటంకం కలుగకుండా చేస్తాయన్న మాట. క్లోమంలో ఈ కణాలు గ్లూకాగాన్‌ను ఉత్పత్తి చేస్తాయని, వీటి పనితీరును విశ్లేషించి భవిష్యత్తులో మధుమేహ వ్యాధికి కొత్త చికిత్స రూపొందించవచ్చని పరిశోధకులు తెలిపారు.



మంట పుట్టని ఆహారంతో దీర్ఘాయుష్షు

వాషింగ్టన్, జనవరి 7: ఆరోగ్యంగా ఉండేందుకు చాలామంది రకరకాల వ్యాయమాలు చేస్తుంటారు. ఆహారపు అలవాట్లను పాటిస్తుంటారు. అయితే, కడుపులో మంట పుట్టనివ్వని పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు వంటి ఆహారాన్ని అధికంగా తీసుకోవడం వల్ల ఎక్కువ కాలం ఆరోగ్యంగా జీవించవచ్చని తాజా అధ్యయనంలో తేలింది. 68,273 మందిపై పరిశోధన జరిపిన పోలాండ్‌లోని వార్సా వర్సిటీ ఆఫ్ లైఫ్ సైన్సెస్ పరిశధకులు ఈ విషయాన్ని గుర్తించారు. ఈ శోథ నిరోధక ఆహారాన్ని తీసుకోవడంతో పాటు ఉప్పు, సంతృప్త కొవ్వులు తక్కువగా తీసుకోవడం వల్ల కేన్సర్ వచ్చే ముప్పు 13%, హృద్రోగాల ముప్పు 20% తగ్గిందని పరిశోధకులు తెలిపారు.

పోటెత్తిన పత్తి!



సూర్యాపేట జిల్లాలోని సీసీఐ కేంద్రాలకు పత్తి పంట పోటెత్తుతోంది. సోమవారం రైతులు తీసుకొచ్చిన పత్తితో సూర్యాపేట మండలం బాలెంల సమీపంలోని కేంద్రం వద్ద వాహనాలు బారులు తీరాయి. నవంబర్‌లో కొనుగోళ్లు ప్రారంభం కాగా, డిసెంబర్‌లో పుంజుకున్నాయి. అయితే ఈ కేంద్రంలో ప్రతి రోజూ 500 క్వింటాళ్ల కొనుగోళ్లు జరుపుతుండగా, సోమవారం సాయంత్రానికి 65 మంది రైతుల నుంచి 1300 క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేశారు. - సూర్యాపేట సిటీ

మళ్లీ 35 మంది విద్యార్థినులకు అస్వస్థత



చిట్యాల ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

చిట్యాల, జనవరి 7: జయశంకర్ భూపాలపల్లి జిల్లా చిట్యాలలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలలో విద్యార్థినులు మళ్లీ అస్వస్థతకు గురయ్యారు. సోమవారం కూడా కలుషిత ఆహారం తిని 35 మంది ఆస్పత్రి పాలయ్యారు. ఆదివారం భోజనం చేసిన అనంతరం 27 మంది తీవ్రమైన కడుపునొప్పి, తలనొప్పి, వాంతులు, విరేచనాలతో ఇబ్బందులు పడగా ఐదుగురి పరిస్థితి విషమంగా మారిన విషయం విదితమే. మరుసటి రోజు ఉదయం కిచిడీ తిన్న వెంటనే బాలికలు కడుపునొప్పితో మెలికలు తిరుగుతూ పడిపోయారు. 35 మందిని ఆసుపత్రికి తరలించారు. మొదటి రోజు జరిగిన ఘటనతో కళ్లు తెరవాల్సిన అధికారులు మళ్లీ అదే నిర్లక్ష్యం వహించడంతో వరుసగా రెండు రోజులపాటు విద్యార్థులు నరకయాతన పడ్డారు.

రాష్ట్రంలో శత్రువులం.. గ్రామంలో మిత్రులం



రాష్ట్రంలో అధికార టీఆర్‌ఎస్‌కు బలమైన శత్రువు కాంగ్రెస్. సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని తుల్జారావుపేటలో మాత్రం కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలు మిత్రపక్షాలుగా మారాయి. రెండు పార్టీల నాయకులు ఒకే తాటిపైకి వచ్చి ఒకే ట్రాక్టరుకు టీఆర్ఎస్, కాంగ్రెస్ జెండాలు కట్టి నామినేషన్ వేయడానికి వెళ్లారు. వీరికి బీజేపీ ప్రధాన ప్రత్యర్థిగా పోటీకి దిగనుంది. - చివ్వెంల

'కేబుల్' సమస్యలను పరిష్కరిస్తాం: లక్ష్మణ్



ముషీరాబాద్/హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ట్రాయ్ తీసుకున్న నిర్ణయం వల్ల రాష్ట్ర వ్యాప్తంగా కేబుల్ ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని, సంబంధిత శాఖ కేంద్ర మంత్రికి సూచించి కేబుల్ ఆపరేటర్లు, వినియోగదారులపై భారం పడకుండా కృషి చేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కె.లక్ష్మణ్ హామీ ఇచ్చారు. సోమవారం ముషీరాబాద్‌లో తెలంగాణ కేబుల్ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల కమిటీ సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ జనవరి 31 వరకు ట్రాయ్ గడువు ఇవ్వడంతో కేంద్ర మంత్రి రాజవర్ధన్ రాథోడ్‌ను ఢిల్లీలో కలిసి విన్నవించామని, ఆయన సానుకూలంగా స్పందించి ఈ ఏడాది జూన్ వరకు గడువు ఇచ్చారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ కేబుల్ ఆపరేటర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు లక్ష్మణ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, గ్రేటర్ అధ్యక్షుడు హరినాథ్‌గౌడ్ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెకు సిద్ధం: మర్రి రాఘవయ్య



చిలకలగూడ/హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి) : రైల్వే ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే దేశవ్యాప్త సమ్మెకు సిద్ధమని ఎన్ఎఫ్ఐఆర్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య హెచ్చరించారు. భారత ప్రభుత్వం, రైల్వే యాజమాన్యం, ఫెడరేషన్‌తో చేసిన ఒప్పందాలు విఫలమైనందున ఎంప్లాయీస్ సంఘ్ జోనల్ హెడ్ క్వార్టర్స్, అన్ని డివిజన్ రైల్వే కార్యాలయాల్లో సోమవారం ధర్నాలు, బహిరంగ సభలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో సికింద్రాబాద్, రైల్ నిలయంలో నిర్వహించిన భారీ బహిరంగ సభల్లో రాఘవయ్య మాట్లాడుతూ రైల్వేలో న్యూ పెన్షన్ స్కీమ్‌ను వెంటనే రద్దు చేయాలని, ఏడవ వేతన సంఘంలో కనీస వేతనం, ఫిట్‌మెంట్ ఫార్ములాల పునర్నిర్మాణం, అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ సెక్షన్ ఆఫీసర్లకు జనవరి-2006 నుండి 5400 రూపాయల గ్రేడ్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంప్లాయిస్ సంఘ్ అధ్యక్షుడు ప్రభాకర్ ఆండ్రూ, జాయింట్ సెక్రటరీ ఎం.రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ ఉపకులాలకు కార్పొరేషన్

▸▸ ఐక్యవేదిక డిమాండ్

బర్కత్‌పుర/హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎస్సీల్లోని ఉపకులాలకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి రూ. 2వేల కోట్ల బడ్జెట్ కేటాయించాలని తెలంగాణ ఎస్సీ ఉపకులాల ఐక్యవేదిక డిమాండ్ చేసింది. సోమవారం తెలంగాణ ఎస్సీ, ఉపకులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు చింతల మల్లికార్జున్, వర్కింగ్ ప్రెసిడెంట్ మంగేష్, ప్రధాన కార్యదర్శి రేణుకుంట్ల మురళి, కోశాధికారి కె.లక్ష్మణ్, చంద్రగిరి రాజమౌళి తదితరులు విలేకరులతో మాట్లాడారు. కార్పొరేషన్ చైర్మన్ పదవి ఉపకులాలకే కేటాయించాలని, హోలియ దాసరి, మోచి తదితర కులస్థులకు తహసీల్దార్ ద్వారా కుల ధ్రువీకరణ పత్రాలు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ ఉప కులాలకు మూడెకరాల భూమి, డబుల్ బెడ్‌రూం ఇళ్లు కేటాయించాలని, అర్హులందరికీ నేరుగా సబ్సిడీ రుణాలు అందజేయాలని, కిన్నెర, జాంబపురాణం చెప్పే కళాకారులకు రూ.2వేల పింఛన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



పులి చర్మాన్ని విక్రయించిన నిందితులతో అటవీశాఖ అధికారులు

పులిని చంపిన నిందితుల అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్, జనవరి 7: ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలోని పెంబి అటవీ ప్రాంతంలో పులిని చంపి చర్మాన్ని విక్రయించే క్రమంలో పట్టుబడిన వారిలో నిందితులను అటవీ శాఖాధికారులు సోమవారం అరెస్టు చేశారు. ఆదిలాబాద్‌లో సోమవారం ఎఫ్‌డీవో చంద్రశేఖర్ వివరాలను వెల్లడించారు. నిర్మల్ జిల్లా పెంబి మండలం పులిగంపాండ్రి అటవీప్రాంతంలో రెండు నెలల క్రితం మున్న, ప్రకాశ్‌లు కరెంట్ తీగలు అమర్చి పులిని చంపినట్లు ఒప్పుకున్నారన్నారు. వీరు హైదరాబాద్‌లోని రాజేందర్, నరేశ్, వరంగల్‌కు చెందిన సంతోష్‌తో సుమారు రూ.25 లక్షలకు పులి చర్మాన్ని విక్రయించేందుకు మధ్యవర్తులతో ఒప్పందం చేసుకున్నారని తెలిపారు. ఈ ఒప్పందం కుదుర్చుకునే క్రమంలోనే వైల్డ్‌లైఫ్ కంట్రోల్‌బ్యూరో వారికి పులిని చంపిన విషయం తెలిసిందన్నారు. ప్రధాన నిందితులలో ప్రకాశ్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. ప్రకాశ్, కిషన్, సంతోష్, రాజేందర్, నరేశ్‌లను అదుపులోకి తీసుకున్నామని మరో నిందితుడు మున్నా పరారీలో ఉన్నాడని తెలిపారు.

13 నుంచి అంతర్జాతీయ పతంగుల పండుగ

▸▸ సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహణ



హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నేషనల్ కైట్ ఫెస్టివల్‌ను ఈనెల 13వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి బుర్రా వెంకటేశం వెల్లడించారు. తెలంగాణ టూరిజం, సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించనున్న కైట్ ఫెస్టివల్, స్వీట్ ఫెస్టివల్ వివరాలను సోమవారం సచివాలయంలో వెల్లడించారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ఈ నెల 13 నుంచి 15వ తేదీ వరకు సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 19 దేశాలకు చెందిన 42 సంస్థల ప్రతినిధులు, 60 మంది ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. కైట్ ఫెస్టివల్‌తో పాటు ఇంటర్నేషనల్ స్వీట్ ఫెస్టివల్ కూడా నిర్వహిస్తామన్నారు. పరేడ్ గ్రౌండ్స్‌లో 3 రోజులు జరిగే ఈ కార్యక్రమంలో.. వెయ్యి రకాల వంటకాలు ప్రదర్శిస్తామన్నారు. ఆగాఖాన్ అకాడమీతో సంయుక్తంగా ఈ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు వెంకటేశం తెలిపారు.

వేరుశనగ రైతుల వెతలు

ప్రభుత్వ మద్దతు ధర క్వింటాలు రూ.4850.. 2రోజుల క్రితం మార్కెట్ ధర రూ.6300.. సోమవారం రూ.4200



వనపర్తి మార్కెట్ యార్డులో తూకం వేస్తున్న వేరుశనగ

వనపర్తి, జనవరి 7: వేరుశనగ రైతుల వెతలు మొదలయ్యాయి. ఆరుగాలం శ్రమించి, ఎన్నో ఆశలతో పంటను సాగు చేసిన రైతులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర కూడా అందని పరిస్థితి నెలకొంది. ఆరంభంలో క్వింటాలు రూ.6300 దాకా పలికి ఊరించింది. దీంతో తమ పంటను విక్రయించడానికి ఉత్సాహంగా మార్కెట్‌కు వచ్చిన రైతులకు వ్యాపారులు ధర తగ్గించి ఝలక్ ఇచ్చారు. సోమవారం ధర ఏకంగా క్వింటా రూ.4200కు పడిపోవడంతో రైతులు ఉసూరుమన్నారు. ఉమ్మడి పాలమూరు జిల్లాలోనే వనపర్తి, నాగర్‌కర్నూలు జిల్లాలు వేరుశనగ సాగుకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచాయి. ఖరీఫ్‌లో సాగైన 30 వేల ఎకరాల పంట చేతికందడంతో రైతులు విక్రయించేందుకు మార్కెట్ బాట పట్టారు. రబీలో సాగైన మరో 30 వేల ఎకరాల పంట కూడా నెల రోజుల్లో మార్కెట్‌కు రానుంది. దీంతో వనపర్తి వ్యవసాయ మార్కెట్‌కు 10 రోజులుగా వేరుశనగ ధాన్యం వెల్లువలా వస్తోంది. ఆది, సోమవారం.. రెండు రోజుల్లోనే 20 వేల బస్తాల వేరుశనగ మార్కెట్‌ను ముంచెత్తింది. సోమవారం ఒక్క రోజే 11 వేల బస్తాలు రావడంతో యార్డులో ఎక్కడ చూసినా వేరుశనగ రాసులు, బస్తాలే దర్శనమిచ్చాయి. ఇక్కడి వేరుశనగకు మంచి డిమాండ్ ఉండటంతో కొనడానికి ఇతర రాష్ట్రాల వ్యాపారులు కూడా వస్తుంటారు. వాళ్లు స్థానిక కమీషన్ ఏజెంట్ల ద్వారా టెండర్ వేస్తారు. ఇక్కడి వేరుశనగ ధాన్యాన్ని మహారాష్ట్ర, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు ఎగుమతి చేస్తారు. దీంతో కొనుగోలుదారుల్లో పోటీతత్వం పెరిగి రైతులకు ఎక్కువ ధర లభించింది. వారంరోజులుగా క్వింటాల్ వేరుశనగ అత్యధికంగా రూ.6300, అత్యల్పంగా రూ.4500 పలికింది. ఆదివారం సైతం అధిక ధర లభించిందని, సోమవారం ఇతర రాష్ట్రాల వ్యాపారులు రాకపోవడంతో కమీషన్ ఏజెంట్లు సిండికేట్‌గా మారి ధరను అమాంతం తగ్గించేశారు. దీంతో అత్యధికంగా రూ. 5800, అత్యల్పంగా రూ.4200 ధర వచ్చిందని రైతులు ఆవేదన చెందుతున్నారు. వ్యాపారులు ధాన్యం నాణ్యతను, తేమ శాతాన్ని యంత్రాలతో చూడకుండా ధరను గుడ్డిగా నిర్ణయిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ధాన్యం నాణ్యతను గుర్తించి గిట్టుబాటు ధర లభించేలా అధికారులు చూడాలని కోరుతున్నారు.

ఒక్క రోజుకే 1000 తగ్గింది

నేను 15 ఎకరాల్లో వేరుశనగ పంటను సాగు చేశాను. ఆదివారం 75బస్తాలను మార్కెట్‌కు తెస్తే క్వింటాల్‌కు రూ.5400 ధర వచ్చింది. మళ్లీ సోమవారం తీసుకొస్తే రూ.4389 మాత్రమే ఇచ్చారు. ఒక్క రోజుకే రూ.1000 తక్కువ వచ్చింది.

- భాస్కర్‌రెడ్డి, గోప్లాపూర్

ధర కొంత తగ్గింది నిజమే

2రోజుల క్రితం ధరను బట్టి చూస్తే ఇప్పుడు కొంత తగ్గిన మాట వాస్తవమే. ఇప్పుడిప్పుడే ధాన్యం మార్కెట్‌కు వస్తోంది. ఇక ఇతర రాష్ట్రాల వ్యాపారులు కొనడానికి వస్తారు. తేమ శాతాన్ని చూసి టెండర్లు వేయాలని వ్యాపారులకు చెప్తాం.

- లక్ష్మయ్య, మార్కెట్ కార్యదర్శి, వనపర్తి

ఆధునిక అన్నదాన సత్రం

▸▸ భవన నిర్మాణ ప్లాన్‌ను పరిశీలించిన వైటీడీఏ అధికారులు

యాదాద్రి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి సన్నిధిలో ఆధునిక వసతి, సదుపాయాలతో నిత్యాన్నదాన సత్ర భవన సముదాయ నిర్మాణ ప్రతిపాదనలు తుది దశకు చేరుకున్నాయి. రూ.12 కోట్ల అంచనాలతో భోజనశాల, వంటశాల, భక్తుల వెయిటింగ్ హాల్‌తో కూడిన భవన నిర్మాణ ప్లాన్స్‌ను సోమవారం వైటీడీఏ వైస్ చైర్మన్ జి. కిషన్‌రావు, ఈవో ఎన్.గీతారెడ్డి సోమవారం హైదరాబాద్‌లో పరిశీలించారు. యాదగిరికొండ కింద గండిచెరువు, ప్రెసిడెన్సియల్ సూట్‌ల మధ్యన ఆలయ అభివృద్ధి కోసం సేకరిస్తున్న 92 ఎకరాల విస్తీర్ణం గల భూమిలో నిత్యాన్నదాన సత్ర భవన సముదాయ నిర్మాణానికి నాలుగు ఎకరాల భూమిని కేటాయిస్తున్నారు. ఈ స్థలంలో ఒకేసారి 500మంది భక్తులు కూర్చొని భోజనాలు చేసేలా విశాలమైన రెండు డైనింగ్ హాల్స్, భక్తులు నిరీక్షించడానికి విశ్రాంతి భవనాలను నిర్మిస్తున్నారు. భోజనాలను వండటానికి అవసరమైన వంటశాలను నిర్మిస్తున్నారు. భవన నిర్మాణ పనులను చేపట్టడానికి హైదరాబాద్‌కు చెందిన విఘ్నేష్ ఫౌండేషన్ అనే సంస్థ రూ.6 కోట్ల వ్యయాన్ని భరించడానికి ముందుకు వచ్చినట్లు ఆలయ వర్గాలు పేర్కొన్నాయి. సీఎం కేసీఆర్ ఆమోదం తర్వాత పనులు చేపట్టనున్నట్లు తెలిసింది.

స్వామిగౌడ్, సుధాకర్‌రెడ్డిపై కేసు కొట్టివేత

కరీంనగర్ లీగల్, జనవరి 7: మండలి చైర్మన్ స్వామిగౌడ్, ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డిపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేస్తూ కరీంనగర్ స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (పీసీఆర్) తీర్పు చెప్పారు. 2013 ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా నియామవళిని ఉల్లంఘించారని పోలీసులు స్వామిగౌడ్, సుధాకర్‌రెడ్డిపై కేసులు నమోదు చేశారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి నేరం రుజువుకాకపోవడంతో వీరిద్దరినీ నిర్దోషులుగా పేర్కొంటూ తీర్పు చెప్పారు.

సర్పంచ్‌కు 3111

▸▸ తొలి రోజు నామినేషన్‌లు ఇవే...

హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మొదటి విడత ఎన్నికల కోసం నోటిఫికేషన్ జారీ చేసిన 4337 గ్రామ పంచాయతీల్లో 7067 నామినేషన్‌లు దాఖలయ్యాయి. ఇందులో సర్పంచ్‌లకు 3111, వార్డు సభ్యులకు 3956 నామినేషన్‌లు దాఖలు చేశారు. 4337 గ్రామ పంచాయతీల పరిధిలో 4337 సర్పంచ్ పదవులు, 39100 వార్డు సభ్యుల పదవులకు నోటిఫికేషన్ జారీ చేశారు. బుధవారం సాయంత్రం 5 గంటల వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. ఇక, మిగిలిన రెండు రోజులు పెద్ద ఎత్తున నామినేషన్‌లు దాఖలు కానున్నాయి. జిల్లాల వారీగా వివరాలు ఇలావున్నాయి. కరీంనగర్ జిల్లాలో సర్పంచ్‌కు 120, వార్డులకు 271, పెద్దపల్లి జిల్లాలో 247, రాజన్న సిరిసిల్ల జిల్లాలో సర్పంచ్‌కు 81, వార్డులకు 129, జగిత్యాల జిల్లాలో సర్పంచ్‌కు 125, వార్డులకు 136, ఆదిలాబాద్ జిల్లాలో సర్పంచ్‌కు52, మంచిర్యాల జిల్లాలో సర్పంచ్‌లకు 59, వార్డులకు23, నిర్మల్ జిల్లాలో సర్పంచ్‌కు 93, వార్డులకు 97, కుమరంభీం జిల్లాలో సర్పంచ్‌కు 36, వార్డులకు 26, జనగామ జిల్లాలో సర్పంచ్‌కు 54, వార్డులకు 68, భూపాలపల్లి జిల్లాలో సర్పంచ్‌కు 69, వార్డులకు70, వరంగల్ రూరల్ జిల్లాలో సర్పంచ్‌కి 89, వార్డులకు 118, మహబూబాబాద్ జిల్లాలో సర్పంచ్‌కు 53, వార్డులకు 31, వరంగల్ అర్బన్ జిల్లాలో సర్పంచ్ 35, ఖమ్మంలో సర్పంచ్‌కు 123, వార్డులకు 123, భద్రాద్రి జిల్లాలో సర్పంచ్‌కు 23, వార్డులకు 51, ఉమ్మడి నల్లగొండలో సర్పంచ్‌కు 427, వార్డులకు 406, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో సర్పంచ్‌కు 364, ఉమ్మడి మెదక్‌లో సర్పంచ్‌కు 606, వార్డులకు 952 నామినేషన్లు దాఖలయ్యాయి.

గర్భిణిపై అంగన్‌వాడీ ఆయా దాష్టీకం!

▸▸ భర్తతో కలిసి దాడి.. శిశువు మృతి.. తల్లి పరిస్థితి విషమం



బాధితురాలు బదావత్ పద్మ

కొత్తగూడెం కలెక్టరేట్, జనవరి 7: ఓ అంగన్‌వాడీ ఆయా దురుసుగా వ్యవహరించి ఆరు నెలల గర్భిణిపై తన భర్తతో కలిసి దాడి చేసింది. దీంతో గర్భిణి కడుపులోని శిశువు మృతి చెందగా, ఆమె పరిస్థితి విషమంగా మారింది. ఈ ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం మద్దిరాల తండాలో సోమవారం జరిగింది. తండాకు చెందిన పద్మ, లక్ష్మణ్ దంపతుల పెద్దకూతురు మేఘనశ్రీ ఒకటో తరగతి చదువుతుండగా, రెండో కూతురు అభినయశ్రీని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్తోంది. ఈ నెల 3న పద్మ.. మేఘనశ్రీని అంగన్‌వాడీ కేంద్రానికి పంపింది. అయితే అక్కడ ఆయా లీలావతి.. మేఘనశ్రీపై ఆగ్రహించి పంపించి వేసింది. ఇదేమని పద్మ నిలదీయడంతో లీలావతి, ఆమె భర్త వీరు కలిసి పద్మపై దాడి చేశారు. స్పృహ కోల్పోయిన పద్మను 108లో ఆసుపత్రికి తరలించగా. వైద్యులు పిండం మృతి చెందినట్లు గుర్తించి అబార్షన్ చేశారు. అనంతరం పద్మను కొత్తగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. బాధితురాలి భర్త లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు అంగన్‌వాడీ ఆయా దంపతులపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శ్రావణ్ కుమార్ తెలిపారు.

స్టాఫ్‌నర్సుకే సకాలంలో అందని వైద్యం !

▸▸ జనగామ ఎంసీహెచ్‌లో గర్భంలోనే మృతి చెందిన శిశువు

జనగామటౌన్, జనవరి 7: ఆమె అదే ఆస్పత్రిలో స్టాఫ్‌నర్సు.. నిండు గర్భిణి అయిన ఆమె అదే ఆస్పత్రిలో ప్రసవం కోసం చేరింది.. వైద్యం సకాలంలో అందలేదు సరికదా, గర్భంలోనే మగబిడ్డ మృతి చెందాడు. జనగామ ఎంసీహెచ్ (మాతా శిశు సంరక్షణ కేంద్రం)లో ఈ దారుణం జరిగింది. వరంగల్ మట్టెవాడకు చెందిన ఆర్.రేవతి జనగామ చంపక్‌హిల్స్‌లోని ఎంసీహెచ్‌లో స్టాఫ్‌నర్సుగా పనిచేస్తోంది. కాగా, ప్రసవం కోసం ఆదివారం ఎంసీహెచ్‌లో చేరింది. రేవతికి అదేరోజు రాత్రి శస్త్రచికిత్స జరగాల్సి వుంది. కాగా, అనస్థీషియన్ అందుబాటులో లేక ఆపరేషన్ ఆలస్యమైంది. ఆక్సిజన్ అందక గర్భస్థ శిశువు మృతి చెందాడు. డాక్టర్ నిర్లక్ష్యంతోనే శిశువును కోల్పోయామని రేవతి భర్త, బంధువులు ఆరోపిస్తూ ఆందోళనకు దిగారు. విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ డాక్టర్ ఏ.శ్రీనివాస్ తెలిపారు.

'స్థానిక' కోడ్‌లో సవరణలు

▸▸ ఎన్నికలు జరిగే ప్రాంతాలకే నియమావళి

▸▸ ఆర్టీసీ, సింగరేణి ఉద్యోగులూ పోటీకి అర్హులు

▸▸ 2వ అనుబంధ ఓటరు జాబితా ప్రదర్శనకు ఆదేశం

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఇకపై స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో.. రాష్ట్రవ్యాప్తంగా కోడ్ అమల్లో ఉండదు. అభివృద్ధి, సంక్షేమం, కొత్త పథకాల అమలుకు కోడ్ అడ్డంకిగా మారనున్నట్లు ప్రభుత్వం గుర్తించింది. దీంతో.. రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) పరిధిలోని ఎన్నికల ప్రవర్తనా నియమావళిలో కీలక సవరణలు చేసింది. ఈమేరకు ఎస్ఈసీ కార్యదర్శి అశోక్‌కుమార్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. దీని ప్రకారం.. ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో పట్టణాలు, నగరపాలికలకు కోడ్ వర్తించదు. సింగరేణి, టీఎస్ఆర్టీసీ ఉద్యోగులు స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయవచ్చని అశోక్‌కుమార్ పేర్కొన్నారు. ఆయా సంస్థల్లో ఎండీ, మేనేజర్, సెక్రటరీ స్థాయిలో పనిచేసే అధికారులు మాత్రం పోటీకి అనర్హులని స్పష్టం చేశారు. కాగా.. పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో రెండో అనుబంధ 'ఓటర్ల జాబితా'ను ప్రదర్శించాలని ఎస్ఈసీ ఆదేశించింది. డిసెంబరు 31 వరకు ఓటర్లుగా నమోదైన వారిని రెండో అనుబంధ జాబితాలో చేర్చాలని జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించింది.

ఎన్నికల 'ఖాతా' తెరిచేదెలా?

▸▸ నేడు, రేపు బ్యాంకు ఉద్యోగుల సమ్మె

▸▸ సర్పంచ్ అభ్యర్థుల్లో గుబులు

▸▸ రేపటితో ముగియనున్న నామినేషన్ల గడువు

జగిత్యాల, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీ చేసే అభ్యర్థుల్లో కొత్త గుబులు మొదలైంది. ఎన్నికల ఖర్చును బ్యాంకు ఖాతాల ద్వారానే జరపాలని, ఆ వివరాలను నామినేషన్లతోపాటే అందజేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) ఆదేశాలు జారీచేసింది. తొలివిడత నామినేషన్ల పర్వం బుధవారంతో ముగియనుంది. అయితే.. మంగళ, బుధవారాల్లో దేశవ్యాప్త సమ్మెలో బ్యాంకు ఉద్యోగులు కూడా పాల్గొంటున్నారు. బ్యాంకులు పనిచేసే అవకాశం లేదు. దీంతో సర్పంచ్, వార్డు స్థానాలకు పోటీ చేసే వారిలో కొత్త ఖాతాలపై ఆందోళన మొదలైంది. తొలుత కొత్త ఖాతాలు తప్పనిసరి అని పేర్కొన్న ఎస్ఈసీ, ఆదివారం కొంత సడలింపునిచ్చింది. పాత ఖాతాలున్నా.. ఎన్నికల ఖర్చుకోసమే వాటిని వినియోగిస్తామంటూ అఫిడవిట్ దాఖలు చేయాలని పేర్కొంది. అయితే.. ఇప్పటి వరకు బ్యాంకు ఖాతా లేనివారి పరిస్థితి ఇప్పుడు అగమ్య గోచరంగా మారింది. ఈ కేటగిరీలో ఎక్కువ శాతం మహిళా అభ్యర్థులు.. ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీ మహిళలు ఉన్నారు.

'కేరళ' పాలనను వ్యతిరేకించాలి: విజయభారతి



కరీంనగర్‌టౌన్, జనవరి 7: నరహంతక పాలనతో కోట్లాది మంది హిందువుల మనోభావాలను దెబ్బతీచేలా వ్యవహరిస్తున్న కేరళ ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ చర్యలను సమస్త హిందూ సమాజం వ్యతిరేకించాలని ప్రజ్ఞాభారతి మహిళా విభాగ్ రాష్ట్ర కన్వీనర్ నరహరి విజయభారతి పిలుపునిచ్చారు. సోమవారం కరీంనగర్‌లో సేవ్ శబరిమలైలో భాగంగా నిర్వహించిన హిందూ ధర్మాగ్రహ యాత్రలో ఆమె ప్రసంగించారు. అసలు దేవుడే లేడని చెప్పే కమ్యూనిస్టులకు శబరిమలై అయ్యప్పస్వామితో ఏమి సంబంధమని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు తుది తీర్పును ఇవ్వకముందే అర్ధరాత్రి దొంగచాటుగా మహిళలను అంబులెన్సుల్లో తీసుకెళ్లి దర్శనం చేయించడంలో ఆంతర్యమేమిటని ఆమె మండిపడ్డారు. సుప్రీంకోర్టు రివ్యూ పిటీషన్‌ను స్వీకరించిందని, ఈనెల 21న తీర్పు వెలువడే అవకాశాలుండగా కేరళ సీఎం అక్కడి సీపీఐ, సీపీఎం కార్యకర్తలు, సుప్రీంకోర్టు తీర్పును గౌరవించాలంటూ మహిళలను దొంగచాటున తీసుకెళ్తున్నారని విమర్శించారు. కఠిన దీక్షలు చేసిన అయ్యప్ప స్వాముల మనోభావాలను దెబ్బతీసే అధికారం వీరికెక్కడిదని ప్రశ్నించారు. అయ్యప్పస్వామి దర్శనం కల్పించాలంటూ మహిళలు ఎవరూ కోరడం లేదని, కమ్యూనిస్టులు, దేవుడిపై నమ్మకం లేని వారే రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు. హిందువుల ఆచారాలు, సంప్రదాయాలు, విశ్వాసాలను దెబ్బతీస్తే సహించేది లేదని హెచ్చరించారు. బీజేపీ రాష్ట్ర అధికారప్రతినిధి బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ శబరిమలై ఆలయ సంప్రదాయాలను కాపాడుకునేందుకు ప్రతి హిందువు ఉద్యమించాలని, ఉద్యమిస్తారని హెచ్చరించారు.

రిజర్వేషన్ల దాడి!

అగ్రవర్ణ పేదలకు విద్య, ఉద్యోగాల్లో పదిశాతం రిజర్వేషన్ కల్పించాలని కేంద్రమంత్రి వర్గం నిర్ణయించింది. ఇందుకు ఎనిమిది లక్షల వార్షికాదాయం, ఐదెకరాల వ్యవసాయభూమి, వెయ్యి చదరపు అడుగుల ఇల్లు ఇత్యాది పరిమితులను ప్రతిపాదించింది. ఈ కొత్త రిజర్వేషన్ను సాధించడం కోసం రాజ్యాంగం అధికరణలు 15, 16 సవరించడానికి నేడు ప్రభుత్వం పార్లమెంటులో బిల్లు ప్రవేశపెట్టబోతున్నది. రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి పార్లమెంటులో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం కనుక, రాజ్యసభలో బీజేపీకి తగినంత బలం లేనందున ఈ ప్రయత్నం ఏ విధంగా ముందుకు పోతుందో చూడాలి. దీనితోపాటు కనీసం సగం శాసనసభలు కూడా ఈ సవరణను ఆమోదించవలసి ఉంటుంది.

సవాలక్ష కష్టాల్లో ఉన్న మోదీ ఇలా మరో సిక్సర్ దాడికి సిద్ధపడతారని విపక్షాలు ఊహించి ఉండవు. ఇది ఎన్నికల జిమ్మిక్కని అవి చేస్తున్న విమర్శను విభేదించలేనిదేమీ లేదు. మొన్న జరిగిన ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో సంప్రదాయిక అగ్రవర్ణ ఓటుబ్యాంకు పార్టీకి దూరమైన విషయం బీజేపీకి స్పష్టమైపోయింది. తమకూ రిజర్వేషన్లు కావాలంటూ కాపు, మరాఠా, జాట్, పాటీదార్ తదితర కులాలు కొన్నేళ్ళుగా ఆందోళనలు చేస్తుండటం, ఆయా రాష్ట్రాల్లో తీవ్ర హింస జరగడం తెలిసిందే. ఈ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు చేసిన ప్రయత్నాలేవీ న్యాయస్థానాల్లో నిలబడలేకపోవడంతో వీరిలో మరింత అసహనం పెరిగింది. అనేక రాష్ట్రాల ఎన్నికల్లో అగ్రవర్ణ కులాల రిజర్వేషన్ అత్యంత కీలకమైపోయింది. మోదీ మాస్టర్ స్ట్రోక్తో విపక్షాలు ఆత్మరక్షణలో పడిపోయిన మాట వాస్తవం. రాజ్యసభలో తగిన బలం లేకుండా నిర్ణయాన్ని ఎలా అమలు చేస్తారని ప్రశ్నిస్తున్న కాంగ్రెస్ ఇప్పటికే విప్ జారీ చేసింది. లోక్సభలో బీజేపీ బలం వల్ల సులభంగా గట్టెక్కి, రాజ్యసభలో నిలిచిపోయిన పక్షంలో విపక్షాలను వేలెత్తిచూపడం తప్పదు. రిజర్వేషన్ల వ్యతిరేకిగా ముద్ర వేస్తున్నట్టు కనబడకుండా, మరోపక్క మోదీ ప్రభుత్వానికి పేరు దక్కకుండా సమావేశాల చివరిరోజుకు ఏదోవిధంగా నెట్టుకురావచ్చునన్నది విపక్షాలకు [illegible] రాజ్యసభను అదనంగా మరో రోజు పొడిగించి అధికారపక్షం మరింత ఇరకాటంలో పడేసింది.

రిజర్వేషన్లు యాభైశాతం దాటకూడదనీ, ఆర్థిక స్థితి ఆధారంగా రిజర్వేషన్లు కల్పించే వెసులుబాటు రాజ్యాంగంలో లేదని సుప్రీంకోర్టు దశాబ్దాల క్రితమే తేల్చేసింది. అగ్రవర్ణ పేదల కోటాకు సంబంధించి మండల్ కమిషన్ కాలంలో వీపీ సింగ్ ఇచ్చిన హామీ కానీ, అనంతరం పీవీ నరసింహారావు చేసిన ప్రయత్నం కానీ సఫలం కాలేదు. ఇప్పుడు ఈ అధికరణలు సవరించిన తరువాత, తమిళనాడు రిజర్వేషన్ చట్టం తరహాలో దీనిని 9వ షెడ్యూల్లో చేర్చి న్యాయస్థానాలనుంచి రక్షించాల్సి ఉంటుందని న్యాయనిపుణులు అంటున్నారు. కానీ, ఈ షెడ్యూల్లో చేర్చినవాటిని కూడా రాజ్యాంగ మౌలిక సూత్రాలకు భంగకరమని అనిపించిన పక్షంలో సమీక్షిస్తానని సుప్రీంకోర్టు గతంలోనే ప్రకటించింది. ఎస్సీ, ఎస్టీలకు అటుంచితే ఓబీసీల రిజర్వేషన్ల వరకూ విద్యాపరంగా, సామాజికంగా వెనుకబాటు ప్రాతిపదిక అయింది తప్ప ఆర్థికం ప్రధాన ప్రాతిపదిక కాబోదన్నది వాస్తవం. పైగా, బీసీ క్రీమీలేయర్ను నిర్ధారించే 8లక్షల రూపాయల వార్షిక ఆదాయపరిమితినే ఓసీ రిజర్వేషన్లకు హద్దుగా నిర్ణయించడం ఇరువురికీ సమానం చేయడమే అవుతున్నది. రిజర్వేషన్ల మూల సిద్ధాంతానికి వ్యతిరేకమైన చర్యలకు పాల్పడకుండా పేదలను ఉద్ధరించడానికి ప్రత్యేకించి పేదరిక నిర్మూలన పథకాలు చేపట్టాలని కొందరు అంటున్నారు. ఇక, క్రీమీలేయర్ను గుర్తించి వడగట్టడం ఎంత కష్టమైన పని కనుక, నిజమైన అగ్రవర్ణ పేదలకు ఈ రిజర్వేషన్ల ద్వారా లబ్ధి చేకూరుతుందని కూడా చెప్పలేం.

ఇంతకాలమూ ఎంతమంది ఎన్ని ప్రయత్నాలు చేసినా అంగుళం కదలని యాభైశాతం రిజర్వేషన్ గోడను ఏకంగా బద్దలు కొట్టడానికే మోదీ సిద్ధపడుతున్నారు. అనుకున్నట్టు జరిగి మరో పదిశాతం వచ్చిచేరినా ఆ తరువాత, వివిధ రాష్ట్రాల నుంచి ఉన్న వేరువేరు డిమాండ్లను బట్టి అది అక్కడితో ఆగిపోదు. అలాగే, తమను బీసీలుగా గుర్తించి, బీసీ రిజర్వేషన్ ఇవ్వాలని పోరాడుతున్న కులాలు ఈ అగ్రకుల రిజర్వేషన్తో సంతృప్తి పడతాయా అన్నది ప్రశ్న. 8లక్షల ఆదాయం, ఐదెకరాల భూమిని ప్రాతిపదికలుగా నిర్ణయించడమన్నది నిజమైన పేదలను ఉద్ధరించడానికేనా? అన్నది మరో ప్రశ్న. పైగా ఆర్థికవెనుకబాటుతనం కొలబద్ద ఇంత పెద్దదిగా ఉండటం ప్రభుత్వాలకు ఊహించని కొత్త సమస్యలు తెచ్చిపెడుతుంది. ప్రైవేటు, పారిశ్రామిక ఉద్యోగాలు భర్తీచేయకుండా ఖాళీగా వదిలేసి, కొత్త రిజర్వేషన్ల కోసం మోదీ ప్రయోగించిన ఈ అస్త్రం అగ్రకులాలను తనవైపు తిప్పుకునే మాస్టర్ స్ట్రోక్ అవుతుందో, హార్దిక్ పటేల్ అంటున్నట్టుగా చివరి లాలీపాప్ అవుతుందో చూడాలి.

'అధికార' గ్రహణంలో ఆర్థికం

ప్రపంచ ఆర్థిక వ్యవస్థ గత ఆరు సంవత్సరాలుగా 3.6 శాతం గౌరవప్రద వృద్ధిరేటుతో పెరుగుతోంది. ముఖ్యంగా గత రెండు సంవత్సరాలలో, అమెరికా అధ్యక్షుడు అనుసరిస్తోన్న ఆర్థిక విధానాలతో, ఆ వృద్ధి రేటు మరింత వేగం పుంజుకొంది. కార్పొరేట్ కంపెనీలకు పన్నులు పెద్ద ఎత్తున తగ్గించడం ద్వారా ట్రంప్ ఈ పురోగతికి దోహదం చేశారు.

గ్లోబల్ ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులకు భద్రత, వాటిపై భారీ లాభాలు కోరుకుంటారు. అమెరికాలో మదుపుచేయడం వల్ల వారి ఆకాంక్షలు నెరవేరుతాయి. రెండు సంవత్సరాల క్రితం వరకు అమెరికాలో వడ్డీరేట్లు దాదాపు శూన్యంగా ఉన్నాయి. ఆ పరిస్థితుల్లో అమెరికాలో మదుపు చేయడానికి గ్లోబల్ ఇన్వెస్టర్లు వెనుకాడారు. 2018లో వడ్డీ రేట్లు పెరగడంతో పరిస్థితి మారిపోయింది. దీంతో భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న మార్కెట్ల నుంచి తమ పెట్టుబడులను ఉపసంహరించుకుని అమెరికాలో మదుపు చేస్తున్నారు.

ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేస్తోన్న రెండో పరిణామం దేశీయ మార్కెట్ల సంరక్షణ. చైనా నుంచి వెల్లువెత్తుతున్న దిగుమతులను అడ్డుకునేందుకు ట్రంప్ ఆ దేశానికి వ్యతిరేకంగా వాణిజ్య యుద్ధాన్ని ప్రారంభించారు. ఆ యుద్ధంలో భాగంగానే భారత్ నుంచి ఉక్కు, అల్యూమినియంపై భారీ సుంకాలను ట్రంప్ విధించారు. ఈ చర్య 2019లో భారత్ ఎగుమతులపై ప్రతికూల ప్రభావాన్ని చూపనున్నది.

ఈ నేపథ్యంలో మన ఆర్థిక వ్యూహాన్ని నిర్ణయించుకోవల్సి వున్నది. విదేశీ పెట్టుబడులను, విదేశీ వాణిజ్యాన్ని అనుమతించడమే ప్రస్తుతం మనం అనుసరిస్తున్న మార్గం. అమెరికాలో వడ్డీ రేట్లు పెరగడం వల్ల మనకు విదేశీ పెట్టుబడుల రాక తగ్గిపోవచ్చు. మన దేశం నుంచి పెట్టుబడులు తరలిపోవడం వల్ల పరిస్థితి మరింతగా ప్రతికూలమవుతుంది. భారతీయ మదుపుదారులు కూడా, విదేశీ మదుపుదారుల వలే, భారత్లో కంటే అమెరికాలో మదుపుచేయడానికే మొగ్గు చూపుతారు. విదేశీ సంస్థాగత మదుపుదారులు గత ఏడాది అక్టోబర్ నాటికి భారత్ నుంచి రూ.90,746 కోట్ల పెట్టుబడులను ఉపసంహరించుకున్నారు. కేవలం ఒక్క ఏడాదిలో విదేశీ మదుపుదారులు భారీ స్థాయిలో తమ సొమ్మును వెనక్కి తీసుకెళ్లిపోవడం ఇదే మొదటిసారి. అమెరికాలో వడ్డీరేట్లు పెరుగుతుండడంతో పాటు రూపాయి విలువ పతనం కావడం వల్లే విదేశీ పెట్టుబడులు తరలిపోయాయి. అమెరికా అనుసరిస్తోన్న సంరక్షణ విధానాల వల్ల ఆ దేశానికి మన ఎగుమతులు కూడా తగ్గిపోయాయి. అమెరికాతో మన వాణిజ్య లోటు 2017లో 15.1 బిలియన్ డాలర్ల నుంచి 2018లో 16.67 బిలియన్ డాలర్లకు పెరిగింది.

భరతవాక్యం

■ భరత్ ఝున్ఝున్వాలా

మన ఆర్థిక వ్యవస్థ పురోగతికి దోహదం చేసే పరిస్థితులు కన్పించడం లేదు. విదేశీ పెట్టుబడులు తరలిపోవడం, దిగుమతుల పెరుగుదల కొనసాగే అవకాశమున్నది. వాణిజ్య యుద్ధం ఇప్పట్లో సమసిపోయే సూచనలు కన్పించడం లేదు. సంరక్షణ విధానాలు మరింతగా విస్తృతమవ్వచ్చు. వచ్చే మార్చిలో యూరోపియన్ యూనియన్ నుంచి బ్రిటన్ వైదొలగనున్నది. ఇరాన్పై వ్యతిరేకతను ట్రంప్ ఇసుమంత కూడా విడనాడడం లేదు. ఈ వాస్తవాలను దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో ఆర్థిక వ్యవస్థ స్థితిగతులు మరింతగా విషమించకుండా ఉండేందుకు తక్షణమే తగు చర్యలు చేపట్టాలి.

విదేశీ పెట్టుబడుల స్వేచ్ఛా ప్రవాహానికి, స్వేచ్ఛా వాణిజ్యానికి అవరోధాలు ఎందుకు కలుగుతున్నాయి? భారత ప్రభుత్వ అత్యున్నత స్థాయి అధికారులు తమ వ్యక్తిగత ప్రయోజనాలే లక్ష్యంగా ఆర్థిక, వాణిజ్య విధానాలను ప్రభావితం చేస్తున్నట్టుగా కన్పిస్తోంది. తత్కారణంగానే తమ భావి యజమానులు – ప్రపంచబ్యాంకు, బహుళజాతి సంస్థలు – నిర్దేశిస్తున్న విధానాలకు వారు మద్దతు నిస్తున్నారు!

విదేశీ మదుపుదారులు మన దేశంలో మదుపు చేయడాన్ని కొనసాగించేందుకై ప్రభుత్వ వ్యయాలను నియంత్రించడం, ద్రవ్యలోటును తగ్గించడం అనే విధానాన్ని ప్రభుత్వం అనుసరిస్తోంది. దేశ ఆర్థికాభివృద్ధికి విదేశీ పెట్టుబడులే కీలకమని పాలకులు విశ్వసిస్తున్నారు. అయితే గత కొద్ది సంవత్సరాలుగా ద్రవ్యలోటును అంతకంతకూ తగ్గిస్తున్నప్పటికీ దేశంలోకి విదేశీ పెట్టుబడుల ప్రవాహం పెరగలేదు. పైగా 2018లో పెట్టుబడుల తరలిపోవడం మరింతగా పెరిగింది. కనుక ఇప్పుడు ద్రవ్యలోటును పెంచి, పెట్టుబడులు తరలిపోవడంపై కఠినమైన ఆంక్షలు విధించడమే మన విధానంగా ఉండాలి. దీనివల్ల మన సొంత పెట్టుబడులను మన పురోభివృద్ధికి ఉపయోగించుకోగలుగుతాము. దిగుమతి సుంకాలు విధిగా పెంచాలి. దీనివల్ల దేశీయ ఉత్పత్తుల విక్రయాలు పెరుగుతాయి. ఫలితంగా ఉద్యోగాల సృష్టి వేగవంతమవుతుంది. అధిక వృద్ధి రేటూ సిద్ధిస్తుంది.

సరే, అసలు విదేశీ పెట్టుబడుల స్వేచ్ఛా ప్రవాహానికి, స్వేచ్ఛా వాణిజ్యానికి అవరోధాలు ఎందుకు కలుగుతున్నాయి? భారత ప్రభుత్వ అత్యున్నత స్థాయి అధికారులు తమ వ్యక్తిగత ప్రయోజనాలే లక్ష్యంగా ఆర్థిక, వాణిజ్య విధానాలను ప్రభావితం చేస్తున్నట్టుగా కన్పిస్తోంది. ప్రపంచ బ్యాంకులో భారత్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మొదలైన ఉద్యోగాలను పొందేందుకు వారు పరస్పరం పోటీ పడుతున్నారు. భారత ప్రభుత్వ మాజీ కార్యదర్శి ఒకరు ప్రపంచ బ్యాంకు నుంచి తాను రోజుకు రూ.40,000లను కన్సల్టెన్సీ ఫీజుగా పొందుతున్నానని గొప్పగా చెప్పుకున్నారు! దేశ ఆర్థికాభివృద్ధికి పూచీపడవలసిన ఈ ఉన్నతాధికారులు తమ కుమారులు, కుమార్తెలకు బహుళజాతి సంస్థల్లో ఉద్యోగాలను ఆశిస్తున్నారు. వారి ఆకాంక్షలు ఎలా నెరవేరతాయి? ప్రపంచ బ్యాంకు, బహుళజాతి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా వ్యవహరించడమే! తత్కారణంగానే తమ భావి యజమానులు నిర్దేశిస్తున్న విధానాలకు వారు మద్దతు నిస్తున్నారు! తమ స్వార్థ ప్రయోజనాలకై దేశాన్ని విక్రయించడానికి ఈ ఉన్నతాధికారులను ఎట్టి పరిస్థితులలోను అనుమతించకూడదు. ప్రస్తుత విధానాలను మార్చివేసి, పెట్టుబడులు తరలిపోవడాన్ని అడ్డుకోవాలి. అలాగే స్వేచ్ఛా వాణిజ్య విధానాలు దేశ ప్రయోజనాలకు సానుకూలంగా ఉండేలా మార్పులు చేయాలి. ఇవి ఇప్పుడు దేశం ముందున్న కర్తవ్యాలు.

(వ్యాసకర్త ఆర్థికవేత్త, బెంగళూరు ఐఐఎం రిటైర్డ్ ప్రొఫెసర్)

సైన్స్కు ఆత్మశోధన అవసరం

జలంధర్ (పంజాబ్)లో ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ 106వ వార్షిక సమావేశం ముగిసింది. కొత్త ఆవిష్కరణలు, నవ కల్పనలు, అంకుర భావాల గురించి స్ఫూర్తిదాయకమైన చర్చలు జరిగాయి. మానవ సమాజాలను సంక్లిష్ట సమస్యల నుంచి విముక్తం చేసి నాగరికతా పురోగమనాన్ని సంభవం చేసిందీ, చేస్తోందీ శాస్త్ర విజ్ఞానమే (సైన్స్). విమర్శనాపూర్వక పరిశీలనలు, నిరంతర ప్రయోగాలతో సంపూర్ణ స్వేచ్ఛాయుత సమాజానికి సైన్స్ పునాదులు వేసింది. 'శాస్త్రీయ దృక్పథం మన జీవనవిధానం కావాలి. మన ఆలోచనాక్రమం కావాలి. మన కార్యాచరణ కావాలి. మన తోటివారితో సంబంధాలకు అది ప్రాతిపదిక అవ్వాలి' అని జవహర్లాల్ నెహ్రూ అన్నారు.

శాస్త్ర విజ్ఞాన వివేచన, శోధనలు కేవలం భౌతిక, జీవ శాస్త్రాలలో పనిచేసే శాస్త్రవేత్తల వ్యాపకాలు మాత్రమే కాదు. సామాజిక శాస్త్రాలలో పరిశోధనా పద్ధతులను సైతం శాస్త్ర విజ్ఞానం ప్రభావితం చేస్తోంది. సైన్స్ ప్రభావశీల వర్గాలను పురోగమిస్తూ ఆ శాస్త్రాల పరిపుష్టతకు దోహదం చేస్తోంది. అయితే సైన్స్ ప్రస్థానం సదా సుగమం, సరళంగా సాగలేదు. అలాగే ఆ ప్రస్థాన పురోగతి గురించిన కథనాలు ఎప్పుడూ విశ్వసనీయమైనవిగా లేవు. 18వ శతాబ్ది యూరోపియన్ జ్ఞానోదయ ఆలోచనాపరులు విశ్వసించినట్టు [illegible] సమాజాన్ని నిర్మించాలని స్వప్నించారు. హేతుబద్ధ ఆలోచనకు విశేషంగా దోహదం చేసిన శాస్త్ర విజ్ఞానాన్ని ఒక మౌలిక సత్యంగా, వివేచనాయుత సమాజానికి పునాదిగా భావించారు. మానవ వ్యవహారాలలో నిశ్చితత్వాన్ని పెంపొందించుకోవడానికి, భవిష్యత్తు గురించి విశ్వసనీయ ఆధారాలతో ఒక కచ్చితమైన అంచనాకు రావడానికి శాస్త్ర విజ్ఞానమే ఆధునికులకు ఆసరా అయింది. అయినప్పటికీ జ్ఞాన ఉత్పత్తితో తప్పనిసరిగా ముడివడివున్న రాజకీయ ఆర్థిక పరిస్థితుల నుంచి శాస్త్ర విజ్ఞానం తనకుతాను స్వేచ్ఛగా వ్యవహరించలేదు. రాజకీయ ఆర్థిక అంశాలతో అది నిత్యం ప్రభావితమవుతుంది. మరింత స్పష్టంగా చెప్పాలంటే శాస్త్ర విజ్ఞానాన్ని ఆ అంశాలు నిత్యం నియంత్రిస్తుంటాయి.

విచక్షణారహిత 'అభివృద్ధి' కార్యకలాపాలకు, సైనిక పాటవాన్ని పెంపొందించుకునే ప్రయత్నాలకు న్యాయబద్ధత కలిగించేందుకై ఆధునిక జాతి–రాజ్యాలు శాస్త్ర విజ్ఞానానికి అమిత ప్రాధాన్యమిచ్చాయి. అధికోత్పత్తిని సాధించేందుకు, అత్యాధునిక పెట్టుబడిదారీ సమాజాల వస్తుదాహాన్ని తీర్చేందుకు మార్కెట్కు శాస్త్ర విజ్ఞానం అవసరమయింది. ప్రజలను అనేక విధాల నియంత్రించేందుకు అవసరమైన సాధనాలను తక్షణమే సమకూర్చుకోవడానికై ప్రస్తుత నిఘా యుగపు పాలక వర్గాలకు శాస్త్ర విజ్ఞానం ఎంతో ఆవశ్యకమయినది. చెప్పవచ్చినదేమిటంటే శాస్త్ర విజ్ఞాన పరిశోధనలకు స్వతంత్ర ప్రతిపత్తి లేదు. అవి రాజకీయ అవసరాలతో ప్రభావితమవుతుంటాయి; రాజకీయ ఆధిపత్యాలతో నియంత్రితమవుతుంటాయి. మరింత స్పష్టంగా చెప్పాలంటే 'విమర్శనా సిద్ధాంత కర్తలు' (క్రిటికల్ థియరిస్ట్స్– ఇంచుమించు శతాబ్దం క్రితం జర్మనీలోని ఫ్రాంక్ఫర్ట్లో వామపక్ష మేధావులు అభివృద్ధిపరచిన సిద్ధాంతం) వాదించినట్టు శాస్త్ర విజ్ఞాన వివేచనా వివేకాల కంటే, దాని ఆధారంగా ఆవిర్భవించిన సాంకేతికతల ప్రయోజనాలే మానవ సమాజాలను ఎల్లెడలా ఆకర్షిస్తున్నాయి. తత్ఫలితంగానే పాలక వర్గాలకు శాస్త్ర విజ్ఞానం సన్నిహితమయింది. ఆ వర్గాల ఆధిపత్యానికి లోబడివుంటోంది. ఈ కారణంగానే మానవీయ, సామాజిక శాస్త్రాలలో పనిచేస్తున్నవారు కూడా సైన్స్ ఆచరణపై మేధో చర్చల్లో భాగస్వాములవుతున్నారు. వైజ్ఞానిక పద్ధతి గురించి నిశితంగా ఆలోచిస్తున్నారు. ఇది ఎంతైనా అవసరం–ముఖ్యంగా మన సమాజంలో. విమర్శనాత్మక ఆలోచనల కంటే మత విశ్వాసాలకే మన పాలకులు ప్రాధాన్యమిస్తున్నారని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇటువంటి పరిస్థితుల్లో సైన్స్ ఆచరణ పట్ల, మన జీవిత పరిసరాల్లో చోటు చేసుకుంటున్న వాటి పట్ల ఉదాసీనంగా ఉండిపోవడం సాధ్యమవుతుందా?

సైన్స్తో వర్తమాన యువ భారతీయుల సంబంధాల తీరుతెన్నులు ప్రాథమికంగా లోపభూయిష్టమైనవి. జ్ఞాన సంప్రదాయాలలోని సైన్స్ వెర్సస్ హ్యూమానిటీస్ అనే ఒక వింత అధిక్రమం (హైరార్కీ) మూలంగా 'పిసిఎమ్' (ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్ మ్యాటిక్స్) విశిష్టమూ, అత్యున్నతమైనదని మన యువజనులు విశ్వసిస్తున్నారు. ఆ సబ్జెక్టులే తమ భావి ఉన్నతికి మేధో పెట్టుబడిగా భావిస్తున్నారు ఇటువంటి భావాలతో ఆ యువ మనస్సులు ముకుళించకుపోతున్నాయి. యువ భారతీయ మేధ సంవృత్తమవుతోంది. దేశ రాజకీయాలు, సంస్కృతి, నైతిక సందిగ్ధతల నుంచి సైన్స్ను వేరుపరుస్తున్నారు. జీవనాధారంగా ఏ వృత్తిని లేదా ఏ ఉద్యోగాన్ని ఎంచుకోవాలనే ఎడతెగని వ్యాకులతతో సైన్స్ను ఒక ఏకీకృత 'ఎఫ్ఐఐటిజెఇఇ/ ఆకాష్' బ్రిలియంట్ మంత్రంగా కుదించివేస్తున్నారు. సైన్స్ అనేది ఒక సమస్యల సముదాయమని, గైడ్ పుస్తకాలు, అనుకృత పరీక్షలు (మాక్ టెస్ట్స్) ద్వారా వాటిని పరిష్కరించవచ్చని భావిస్తున్నారు. ఈ క్రమంలో సైన్స్ తన స్వతసిద్ధ స్ఫూర్తిని కోల్పోతోంది. కేవలం ఒక నైపుణ్యంగా కుదించివేయబడడంతో యువ మనస్సుల్లో సృజనాత్మక ఊహలు, ఆలోచనాశక్తి హరించిపోతున్నాయి.

నేడు ఆదర్శ ప్రాయ విద్యా సంస్థగా పేరు పొందిన ఏ సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్ ఇన్స్టిట్యూట్ అయినా మరో సత్యేంద్రనాథ్ బోస్ను, సివిరామన్ను సృష్టించలేదు. ప్రభుత్వం అపరిమిత ప్రాధాన్యమిస్తోన్న ఐఐటిలు కూడా



సైన్స్ తన సొంత ఆలోచనలనూ, కార్యకలాపాలనూ అంతర్దృష్టితో విమర్శించుకోవాల్సిన ఆవశ్యకత వర్తమాన యుగంలో ఎంతైనా ఉన్నది. నిత్యం అనూహ్య సాంకేతికతలు ఆవిష్కృతమవుతున్న ఈ కాలంలో సైన్స్ తప్పనిసరిగా అంతర్ముఖత్వం సంతరించుకోవాలి. తన నిశిత దృక్కులను తనపైనే సారించుకోవాలి. తనను తాను పునర్ నిర్వచించుకోవాలి.

కార్పొరేట్ కంపెనీలకు అవసరమైన టెక్నాలజిస్టులను మాత్రమే అందిస్తున్నాయి. విశ్వవిద్యాలయాలలో సైతం, కొంతమంది అసాధారణ ప్రతిభావంతులు మినహా, శాస్త్రవేత్తలు తమకుతాము ప్రయోగశాలలకే పరిమితమవుతున్నారు. సైన్స్ సమాజం మధ్య సంబంధం గురించి అరుదుగా మాట్లాడుతున్నారు ప్రత్యేక అధ్యయనాలు, వృత్తిగత 'నిష్పాక్షికత' పేరిట సమాజం నుంచి స్వయంగా వేరుపడుతున్నారు. ఈ వేర్పాటు ఒక మౌన సంస్కృతిని సృష్టిస్తోంది. సమాజం అవసరాలను అలక్ష్యం చేయడానికి కారణమవుతోంది. ఇదేమీ రాజకీయ ఆధిపత్యాల నుంచి స్వేచ్ఛగా వ్యవహరించడం కాదు. నిష్కర్షగా చెప్పాలంటే యథాతథ పరిస్థితిని కొనసాగించే, సమర్థించే మరో రకపు రాజకీయాలను అనుసరించడమే. కనుకనే, మంచి శాస్త్రవేత్తలు, సాంకేతికతల స్రష్టలు సైతం హోలోకాస్ట్ (మారణహోమం)ను విజయవంతం చేసేందుకు వెనుకాడరని జిగ్మంట్ బౌమన్ వ్యాఖ్యానించారు.

సైన్స్ తనను తాను కవిత్వం, తత్వశాస్త్రం, రాజకీయాల దృష్టికోణాల నుంచి చూచుకోవాల్సిన అవసరం ఉంది. ప్రస్తుత కాలంలో ఇది ఎంతైనా అవసరం. తొలుత ప్రకృతి పట్ల మన దృక్పథం గురించి వివేచించండి. ఆధునిక విజ్ఞాన శాస్త్రం బేకోనియన్ అనుభవవాదం, కార్టీసియన్ హేతువాదం, న్యూటోనియన్ కుదింపువాదం, డార్వీనియన్ పరిణామవాదం, నవ్య భౌతికశాస్త్ర ఆవిష్కరణల ద్వారా ఆవిర్భవించి, అభివృద్ధి చెందుతోంది. అయితే ప్రకృతి కేవలం ఒక 'వనరు' మాత్రమేనా అన్న ప్రశ్న మిగిలిపోయింది. మనకు వెలుపల ఉన్న ప్రకృతిని పరిశీలించి, వివరించి, అణువులు లేదా జన్యువులు మొదలైన ప్రాథమిక అంశాలుగా కుదించి, లక్ష్యాలను నిర్దేశించుకుని కార్యసాధకంగా ఉపయోగించుకోవడానికేనా ప్రకృతి ఉన్నది? లేక అది తన సొంత స్ఫూర్తితో చైతన్యశీల అస్తిత్వంతో అలరారుతుందా? 'మానవ మేధ నిశిత దృష్టికి ఆవల ఉన్న ప్రకృతి సౌందర్యాన్ని ఆంగ్ల మహాకవి విలియమ్ వర్డ్స్వర్త్ దర్శించిన విధంగా మనం కూడా దాన్ని ఆత్మీయతతో వీక్షించగలుగతామా? శాస్త్ర విజ్ఞానం, కవిత్వం మధ్య సంభాషణ ప్రకృతి పట్ల మరింత అర్థవంతమైన, పర్యావరణపరమైన దృక్పథాన్ని అనుసరించేందుకు మనకు విశేషంగా తోడ్పడగలదు. ఆధునిక జీవ వైద్యశాస్త్రం (బయో మెడిసిన్) మృత్యు అనుభవాన్ని ఎలా మార్చివేసిందో కూడా ఆలోచించండి మనిషి చావు నేడు వైద్యశాస్త్రపరంగా ఒక పర్యవేక్షణా ప్రక్రియగా మారిపోలేదూ? ఇంటెన్సివ్ కేర్ యూనిట్లో నవీన వైద్య యంత్రాల మధ్య మీరు మీ అంతిమ క్షణాలను గడుపుతారు. అయితే మరో విధంగా చనిపోవడానికి అవకాశం లేదా? పండుటాకు ఎలా రాలిపోతుందో గమనించండి. వివిధ వర్ణ శోభలతో అస్తమిస్తున్న సూర్యుడిని వీక్షించండి. మరి జీవించడం, చనిపోవడం గురించిన ఆధ్యాత్మిక చర్చలలో బయో మెడిసిన్ పాల్గోవడం జరిగితే?! ఇటువంటి ప్రశ్న అడగడం అంటే మరో రకపు సైన్స్ ఆచరణను సంభవింపచేయడమేనని చెప్పవచ్చు.

చరిత్ర కాంగ్రెస్ వలే కాకుండా సైన్స్ కాంగ్రెస్ జాతి గమనంలో ఒక ప్రధాన ఘటన. ఇది విస్మయకర విషయమేమీ కాదు. ఎందుకని? ఆధునికతలో శాస్త్ర విజ్ఞానానికి ఒక ఉన్నత స్థానం ఉన్నదని ప్రపంచం భావిస్తోంది. మానవ సమాజాలు సైన్స్ను అలా అవగతం చేసుకొంటున్నప్పటికీ సామాజిక తత్వవేత్తలు ఆ ఆధిపత్య భావనను సదా అంగీకరించరు. పాల్ ఫెయిరాబెన్డ్ ఇందుకొక ఉదాహరణ. సైన్స్ హేతుబద్ధతను నిరాకరించి, అరాచక జ్ఞాన సిద్ధాంతాన్ని అభివృద్ధిపరచుకోవాలని ఆయన వాదించారు. ఆధునికాంతరవాదులు మహా కథనాల వినిర్మాణంతో సైన్స్ ఆధిపత్యాన్ని త్రోసిపుచ్చడానికి ప్రయత్నించారు. ఆశిష్ నంది తదితరులు నయా గాంధేయ వాద ఆదర్శాల స్ఫూర్తితో సైన్స్, ఆధిపత్యం, హింస గురించి మాట్లాడారు.

సైన్స్ తన సొంత ఆలోచనలనూ, కార్యకలాపాలనూ అంతర్దృష్టితో విమర్శించుకోవడం వర్తమాన యుగ అవసరమని సామాజిక ఆచరణ విద్యార్థిగా నేను విశ్వసిస్తున్నాను. సైన్స్ తననుతాను నిశితంగా పరీక్షించుకోవాలి. 'సువ్యవస్థిత సంశయవాదం' సైన్స్ స్వభావమని అమెరికన్ సామాజిక శాస్త్రవేత్త రాబర్ట్ మెర్టన్ అన్నారు. ఎందుకంటే సైన్స్ దేనినీ యథాతథంగా అంగీకరించదు. అనుభవపూర్వక జ్ఞానంతో మాత్రమే దేనినైనా ఆమోదిస్తుంది. ఈ కారణంగానే కల్పిత కథలు, మూఢ విశ్వాసాల నుంచి సైన్స్ తననుతాను వేరుపరచుకున్నది. ఇరవయో శతాబ్దిలో దుస్సాహసాలకు పాల్పడిన సమాజాలు ఎటువంటి బీభత్సాలను సృష్టించాయో మనకు తెలుసు. అతి వాస్తవిక (హైపర్రియల్) ప్రపంచానికి సంబంధించి అన్ని రకాల మీడియా సిమ్యులేషన్స్ (అసలు లేని నకిలీ)ను మనం వినియోగించుకుంటున్నాం. సర్జికల్ దాడులు, రాకెట్ ప్రయోగాలు, క్రికెటర్ సెంచరీ ఇత్యాదులు టీవీలో ఒకే స్థాయిలో గొప్పగా కన్పిస్తాయి. నిత్యం అనూహ్య సాంకేతికతలు ఆవిష్కృతమవుతున్న ఈ కాలంలో సైన్స్ తప్పనిసరిగా అంతర్ముఖత్వం సంతరించుకోవాలి. తన నిశిత దృక్కులను తనపైనే సారించుకోవాలి. తనను తాను పునర్ నిర్వచించుకోవాలి. సైన్స్ ఎవరి కోసం? ఏ ప్రయోజనాల కోసం? ఇవి కేవలం సంశయవాద సంబంధమైనవి కావు. ఈ ప్రశ్నలకు మన ప్రతిస్పందించే తీరు పైనే మానవాళి ఉమ్మడి భవితవ్యం ఆధారపడివున్నది. ఆత్మశోధనాత్మక సైన్స విధిగా వినయశీలి కూడా అవుతుంది. విలియం బ్లేక్, ఐజాక్ న్యూటన్ పరస్పరం సంభాషించుకుంటూ సంవదించుకునే ప్రపంచాన్ని ఊహించేందుకు కవులు, తాత్వికులు, సామాన్య పౌరులను అటువంటి సైన్స్ ఆహ్వానిస్తుంది. మరి జలంధర్ సమాలోచనల నుంచి పరిశోధనలకు, సామాజిక జీవనస్రవంతికి తిరిగి వెళుతున్న శాస్త్రవేత్తలు ఈ ఆవశ్యక మేధోసత్యాన్ని అర్థం చేసుకుని తమ మనస్సుల్లో నింపుకున్నారా?

■ అవిజిత్ పథక్

సామాజిక శాస్త్ర ఆచార్యులు, జెఎన్యూ

(ది వైర్)

ఈ సమ్మెకు కేంద్రానిదే బాధ్యత!

నేడు, రేపు జరగబోతున్న రెండు రోజుల సార్వత్రిక సమ్మె వల్ల సాధారణ జన జీవనం ఇబ్బంది పడుతుంది. ఇట్లాంటి సమ్మెలను నివారించాల్సిన బాధ్యత కచ్చితంగా ప్రభుత్వానిదే. కానీ ఆ రకమైన ప్రయత్నాలేవి జరగలేదు కనుకనే ఈ సమ్మె అనివార్యంగా జరుగుతున్నది. దాదాపు 20 కోట్ల మంది సమ్మె బాట పడుతున్నట్లు అంచనాలు వినపడుతున్నవి. కార్మిక సంఘాల డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం కక్షపూరిత ధోరణితో కాకుండా సానుకూలంగా స్పందించి, కనీసం చర్చలు చేసి, వాటి ఫలితాలను ప్రజలకు వివరించి ఉండాల్సింది. అలాంటి సందర్భం ఎక్కడా కనిపించ లేదు. ఈ రోజు సమ్మె వలన ఎవరు ఇబ్బంది ఎదుర్కొన్నా దానికి పూర్తి బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదే. ఎందుకంటే ఈ సమ్మెలను నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదు. సమ్మె ఎందుకు తలపెట్టారో కార్మికవర్గం దగ్గర సమాధానం డిమాండ్ల రూపంలో ఉన్నది. కానీ ఎందుకు నివారించ లేకపోయారో ప్రభుత్వం దగ్గర సమాధానం లేదు, ఎందుకంటే వారు ఆ ప్రయత్నాలే చేయలేదు.

సెప్టెంబరు 2018లో, అనగా దాదాపు నాలుగు నెలల క్రితమే, 10 కేంద్ర కార్మిక సంఘాలు, ఇంకా రాష్ట్ర, జాతీయ స్థాయిలోని స్వతంత్ర సంఘాలు (ఇన్సూరెన్స్, బీమా, పోస్టల్, టెలికం రంగాల ఉద్యోగ సంఘాలతో సహా) కలిసి ఈ జనవరి 8, 9 తేదీల్లో సార్వత్రిక సమ్మె నిర్వహించాలని తల పెట్టాయి. ఈ సమ్మె డిమాండ్లను ముందుగానే ప్రభుత్వానికి విన్నవించాయి. ఈ సమ్మె సన్నాహకాలు కూడా ఎప్పటి నుంచో ఊపందుకున్నాయి. ఈ పరిస్థితిలో ప్రభుత్వం సదరు సంఘాలన్నింటిని చర్చలకు పిలిచి ఉండాల్సింది. ముఖ్యంగా కేంద్ర కార్మిక సంఘాలు ఐ.ఎన్.టి.యు.సి., సి.ఐ.టి.యు., ఏ.ఐ.టి.యు.సి.లాంటి పెద్ద యూనియన్లనైనా చర్చలకు పిలిచి ప్రభుత్వం తన ఆలోచనను వివరించి ఉండాల్సింది. అయినా కార్మిక సంఘాలు సమ్మెలోకి వెళ్ళినట్లయితే ప్రజలకు వారే సమాధానం చెప్పుకునే అవకాశం ఉండేది. అలాంటి ప్రయత్నం చేయకపోవడం వల్ల ఈరోజు సమ్మె అనివార్యమైంది. ప్రభుత్వం ఉదాసీన వైఖరి కార్మికుల సమస్యల పట్ల నిర్లక్ష్యంగానే గాక, ప్రజలకు కలిగే ఇబ్బందుల పట్ల కూడా నిర్లక్ష్యంగా వ్యక్తమవుతున్నది. ప్రజాస్వామ్య ప్రభుత్వానికి ఇది మంచి పద్ధతి కాదు. కార్మిక సంఘాలు ప్రభుత్వం ముందుంచిన 12 డిమాండ్లలో కనీసం ఎన్ని డిమాండ్లు ప్రభుత్వం తీర్చగలదో లేదా భవిష్యత్తులో ఎలాంటి ప్రణాళికల ద్వారా వాటిని తీర్చగలదో బహిరంగంగా వివరించి ఉండాల్సింది. నీతి ఆయోగ్ ప్రతిపాదన ప్రకారమే కనీస వేతనం నెలకు రూ.26,000/– ఇవ్వాలని ఉన్నది. కార్మిక సంఘాల డిమాండు ప్రకారం అది రూ.18000/– మాత్రమే. కానీ ఈ మొత్తం కూడా ఎక్కడా అమలవ్వటం లేదు. నాలుగు పదుల కార్మిక చట్టాలను నాలుగు 'కోడ్'లుగా కేంద్రం ఎందుకు మార్చాలనుకుంటుందో ప్రజలకైనా వివరించాలిగా! ధరల పెరుగుదలను నియంత్రించేందుకు ఏయే చర్యలు తీసుకుంటున్నారో అవీ వివరించాలి. వ్యవసాయ కూలీలకు, వ్యవసాయదారులకు సమగ్ర బీమా సౌకర్యాన్ని అందజేయడంలో ఎందుకు విఫలమౌతున్నారో వివరించాలి. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను సేవారంగంలోకి అవసరం లేకున్నా ఎందుకు ఆహ్వానిస్తున్నారో, నష్టపూరిత నూతన పెన్షన్ విధానాన్ని ఎత్తివేయడానికి ఉన్న ఇబ్బందులేమిటో వివరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రభుత్వ యంత్రాంగం చాలా కీలకమైనది. ఈ యంత్రాంగంలో కార్మికులే అధికం. భారత దేశంలో అసంఘటిత రంగ కార్మికులు తొంబై నాలుగు శాతం. ఎన్నికలలో నిర్ణయాక పాత్ర పోషించేది కూడా ఈ అసంఘటిత రంగ కార్మికులే. కనీసం ఎన్నికల సంవత్సరమైన ఈ 2019లోనైనా కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందేమోనని కార్మికులు ఎదురు చూసి జనవరి నెలను సమ్మెకు తగిన సమయంగా ఎన్నుకుని ఉండవచ్చు. అయినప్పటికీ లెక్క చేయకపోవడం వల్ల కేంద్రమే దుష్ఫలితాలను ఎదుర్కోవాల్సి ఉంటుంది.

■ జి. తిరుపతయ్య

దేశహితం కోసమే కార్మికవర్గం సమ్మె

పది కేంద్ర కార్మికసంఘాలు; బ్యాంకు, ఇన్సూరెన్సు, రైల్వే, రక్షణ, బిఎస్ఎన్ఎల్, స్టీల్, కోల్, పోస్టల్ తదితర రంగాల్లోని స్వతంత్ర ఫెడరేషన్లు, అసోసియేషన్లు కలిసి 2018, సెప్టెంబర్ 15తేదీన ఢిల్లీలో ఒక సదస్సు నిర్వహించుకున్నాయి. ప్రజావ్యతిరేక కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఈ సదస్సు 2019, జనవరి 8, 9 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చింది. ఇటీవల 5 రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో తలబొప్పి కట్టిన బిజెపి సంకీర్ణానికి ఈ సమ్మె ఒక తాజా సవాల్. ప్రభుత్వ రంగ సంస్థల విధ్వంసం వద్దని, వ్యవసాయ సంక్షోభాన్ని నివారించాలని, కార్మిక చట్టాలకు తూట్లుపొడవద్దని, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీము రద్దు చేయాలని, రెగ్యులర్ ఉపాధి కల్పన చర్యలు చేపట్టాలని, రూ.18 వేల కనీస వేతనం, రూ.9 వేల కనీస పెన్షన్ నిర్ణయించాలని, అన్నింటినీమించి ఆకాశాన్నంటిన ధరల్ని భూమార్గం పట్టించాలనే డిమాండ్లతో ఈ సమ్మె జరుగుతోంది.

దేశంలో బలిసిన సంపన్నుల జనాభాలో 10 శాతం మందే సంపదలో 77.4 శాతాన్ని పోగేసుకున్నారు. మనలాంటి మిగతా 90శాతం అర్భకజనం వాటా సంపదలో 22.6 శాతమే. శ్రామికుల్లో 82 శాతం మంది పురుషుల, 92 శాతం మంది మహిళల నెలసరి ఆదాయం రూ.10వేల కంటే తక్కువే. ఈ ప్రభుత్వానివన్నీ తలకిందుల ప్రాధాన్యతలే! ఎన్డిఎ ప్రభుత్వం 2014 నుంచి ప్రచార ఆర్భాటం కోసం 4,300 కోట్లు, కుంభమేళాకు 4,200 కోట్లు, శివాజీ పటేల్ విగ్రహాల కోసం 6,569 కోట్లు, జియో యూనివర్సిటీ కోసం వెయ్యికోట్లు, హిందీ ప్రచారం కోసం 800 కోట్ల రూపాయల్ని



మోదీ నేతృత్వంలోని 55 నెలల ఎన్డిఎ పాలన దేశానికి ఒక పీడకల. మంచు కరిగిపోతున్నది, మాయ తొలగిపోతున్నది! మొన్నటి గుజరాత్ నుండి నేటి ఛత్తీస్గడ్ ఎన్నికల దాకా ఒక నిశ్శబ్ద విప్లవం చాప క్రింద నీరులా వ్యాపిస్తున్నది. ఒక సస్యశ్యామల, సావకాశాల, సామరస్య, సౌహార్ద్ర, సుదృఢ భారతదేశమే నేటితరం లక్ష్యం, గమ్యం కావాలి! ఇందుకు ప్రత్యామ్నాయ ప్రజానుకూల విధానాలే శరణ్యం! భవిష్యత్ ప్రభుత్వాలు ఏవైనా, ఈ ప్రత్యామ్నాయ విధానాల రూపకల్పనపై నిర్ణయాత్మక ప్రభావం చూపడానికే భారత కార్మికవర్గం దేశభక్తితో నేడు, రేపు దేశవ్యాప్త సమ్మెను తలపెట్టింది.

2014 ఎన్నికల్లో నరేంద్ర మోదీ నాయకత్వంలో బిజెపి అపూర్వ మెజార్టీతో గద్దెనెక్కినపుడు దేశప్రజలు ఎన్నో ఆశలతో ఉన్నారు. పార్లమెంటు మెట్లవద్ద ఆయన అభివందనం చేసినపుడు ప్రజాస్వామిక ప్రియుల్లో విశ్వాస భావం ఉప్పొంగింది. కానీ నాడు కురిసిన హిమ సమూహములు నేడు ఏవీ! అంతకుముందూ, ఎన్నికల సభల్లోనూ ఇచ్చిన హామీలకు భిన్నంగా నేడు పాలన జరుగుతోంది. ప్రవర్ధమాన భారత ఆర్థిక వ్యవస్థలో బాగుపడుతున్నదెవ్వరన్నదే నేడు జాతిని పట్టిపీడిస్తున్న ప్రశ్న. కార్పొరేట్లకు రాయితీలు, కార్మికులకు వెతలు! యజమానులకు లాభాల్లో పెరుగుదల, శ్రామికులకు నిజవేతనాల్లో కోతలు! ఇదేకదా అసలు దృశ్యం!

ఖర్చు పెట్టింది. ముఖేష్ అంబానీ, గాలి జనార్దనరెడ్డి కుటుంబాల్లో జరిగిన పెళ్లి వేడుకలకు కోట్లాది రూపాయలు ఖర్చు పెట్టడం చూస్తే భారతీయ సమాజంలో ధనస్వామ్యం వికృతరూపం ఎలా ఉందో అర్థమవుతుంది.

మోదీ ప్రధానమంత్రిగా కార్పొరేట్ వర్గాల ప్రతిరూపంగా మారిపోయారు. దేశరక్షణ, సహజవనరులు, కమ్యూనికేషన్, ఎంటర్టైన్మెంట్ రంగాలపై నేడు అంబానీలది గుత్తాధిపత్యం. 2014 నాటి బ్యాంకుల 2.24 లక్షలకోట్ల రూపాయల పాత బకాయిలు నేడు 10లక్షల కోట్లకు చేరాయి. ఈ కాలంలోనే 3.10 లక్షల కోట్ల మేర కార్పొరేట్ సంస్థల బ్యాంకు రుణాల మాఫీ జరిగింది. రద్దయిన పెద్దనోట్లలో 99.3శాతం నోట్లు తిరిగి బ్యాంకులకు చేరుకున్నాయి. జిఎస్టి పన్నుల విధానంవల్ల ప్రకటిత లక్ష్యాలేవీ నెరవేరలేదు. నోట్లరద్దు, జిఎస్టిల వల్ల 35లక్షల ఉద్యోగాలు గల్లంతయ్యాయి.

ఒక ప్రభుత్వాధినేత ప్రభుత్వరంగ సంస్థలపై విషం కక్కడం మోదీ విషయంలోనే చూస్తున్నాం. ఆయన దృష్టిలో ప్రతీ ప్రభుత్వ రంగ సంస్థ పుట్టుకా గిట్టడం కోసమేనట! దేశమంతా హారతులు పట్టిన జాతీయకరణ ఇందిరాగాంధీ చేసిన మోసమట! ప్రపంచ బ్రాండింగ్ అవార్డ్స్ 2018లో ఇన్సూరెన్సు రంగంలో ప్రపంచంలోనే నెంబర్ 1 గా నిలిచిన ఎల్ఐసిని స్టాక్మార్కెట్లో లిస్ట్ చేస్తారట! ఎఫ్ఆర్డిఐ బిల్లు చట్టమైపోయి ఉంటే బ్యాంకుల విశ్వసనీయత ఏమై ఉండేది?

పంటసాగు ఖర్చులన్నీ కలిపి దానిపై 150 శాతం మేర గిట్టుబాటు ధరలు ఇవ్వాలన్న స్వామినాథన్ కమిటీ సిఫారసులను ఈ ప్రభుత్వం అమలు చేయలేదు. రైతుల ఆత్మహత్యలు బిజెపి పాలిత రాష్ట్రాలలోనూ కొనసాగుతున్నాయి. యువత ఉపాధి అవకాశాల్లేక ఆగ్రహావేశాలతో వుంది. అన్నింటా కాంట్రాక్టు ఉపాధే. 44 కార్మిక చట్టాల స్థానంలో 4 లేబర్ కోడ్లు అమల్లోకి తెచ్చి సంక్షేమానికి, భద్రతకు పాతరేస్తున్నారు. అజీమ్ ప్రేమ్జీ సంస్థ అధ్యయనం మేరకు 1970–80 మధ్య కాలంలో జిడిపి రేటు 3–4 శాతం ఉన్నకాలంలో కూడా ఉద్యోగాల కల్పనలో పెరుగుదల రేటు 2శాతంగా వుండేది. ఇపుడు 10శాతం జిడిపి సాధిస్తే కూడా, ఒక్కశాతం ఉపాధి కల్పన వృద్ధిరేటు ఉండడం లేదు.

మోదీ నేతృత్వంలోని 55 నెలల ఎన్డిఎ పాలన దేశానికి ఒక పీడకల. మంచు కరిగిపోతున్నది, మాయ తొలగిపోతున్నది! మొన్నటి గుజరాత్ నుండి నేటి ఛత్తీస్గడ్ ఎన్నికల దాకా ఒక నిశ్శబ్ద విప్లవం చాప క్రింద నీరులా వ్యాపిస్తున్నది. ఒక సస్యశ్యామల, సావకాశాల, సామరస్య, సౌహార్ద్ర, సుదృఢ భారతదేశమే నేటితరం లక్ష్యం, గమ్యం కావాలి! ఇందుకు ప్రత్యామ్నాయ ప్రజానుకూల విధానాలే శరణ్యం! భవిష్యత్ ప్రభుత్వాలు ఏవైనా, ఈ ప్రత్యామ్నాయ విధానాల రూపకల్పనపై నిర్ణయాత్మక ప్రభావం చూపడానికే భారత కార్మికవర్గం దేశభక్తితో 2019 జనవరి 8, 9 తేదీలలో రెండు రోజుల దేశవ్యాప్త సమ్మెను తలపెట్టింది!

■ ఎ. రఘునాథరెడ్డి

ఎల్ఐసి ఉద్యోగుల సంఘం, కడప డివిజన్

నేటి నుంచి జేఈఈ మెయిన్

▸ ఈ నెల 12 వరకు ఆన్‌లైన్‌లోనే పరీక్ష నిర్వహణ

హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఐఐటీ, ఎన్‌ఐటీల్లో ప్రవేశానికి జేఈఈ మెయిన్ పరీక్షలు మంగళవారం ప్రారంభం కానున్నాయి. ఈ నెల 12 వరకు ప్రతి రోజు రెండు షిఫ్టుల్లో పరీక్షను నిర్వహిస్తారు. ఈ ఏడాది పరీక్షను పూర్తిగా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది నుంచి పరీక్షను రెండుసార్లు నిర్వహించాలని నిర్ణయించిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) రెండో విడత పరీక్షను ఏప్రిల్‌లో నిర్వహించనుంది. 8న ఆర్కిటెక్చర్‌లో ప్రవేశాలకు పేపర్-2 పరీక్ష, 9-12వ తేదీ వరకు ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకు పేపర్-1 పరీక్ష జరుగుతుంది. మొదటి షిఫ్టును ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, రెండో షిఫ్టును మధ్యాహ్నం 2:30 నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు నిర్వహిస్తారు. ఏపీలో 18, తెలంగాణలో 7 నగరాల్లో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు సందేహాలుంటే 7042399520, 21, 26 నంబర్లను సంప్రదించవచ్చని ఎన్‌టీఏ ప్రకటించింది.

● సాంకేతిక విద్యాభవన్‌లో ధ్రువపత్రాల పరిశీలన

హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మండల్ ప్లానింగ్,స్టాటిస్టికల్ ఆఫీసర్, అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టుల రాత పరీక్షలో ఎంపికైన అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనను ఈ నెల10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు. అయితే ఈ ప్రక్రియను టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో కాకుండా మాసబ్‌ట్యాంక్‌లోని సాంకేతిక విద్యాభవన్‌లో నిర్వహించనున్నట్లు టీఎస్‌పీఎస్సీ సెక్రటరీ ఎ.వాణీప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

● 10 నుంచి జూ. కాలేజీల అనుమతికి దరఖాస్తులు

హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): వచ్చే విద్యాసంవత్సరానికి అనుబంధ గుర్తింపు, అదనపు సెక్షన్ల ఏర్పాటుకు ప్రైవేటు జూనియర్ కాలేజీలు ఈ నెల 10 నుంచి దరఖాస్తు చేసుకోవచ్చని ఇంటర్‌బోర్డు సూచించింది. ఈ నెలాఖరు వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా దరఖాస్తులను స్వీకరించవచ్చని బోర్డు కార్యదర్శి అశోక్ పేర్కొన్నారు. ఫిబ్రవరి 12 వరకు రూ.1,000, ఫిబ్రవరి 13-25 వరకు రూ.3 వేలు, మార్చి 8 వరకు రూ.5 వేలు, మార్చి 20లోపు రూ.10వేల అపరాధ రుసుముతో అనుమతిస్తామన్నారు.

● నేడో రేపో ఇంజనీరింగ్ ఫీజుల నోటిఫికేషన్

హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్‌తో పాటు వృత్తి విద్యా కోర్సులకు ఫీజులు నిర్ణయించడానికి మంగళ లేదా బుధవారాల్లో నోటిఫికేషన్ జారీ చేసేందుకు తెలంగాణ ఉన్నత విద్యామండలి కసరత్తు చేస్తోంది. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తుల స్వీకరణకు అంగీకరిస్తూ ఎన్ఐసీ సోమవారం లేఖ రాయడంతో నోటిఫికేషన్ ప్రక్రియను అధికారులు వేగవంతం చేశారు.

● 'ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ గ్రేడ్-1' జాబితా విడుదల

హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): మహిళా, శిశు సంక్షేమ శాఖలో ఎక్స్‌టెన్షన్ ఆఫీసర్ గ్రేడ్-1 సూపర్‌వైజర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదలైందని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. టీఆర్టీ రిక్రూట్‌మెంట్‌లో భాగంగా లాంగ్వేజ్ పండిట్ (హిందీ) పోస్టులకు మూడోవిడత సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కి 164 మందిని ఎంపిక చేశారు. వీరికి ఈనెల 11న టీఎస్‌పీఎస్సీ కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్ నిర్వహించనున్నట్లు తెలిపారు.

● డిగ్రీ లెక్చరర్ల సంఘం అధ్యక్షుడిగా నాగేందర్

హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వ డిగ్రీ లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కె.నాగేందర్, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నామని సంఘం ప్రతినిధులు తెలిపారు. ప్రభుత్వ డిగ్రీ విద్య బలోపేతానికి కృషి చేయాలని ప్రభుత్వాన్ని వీరు కోరారు. ప్రభుత్వ డిగ్రీ విద్యలో కీలకమైన మార్పులు చేస్తూ డిగ్రీ కాలేజీలను బలోపేతం చేస్తున్న కమిషనర్ నవీన్ మిట్టల్‌కు నూతన కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపింది.

● ఆపరేషన్ స్మైల్‌లో 'దర్పణ్'

హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): బాలకార్మికులను గుర్తించి తల్లిదండ్రుల వద్దకు, పునరావాస కేంద్రాలకు తరలించేందుకు నిర్వహిస్తున్న 'ఆపరేషన్ స్మైల్'లో భాగంగా తెలంగాణ పోలీసులు ఈ సారి 'దర్పణ్' యాప్‌ను వినియోగించనున్నారు. ఫేషియల్ రికగ్నైజేషన్ ద్వారా పలు రాష్ట్రాల్లో తప్పిపోయిన పిల్లల డేటాబేస్ ఆధారంగా తమకు దొరికే బాలల వివరాలను తెలుసుకోనున్నారు. ఆపరేషన్ స్మైల్ నిర్వహణపై సీఐడీ చీఫ్ గోవింద్ సింగ్ సోమవారం డీజీపీ కార్యాలయంలో ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

● ఎమ్మెల్యే రాజాసింగ్ క్షమాపణ చెప్పాలి: కర్నె

హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఎంఐఎం సీనియర్ ఎమ్మెల్యే ముంతాజ్ అహ్మద్ ఖాన్ ప్రొటెం స్పీకర్‌గా ఉంటే ప్రమాణ స్వీకారం చేయబోనన్న బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ డిమాండ్ చేశారు. తెలంగాణ పట్ల కేంద్రం వివక్షపై కేసీఆర్ ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా బీజేపీ ఎంపీ బండారు దత్తాత్రేయ నోటికొచ్చినట్లు ఆరోపణలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి అందిన సాయంపై దత్తాత్రేయతో చర్చకు సిద్ధంగా ఉన్నామని, చర్చా వేదికను నిర్ణయిస్తే తమ పార్టీ నుంచి నాయకులను పంపిస్తామని ప్రభాకర్ అన్నారు.

● ఉమ్మడి అంశాలను బదిలీ చేయండి: జితేందర్

న్యూఢిల్లీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలోని ఉమ్మడి జాబితాలో ఉన్న అంశాలను రాష్ట్రాలకు బదిలీ చేయాలని టీఆర్‌ఎస్ లోక్‌సభాపక్ష నేత జితేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఆయన లోక్‌సభ జీరో అవర్‌లో మాట్లాడుతూ.. రాజ్యాంగంలోని ఏడో షెడ్యూల్‌ను సవరించి ఉమ్మడి జాబితాలోని అంశాలను రాష్ట్రాలకు ఇవ్వాలన్నారు. కేంద్రం తన వద్ద రక్షణ, అంతర్గత భద్రత, విదేశీ వ్యవహారాలు వంటి కీలకాంశాలను మాత్రమే ఉంచుకోవాలని సూచించారు. మరోవైపు టీఆర్‌ఎస్ ఎంపీ పసునూరి దయాకర్ ఎస్సీ వర్గీకరణపై తెలుగులో మాట్లాడారు. ఎస్సీల వర్గీకరణపై సీఎం కేసీఆర్ రెండుసార్లు అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంటుకు పంపించారని, 100 రోజుల్లో ఎస్సీ వర్గీకరణ చేస్తామన్న బీజేపీ మాట నిలబెట్టుకోవాలని కోరారు.

● రీజనల్ రింగ్ రోడ్డుకు డీపీఆర్: కేంద్రం

న్యూఢిల్లీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ చుట్టూ రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపింది. వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్), సాధ్యాసాధ్యాల అధ్యయన ప్రక్రియ ప్రారంభమైందని కేంద్ర రహదారుల శాఖ సహాయ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ వెల్లడించారు. అంచనా వ్యయాలు, ప్రాజెక్టు పూర్తయ్యే సమయం వంటి అంశాలను ఇంకా ఖరారు చేయలేదని చెప్పారు. హైదరాబాద్ చుట్టూ 334 కిలోమీటర్ల మేర నిర్మించనున్న ఈ రోడ్డు రెండు భాగాలుగా ఉంటుంది. సంగారెడ్డి - నర్సాపూర్ - తూప్రాన్ - గజ్వేల్ - జగదేవ్‌పూర్ - భువనగిరి - చౌటుప్పల్ మధ్య 154 కిలోమీటర్ల దూరం ఒక భాగం కాగా.. చౌటుప్పల్ - షాద్‌నగర్ - కంది మధ్య 180 కిలోమీటర్లు మరో భాగంలో ఉంటాయి.

● డెంగీ, చికున్‌గున్యా విజృంభణ

హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): డెంగీ, చికున్‌గున్యా జ్వరాలు మళ్లీ విజృంభిస్తున్నాయి. 2017లో రాష్ట్రవ్యాప్తంగా 3827 డెంగీ కేసులు నమోదవ్వగా, 2018లో 4592కు చేరింది. వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం 2018లో ఖమ్మం జిల్లాలో 708 కేసులు, హైదరాబాద్‌లో 596 కేసులు నమోదయ్యాయి. ఆదిలాబాద్ జిల్లాలో 494, కొత్తగూడెంలో 400, పాలమూరులో 321, మేడ్చల్‌లో 217, పెద్దపల్లిలో 271 డెంగీ కేసులు నమోదయ్యాయి. ప్రైవేటు ఆస్పత్రుల్లో అనధికారికంగా నమోదైన డెంగీ కేసుల సంఖ్య వేలల్లోనే ఉంటుంది. చికున్‌గున్యా కేసులు కూడా పెరిగాయి. 2017లో రాష్ట్రవ్యాప్తంగా 58 చికున్‌గున్యా కేసులు నమోదైతే 2018లో 489 కేసులు నమోదయ్యాయి.

కొత్త మునిసిపాలిటీల్లో నిర్మాణాలకూ

ఆన్‌లైన్‌లోనే అనుమతులు

హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటుచేసిన మునిసిపాలిటీల్లో భవన నిర్మాణ అనుమతులను ఆన్‌లైన్‌లోనే ఇవ్వాలని మున్సిపల్ శాఖ నిర్ణయించింది. ప్రస్తుతం రాష్ట్రంలోని 72 పాత మున్సిపాలిటీల్లో భవన నిర్మాణ అనుమతులను డెవలప్‌మెంట్ పర్మిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(డీపీఎంఎస్) విధానం ద్వారా ఇస్తున్నారు. ఈ ప్రక్రియ విజయవంతంగా అమలవుతున్న తరుణంలో కొత్త మునిసిపాలిటీల్లోనూ అమలు చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. జనవరి 7వ తేదీ నుంచి డీపీఎంఎస్ ద్వారా అనుమతులివ్వాలని చర్యలు చేపట్టారు. కాగా, ఈ నెల 8, 9 తేదీల్లో ఉద్యోగులు, కార్మికులు సమ్మెలో పాల్గొంటున్నందున నీటి సరఫరా, పారిశుధ్యానికి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని సంబంధిత కమిషనర్లను మునిసిపల్ శాఖ ఆదేశించింది.

కలుపుతీత యంత్రానికి జాతీయ పురస్కారం

▸ వరంగల్ వాసికి దక్కిన ఆంత్రప్రెన్యూర్‌షిప్ అవార్డు


అవార్డు స్వీకరిస్తున్న మహిపాల్ చారి

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ స్టార్టప్ పోటీలో తెలంగాణ స్టార్టప్ సత్తా చాటింది. వరంగల్ జిల్లాకు చెందిన కడివేండి మహిపాల్ చారి రూపొందించిన కలుపు యంత్రానికి వ్యవసాయ విభాగంలో జాతీయ ఆంత్రప్రెన్యూర్‌షిప్-2018 అవార్డు దక్కింది. ఈ నెల 4న ఢిల్లీలో ఆయన అవార్డు అందుకున్నారు. పొలాల్లో కలుపు తీయడానికి ఉపయోగించే కలుపు తీత యంత్రాన్ని మహిపాల్‌చారి అభివృద్ధి చేశారు. 2013 నుంచి మార్కెట్లో అందుబాటులో ఉన్న ఈ యంత్రాన్ని దేశవ్యాప్తంగా అనేకమంది చిన్న, సన్నకారు రైతులు వినియోగిస్తూ లబ్ధి పొందుతున్నారు.రెండు ఇంజిన్లు, 4-5 హెచ్‌పీ సామర్థ్యం కలిగిన ఈ యంత్రం ధర కూడా తక్కువగా ఉండటంతో రైతులు పెద్ద ఎత్తున వినియోగిస్తున్నారు.

ఫ్యాన్‌కు ఉరి.. ఇక కుదరదు

▸ మహబూబ్‌నగర్ జిల్లా విద్యార్థి వినూత్న ఆవిష్కరణ



మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జనవరి 7: ఆత్మహత్య అనగానే ముందుగా గుర్తొచ్చేది ఫ్యాన్‌కు ఉరేసుకోవడం. ఇంట్లో అందుబాటులో ఉండటంతో చాలామంది దీన్నే ఆత్మహత్యకు సాధనంగా వాడుతున్నారు. క్షణికావేశంలో తీసుకునే నిర్ణయంతో.. వారి కుటుంబం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ఉరేసుకోవడానికి వీలు కాని ఫ్యాన్‌ను మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం యన్మనగండ్ల ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి వెంకటేశ్ ఆవిష్కరించాడు. ఫ్యాన్‌ను బిగించేప్పుడు దానికి ఒక స్ప్రింగ్ లాంటి నిర్మాణాన్ని ఏర్పాటు చేశాడు. దీనివల్ల ఫ్యాన్‌కు ఉరేసుకోగానే.. వ్యక్తి బరువుతో స్ప్రింగ్ కిందకు సాగుతుంది. తద్వారా ఆత్మహత్యాయత్నం విఫలమవుతుంది. మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో వెంకటేశ్ దీన్ని ప్రదర్శించాడు. మూడు రోజుల పాటు సాగే ఈ వైజ్ఞానిక ప్రదర్శనలో ఉమ్మడి జిల్లా స్థాయి నుంచి 363 ప్రాజెక్టులను ప్రదర్శించారు. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర బాలుర ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రూపొందించిన కాళేశ్వరం ప్రాజెక్టు నమూనా కూడా పలువుర్ని ఆకట్టుకుంది.

కలప స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం!

▸ స్మగ్లర్లపై పీడీ యాక్ట్ ప్రయోగించండి

▸ ఎంతటివారినైనా వదిలిపెట్టొద్దు

▸ టీఆర్ఎస్ నాయకులైనా ఉపేక్షించొద్దు

▸ సహకరించే అధికారులపై చర్యలు: సీఎం


పర్యావరణ పరిరక్షణ-అడవుల పెంపకంపై జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కలప స్మగ్లింగ్‌పై ఉక్కుపాదం మోపాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. పర్యావరణానికి హాని కలిగిస్తే ఎంతటివారినైనా వదిలే ప్రసక్తే లేదన్నారు. స్మగ్లర్లు ఎంతటి పలుకుబడి కలిగిన వ్యక్తులైనా, ఏ రాజకీయ పార్టీకి చెందిన వారైనా వదలొద్దని, టీఆర్ఎస్ నాయకుల ప్రమేయముంటే ముందుగా వారిపైనే చర్యలు తీసుకోవాలని అన్నారు. వారికి సహకరించే అధికారులపైనా చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. సోమవారం 'పర్యావరణ పరిరక్షణ-అడవుల పెంపకం'పై ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. తరచూ స్మగ్లింగ్‌కు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయాలని ఆదేశించారు. "రాష్ట్రంలో పర్యావరణ పరిరక్షణను నాలుగు విభాగాలుగా విభజించి చర్యలు తీసుకోవాలి. కోట్లాది మొక్కల పెంపకం, అటవీ పునరుద్ధరణ, హైదరాబాద్ నగరం లోపల, బయట పచ్చదనం పెంచడం, కలప స్మగ్లింగ్‌ను అరికట్టడంపై కార్యాచరణ రూపొందించుకుని రంగంలోకి దిగాలి" అని సీఎం కేసీఆర్ ఆదేశించారు. కొన్ని ప్రాంతాల్లో కలప స్మగ్లింగ్‌నే కొందరు పనిగా పెట్టుకున్నారని, అలాంటి ప్రాంతాలను, వ్యక్తులను గుర్తించాలని, అక్కడ నిబద్ధత కలిగిన అధికారులను నియమించాలని అన్నారు. వారు సాయుధ పోలీసుల అండతో కలప స్మగ్లింగ్‌ను నూటికి నూరు శాతం అరికట్టాలని నిర్దేశించారు. గతంలో నక్సలైట్ల కారణంగా అడవుల్లోకి వెళ్లడం సాధ్యం కావట్లేదని సాకులు చెప్పేవారని, ప్రస్తుతం అలాంటి సమస్య కూడా లేదని పేర్కొన్నారు. అడవులను కాపాడేందుకు పోలీస్-అటవీ అధికారులు సంయుక్త సమావేశం ఏర్పాటు చేసుకుని కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. అడవులు నశించిపోతుంటే.. హరితహారం లాంటి కార్యక్రమాల ద్వారా ఎన్ని చెట్లు పెంచినా ప్రయోజనముండదని సీఎం అన్నారు. కట్టె కోత మెషిన్ల (సా మిల్స్) నిర్వహణపై కూడా నియంత్రణ ఉండాలని, కొత్తగా ఎలాంటి సా మిల్స్‌కు అనుమతి ఇవ్వొద్దని అన్నారు. అడవుల రక్షణతోపాటు చెట్ల నరికివేత వల్ల పోయిన అడవిని పునరుద్ధరించడానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. తెలంగాణకు హరితహారం కార్యక్రమం కింద ప్రతి ఏటా నాటే మొక్కల సంఖ్యను పెంచాలని, వచ్చే వర్షాకాలం నుంచి ఏడాదికి వంద కోట్ల చొప్పున మొక్కలు నాటాలని ఆదేశించారు. 'దేశ రాజధాని ఢిల్లీలాగే హైదరాబాద్‌లో కూడా వాహనాల సంఖ్య పెరుగుతోంది. కాలుష్యం పెరుగుతోంది. దాన్ని నివారించాలంటే చెట్లు పెంచడం ఒక్కటే మార్గం" అని సీఎం అన్నారు. మొక్కల పెంపకం కార్యక్రమానికి నిధుల కొరత లేదని, పచ్చదనం పెంచేందుకు చిత్తశుద్ధితో పనిచేయాలని పేర్కొన్నారు.

కలప స్మగ్లింగ్‌లో రాజకీయ నాయకులు..

కలప స్మగ్లింగ్‌లో రాజకీయ నాయకుల ప్రమేయం ఎక్కువగా ఉంటోందని అటవీ శాఖ ఉన్నతాధికారులు సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకొచ్చారు. క్షేత్రస్థాయిలో రాజకీయ నాయకులతో సిబ్బంది పడుతున్న ఇబ్బందులను వివరించారు. కొన్ని ప్రాంతాల్లో పోలీసుల సహకారం లభించడం లేదని పేర్కొన్నారు. కొందరు పలుకుబడి కలిగిన వ్యక్తులు ఇళ్లు నిర్మించుకునే క్రమంలో తాము ఎంత కావాలంటే అంత కలప అందిస్తామని హామీలు ఇస్తుంటారని, కొందరు అధికారులు తరచూ చెపుతుంటారని ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ గుర్తుచేశారు. అడవుల్లో చెట్లు నరకడం వల్లే ఈ కలప సమకూరుతోందని, అలాంటి అక్రమాన్ని అరికట్టాల్సిన అవసరముందని అన్నారు.



టీఆర్ఎస్ కార్యాలయానికి స్థలమివ్వండి

▸ ప్రధానిని కోరిన పార్టీ ఎంపీలు

న్యూఢిల్లీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో టీఆర్ఎస్ కార్యాలయాన్ని నిర్మించుకోవడానికి స్థలం కేటాయించాలని ప్రధాని మోదీని ఆ పార్టీ ఎంపీలు కోరారు. రాజ్యసభ, లోక్‌సభల్లో కలిపి టీఆర్ఎస్‌కు 17 మంది ఎంపీలున్నారని, 1000 చదరపు మీటర్ల స్థలం కేటాయించాలంటూ ఎంపీలు సోమవారం ప్రధానికి వినతిపత్రం ఇచ్చారు. ఢిల్లీలోని రాజేంద్రప్రసాద్ రోడ్డులో ఖాళీ స్థలాన్ని కేటాయించాలన్నారు. ప్రధాని సానుకూలంగా స్పందించారని టీఆర్ఎస్ లోక్‌సభ పక్షనేత జితేందర్‌రెడ్డి తెలిపారు. ప్రధానిని కలిసిన వారిలో ఎంపీలు సంతోశ్‌కుమార్, బి.వినోద్‌కుమార్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, బీబీ పాటిల్, సీతారాంనాయక్, నగేశ్, బండా ప్రకాశ్, లింగయ్యయాదవ్, ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి వేణుగోపాలాచారి ఉన్నారు.


ప్రధానికి వినతిపత్రం ఇస్తున్న ఎంపీలు జితేందర్, వినోద్, బూర తదితరులు

మంత్రాంగం

ఎవరిది?

(మొదటి పేజీ తరువాయి)

చూస్తారు!? సభలో సమన్వయం ఎవరు సాధిస్తారు!? ఎమ్మెల్యేల్లో ముమ్మరంగా సాగుతున్న చర్చ ఇది. అసెంబ్లీ సమావేశాల నిర్వహణ సమయంలో శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పాత్ర క్రియాశీలంగా ఉంటుంది. తీర్మానాలు ప్రవేశపెట్టడం, సభా సమయం పెంచడం, తగ్గించడం; అధికార, ప్రతిపక్షాల మధ్య సమన్వయం సాధించడం; ప్రభుత్వ ప్రాధాన్యాలను స్పీకర్ దృష్టికి తీసుకెళ్లడం, స్పీకర్‌కు సహాయకారిగా ఉండడం తదితర వ్యవహారాలను సంబంధిత మంత్రే చూసుకుంటారు. రెండోసారి టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ కేబినెట్‌లోకి ఒక్కరినే తీసుకున్నారు. దాంతో, శాసనసభ వ్యవహారాలు ఎవరు చూస్తారనే చర్చ సాగుతోంది. ఈ నేపథ్యంలో 18వ తేదీనే మంత్రివర్గ విస్తరణ ఉండవచ్చని, మంచి ముహూర్తం కూడా ఉందని టీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. లేదంటే 30న మరో ముహూర్తం ఉందని అంటున్నారు.

సీఎం చూస్తారా? ఇతరులా?

18న మంత్రివర్గ విస్తరణ జరగకపోతే ముఖ్యమంత్రి కేసీఆర్ అసెంబ్లీ సమావేశాల్లో అన్నీ తానై వ్యవహరిస్తారా? లేక ఇతరులకు బాధ్యతలు అప్పగిస్తారా? అనే సందిగ్ధం నెలకొంది. ఆ నాలుగు రోజులూ హోం మంత్రి మహమూద్ అలీకి బాధ్యతలు అప్పగించవచ్చనే అభిప్రాయాలూ వ్యక్తమవుతున్నాయి. ఒకవేళ 18వ తేదీన విస్తరణ జరిగితే.. ఆ రోజు ప్రమాణ స్వీకారం చేసిన మంత్రుల్లో ఒకరికి శాసనసభ వ్యవహారాల బాధ్యతలు అప్పగించే అవకాశాలున్నాయి. ఇదే విషయాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ సురేశ్ రెడ్డి దృష్టికి 'ఆంధ్రజ్యోతి' ప్రతినిధి తీసుకెళ్లగా.. శాసనసభ వ్యవహారాల బాధ్యతను ముఖ్యమంత్రి గానీ, సహచర మంత్రిగానీ నిర్వహించవచ్చన్నారు. ఆ బాధ్యతలను ఎవరికి అప్పగించాలనేది సీఎం నిర్ణయంపైనే ఆధారపడి ఉంటుందన్నారు. కచ్చితంగా శాసనసభ వ్యవహారాల మంత్రే చూడాలనే నిబంధన ఏమీ లేదన్నారు.

కోటి ఎకరాలకు నీళ్లు పారిస్తాం

ప్రజలు నమ్మి మరోసారి అధికారాన్నిచ్చారు.. ప్రాజెక్టుల పూర్తితో నమ్మకాన్ని నిలబెట్టుకుంటాం

▸ ఈ సారి కేంద్రంలో మనదే క్రియాశీలక పాత్ర

▸ నిధులను రాబట్టుకుంటాం: సీఎం కేసీఆర్

▸ సాగునీటి ప్రాజెక్టులపై సుదీర్ఘ సమీక్ష

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, నిర్వహణ కోసం విధి విధానాలు రూపొందించాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. కోటి ఎకరాలకు సాగునీరు అందించడమే లక్ష్యంగా గోదావరి, కృష్ణా బేసిన్లలో రాష్ట్రానికి ఉన్న నీటి వాటాను వినియోగించుకునే వ్యూహాన్ని అమలు చేయాలన్నారు. టీఆర్ఎస్ ప్రభుత్వం వస్తేనే ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి, సాగునీరు అందిస్తారనే విశ్వాసంతో ప్రజలు తమకు మరోసారి అవకాశమిచ్చారని, వారి నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని తెలిపారు. ఈ టర్మ్‌లో అన్ని ప్రాజెక్టులు పూర్తి చేస్తామన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు మాదిరిగానే పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని శరవేగంగా పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ప్రాజెక్టుల నిర్మాణానికి బడ్జెట్లో నిధులు కేటాయించడంతోపాటు ఇతర ఆర్థిక సంస్థల నుంచి కూడా నిధులు సేకరిస్తామని చెప్పారు. ప్రాజెక్టులు పూర్తయిన తర్వాత కూడా వాటి నిర్వహణ కోసం నిధులను బడ్జెట్లో కేటాయిస్తామని తెలిపారు. రైతులకు సాగునీరు ఇవ్వడంతోపాటు పరిశ్రమలకు, మంచినీటికి కూడా ఎంత నీరు అవసరమవుతుందో లెక్కగట్టి, ఏ ప్రాజెక్టు నుంచి ఎంత నీరు వాడాలో నిర్ణయించాలన్నారు. ప్రాజెక్టుల నుంచి వచ్చే నీటితో మొదట చెరువులు నింపడానికే ప్రాధాన్యం ఇవ్వాలని ఆదేశించారు. ఈ మేరకు సోమవారం సాగునీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. ఇటీవలే అన్ని ప్రాజెక్టుల పనులను స్వయంగా సందర్శించి వచ్చిన విశ్రాంత ఇంజనీర్లు, వివిధ ప్రాజెక్టు పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు, ఈ సమావేశంలో పాల్గొన్నారు. ప్రతి ప్రాజెక్టు పురోగతిపై విశ్రాంత ఇంజనీర్ల బృందం సీఎంకు వివరించింది. ఈ సందర్భంగా ఎక్కడ ఏ లోపం ఉందో చర్చించి, అక్కడికక్కడే లోపాన్ని సవరించడానికి అధికారులకు సూచనలు చేశారు. పనుల్లో నిర్లక్ష్యం వహించే ఏజెన్సీలను మార్చాలని సీఎం ఆదేశించారు.

ఈ టర్మ్‌లో ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తాం..

"తెలంగాణ రాష్ట్రం కోసం ప్రజలు దశాబ్దాల తరబడి పోరాడారు. రాష్ట్రం వస్తే సాగునీరు వస్తుందని ఆశపడ్డారు. మొదటి టర్మ్‌లో సాగునీటి ప్రాజెక్టులను ప్రారంభించాం. మిషన్ కాకతీయ ద్వారా చెరువులు పునరుద్ధరించే పనులు చేపట్టాం. అన్ని పనులు పురోగతిలో ఉన్నాయి. ప్రాజెక్టులు పూర్తి చేయడం టీఆర్ఎస్ ప్రభుత్వం వల్లనే అవుతుందని ప్రజలు నమ్మారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి, సాగునీరు అందించాం. అందుకే అక్కడి ప్రజలు 13 సీట్లలో టీఆర్ఎస్‌ను గెలిపించారు. ఈ టర్మ్‌లో ప్రాజెక్టులన్నీ పూర్తి చేసి, తెలంగాణలో కోటి ఎకరాల్లో నీరు పారించాల్సిన బాధ్యత మనపై ఉంది. రైతులకు సాగునీరు అందించడమే ధ్యేయంగా పనిచేద్దాం" అని కేసీఆర్ పిలుపునిచ్చారు. తెలంగాణలో ఓ ప్రాజెక్టును జాతీయ ప్రాజెక్టుగా గుర్తించాలని, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.20-30 వేల కోట్లు ఇవ్వాలని మోదీని అనేకసార్లు కోరానని, అయినా నిధులివ్వలేదని కేసీఆర్ అన్నారు. ఈ సారి కేంద్రంలో తమది క్రియాశీల పాత్ర ఉంటుందని, కావాల్సిన నిధులు రాబట్టుకునే అవకాశం ఉంటుందని చెప్పారు.

వానాకాలంలో నీళ్లు పొలాలకు చేరాలి..

"గోదావరి నదిలో తెలంగాణకు 950 టీఎంసీల నీటి వాటా ఉంది. దీని ప్రకారమే కాళేశ్వరం, తుపాకులగూడెం, సీతారామ ప్రాజెక్టులు నిర్మిస్తున్నాం. ఎండాకాలంలోనే పనులన్నీ పూర్తి కావాలి. వర్షాకాలంలో నీళ్లు చెరువుల ద్వారా పొలాలకు చేరాలి" అంటూ వివిధ రిజర్వాయర్లకు నీటి తరలింపు వివరాలను, కాళేశ్వరం ప్రాజెక్టు లక్ష్యాలను కేసీఆర్ వివరించారు. దేవాదుల ఎత్తిపోతల పథకాన్ని పూర్తి స్థాయిలో సమీక్షించాల్సిన అవసరం ఉందన్నారు. 'ఏడాదికి 75 టీఎంసీలకు పైగా నీరు తీసుకునే అవకాశం ఉంది. ఇప్పుడున్న డిజైన్లు, కాల్వలు, ఇతర నిర్మాణాలు పెద్దగా ఉపయోగపడేలా లేవు. మొత్తం పాత వరంగల్ జిల్లాకు దేవాదుల ద్వారా నీరు అందించాలి. తుంగతుర్తి నియోజకవర్గంలో రిజర్వాయర్ నిర్మించి, తుంగతుర్తి, సూర్యాపేట, కోదాడ తదితర నియోజకవర్గాలకు నీరివ్వాలి. దీని కోసం మొత్తం ప్రాజెక్టును రివ్యూ చేసి, కొత్త ప్రతిపాదనలు తయారు చేయాలి" అని సీఎం ఆదేశించారు.

కేసుల వల్లే 'పాలమూరు' ఆలస్యం

"పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం వేగం పెరగాలి. పాలమూరు ప్రాజెక్టును పూర్తి చేసి, మహబూబ్‌నగర్ జిల్లాను సస్యశ్యామలం చేయాలి. జిల్లా ప్రజలకు ఎంతో మేలు చేసే ఈ ప్రాజెక్టును ఆ జిల్లాకు చెందిన రాజకీయ నాయకులే కోర్టుల్లో కేసులు వేసి అడ్డుకున్నారు. దాని వల్లే కొంత జాప్యం జరిగింది. ఇప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మిస్తున్నంత వేగంగా పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం నిర్మాణం సాగాలి" అని ముఖ్యమంత్రి చెప్పారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, సీఎస్ ఎస్.కె.జోషి, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, సీఎంవో కార్యదర్శి స్మితా సభర్వాల్, నీటి పారుదల శాఖ ఈఎన్‌సీలు మురళీధర్ రావు, అనిల్ కుమార్, హరిరామ్, ఓఎస్డీ శ్రీధర్ దేశ్ పాండే, సలహాదారు పెంటారెడ్డి, సీఈలు, రిటైర్డు ఇంజనీర్లు పాల్గొన్నారు.

హామీల అమలుకు భరోసా


గవర్నర్ ప్రసంగం ద్వారా వెల్లడి.. 2019-20 ఆర్థిక సంవత్సరం నుంచి అమలు.. సిద్ధమైన గవర్నర్ ప్రసంగ పాఠం

▸ తొలిసారి కేబినెట్ భేటీలో ఇద్దరే ఇద్దరు

▸ సీఎం కేసీఆర్, హోంమంత్రి అలీ సమావేశం

▸ స్టీఫెన్సన్ నియామకంతో ముగిసిన భేటీ

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికలు ముగిసి.. రెండోసారి అధికారం చేపట్టిన టీఆర్ఎస్.. ఇక తాము ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామనే భరోసాను ప్రజలకు ఇచ్చేందుకు సిద్ధమైంది. ఈ నెల 19న ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ చేయనున్న ప్రసంగం ద్వారా ఈ విషయాన్ని చెప్పనుంది. ఈ దిశగా గవర్నర్ ప్రసంగ పాఠం సిద్ధమైంది. పుస్తకాల ముద్రణ జరుగుతోంది. ఏప్రిల్ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం (2019-20) ప్రారంభమవుతున్న నేపథ్యంలో.. ఎన్నికల హామీలు, సంక్షేమ పథకాల అమలును అప్పటినుంచే ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలిసింది. గవర్నర్ ప్రసంగాన్ని ఆమోదించేందుకు రేపో, మాపో మరోసారి మంత్రివర్గ సమావేశం జరిగే అవకాశాలున్నాయి. కేబినెట్ ఆమోదం తర్వాత గవర్నర్ ప్రసంగం అసెంబ్లీ ముందుకు రానుంది. కాగా రెండోసారి టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక.. తొలిసారి సోమవారం మంత్రివర్గ భేటీ జరిగింది. ఈ భేటీలో సీఎం కేసీఆర్‌తోపాటు హోంమంత్రి మహమూద్ అలీ పాల్గొన్నారు. తాజా ఎన్నికల్లో టీఆర్ఎస్ కీలకమైన హామీలు ఇచ్చింది. వీటిలో ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 61 ఏళ్లకు పెంచడం, ప్రభుత్వ ఉద్యోగ నియామకానికి అర్హత వయోపరిమితిని 3 ఏళ్లు పెంచడమన్నది ప్రధానంగా ఉన్నాయి. నిరుద్యోగ యువతకు రూ.3,016 చొప్పున భృతి పథకాన్ని కొత్తగా ప్రారంభించాల్సి ఉంది. రైతుబంధు పథకం ద్వారా ఆర్థిక సాయాన్ని సీజన్‌కు రూ.5 వేల చొప్పున ఎకరానికి రూ. 10 వేలకు పెంచాల్సి ఉంది. ఇక ఆసరా పింఛన్లను కూడా రూ.1000 నుంచి రూ.2,016కు, దివ్యాంగుల పింఛన్‌ను రూ. 1500 నుంచి రూ.3,016కు పెంచాలని సీఎం కేసీఆర్ నిర్ణయించిన విషయం తెలిసిందే. వీటితోపాటు భవిష్యత్తు లక్ష్యాలను కూడా గవర్నర్ ప్రసంగంలో పొందుపరిచినట్లు సమాచారం.



నామినేటెడ్ సభ్యుడిగా మరోసారి స్టీఫెన్సన్

సీఎం కేసీఆర్, హోంమంత్రి మహమూద్ అలీల తొలి మంత్రివర్గ సమావేశంలో నామినేటెడ్ సభ్యుడి ఎంపికనే ఏకైక అజెండాగా తీసుకున్నారు. గత శాసనసభలో నామినేటెడ్ ఎమ్మెల్యేగా ఉన్న ఎల్విన్ స్టీఫెన్సన్‌నే మరోసారి నియమించారు. ఆయనను నామినేట్ చేస్తూ గవర్నర్‌కు ప్రతిపాదన పంపించారు. గవర్నర్ ఆమోద ముద్ర వేసి ఎన్నికల సంఘానికి పంపించారు. దీంతో స్టీఫెన్సన్‌ను నామినేట్ చేస్తున్నట్లు పేర్కొంటూ రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి రజత్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇక అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంతంగా, విజయవంతంగా నిర్వహించినందుకు భారత ఎన్నికల సంఘాన్ని రాష్ట్ర మంత్రివర్గ సమావేశం అభినందించినట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. శాసనసభ్యులకు రాజ్యాంగం, అసెంబ్లీ నిబంధనల ప్రతులను, తెలుగు, ఇంగ్లిషు, ఉర్దూ భాషలో అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది.

కాకతీయ వర్సిటీలో దూర విద్య

వరంగల్‌లోని కాకతీయ విశ్వవిద్యాలయం దూర విద్యా విధానంలో బీఏ/బీకాం ప్రోగ్రాముల్లో ప్రవేశాలకు నిర్వహించే ప్రత్యేక ప్రవేశార్హత పరీక్ష ప్రకటనను విడుదల చేసింది.

అర్హత: ఏ విద్యార్హతలు లేకుండా 2019 జనవరి 30 నాటికి 18 ఏళ్లు నిండి ప్రవేశార్హత పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి. 2015 నుంచి 2018 వరకు గతంలో నిర్వహించిన అర్హత పరీక్షల్లో ఉత్తీర్ణులైనవారు(లేదా) ఇంటర్ లేదా తత్సమాన కోర్సు పాసైన అభ్యర్థులు ప్రవేశార్హత పరీక్ష రాయకుండా నేరుగా ప్రవేశం పొందవచ్చు.

- **ప్రత్యేక ప్రవేశార్హత తేదీ:** ఫిబ్రవరి 6
- **దరఖాస్తు విధానం:** దరఖాస్తులను నేరుగా అధ్యయన కేంద్రాల నుంచి పొందవచ్చు(లేదా) వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పూర్తి చేసిన దరఖాస్తుకు ఫీజు డీడీ, ఇతర ధ్రువపత్రాల నకళ్లను జతచేసి ఏ అధ్యయన కేంద్రంలో పరీక్ష రాయాలనుకుంటున్నారో ఆ కేంద్రంలో స్వయంగా అందజేయాలి. కేంద్ర కార్యాలయానికి కూడా దరఖాస్తులు పంపవచ్చు.
- **ఫీజు:** రూ.200
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 2

వెబ్‌సైట్: http://www.sdlceku.co.in/

Scholarship Alert

Top Class Education Scheme for SC Students 2018

Category: Means and Merit Based
Description: Ministry of Social Justice and Empowerment, Government of India, is inviting applications from students belonging to SC category and are pursuing full time degree course from recognized institute.
Eligibility: Applicants, whose annual family income is not more than INR 6 Lacs, will be considered eligible for this scholarship.
Prizes & Rewards: Candidate will be awarded with full tuition fee and non-refundable charges of INR 2L p.a. for studying in private sector institution, INR 3.72L p.a. for the private sector flying clubs for commercial pilot training, INR 2220 p.m. for lodging, INR 3000 p.a. for stationery expenses and INR 45,000 for computer and accessories.
Last Date to apply: January 15, 2019. **Application:** Interested students can apply online.
Short Source URL: http:// www.b4s.in/AJ/TCE1

UCC Ireland Meritorious Scholarship 2019

Category: Merit Based
Description: University College Cork, Ireland is offering lucrative fee waiver for pursual of under-graduation and post-graduation programmes in Science, Engineering, Food Science, Business and Law.
Eligibility: For under graduation courses, one must have 80% in class 12 with a score of 85 in Maths and IELTS band of 6 to 7, depending on the course. For postgraduation courses, 65% in graduation is required and IELTS score of 6.5-7 band on the course. Special Quercus scholarships are also available.
Prizes & Rewards: Waiver in tuition fee of up to 25% in Science and Engineering courses are offered, and EUR 3000 scholarship for Business Programs. Two-year post-study work opportunity is also provided.
Last Date to apply: January 15, 2019
Application: Applications are taken online only.
Short Source URL: http:// www.b4s.in/AJ/UIM2

Raman Research Fellowship 2019-20

Category: Research Based
Description: Council of Scientific and Industrial Research, Ministry of Science and Technology, Government of India has proposed this fellowship researchers to carry out research in the fields of emerging and high priority technology at renowned foreign institutions, R&D Centres of Excellence to enhance their R&D capability and skills.
Eligibility: The applicant must be a regular scientist of CSIR and must be having a research experience of minimum 5 years in CSIR. The candidate must be presently working in high priority areas and the applicant must not be of more than 45 years. **Prizes & Rewards:** The selected candidates will get a fellowship amount of USD 2500 per month along supplementary grant of USD 1000 for participation in conferences and visiting institutions of excellence in country of placement is also provided to the fellows. **Last Date to apply:** January 18, 2019
Application: Applications can be made online only via email.
Short Source URL: http:// www.b4s.in/AJ/RRF8

Courtesy: www.buddy4study.com



డయాగ్రమ్స్ లేబులింగ్ ఫ్లో చార్టులు

సబ్జెక్టుపై పట్టుకు కీలకం

సీనియర్ ఇంటర్ జువాలజీ

ఇంటర్‌లో బయాలజీ విద్యార్థులకు సులువైన సబ్జెక్టు జువాలజీ. అదే స్కోరింగ్ సబ్జెక్టు కూడా. జువాలజీలో అరవైకి అరవై మార్కులు సాధించాలంటే సబ్జెక్టు సన్నద్ధతలో కొన్ని మెలకువలు పాటించాల్సి ఉంటుంది. అలా చేసినప్పుడు మాత్రమే అటు ఇంటర్ పరీక్షల్లోనూ, ఇటు నీట్ సహా వివిధ పోటీ పరీక్షల్లోనూ మంచి మార్కులను పొందవచ్చు. ప్రామాణిక మెటీరియల్‌తో నోట్స్ ప్రిపరేషన్ ఒక ఎత్తయితే, దానిని పక్కాగా చదువుకోవడం, పదేపదే రివిజన్ చేసుకోవడం మరో ఎత్తు. మూడేళ్ల ప్రశ్నపత్రాలను, ఆ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో జరిగిన ఎంసెట్, నీట్‌ను లోతుగా విశ్లేషించి, అనువైన విధానాలతో రూపొందించిన వ్యాసమిది.

ఇంటర్ రెండో సంవత్సరం జువాలజీ పేపర్‌లో మూడు విభాగాలుంటాయి. గరిష్ఠంగా 60 మార్కులు కేటాయించారు. పరీక్ష రాసేందుకు మూడు గంటల సమయం ఇస్తారు.

సెక్షన్-ఎలో పది ప్రశ్నలుంటాయి. అన్నింటికీ సమాధానాలు రాయాలి. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు కేటాయించారు. చాయిస్ ఉండదు కనుక 60కి 60 మార్కులు సాధించాలంటే నిర్లక్ష్యం చేయకుండా అన్ని యూనిట్స్ చివర ఇచ్చిన అన్ని వెరీ షార్ట్ ఆన్సర్ క్వశ్చన్స్‌ను క్షుణ్ణంగా చదవాలి. వాటితో పాటు ఒకటి లేదా రెండు ప్రశ్నలు ఇన్‌డైరెక్ట్‌గా ఇస్తారు. అందువల్ల ఏ యూనిట్‌ని వదిలిపెట్టకుండా అన్నింటిని పూర్తిగా చదవాలి. ఈ విభాగంలో ప్రశ్నలను ఊహించలేనందున అన్నింటినీ కవర్ చేయాలి.

కొన్ని సంవత్సరాలుగా రిపీటెడ్‌గా అడుగుతున్న ప్రశ్నలు

- Bohr effect
- What is Chyme
- Diabetes mellitus and insipidus
- All or none response
- Renal columns
- Omega-3 fatty acids
- Respiratory Disorders
- Red & White muscle fibers
- Key stone bone
- Coricycle
- Metastasis
- Yellow spot & Blind spot
- Amniocentesis
- Exotic carps & Indian carps
- Bile Juice and its role
- Role of ANF
- Cortical and Juxtamedullary neurons
- Corpus callosum ను తప్పక చదవాలి.

నీట్‌లో కూడా ఈ ప్రశ్నలను ఆధారం చేసుకొని 10-12 ప్రశ్నలు అడుగుతున్నారు. కాబట్టి ఈ విభాగంపై ఎక్కువ దృష్టి సారించాలి.

సెక్షన్-బి విభాగంలో ఎనిమిది ప్రశ్నలు ఇస్తారు. ఆరు ప్రశ్నలకు సమాధానాలు రాయాలి. ప్రతి ప్రశ్నకు నాలుగు మార్కులు. ఈ విభాగంలో ఒక ప్రశ్న డయాగ్రమ్‌కు సంబంధించి ఉంటుంది.

- Internal Structure of Heart
- L.S. of Kidney
- L.S. of Tooth
- Nephron Structure
- T.S. of Spinalcord లను వీలైనన్ని ఎక్కువసార్లు ప్రాక్టీస్ చేసి లేబుల్స్ గుర్తించాలి.

సెక్షన్-సి విభాగం నుంచి మూడు ప్రశ్నలిస్తారు. రెంటికి సమాధానాలను రాయాలి. ప్రతి సమాధానానికి ఎనిమిది మార్కులు కేటాయిస్తారు. నీట్ డయాగ్రమ్ సహా సమాధానాలు రాయాల్సి ఉంటుంది. ఈ విభాగానికి సంబంధించి మూడు ప్రశ్నలు యూనిట్ 2, 5, 6 నుంచి అడుగుతున్నారు.

మూడేళ్ళ నీట్ ప్రశ్నపత్రాలను పరిశీలిస్తే ఇంటర్ సెకండియర్ సిలబస్ నుంచి సుమారుగా 27 నుంచి 28 ప్రశ్నలు అడిగారు. అంటే మొత్తం సిలబస్‌లో 65-70% శాతం ప్రశ్నలు రెండో సంవత్సరం టెక్ట్స్‌బుక్స్ ఆధారంగా చేసుకొని ఇస్తున్నారు. అదే ఎంసెట్‌పరంగా చూస్తే రెండేళ్ళ కోర్సుకు సమప్రాధాన్యం కల్పిస్తున్నారు. కాబట్టి సెకండియర్ విద్యార్థులు, వ్యూహాత్మకంగా ఏకకాలంలో ఐపిఇతోపాటు ఎంసెట్, నీట్, ఎయిమ్స్, జిప్మర్‌కి ఉద్దేశించిన ఆబ్జెక్టివ్ టెస్టులకూ ప్రిపేరవ్వాలి. అలా చేస్తే తక్కువ సమయంలో సాధ్యమైనన్ని ఎక్కువ మార్కులు సాధించుకోవచ్చు.

ఇంటర్ రెండో సంవత్సరంలో కఠినంగా అనిపించే చాప్టర్లు రెండు. ఆశ్చర్యకరమైన విషయం ఏమంటే ఆ రెండు చాప్టర్లే ఇంటర్, ఎంసెట్, నీట్ పరంగా ఎక్కువ వెయిటేజి ఉన్నవి. అందులో ముఖ్యంగా ఎక్కువ దృష్టి సారించాల్సిన చాప్టర్ యూనిట్-6 (జెనెటిక్స్). ఇంటర్‌పరంగా ఈ విభాగం నుంచి ఒక ఎల్‌ఎక్యూ, ఒక ఎస్‌ఎక్యూ అడుగుతున్నారు. 8 మార్కుల కోసం మూడు ప్రశ్నలను ప్రిపేరయితే చాలు ఆ మూడింటి నుంచి ఒక ప్రశ్న ఫైనల్ పరీక్షలో రాయవచ్చు. Criss-Cross Inheritance, Blood grouping, Sex - Determination ప్రిపేరయితే 12 మార్కులు సాధించవచ్చు. ఈ విభాగం నుంచి సుమారుగా 4 - 6 ప్రశ్నలు ఎంసెట్, నీట్ పరీక్షల్లో అడుగుతున్నారు. Concept, Condition, Calculation, Approach ని ఫాలో అయితే అన్ని ప్రశ్నలకు సమాధానాలు రాయవచ్చు.

బ్లడ్ గ్రూప్స్‌కి సంబంధించి కాన్సెప్ట్‌ని అర్థం చేసుకుని ఏ కండిషన్ ఇచ్చారో చూసుకొని, అడిగిన ప్రశ్నని కాలిక్యులేట్ చేయాలి. జెనిటిక్స్ డిజార్డర్ చాప్టర్‌లో పెడిగ్రి చార్ట్ ఆధారంగా ప్రశ్నలు ఎక్కువగా అడుగుతున్నారు. కాబట్టి పెడిగ్రి సింబల్స్ ఒక దగ్గర రాసుకొని, కాన్సెప్ట్ నేర్చుకొని, సాధ్యమైనన్ని ఎక్కువ మోడల్స్, పెడిగ్రి సంబంధిత ప్రాబ్లమ్స్‌ని ప్రాక్టీస్ చేయాలి. అప్పుడే పరిపూర్ణత వస్తుంది. ఈ ప్రాబ్లమ్స్ అన్నీ మేథ్స్‌లోని ప్రాబబిలిటీ ఆధారంగా ఉంటాయి. అందువల్ల క్రాస్‌చెక్ చేసుకొని చూసుకున్న తరవాతే సమాధానం టిక్ చేసుకోవాలి.

> మెమొరీ బేస్డ్ చాప్టర్లను వీలైనన్ని ఎక్కువసార్లు రివైజ్ చేసుకోవాలి. లీజర్ సమయంలో గ్రూప్ డిస్కషన్ రూపంలో ఇంటరాక్ట్ కావాలి.

ఇంటర్, నీట్‌పరంగా ఎక్కువ వెయిటేజ్ ఉన్న మరో యూనిట్-5. ఈ విభాగం నుంచి ఇంటర్‌లో ఒక 8 మార్కుల ప్రశ్న, ఒకటి లేదా రెండు వివిఎస్‌క్యూలను అడుగుతున్నారు. ఎల్‌ఎక్యూకి సంబంధించి Human Male reproductive system, Female reproductive system, Development నుంచి ప్రశ్న అడుగుతున్నారు. డయాగ్రమ్‌లను పరిశీలిస్తూ ప్రాక్టీస్ చేసి, థియరీ పార్ట్‌ని ప్రిపేరయితే సులువుగా అర్థం చేసుకోవచ్చు. నీట్‌కి సంబంధించిన బిట్స్ కూడా సులువుగా చేయవచ్చు. ఎస్‌టిడికి సంబంధించి టేబుల్ తయారుచేసుకోవాలి. ఫ్యామిలీ ప్లానింగ్ మెథడ్స్‌ని ఫ్లో చార్ట్ ద్వారా ప్రిపేరయితే సమయం కలిసి రావడానికి తోడు సబ్జెక్టులో స్పష్టత పెరుగుతుంది.

ఇంటర్ రెండో సంవత్సరం సిలబస్‌పరంగా తక్కువ సమయంలో ఎక్కువ మార్కులు సాధించడానికి వీలుగా ఉన్న సులువైన చాప్టర్ యూనిట్-4. ఈ విభాగం నుంచి ఇంటర్‌లో 8-10 మార్కులు, నీట్‌లో 5-6 ప్రశ్నలు అడుగుతున్నారు. ఎండోక్రైన్ సిస్టమ్‌లోని అంశాలను ఒక టేబుల్ రూపంలో రాసుకొని ప్రిపేరయితే సులభంగా మార్కులు సాధించవచ్చు. Gland, Hormones, Function, Hypo, Hyper secretion symptoms diseaseని ఒక టేబుల్ రూపంలో రాసుకుంటే అన్ని అంశాలు కవర్ అవుతాయి. ఏ రూపంలో ప్రశ్న అడిగినా సమాధానం రాయవచ్చు.

యూనిట్ 7 ఎవల్యూషన్ చాప్టర్‌ను నాలుగు సబ్ టాపిక్స్‌గా చేసుకొని ప్రిపేరవ్వాలి. ఫేజ్-1లో Origin of Life ని Chronological order లో రాసుకోవాలి. Evidences for evolutionకి సంబంధించి ఉదాహరణలను విడిగా రాసుకోవాలి. Scientist contribution, Merits, Demeritsని వేర్వేరుగా రాసుకొని ఎక్కువ దృష్టి సారించాలి. ఏటా నీట్, ఎంసెట్‌లో Hardy Weinberg equilibrium మీద ఒక ప్రాబ్లమ్‌ని ఇస్తున్నారు. ఫార్ములాని చూడకుండా ప్రాక్టీస్ చేసుకొని, సాధ్యమైనన్ని మోడల్ ప్రాబ్లమ్స్‌ని సాల్వ్ చేసుకోవాలి.


Human Evolutionకి సంబంధించి Chronological ఆర్డర్‌ను ఫ్లో చార్ట్ రూపంలో ప్రిపేర్ కావాలి. ఈ విభాగానికి సంబంధించి ఐపిఇలో రెండు నాలుగు మార్కుల ప్రశ్నలు అడుగుతున్నారు. ఈ కింది ప్రశ్నలను ప్రిపేరయితే వాటికి సమాధానాలు రాయవచ్చు.

- Demerits of Darwinism
- Industrial melanism
- Homologous & analogous organs
- Hardy weinberg equilibrium
- Stanley Miller & Urey experiment

యూనిట్-2 నుంచి ఒక లాంగ్ ఆన్సర్ ప్రశ్న ఒకటి లేదా రెండు వివిఎస్‌క్యూ అడగవచ్చు. ఎల్‌ఎక్యూ కోసం Structure of heart & Functioning of heart ప్రశ్నలను ప్రిపేర్ కావాలి. అలాగే ఈ యూనిట్ నుంచి 3-4 ప్రశ్నలు నీట్‌లో రావచ్చు.

యూనిట్-8 అప్లయిడ్ బయాలజీ నుంచి నాలుగు మార్కుల ప్రశ్నలైన Types of cancers, causes of cancers, AIDS, MRI, Inbreeding & Outbreeding, ECG మీద ఎక్కువ దృష్టి సారించాలి. వీటితోపాటు వాక్సిన్స్, ట్రాన్స్‌జెనిక్ యానిమల్స్ నుంచి నీట్ బిట్స్ అడుగుతున్నారు. బ్లూ ప్రింట్‌లోని చాప్టర్ల వెయిటేజిని ఆధారం చేసుకొని దేనినుంచి ఎక్కువ ప్రశ్నలు వస్తున్నాయో పరిశీలించి, వాటికి వీలైనంత ఎక్కువ సమయం కేటాయించుకోవాలి. మెమొరీ బేస్డ్ చాప్టర్లను వీలైనన్ని ఎక్కువసార్లు రివైజ్ చేసుకోవాలి. లీజర్ సమయంలో గ్రూప్ డిస్కషన్ రూపంలో ఇంటరాక్ట్ కావడం వల్ల కంటెంట్ షార్ట్ మెమొరీ నుంచి లాంగ్ మెమొరీలోకి మారి సత్ఫలితాలనిస్తుంది.

ఏపీ, టిఎస్ ఎంసెట్ ఆన్‌లైన్ (కంప్యూటర్ బేస్డ్) మోడ్‌లో నిర్వహిస్తున్నందున సాధ్యమైనన్ని ఎక్కువ టెస్ట్‌లను ఆన్‌లైన్‌లో ప్రాక్టీస్ చేయాలి. నిర్ణీత సమయాన్ని కేటాయించుకొని, వీలైనన్ని టెస్ట్‌లు రాయాలి. ఎంసెట్ టెస్ట్ తెలుగు అకాడమి సిలబస్‌ను బేస్ చేసుకొని ఉంటుంది. ఎక్కువ ప్రశ్నలు టెక్ట్స్‌బుక్ లైన్ నుంచి అడుగుతారు. కాబట్టి ఐపిఇ ప్రిపరేషన్‌కు ఎక్కువ ఉపయుక్తకరంగా ఉంటుంది. నీట్ విషయానికొస్తే కొన్ని ప్రశ్నలు అప్లికేషన్ ఓరియంటెడ్ ఇస్తున్నారు. కాన్సెప్ట్‌ని సరిగా అర్థంచేసుకొని రిలేటెడ్ పాయింట్స్‌ని సినాప్సిస్‌గా రాసుకుంటే ఈ ప్రాబ్లమ్‌ను సులభంగా అధిగమించవచ్చు.



డాక్టర్ ధూళిపాళ్ల శ్రీనివాసరావు
సీనియర్ ఫ్యాకల్టీ

S. NO	UNIT	TS. EAMCET 2016	TS. EAMCET 2017	TS. EAMCET 2018	AP EAMCET 2016	AP EAMCET 2017	AP EAMCET 2018	NEET 2016	NEET 2017	NEET 2018
1	Human Anatomy and Physiology-I	2	2	2	3	3	3	3	4	5
2	Human Anatomy and Physiology-II	2	1	2	4	2	3	2	3	4
3	Human Anatomy and Physiology-III	2	2	2	3	3	2	3	4	4
4	Human Anatomy and Physiology-IV	2	4	3	2	2	2	5	5	2
5	Human Reproduction & R.Health	2	2	2	2	3	4	5	4	5
6	Genetics	4	3	3	2	3	3	2	6	3
7	Organic Evolution	3	3	2	2	3	2	5	1	3
8	Applied Biology	4	4	3	2	2	3	2	1	—
TOTAL		21	21	19	20	21	22	27	28	26

S. NO	UNIT	2016 IPE AP VSQ	2016 IPE AP SAQ	2016 IPE AP LAQ	2016 IPE AP MARKS	2016 IPE TS VSQ	2016 IPE TS SAQ	2016 IPE TS LAQ	2016 IPE TS MARKS
1	Human Anatomy and Physiology-I	1	2		10	1	2		10
2	Human Anatomy and Physiology-II	1		1	10			1	8
3	Human Anatomy and Physiology-III	2	1		8	2	1		8
4	Human Anatomy and Physiology-IV	3	1		10	3	1		10
5	Human Reproduction & R.Health	1		1	10		1	1	12
6	Genetics		1	1	12		1	1	12
7	Organic Evolution		2		8	2	1		8
8	Applied Biology	2	1		8	2	1		8
TOTAL		20	32	24	76	20	32	24	76

S. NO	UNIT	2017 IPE AP VSQ	2017 IPE AP SAQ	2017 IPE AP LAQ	2017 IPE AP MARKS	2017 IPE TS VSQ	2017 IPE TS SAQ	2017 IPE TS LAQ	2017 IPE TS MARKS
1	Human Anatomy and Physiology-I	1	2		10	1	2		10
2	Human Anatomy and Physiology-II	1		1	10	1		1	10
3	Human Anatomy and Physiology-III	2	1		8	2	1		8
4	Human Anatomy and Physiology-IV	2	1		8	2	2		12
5	Human Reproduction & R.Health	2		1	12			1	8
6	Genetics		1	1	12		1	1	12
7	Organic Evolution		2		8	2	1		8
8	Applied Biology	2	1		8	2	1		8
TOTAL		20	32	24	76	20	32	24	76

S. NO	UNIT	2018 IPE AP VSQ	2018 IPE AP SAQ	2018 IPE AP LAQ	2018 IPE AP MARKS	2018 IPE TS VSQ	2018 IPE TS SAQ	2018 IPE TS LAQ	2018 IPE TS MARKS
1	Human Anatomy and Physiology-I	1	2		10	1	2		10
2	Human Anatomy and Physiology-II	1		1	10	1		1	10
3	Human Anatomy and Physiology-III	2	1		8	2	1		8
4	Human Anatomy and Physiology-IV	3	1		10	2	1		8
5	Human Reproduction & R.Health	1		1	10	2		1	12
6	Genetics		1	1	12		1	1	12
7	Organic Evolution		2		8		2		8
8	Applied Biology	2	1		8	2	1		8
TOTAL		10		3	76	10	8	3	76

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
మంగళవారం • 8 జనవరి 2019

ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న సంతూర్ గోల్డ్ సోప్ ముత్యాల ముగ్గుల పోటీలు (టేస్ట్ పార్టనర్: గోల్డ్‌డ్రాప్, ఫ్యాషన్ పార్టనర్: డిగ్ సెల్, హెల్త్ పార్టనర్: అమృతబిందు) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లోని 83 కేంద్రాల్లో జనవరి 4, 5, 6 తేదీల్లో ఘనంగా జరిగాయి. మొత్తం 12 వేల మందికి పైగా మహిళలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతి కేంద్రంలో ప్రథమ రూ.5,000, ద్వితీయ రూ.3,000, తృతీయ బహుమతి రూ.2,000తో పాటు అనేక కన్సొలేషన్ బహుమతులు అందించాం. జిల్లా స్థాయిలో విజేతలుగా నిల్చిన మహిళలు రాష్ట్ర స్థాయిలో జరిగే ఫైనల్ పోటీలకు అర్హత సాధించారు. తెలంగాణలోని 10 ఉమ్మడి జిల్లాల నుంచి ఎంపికైన వారికి హైదరాబాద్‌లో జనవరి 9న ఫైనల్స్ జరుగుతాయి. ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాల తోపాటు తమిళనాడు, కర్ణాటక విజేతలిద్దరు... మొత్తం 15 మందికి జనవరి 11న విజయవాడలో ఫైనల్ పోటీలు జరుగుతాయి. ఫైనల్స్ విజేతలు ఎనిమిదిమందికి రూ.1.20 లక్షల బంపర్ బహుమతులతోపాటు మరో 17 మందికి కన్సొలేషన్ బహుమతులు ఉంటాయి. రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనబోతున్న ఫైనలిస్టులు, వారు జిల్లాస్థాయి పోటీల్లో తీర్చిన అందమైన రంగవల్లులు నవ్య పాఠకుల కోసం....

ఆంధ్రజ్యోతి-సంతూర్ గోల్డ్ సోప్ ముత్యాల ముగ్గుల పోటీలు

ఫైనలిస్టులు వీరే

ముత్యాల ముగ్గులు

ఆంధ్రప్రదేశ్


కృష్ణజ్యోతి, శ్రీకాకుళం


పి.విజయసాయి, విజయనగరం


ఎన్.వందన, విశాఖపట్నం


టి.విద్యాధరణి, తూర్పుగోదావరి


సీహెచ్ సృజన, పశ్చిమగోదావరి


కె.మల్లేశ్వరి, కృష్ణా


విజయలక్ష్మి, గుంటూరు


ఎస్.సురేఖ, ప్రకాశం


ఎం.సునీత, నెల్లూరు


డి.పూర్ణ, చిత్తూరు


కె.జయలక్ష్మి, కడప


ఆర్.గౌతమి, కర్నూలు


కె.ప్రసన్నలక్ష్మి, అనంతపురం


టి.మంజుల, తమిళనాడు


బి.శాంతి, కర్ణాటక

తెలంగాణ


జి.మంజుల, ఆదిలాబాద్


శీపెల్లి ఇందు, కరీంనగర్


బి.సుమలత, వరంగల్


జి.స్వప్న, నిజామాబాద్


వి.విజయలక్ష్మి, నల్లగొండ


శిల్ప, మహబూబ్‌నగర్


డి.మల్లేశ్వరి, ఖమ్మం


పి.ధనలక్ష్మి, హైదరాబాద్


అవంతి, మెదక్


బి.సువర్ణ, రంగారెడ్డి



నిండైన ఆరోగ్యం వెలకట్టలేని నిధి!
అది కలకాలం తరగకుండా ఉండాలంటే...
శారీరక, మానసిక ఆరోగ్యాలు రెండూ జాగ్రత్తగా కాపాడుకోవాలి!
అందుకు తగిన ఆరోగ్య సూత్రాలు తూచ తప్పక పాటించాలి!

హెల్త్ ఈజ్ వెల్త్!

ఏ చిన్న నలత అయినా దాని ప్రభావం జీవన సరళిని గాడి తప్పిస్తుంది. అలాగని నిండు ఆరోగ్యంతో కలకాలం కొనసాగడం ఒక్కరికీ సాధ్యం కాదు! కానీ అనారోగ్యపు ఒడుదొడుకుల్ని తట్టుకుని నిలబడేలా శరీరాన్ని సన్నద్ధం చేసుకోవడం మన చేతుల్లో పనే! ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకుంటే ఆరోగ్యం పట్ల కనబరచిన నిర్లక్ష్యాలు, వాటి పర్యవసానాలు, స్వల్ప అవగాహనతో వాటిని నియంత్రించుకోగలిగే వెసులుబాట్లు కనిపిస్తాయి. ఆరోగ్యాన్ని చెక్కుచెదరకుండా ఉంచే ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవరుచుకోవడం మన విధి! అందుకోసం....

నీరు పుష్కలంగా!

దాహం వేసినప్పుడు తప్ప నీళ్ల జోలికి వెళ్లం! నిజానికి దాహం వేసిందంటే... అప్పటికే శరీర కణాల్లో నీటి శాతం తగ్గిపోయిందని అర్థం. కణాలు దాహంతో అల్లాడకుండా ఉండాలంటే, దాహం వేసేవరకూ ఆగకుండా, తరచుగా నీళ్లు తాగుతూనే ఉండాలి. శరీర జీవక్రియలు సక్రమంగా, సమర్థంగా జరగడానికి నీరు ఎంతో అవసరం. శరీరంలోని వ్యర్థాలు బయటకు వెళ్లాలన్నా, పోషకాలు, ఆక్సిజన్ శరీరం మొత్తం అందాలన్నా తగినంత నీరు తాగాలి. మూత్రం, స్వేదం, ఊపిరి ద్వారా శరీరంలోని నీరు తరిగిపోతూ ఉంటుంది. దాన్ని ఎప్పటికప్పుడు భర్తీ చేస్తూ ఉండాలి. నీటి అవసరం... వాతావరణం, చేసే పని, శరీర బరువుల మీద ఆధారపడి ఉంటుంది. కాబట్టి అందుకు తగ్గట్టు సరిపడా నీరు తాగాలి. మూత్రం రంగును బట్టి తాగుతున్న నీరు సరిపోతుందో, లేదో తెలుసుకునే వీలుంది. మూత్రం నీరులా స్వచ్ఛంగా ఉందంటే మీరు తాగుతున్న నీటి పరిమాణం సరిపోతోందని అర్థం. మూత్రం పచ్చదనం పెరుగుతుంటే, నీళ్లు తాగడం పెంచాలి.

నిద్ర సరిపడా!

కంటి నిండా నిద్ర కరువైతే జీవక్రియలు గాడి తప్పుతాయి. ఆకలి క్రమం తప్పుతుంది. మెదడు చురుకుదనం తగ్గుతుంది. సామర్థ్యం సన్నగిల్లుతుంది. కాబట్టి బయలాజికల్ క్లాక్ దెబ్బతినకుండా ఉండడం కోసం వేళకు నిద్ర పోవడం తప్పనిసరి. అయితే పెరిగే వయసుతోపాటు నిద్ర కొందరికి సమస్యగా మారుతుంది. ఇందుకు కారణాలను కనిపెట్టి పరిష్కరించుకోవాలి. దానికితోడు నిద్రకు ఉపకరించేలా పరిసరాలను, జీవనశైలిని మార్చుకోవాలి. ఇందు కోసం...

- ప్రతి రోజూ ఒకే సమయానికి నిద్ర పోవడం అలవాటు చేసుకోవాలి.
- నిద్రకు ముందు ఆందోళనకు గురిచేసే అంశాల గురించి ఆలోచించకూడదు.
- గుండె వేగాన్ని పెంచే వీడియోగేమ్స్ ఆడకూడదు, సినిమాలు చూడకూడదు.
- మనసును ప్రశాంతంగా ఉంచే సంగీతం వినాలి.
- సెల్‌ఫోన్, మ్యూజిక్ సిస్టమ్, టీవీలకు పడగ్గదిలో చోటు కల్పించకూడదు.

శరీర తత్వాన్ని బట్టి...

తక్కువ సమయంలో ఎక్కువ బరువు తగ్గాలనే తాపత్రయం తగదు! అలాంటి ఆహార నియమాలు అందరికీ సరిపడకపోవచ్చు! ఒకరికి ఫలితాన్నిచ్చిన డైట్ పద్ధతి మరొకరికి అంతటి ఫలితాన్నే ఇవ్వకపోవచ్చు. కాబట్టి శరీర తీరు, తత్వాలను బట్టి, వైద్యులు సూచించిన డైటింగ్ పద్ధతిని అనుసరించాలి. శరీరానికి సరిపడా పోషకాలను అందిస్తూనే, అనవసర కొవ్వులను తగ్గించుకుంటూ, వ్యాయామం చేస్తూ అధిక బరువును తగ్గించుకోవడం ఆరోగ్యకరం. అధిక బరువు తగ్గాలనుకునేవాళ్లు... తాము తినే పదార్థాలు, వాటిలోని పోషక విలువలు, శరీరం శక్తిని ఖర్చు చేసే తీరు మీద అవగాహన ఏర్పరుచుకోవాలి. తీసుకునే ఆహారంలో సంక్లిష్ట కొవ్వులకు బదులుగా సాధారణ కొవ్వులు ఉండేలా చూసుకోవాలి. మైదా, చక్కెరలను పూర్తిగా మానేయాలి. ప్రిజర్వేటివ్స్ కలిపిన ప్రాసెస్‌డ్ ఫుడ్స్, ప్యాకేజ్‌డ్ ఫుడ్ పూర్తిగా మానేయాలి. పీచు పదార్థం ఎక్కువగా ఉండే తాజా పళ్లు, కూరగాయలను ఎక్కువగా తీసుకోవాలి.



డాక్టర్ ఎమ్.గోవర్ధన్,
కన్సల్టెంట్ జనరల్ ఫిజీషియన్,
కేర్ హాస్పిటల్స్,
నాంపల్లి, హైదరాబాద్.



కండరాలన్నీ కదిలేలా....

వ్యాధుల నుంచి రక్షణ కల్పించి, ఆయుష్షును పెంచే ఔషధం వ్యాయామం! వ్యాయామంతో ఎముకల సాంద్రత పెరుగుతుంది. కండరాల పటుత్వం పెరుగుతుంది. అధిక బరువు తగ్గి, ఒళ్లు తేలికవుతుంది. కాబట్టి దైనందిన కార్యక్రమాల్లో వ్యాయామానికి చోటు కల్పించాలి. అయితే వ్యాయామాన్ని శారీరక శ్రమగా భావించి, బద్ధకిస్తూ ఉంటాం! కానీ వ్యాయామాన్ని ఆనందంగా ఆస్వాదించే గుణం అలవరుచుకోవాలి. నడక, పరుగు, జిమ్‌లో వ్యాయామాలు, యోగా, ఏరోబిక్స్... వీటిలో నచ్చిన వ్యాయామాన్ని ఎంచుకోవాలి. వారంలో కనీసం ఐదు రోజులపాటు, రోజుకి 45 నిమిషాలపాటు వ్యాయామం చేయడం ఎంతో అవసరం. వ్యాయామాన్ని ఇష్టపడనివాళ్లు... తమకిష్టమైన సైక్లింగ్, ఈత, హైకింగ్, ట్రెక్కింగ్‌లనూ ఎంచుకోవచ్చు. ఎంచుకునేది ఎలాంటి వ్యాయామమైనా శరీరంలోని ప్రతి కండరం కదిలేలా ఉండాలి!

పండులా ఉండాలంటే...

విటమిన్లు, ఖనిజ లవణాల కోసం సప్లిమెంట్ల మీద ఆధారపడే బదులు తాజా పళ్లను ఎంచుకోవాలి. సాధారణంగా తినుబండారాల కోసం డబ్బు ఖర్చు చేస్తూ ఉంటాం! కానీ అదే ఖర్చులో పళ్లు కొనడానికి వెనకాడతాం! నిజానికి ఫలహారం ఆరోగ్యకరం, పోషకనిలయం! మారే రుతువులతో మార్పులు చోటుచేసుకునే వాతావరణానికి తగ్గట్టు శరీరాన్ని సన్నద్ధం చేయగల పోషకాలు సీజనల్ ఫ్రూట్స్‌లో ఉంటాయి. కాబట్టి పళ్లు తినడం అలవాటు చేసుకోవాలి. సాధారణంగా భోజనం తర్వాత పళ్లు తింటూ ఉంటాం! కానీ పళ్లు పరగడుపునే తినాలి. ఉదయం అల్పాహారానికి ముందు తినడం అలవాటు చేసుకోవాలి. అలాగే తొక్క తీయకుండా, జ్యూస్ చేయకుండా, చక్కెర, ఉప్పు చేర్చకుండా తినాలి. చెట్టు నుంచి పండు కోసినప్పటి నుంచి దాన్లోని పోషకాలు నష్టమైపోతూ ఉంటాయి. కాబట్టి సాధ్యమైనంతవరకూ తాజా పళ్లను ఎంచుకోవాలి.

మాంసం తినకపోయినా....

నీరసం, అలసట, నిద్రమత్తు, కళ్ల ముందు చీకట్లు కమ్మడం... ఇవన్నీ రక్తలేమి లక్షణాలు! ఈ ఇబ్బందిని అధిగమించడం తేలికే అయినా, మాంసకృత్తులను సమృద్ధిగా పొందాలంటే మాంసమే తినాలనే అపోహ వల్ల ఈ సమస్య సమస్యగానే మిగిలిపోతూ ఉంటుంది. మాంసకృత్తులు సమృద్ధిగా దొరికే కూరగాయలూ ఉన్నాయి. చిక్కుళ్లు, క్యాలీఫ్లవర్, పుట్టగొడుగులు, సబ్జా గింజలు, బాదం పప్పు, పచ్చి బఠాణీల్లో ప్రొటీన్లు ఎక్కువ.



మనసు ప్రశాంతం!

- **వ్యాయామం అవసరం:** శరీరానికి వ్యాయామం, పోషకాహారం ఎంతో అవసరం. వీటిని సమకూర్చగలిగితే మానసిక సామర్థ్యం పెరుగుతుంది. అధిక బరువు ఆత్మన్యూనతకు లోను చేసి, తద్వారా డిప్రెషన్‌లోకి తోసేస్తుంది. కాబట్టి సమతులాహారం తీసుకుంటూ, క్రమంతప్పక వ్యాయామం చేస్తూ బరువును అదుపులో ఉంచుకోవాలి.
- **సహాయసహకారాలు:** అవసరం ఉన్నవారికి స్వచ్ఛంద సహాయం చేయడంతో ఆత్మవిశ్వాసం పెరుగుతుంది. కాబట్టి మీరు నివసించే ప్రాంతానికి దగ్గర్లో వాలంటీర్ వర్క్‌కు ఉపయోగపడాలనుకుంటే వెబ్‌సైట్ల ఆధారంగా కనిపెట్టి, సహాయపడండి. సమాజానికి ఎంతో కొంత తిరిగివ్వడం బాధ్యతగా భావించండి. ఇచ్చుటలో ఉండే ఆనందం మరెందులోనూ ఉండదు.
- **సాంత్వన పొందాలి:** ఒత్తిడితో కూడిన, ఉరుకుల పరుగుల జీవితంలో విశ్రాంతికి చోటు ఉంటోందా? 'నాకంత సమయం దొరకట్లేదు' అనేది మీ సమాధానమైతే, మరోసారి ఆలోచించండి! దైనందిన జీవితాన్ని ఒక్కసారి తరచి చూసుకుంటే సాంత్వన పొందడానికి 30 నిమిషాల సమయం దొరకకపోదు. ఆ సమయాన్ని సంగీతం వినడానికి, టీవీ చూడడానికి లేదా మీకిష్టమైన పని చేయడానికి కేటాయించండి.
- **అనుబంధాల బలం:** పాజిటివ్ వ్యక్తులతో కలిసి మెలగడం వల్ల ఆ ప్రభావం మన మనసు మీద పడుతుంది. ఒకవేళ మీ పరిసరాల్లో, మిమ్మల్ని చుట్టుముట్టి ప్రతికూల వ్యక్తులుంటే, అంతకంటే మెరుగైన వ్యక్తుల సాంగత్యంలో సంచరించే ప్రయత్నం చేయండి. ఒకవేళ ప్రతికూల వ్యక్తులతో కలిసి మెలగవలసి వచ్చినా, వారిలోని మంచి అంశాలను గమనించి, వాటి ద్వారా ప్రేరణ పొందే ప్రయత్నం చేయండి.
- **సహాయం పొందడంలో తప్పు లేదు:** మానసిక ఆరోగ్యం కోసం సహాయం కోరడం తప్పు కాదు. కొన్ని సందర్భాల్లో నిపుణుల అవసరం రావచ్చు. ఇలాంటప్పుడు కుటుంబసభ్యులు, స్నేహితుల సహాయంతో వైద్యులను కలవండి. వైద్యులతో మనసు విప్పి సమస్యలను చర్చించండి. మానసిక రుగ్మతలకు సరైన సమయంలో చికిత్స తీసుకోకపోతే, అవి జీవన నాణ్యతను దెబ్బతీసి అనుబంధాలను కూడా బలహీనపరుస్తాయి.

సంతోషకారకాలతో సాంగత్యం

సార్వత్రికంగా అందరినీ సంతోషపెట్టే మార్గం అంటూ ఏదీ ఉండదు. అది ఎవరికి వారు తేల్చుకోవలసిందే! ఉదాహరణకు కొందరికి క్రికెట్ అమితానందం కలిగించవచ్చు. కొందరిక అది పరమ చికాకు కలిగించే అంశం కావచ్చు. ఎందుకలా అంటే ఎవరి కారణాలు వారికి ఉంటాయి. అందువల్ల సమూహంలోనే తమ తమ సంతోషాన్ని అందుకోవడం అనేది అన్నిసార్లూ జరగదు. కాకపోతే చాలామంది సమూహంలోనే వెతుక్కునే ప్రయత్నాలు చేస్తారు. ఎక్కువ మంది విఫలమవుతారు. అందువల్ల మీరు అమితంగా ఇష్టపడేదాన్ని, సంతోషపడేదాన్ని కొందరు విమర్శించవచ్చు కూడా. ఆ విమర్శలకు ప్రభావితమై, మార్గాన్ని మార్చుకోవడం ద్వారా మనసు ఎటూ కాకుండా పోతుంది. క్రమక్రమంగా అలజడికీ, ఆందోళనకూ లోనవుతుంది. అందుకే ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా తమకు ఆనందాన్ని ఇవ్వగలిగే వాటిని ఎంచుకుని జీవితమంతా వాటితో గడపడం అలవర్చుకోవడం మేలు.

ఒక లక్ష్యమంటూ ఉండాలి

వ్యక్తిగతంగా గానీ, వృత్తిపరంగా గానీ, ప్రతి ఒక్కరికీ ఒక లక్ష్యం అంటూ ఉండాలి. లేకపోతే మనసు చంచలంగా మారుతుంది. ఏ ఒక్క మార్గంలోనూ చివరిదాకా వెళ్లకుండా మాటిమాటికీ మరో దానిలోకి మారిపోతూ ఉంటుంది. దీనివల్ల అన్నీ అర్థంతరంగా ఆగిపోతాయి. అంతిమంగా ఇది మనోవేదననే మిగులుస్తుంది. అందువల్ల ఒక లక్ష్యాన్ని నిర్ణయించుకుని, ఆ దిశగానే వెళుతున్నప్పుడు ఆ చంచలత్వం ఉండదు. అనుకున్న స్థాయిలో కాకపోయినా కొంత మేరకు సాధించినా అది ఎంతో సంతృప్తినిస్తుంది. ఎందుకంటే కొంత సాధించిన వారికి ఎప్పుడో ఒకప్పుడు ఆ మిగతాది కూడా సాధించగలనన్న ఆత్మవిశ్వాసం ఏర్పడుతుంది. అది తాత్కాలికంగా ఏదైనా అంతరాయం ఏర్పడి ఆగిపోయినా కొంత విరామం తర్వాత తిరిగి కొనసాగే ఆత్మస్థైర్యం ఏర్పడుతుంది.

కుటుంబ బంధాలు ఎంతో ముఖ్యం!

రోజువారి ఉద్యోగ, వ్యాపారాల ఒత్తిడిలో పడి చాలా మంది కుటుంబ విషయాల పట్ల నిర్లక్ష్యంగా ఉండిపోతారు. దీనివల్ల కుటుంబ సభ్యుల మధ్యనున్న బంధాలు బలహీనపడతాయి. చివరికి బాధాకరంగా మిగిలిపోతాయి. బయట ఎన్ని శిఖరాలు అధిగమించినా కుటుంబ సభ్యులతో ఆత్మీయ బంధం లేకపోతే, అది గుండె బరువునే పెంచుతుంది. అందువల్ల వృత్తిపరంగా ఎంత ఒత్తిడిలో ఉన్నా, కుటుంబ సభ్యులకు ఇవ్వాల్సినంత ప్రాముఖ్యం ఇవ్వాల్సిందే!

ఒత్తిడిని స్వీకరించాలి!

ఏ పనినైనా ఒక పర్‌ఫెక్షన్‌తో చేయాలనుకున్నప్పుడు ఒత్తిడి ఉంటుంది. ఆ ఒత్తిడే లేకపోతే వచ్చే ఉత్పత్తి అపురూపంగా ఉండదు. అయితే మనం ఇష్టంగా చేసే పని ఎంత బరువైనదైనా అది మానసిక ఒత్తిడిని కలిగించదు. అయిష్టంగా చేసేవే ఒత్తిడికి, అసహనానికీ గురిచేస్తాయి ఒక దశలో దాన్నించి పారిపోయేలా కూడా చేస్తాయి. ఉన్న ఉద్యోగం లేదా వ్యాపారం వదిలేసి మరో దానిలోకి వెళ్లిపోయేలా చేస్తాయి. కానీ, ఆ కొత్తది కూడా ఒత్తిడి లేకుండా ఏమీ ఉండదు. చేసే పనిలో నైపుణ్యం పెరిగే కొద్దీ ఒత్తిడి చాలా వరకు తగ్గుతుంది. అందువల్ల వృత్తి పరమైన నైపుణ్యాన్ని నిత్యం పెంచుకోవడం ద్వారా అన్ని ఒత్తిడులనూ అధిగమించవచ్చు.



డాక్టర్ సుజాతా రాజమణి
కౌన్సెలింగ్ అండ్ సైకోథెరపిస్ట్
కిమ్స్ హాస్పిటల్, సికింద్రాబాద్

హార్మోనల్ హెల్త్

లేపనాలు పని చేయవా?

డాక్టర్! నా అంగం చిన్నదిగా ఉందని అనుమానం! దాంతో అంగ పరిమాణాన్ని పెంచే ప్రకటనలు ఇంటర్నెట్‌లో చూసి, లేపనాలను తెప్పించి వాడాను. అయినా ప్రయోజనం లేదు. ఎందుకని?

(ఓ సోదరుడు, నెల్లూరు)



అంగ పరిమాణం గురించి ఎక్కువశాతం మంది పురుషుల్లో రకరకాల అనుమానాలుంటాయి. వీటిలో ఎక్కువ అర్థం లేనివే! స్తంభించినప్పుడు కనీసం 3 అంగుళాల పొడవు ఉంటే, మీ అంగం తగిన పరిమాణంలోనే ఉందని అర్థం. అంగ పరిమాణం పెంచే మందులు లేవు. అలా ఎవరైనా ప్రకటనలు ఇస్తే వాటిని బోగస్‌విగా భావించాలి. లేపనాల వల్ల అంగ పరిమాణం పెరిగే అవకాశం లేదు. ఇతరులు తమ అంగం చిన్నదిగా ఉందని ఎక్కడ కనిపెట్టేస్తారో? అనే అర్థం లేని భయాలతో అంగ పరిమాణాన్ని పెంచే మందుల కోసం వైద్యులను కలుస్తూ ఉంటారు. కానీ అలాంటి మందులు ఎక్కడా ఉండవు. అరుదుగా కొందరు మగపిల్లల్లో చిన్న వయసులోనే అంగం మరీ చిన్నదిగా, పెరగకుండా ఉండిపోతుంది. తోటి పిల్లలతో పోల్చినప్పుడు ఆ తేడా స్పష్టంగా కనిపిస్తే వైద్యులను సంప్రతించాలి. అందుకు కారణాన్ని కనిపెట్టి, సరిదిద్దితే పిల్లల్లో అంగం తిరిగి పెరగడం మొదలుపెడుతుంది. ఇలా పెద్దల్లో సాధ్యం కాదు. కాబట్టి బూటకపు ప్రకటనలను నమ్మకండి. అలాగే అశ్లీల వీడియోలలో కనిపించే పురుషులతో పోల్చుకుని నిరాశ చెందకండి. ఆ వీడియోల్లో కనిపించేదంతా నిజం కాదు. మీకు ఇంకా సందేహం ఉంటే వైద్యులను సంప్రతించి సలహా తీసుకోండి.

డాక్టర్ రాహుల్ రెడ్డి,
ఆండ్రాలజిస్ట్,
ఆండ్రోకేర్ ఆండ్రాలజీ ఇన్‌స్టిట్యూట్
8332850090 (కన్సల్టేషన్ కోసం)



రసాయన చికిత్సలు

ఆయుర్వేదం

మనిషిలోని మౌలిక పదార్థాలైన పంచభూతాల సమతుల్యతను కాపాడటమే ఆరోగ్యం. అయితే మనిషి జీవన వ్యాపారాలు నడిపించడానికి వాయు, ఆకాశ దోషాలు కలిసిన వాతదోషం, అగ్ని-జలభూతాలు కలిసిన పిత్తదోషం, పృథ్వీ-జలాలతో కలిసిన కఫదోషం కీలక పాత్ర పోషిస్తాయి. వీటి ఆధారంగా నడిచే శరీరంలోని సప్తధాతువులు కాలానుగుణంగా, వయసును బట్టి మార్పు చెందుతూ ఉంటాయి. సృష్టి విచిత్రం ఏమిటంటే పంచభూతాలుగా పిలవబడే ఆకాశం, వాయువు, అగ్ని, జలం, పృథ్వీ ఈ పంచభూతాల్లో ఏ ఒక్కటీ స్వతంత్రంగా కాకుండా, ఒకదానితో ఒకటి కలవడం ద్వారా ఏర్పడతాయి. అయితే వివిధ కారణాల వల్ల ఈ పంచభూతాల మధ్య ఒక వైషమ్యం ఏర్పడి వాటి సమతుల్యత దెబ్బ తింటుంది. ఈ పరిణామం అనారోగ్యానికి మూలమవుతుంది. అనునిత్యం తీసుకునే ఆహారపానీయాల్లోగానీ, నివసించే పరిసరాల్లోగానీ, ఆచరించే నిత్యకృత్యాల్లోగానీ కొన్ని జాగ్రత్తలు పాటించడం ద్వారా పంచభూతాల నడుమ సమతుల్యత చెడకుండా చూసుకోవచ్చు. అది సాధ్యం కానప్పుడు పంచభూత సిద్ధాంతాన్నీ, ద్రవ్య గుణ, కర్మలను ఆధారం చేసుకుని కొన్ని మందులు ఇవ్వడం జరుగుతుంది.

- వాతావరణం లేదా రుతు ప్రభావాల వల్ల గానీ, లేదా వయసు కారణంగా గానీ, సమస్యలు తలెత్తినప్పుడు, రసాయన చికిత్సలు అవసరమవుతాయి.
- సాధారణంగా శరీరం బలహీనపడినప్పుడే వ్యాధులు వస్తాయి. ఈ స్థితిలో కూడా రసాయన చికిత్సలు ఎంతో ఉపకరిస్తాయి.
- రుతువుకూ రుతువుకూ మధ్యనుండే సంధికాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ. ఈ స్థితిలో రసాయన ఔషధాలను గృహవైద్యంగా గానీ, ఆయుర్వేద వైద్యుడి సలహాతో గానీ, తీసుకుని అనేక వ్యాధులు దరికి రాకుండా చూసుకోవచ్చు. ఒకవేళ వచ్చినా, తీవ్రత చాలా తక్కువగా ఉండి త్వరితంగా ఉపశమనం లభిస్తుంది.
- ప్రకృతి విధ్వంసం కారణంగా వచ్చే వ్యాధులను ఆయుర్వేద పరిభాషలో జన-పదోధ్వంస వ్యాధులు (ఎపిడెమిక్, ఎండెమిక్, పాండెమిక్) అంటారు. రుతు వైపరీత్యంలో వచ్చే వ్యాధుల్ని కాలజవ్యాధులు (సీజనల్ డిసీజెస్) అంటారు. గాలి, ఆహార పానీయాల కాలుష్యాలనుంచి కాపాడుకోవడం ఒక్కటే దీనికి పరిష్కారం.
- దేశకాల పరిస్థితులు, వయో పరిణామాలను అనుసరించి వాడుకోవడానికి అందుబాటులో ఉండే కొన్ని ఔషధాలను ఇక్కడ చెప్పుకోవచ్చు. ప్రత్యేకించి గృహవైద్యంగా వాడుకోగలిగే వాటిల్లో ఇవి చాలా ముఖ్యమైనవి.
- కాచి చల్లార్చిన నీళ్లు, బాగా చిలికిన మజ్జిగ, ఆవు పాలు. వీటిని తరుచూ తీసుకోవడం ఎంతో శ్రేష్ఠం.
- ఉదయం వేళ పరగడుపున ఉసిరికాయ పొడి లేదా రసం, తిప్పతీగె పొడి లేదా రసం, గుంట గలిజేరు పొడి లేదా రసం వీటిలో ఏదో ఒకటి రోజూ తీసుకోవడం వల్ల వ్యాధినిరోధక శక్తి పెరిగి ఆరోగ్యంగా ఉండవచ్చు.

ఇవికాకుండా, వైద్యుడి సలహా మేరకు అగస్త్య రసాయనం, శిలాజితు రసాయనం, కూష్మాండ రసాయనం, చ్యవన ప్రాశ రసాయనం తీసుకోవడం ద్వారా అనేక రోగాలను ఆమడ దూరంలో ఉంచవచ్చు.

నిరంతరం యోగాభ్యాసం చేయగలిగితే అసలు మందుల అవసరమే ఉండదు. ఒకవేళ తప్పనిసరి అయినా అతి స్వల్పకాలం, అతి తక్కువ మోతాదులో తీసుకోవడంతోనే ఆరోగ్యం చక్కబడుతుంది.

ప్రొఫెసర్ చిలువేరు రవీందర్
ప్రభుత్వ బి.ఆర్.కె.ఆర్. ఆయుర్వేద కళాశాల
హైదరాబాద్





సెక్సువల్ హెల్త్

అవి పూర్తి రక్షణ కల్పిస్తాయా?


ప్రశ్న: డాక్టర్! కండోమ్స్ అన్ని సుఖవ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయా? నా స్నేహితుడు ఒకరికి కండోమ్ వాడినా సుఖవ్యాధి సంక్రమించింది. ఇది ఎలా సాధ్యం?

(ఓ సోదరుడు, ఖమ్మం)



సెక్స్‌లో పాల్గొన్న ప్రతిసారీ (స్త్రీపురుషులు) కండోమ్ సక్రమంగా వాడితే లైంగిక వ్యాధులు సోకకుండా ఉంటాయి. అయితే సెక్స్ ద్వారా వైరస్‌లు ఒకరి నుంచి మరొకరికి సోకకుండా కండోమ్‌లు రక్షణ కల్పించినా, ఆ సమయంలో అనుసరించే ఇతర చర్యల వల్ల వ్యాధులు సంక్రమిస్తూ ఉంటాయి. ఉదాహరణకు, ఓరల్ సెక్స్ ద్వారా హెపటైటిస్ వైరస్ ఒకరి నుంచి మరొకరికి సోకుతుంది. అలాగే కొన్ని రకాల ఫోర్‌ప్లే ద్వారా కూడా వైరస్‌లు సోకుతాయి. హెర్పిస్ కారక పుండ్లు ఉన్న వ్యక్తితో సఖ్యతగా మెలిగినప్పుడు, చర్మం ద్వారా చర్మంలోకి చొరబడి వ్యాధిని కలుగజేస్తాయి. కాబట్టి పెళ్లికి ముందు అపరిచిత వ్యక్తులతో సెక్స్‌లో పాల్గొనకపోవడమే మేలు. పెళ్లి తర్వాత అక్రమ సంబంధాలు నెరపడం కూడా ప్రమాదకరమే! కండోమ్స్‌ను కూడా పూర్తిగా నమ్మలేం! నాణ్యత లేని కండోమ్స్ చిరిగిపోవచ్చు. కొన్నిసార్లు వదులై లోపలే జారిపోవచ్చు. కాబట్టి వాటి మీద భారం వేసి లైంగిక చర్యల్లో పాల్గొనడం ప్రమాదకరం. అన్ని రకాల లైంగిక వ్యాధులకూ సమూలంగా చికిత్స చేయలేం! కొన్ని దీర్ఘకాలం వేధించి ఆరోగ్యాన్ని కుదేలు చేస్తాయి. కొన్ని పుట్టబోయే పిల్లలకూ సంక్రమిస్తాయి. చికిత్స లోపిస్తే, పుట్టే పిల్లల్లో అవయవలోపాలను కలుగజేస్తాయి. కాబట్టి కండోమ్స్ విషయంలో సరైన అవగాహనతో మెలగాలి.

డాక్టర్ షర్మిలా మజుందార్,
సెక్సాలజిస్ట్ అండ్ సైకో అనలిస్ట్
mili77@gamil.com (కన్సల్టేషన్ కోసం)



వెయిట్ లాస్

బరువు తగ్గాలా?




శరీరం బరువు తగ్గించుకోవడం అన్నది ఎంతో మందికి మహా యజ్ఞమైపోయింది. అయితే, బరువు పెరగడానికి దారి తీసే వాటిలో పిండి పదార్థాలే (కార్బోహైడ్రేట్లు) అతి పెద్ద కారణమనే నిజాన్ని చాలా మంది గుర్తించడం లేదు. నిజానికి, ఆహారంలో వాటి నిష్పత్తిని గణనీయంగా తగ్గిస్తే శరీరం బరువు అనతి కాలంలోనే తగ్గిపోతుంది. కానీ, చాలా మందికి అదే సాధ్యం కాదు. ఎందుకంటే కొన్ని దశాబ్దాలుగా అన్నం, చపాతీలకు విపరీతంగా అలవాటు పడిన ప్రాణం, అవి లేని ఆహారం తీసుకోవడానికి ఎంత మాత్రం ఇష్టపడదు. ఇతరమైనవి ఎన్ని తిన్నా, చివరగా మళ్లీ అన్నం తినాల్సిందే! పైగా, పిండి పదార్థాలు త్వరత్వరగా అరిగిపోవడం వల్ల మళ్లీ మళ్లీ తినాలనిపిస్తుంది. ఫలితంగా ఏమవుతుంది? అవీ ఇవీ కలిసి శరీరం బరువు మునుపటి కన్నా మరికాస్త పెరుగుతుంది. అందువల్ల బరువు తగ్గాలనే బలమైన కాంక్ష ఏదైనా ఉంటే సహజమైన ఇష్టాఇష్టాలను కట్టడి చేయాల్సిందే. "పిండిపదార్థాలు తగ్గించడం సరే గానీ, వాటి స్థానాన్ని వేటితో నింపాలి?" అన్న ప్రశ్నకు, అమెరికన్ హార్ట్ అసోసియేషన్ వాళ్లు ఒక సైంటిఫిక్ సెషన్‌లో సమాధానం చెప్పారు. అందులో ప్రధానంగా బాదాం, జీడిపప్పు, వేరుశనగల వంటి పిడికెడు గింజ దాన్యాలు రోజూ తీసుకోవాలని స్పష్టం చేశారు. గింజ దాన్యాల్లో ప్రొటీన్ ఎక్కువగా ఉండడం వల్ల తొందరగా కడుపు నిండినట్లయి, పిండి పదార్థాల వైపు పెద్దగా మనసు వెళ్లదు. ఇదొక కారణమైతే, కార్బోహైడ్రేట్లతో పోలిస్తే వృక్ష సంబంధమైన ఈ తరహా ప్రొటీన్‌లకు బరువు పెంచే గుణం తక్కువ. ఏ రకంగా చూసినా పిండిపదార్థాలను బాగా తగ్గించుకుని గింజదాన్యాలు తినడం బరువు తగ్గే మంచి మార్గమని ఇటీవలి ఈ అధ్యయనాలు స్పష్టం చేశాయి. కాకపోతే గింజ ధాన్యాలను తీసుకునే క్రమంలో ఫైబర్ కోసం కీరా లాంటివి విధిగా తీసుకోవాలి. లేదంటే మలబద్ధకం ఏర్పడి మరో కొత్త సమస్య తలెత్తే అవకాశం ఉందంటున్నారు అధ్యయనకారులు.

తిరుప్పావై

జనార్దనా...
జయము! జయము!

ఇరవై నాలుగో పాశురం

అన్రివ్వులగ మళన్దాయ్! అడిపోట్రి
చ్చెన్రఙ్గుత్తెన్నిలఙ్గైశెత్తాయ్! తిఱల్ పోట్రి
పొన్రచ్చెగడ ముదైత్తాయ్! పుగళ్ పోట్రి
కన్రు కుణిలా వెఱిన్దాయ్! కళల్ పోట్రి
కున్రుకుడైయా వెడుత్తాయ్! గుణమ్ పోట్రి
వెన్రు పగైక్కెడుక్కుమ్ నిన్ కైయిల్ వేల్ పోట్రి
ఏన్రెన్రున్ శేవగమే యేత్తిప్పఱై కొళ్వాన్
ఇన్రియామ్ వన్దోమ్ ఇరఙ్గేలో రెమ్బావాయ్!


చిత్రం: కేశవ్ https://www.facebook.com/keshav61/

శ్రీకృష్ణుడు శయనమందిరం బయటికి వచ్చి, ఆస్థానంలో సింహాసనంపై ఆసీనుడివి కావాలని ఆండాళ్, ఆమె సఖులు అర్థిస్తున్నారు. దేవేరి నప్పిన్నాయ్‌తో సహా, కృష్ణుడు శయ్యను వీడి, సింహాసనంపై ఆసీనుడయ్యాడు. ఆయన సింహవిక్రాంత గతిని చూసి గోపికలు అద్భుతాశ్చర్యాలకు లోనయ్యారు. భగవానుడు, పిరాట్టి ప్రసాదించిన దర్శన సౌభాగ్యాన్ని కన్నులపండువగా దర్శించారు. వారి శ్రీచరణాలకు దృష్టిదోషం అంటకుండా మంగళాశాసనం పలికారు. ఆ తరువాత తాము అక్కడికి వచ్చిన కార్యం విన్నవించారు. శ్రీవ్రతం ఆచరించడానికి వ్రతోపకరణాలు అందజెయ్యాలని వేడుకున్నారు. నిరంతర కైంకర్యభాగ్యం ప్రసాదించమని ప్రార్థించారు. గోపికలు ప్రార్థించాక, కృష్ణుడు శయ్య మీద నుంచి లేచాడు. ఆయన తమ వంక వ్యాఘ్ర, సింహ, రిషభ గతులలో నడచి రావడాన్ని చూసిన గోపికలు ఆయన అడుగడుగుకూ మంగళాశాసనం సమర్పించారు.

తిరుప్పావైలో పొదిగిన మంగళాభరణం

"పూర్వం లోకాలను కొలిచి, మహాబలి మదాన్ని అణచిన నీ శ్రీపాదాలకు శుభమగుగాక! దృష్టిదోషం కలుగకుండు గాక! ఒకప్పుడు రామావతారంలో, దక్షిణ దిశలో ఉన్న లంకానగరానికి వెళ్లి, మహాపరాధి లంకేశ్వరుని సంహరించిన నీ వీరవిక్రమానికి మంగళమగు గాక! నిన్ను అంతం చెయ్యడానికి బండిచక్రం రూపంలో వచ్చిన శకటాసురుణ్ణి పాదతాడనంతో అంతమొందించావు. అలాంటి నీ యశస్సుకు జయమంగళం. దూడ రూపంలో నీకు ఆపద తలపెట్టిన వత్సాసురుణ్ణి కట్టె పుల్లను విసిరినట్టు తన్ని, ఆ సమయంలోనే కపిత్థాసురుణ్ణి తుదముట్టించిన దివ్యబాలుడివి. నీ పాదకింకిణులకూ, పవిత్ర చరణాలకూ జయమంగళం! గోప, గోగణాలను కుంభవృష్టి నుంచి కాపాడడానికి గోవర్ధన గిరిని గొడుగును ఎత్తినంత సులభంగాఎత్తి, కులరక్షణ చేసిన నీ అభయహస్తానికి శుభమంగళం! మహామహిమాన్వితమైన శూలధారివి నీవు. నీ శత్రువులను తుడిచివేసే ఆ దివ్యశూలానికి మంగళమగు గాక! నీ అద్భుత లీలలకూ, నిరుపమానమైన శౌర్యపరాక్రమాలకూ, పరమపావన శ్రీచరణాలకూ మంగళమగు గాక! మహానుభావా, మా ప్రార్థనా నమస్కారాలు సమర్పించి, వ్రతోపకరణమైన 'పఱ'ను (భేరీవాద్యం / ఢక్క) అర్థించడం కోసం నీ సన్నిధానానికి ఈ రోజు మేము వచ్చాం. మా పట్ల దయ చూపి, నిత్యకైంకర్య భాగ్యం ప్రసాదించు!" అని వారు వేడుకుంటున్నారు.

ఈ పాశురం తిరుప్పావై ప్రబంధంలో పొదిగిన మంగళాభరణం. తన తండ్రి విష్ణుచిత్తుని మాదిరిగానే... ఆండాళ్ ఈ పాశురంలో భగవానునికి 'పల్లాండు' అంటే మంగళాశాసనం గానం చేసింది. ఈ పాశురాన్ని సంప్రదాయపరులు రెండుసార్లు అనుసంధిస్తారు. నారాయణుడి విభవావతారమైన కృష్ణునికి ఈ పాశురంలో ఆండాళ్ మంగళాశాసనం పలుకుతోంది. శ్రీవైకుంఠంలో నిత్య కైంకర్యం ప్రసాదించమని అర్థిస్తోంది.

"మా మీద దయ చూపించు. శూలసదృశమైన నీ సంకల్పం మోక్షసిద్ధికి అవరోధాలైన ఆటంకాలన్నింటినీ నిర్మూలిస్తుంది. శూలం లాంటి తీక్షణమైన నీ సంకల్పానికి మంగళమగు గాక! శ్వేతఛత్రం కింద పరివేష్టించిన ఏకఛత్రాధిపతీ! సర్వేశ్వరుడివైన నీవు గోవర్ధనగిరి కింద విరాజమానుడవైన పరమపాద నాథునివి! నీకు సమస్త మంగళాలూ చేకూరు గాక! ప్రభూ, 'నీ లీలలు' అనే సుదర్శనచక్రం మా పాపపుణ్యాల చక్రాన్ని తుత్తునియలు చేస్తుంది. స్వర్గ-నరకాలకు కారణభూతాలైన అంతులేని మా మనోరథాలను (కోరికలను) నీ దండం అణచివేస్తుంది. అలాంటి ఆయుధాలకు జయము, జయము! నీ వ్యూహావతారాల ద్వారా... మోక్ష విరోధులను నిర్మూలించే వివేకాన్ని మాకు అనుగ్రహించే ఆచార్యసార్వభౌముడివి. సమస్తమైన సృష్టికీ కర్తగా విరాజిల్లుతూ, నీ శుభకరమైన చరణాలను మా ప్రపత్తి నిష్ఠకు సాధనంగా ప్రసాదించావు. మా కర్మేంద్రియాలనూ, జ్ఞానేంద్రియాలనూ, అన్ని కర్మలకు కారణమైన మనస్సునూ నిగ్రహించగల సమర్థుడివి నీవే. నీ చరణాల ముందర మేము అర్థించేది కేవలం కైంకర్యభాగ్యమే గాని మరొకటి కాదు! కరుణానిధీ, మా అభీష్టాన్ని నెరవేర్చు!" అని ఆండాళ్ కోరుతోంది.

ఆండాళ్ తిరువడిగళే శరణం!

● **శ్రీదేవీ మురళీధర్**

స్ఫూర్తి

ఆమె సంకల్పం... ఆకాశమంత!



రోజు పడవలో నది దాటి, దట్టమైన అడవి, కొండప్రాంతం గుండా నాలుగు కిలోమీటర్లు నడిచి వెళ్లి పిల్లలకు పాఠాలు చెబుతారామె. కేరళకు చెందిన ఉషాకుమారి 16 ఏళ్లుగా ఆ సాహసం చేస్తున్నారు. ఏకోపాధ్యాయ టీచరైన ఉషను లోయర్ ప్రైమరీ టీచర్ అర్హత కోర్సు చేయలేదనే కారణంతో కొద్దిరోజుల్లోనే ఉద్యోగం నుంచి తొలగించనున్నారు. 'నా ఉద్యోగం ముఖ్యం కాదు. ఇక్కడి వారికి మంచి జరగడం ముఖ్యం. రోడ్లు రావడం ముఖ్యం' అంటున్న ఉష తన ప్రయాణ విశేషాలు పంచుకున్నారిలా..

నేను ఉండేది తిరువనంతపురం జిల్లాలోని అంబూరి గ్రామంలో. నాకు ఆస్తమా ఉన్నప్పటికీ రోజు ఉదయాన్నే ఏడు గంటలకు స్కూటీ మీద కున్నాథుమల గ్రామానికి వెళ్తాను. అక్కడి 'కానీ' అనే గిరిజన తెగ పిల్లలకు పాఠాలు చెబుతా. కుంబిక్కల్ కడవు చేరగానే నది సమీపంలో స్కూటీ నిలిపి, పడవ నడుపుకుంటూ కొండ ప్రాంతం వరకు వెళ్తాను. అడవి మార్గం గుండా నాలుగు కిలోమీటర్లు నడక. దారంతా రాళ్లు, రప్పలతో అస్తవ్యస్తంగా ఉంటుంది.





ఒక్కదాన్నే అయినప్పటికీ చేతిలో చిన్న కర్ర పట్టుకొని ముందుకు సాగుతాను. స్కూలుకు చేరడానికి రెండు గంటలు పడుతుంది. మొదట్లో ఏనుగులు, చిరుత పులులు కనిపించేవి. వాటిని చూడగానే భయంతో పొదల వెనక దాక్కునేదాన్ని. ఆ రోజు స్కూలుకు కొంచెం ఆలస్యం అయ్యేది. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు పిల్లలకు పాఠాలు చెప్పేసి, ఇంటికి చేరే సరికి రాత్రి ఎనిమిదవుతుంది. మా స్కూల్లో ఒకటో తరగతి నుంచి నాలుగో తరగతి వరకు ఉంది. రోజు 14 మంది పిల్లలు వస్తున్నారు. స్కూలు భవనం లేకపోవడంతో కొన్నాళ్లు బండ రాళ్ల మీద, చెట్ల నీడన పాఠాలు చెప్పాను. 2000 సంవత్సరంలో స్కూలుకు పక్కా భవనం నిర్మించారు. వర్షం పడిన రోజు లేదా నాకు ఆరోగ్యం బాగాలేనప్పుడు ఇంటికి వెళ్లేదాన్ని కాదు. ఎందుకంటే మరుసటి రోజు స్కూలుకు రావడం కుదరదనే ఆలోచనతో అక్కడే పిల్లల ఇంట్లో ఉండేదాన్ని. ఇక్కడ చదువుకున్న పిల్లల్లో చాలామంది పట్టణంలో పదో తరగతి పూర్తిచేశారు. వారిలో కొందరు డిగ్రీ కూడా చేశారు. కొందరేమో వృత్తివిద్యా కోర్సులు చేసి, ఉపాధి పొందుతున్నారు. వారిని చూస్తే నా మనసుకు ఎంతో తృప్తిగా అనిపిస్తుంది.

నా ఉద్యోగం ముఖ్యం కాదు.

ఇటీవలే ప్రభుత్వం ఏకోపాధ్యాయ టీచర్ ఉన్న స్కూళ్లను రద్దుచేసి, వాటి స్థానంలో పాత వ్యవస్థను (ప్రైమరీ స్కూళ్లను) ప్రవేశపెట్టాలనే ఆలోచన చేసింది. నేను ప్రైమరీ స్కూల్లో చెప్పేందుకు కావాల్సిన అర్హత కోర్సు చేయలేదు. నేను ఉద్యోగం కోల్పోయే పరిస్థితి రావచ్చు. అయినా నాకేం బాధగా లేదు. సకాలంలో వైద్యం అందక చాలామంది చనిపోవడం చూశాను. ఇప్పుడు ఈ గూడేనికి రోడ్డు వస్తుంది. దాంతో ఎక్కువ మంది టీచర్లు వస్తారు. పిల్లల జీవితాలు బాగుపడతాయి. అది చాలు.






నేను పదోతరగతి చదివే రోజుల్లో (1980లో) కేరళలో గ్రంథాలయ ఉద్యమపితగా పేరుగాంచిన పి.ఎన్. ఫణిక్కర్‌తో కలిసి 'పెద్దవాళ్లకు కూడా చదువు' అనే కార్యక్రమంలో పాల్గొన్నాను. అప్పటి నుంచి నాకు సామాజిక కార్యక్రమాల మీద ఆసక్తి పెరిగింది. 1997లో జిల్లా ప్రాథమిక విద్యా కార్యక్రమంలో వలంటీర్‌గా చేరాను. 1999లో తిరువనంతపురం సమీపంలోని గిరిజన గ్రామాల్లో ప్రభుత్వం ఏకోపాధ్యాయ పాఠశాలల్లో నియామకాలు చేస్తుందని తెలుసుకొని, దరఖాస్తు పంపాను. అలా కున్నత్తుమలా స్కూలుకు టీచర్‌గా వచ్చాను. ఈ పదహారేళ్లలో పిల్లలు, నేను ఒక కుటుంబంలా మెలిగాం.

లీగల్ కౌన్సెలింగ్

నా ఇంట్లోంచి గెంటేశారు!

నాకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు. కూతురు పెళ్లయిపోయింది. కొడుకులిద్దరినీ ఎం.టెక్. చదివిస్తే... అమెరికా వెళ్లి, ఉద్యోగం చేస్తూ పదేళ్లుగా అక్కడే ఉండిపోయారు. నాలుగేళ్ల క్రితం నా భర్త రిటైరయ్యాక వచ్చిన డబ్బుతో ఒక ఇల్లు కొని దాన్ని నా పేరిట రిజిస్టర్ చేయించుకున్నాను. ఆ తర్వాత ఇద్దరు కొడుకులకు గిఫ్ట్‌డీడ్ రాసి పెట్టాను. అంతే తప్ప వారికి ఇంకా పొజిషన్ ఇవ్వలేదు. ఏడాది క్రితం నా చిన్న కొడుకు ఇండియాకు వచ్చి, పెళ్లి చేసుకుని అమెరికాలో ఉద్యోగం మానేసి ఇక్కడే ఒక ఉద్యోగం చూసుకుని మాతోనే ఉంటున్నాడు. అయితే ఈ ఇంటిని అమెరికా నుంచి తానొక్కడు పంపిన డబ్బుతోనే కొన్నానని, అందువల్ల ఆ మొత్తం ఆస్తి తనకొక్కడికే చెందాలంటూ గొడవ మొదలెట్టాడు. ఆరు మాసాల క్రితం నా భర్త చనిపోయాడు. ఆ తర్వాత గొడవను మరింత తీవ్రం చేశారు. నా కూతురును, మా బంధువులను మా ఇంటికి రాకుండా చేశారు. చివరికి నా కొడుకు, కోడలు, ఆమె తలితండ్రులు, ఆమె చెల్లెలు కలిసి రెండు మాసాల క్రితం నన్ను ఇంట్లోంచి బయటికి గెంటేశారు. నేను బయట చిన్న అద్దె ఇల్లు తీసుకుని అందులో ఉంటున్నాను. రిటైర్‌మెంట్ డబ్బులతో కొన్న కారణంగా వీళ్లు నాకు ఈ గతి పట్టించారు. ఈ స్థితిలో నన్ను ఏం చేయమంటారో చెప్పండి.

- బి. పార్వతమ్మ, ఉప్పల్.



మీరు ఇప్పుడు అనుభవిస్తున్నది గృహహింసే. గృహహింస చట్టం కోడళ్ల రక్షణకే కాదు అత్తల పరిరక్షణకూ ఉపకరిస్తుంది. ఈ విషయంలో మీరు మీ జిల్లా స్త్రీ - శిశు సంక్షేమ శాఖలోని ప్రాజెక్టు ఆఫీసర్‌కు దరఖాస్తు ఇస్తే వారు విచారణ జరుపుతారు. ముందు మిమ్మల్ని హింసిస్తున్న వాళ్లను పిలిపించి కౌన్సెలింగ్ ఇస్తారు. వాళ్లు వినిపించుకోకపోతే సంబంధిత మెజిస్ట్రేట్ కోర్టులో కేసు ఫైల్ చేస్తారు. అప్పుడు మీరు ఒక న్యాయవాదిని నియమించుకోవలసి ఉంటుంది. ఒకవేళ మీకు ఆర్థిక స్తోమత లేకపోతే, న్యాయస్థానమే ఒక న్యాయవాదిని నియమిస్తుంది. కోర్టువారు కేసు విచారించి, మీ పైన ఏరకమైన దాడి జరగకుండా, మీకు ప్రొటెక్షన్ ఆర్డర్ ఇస్తారు. మీ ఇంట్లోకి మీరు తిరిగి ప్రవేశించి అందులో నివాసం ఉండేందుకు రెసిడెన్షియల్ ఆర్డర్ కూడా ఇస్తారు. ఆ ఆర్డర్‌ను ప్రాజెక్టు ఆఫీసర్ మీ ప్రత్యర్థులకు చేరవేస్తారు. అప్పటికీ వారు మొండిగా వ్యవహరిస్తే, స్థానిక పోలీసుల ద్వారా మీకు పూర్తి స్థాయి రక్షణ కల్పిస్తారు. మీ భర్త స్వార్జితంతో కొన్న ఆస్థిని గిఫ్ట్‌గా రాసి ఇచ్చే అధికారం పూర్తిగా మీకు ఉంటుంది. అయినా మీరు రాసి ఇచ్చింది మీ కొడుకులకే తప్ప మరెవరికో కాదు. అలాంటప్పుడు వారు మిమ్మల్ని ప్రశ్నించే అధికారం ఎంత మాత్రం లేదు. ఈ విషయంలో మీ కొడుకు, కోడలే కాకుండా వారి తరపు వాళ్లెవరికీ మిమ్మల్ని ప్రశ్నించే అధికారం లేదు. అదే సమయంలో మీ కూతురును గానీ, ఆమె తాలూకు వాళ్లను గానీ, మీ ఇంటికి రాకుండా అడ్డుకునే అధికారం కూడా ఎవరికీ ఉండదు. ఆస్తిని గిఫ్ట్‌గా రాసి పెట్టారే తప్ప వారికి ఇంకా పొజిషన్ ఇవ్వలేదు కాబట్టి అతని పేరిట ఇచ్చిన గిఫ్ట్‌డీడ్‌ను క్యాన్సిల్ చేసే అధికారం కూడా మీకుంది. మీరు వెంటనే మీ జిల్లా స్త్రీ- శిశు సంక్షేమశాఖలోని ప్రాజెక్టు అధికారిని సంప్రదిస్తే సమస్య పరిష్కారమవుతుంది.



- టి. ఎల్. నయన్‌కుమార్
న్యాయవాది, హైదరాబాద్

డైలీ సుడోకు - 419

	3	4						7
	7		9					
1					7			
	4	6	2					5
7	9		6		8		3	1
8					4	6	2	
			4					3
					2		7	
5						8	1	

ఎలా పూరించాలి?

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. నిలువుగా, అడ్డంగానూ ప్రతీ లైనులోనూ 1 నుంచి 9 వరకు అంకెలను పూరించాలి. ఒకసారి పూరించిన అంకెను తిరిగి వాడకూడదు.

సుడోకు- 418 సమాధానం

9	1	4	7	3	8	6	5	2
3	5	8	4	6	2	1	9	7
7	2	6	5	9	1	8	4	3
5	4	1	8	7	3	9	2	6
8	9	7	6	2	4	3	1	5
6	3	2	9	1	5	4	7	8
2	6	3	1	4	7	5	8	9
4	7	5	3	8	9	2	6	1
1	8	9	2	5	6	7	3	4


తమన్నా, వెంకటేశ్, మెహరీన్, వరుణ్‌తేజ్

పర్‌ఫెక్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్!

- వెంకటేశ్

"నేను 'ఇంట్లో ఇల్లాలు వంటింట్లో ప్రియురాలు', 'మల్లీశ్వరి', 'నువ్వు నాకు నచ్చావ్' తర్వాత పూర్తిస్థాయి కామెడీ చిత్రం చేయలేదు. సంక్రాంతికి పర్‌ఫెక్ట్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ ఈ 'ఎఫ్2'. అనిల్ రావిపూడి ప్రతి పాత్రనూ బాగా డిజైన్ చేశాడు" అని వెంకటేశ్ అన్నారు. వరుణ్‌తేజ్‌తో కలిసి ఆయన నటించిన సినిమా 'ఎఫ్ 2'. ఫన్ అండ్ ఫ్రస్ట్రేషన్... అనేది ఉపశీర్షిక. 'దిల్'రాజు చిత్రసమర్పకులు. శిరీష్, లక్ష్మణ్ నిర్మాతలు. తమన్నా, మెహరీన్ హీరోయిన్లు. సంక్రాంతి సందర్భంగా ఈ నెల 12న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వరుణ్‌తేజ్ మాట్లాడుతూ "ముందునుంచీ డిఫరెంట్ జానర్ సినిమాలు చేస్తున్నాను. ఏదో ఒక సినిమాలో కామెడీ చేయాలనుకున్నా. అయితే... కెరీర్ మొత్తంలో చేయాలనుకున్న కామెడీని అనిల్ రావిపూడి ఈ ఒక్క సినిమాలో నాతో చేయించారు. వెంకటేశ్‌గారు కామెడీ ఇరగదీస్తారు. అందుకని, ఆయనతో నటించాలంటే ముందు కొంచెం టెన్షన్ పడ్డాను. కానీ, ఆయన ఇచ్చిన కంఫర్ట్ వల్ల సులభంగా నటించాను. థియేటర్లలో సినిమా చూస్తున్నంతసేపూ ఎవరూ సీట్లలో కూర్చోరు. పైకి లేచి మరీ నవ్వుతారు" అన్నారు. తమన్నా మాట్లాడుతూ "కొన్నేళ్ళ క్రితం నేను నటించిన ఓ సినిమా చూసిన 'దిల్ రాజుగారు... దాన్ని కొని విడుదల చేశారు. అప్పట్నుంచి నా జీవితంలో 'హ్యాపీ డేస్' వచ్చాయి. తర్వాత ఆయన సంస్థలో నటించాలని చాలాసార్లు అనుకున్నా. ఇప్పటికి కుదిరింది. వెంకటేశ్‌గారు కామెడీ టైమింగ్, యాక్టింగ్ ముద్దొచ్చాయి" అన్నారు. "రెండున్నర గంటల సినిమాలో చాలా నవ్వులున్నాయి. హీరో హీరోయిన్లు నలుగురి మధ్య ఉండే ఫన్, ఫ్రస్ట్రేషన్ నవ్వులు పూయిస్తాయి" అని అనిల్ రావిపూడి అన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మాత హర్షిత్‌రెడ్డి, నటీనటులు ఝాన్సీ, మాధవి, 'మిర్చి' కిరణ్, 'రచ్చ' రవి తదితరులు పాల్గొన్నారు.

నేనూ మాట్లాడగలను : 'దిల్' రాజు

"సంక్రాంతి సీజన్‌లో తెలుగు సినిమాలకు కాకుండా వేరే సినిమాలకు థియేటర్లు ఇచ్చే పరిస్థితి లేదు" అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. తమ సినిమాకు థియేటర్లు ఇవ్వడం లేదని ఆదివారం 'పేట' ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో నిర్మాత అశోక్ వల్లభనేని, తుమ్మల ప్రసన్నకుమార్ చేసిన వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. "అనువాద చిత్రానికి థియేటర్లు ఎలా అడ్జస్ట్ అవుతాయి? సంక్రాంతి బరిలో ఉన్న తెలుగు చిత్రాల విడుదల తేదీలు ఆరు నెలల క్రితమే ఖరారయ్యాయి. ఇప్పుడు ఏ నిర్మాత అయితే తనకు థియేటర్లు ఇవ్వడం లేదని కామెంట్స్ చేశారో... అదే నిర్మాత 'సర్కార్' సినిమాకు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడ ఎన్ని థియేటర్లు కావాలో... అన్ని థియేటర్లలో వేసుకున్నారు. ఇప్పుడు అనవసరమైన స్టేట్మెంట్లు ఇస్తున్నారు. తెలుగు సినిమాలను తగ్గించుకుని మిగతా సినిమాలను విడుదల చేయలేం కదా? ఈ నెల 18నుంచి థియేటర్లన్నీ తమ సినిమాకు అందుబాటులోకి వస్తాయని అతని తరఫున కొందరు అన్నారు. అదే నిజమైతే వారి సినిమాను 18న విడుదల చేస్తే సరిపోతుంది కదా! ఇవేవీ ఆలోచించకుండా... నోరు జారి పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడారు. మేమూ అటువంటి మాటలు మాట్లాడగలం. కానీ, నాకు ఒక క్యారెక్టర్ ఉంది. ఇక్కడ మనం చేస్తున్నది వ్యాపారం. వాళ్ళు సినిమా కొన్నది కూడా డబ్బు సంపాదించడానికే. మంచి సినిమాలు చేసి ప్రేక్షకుల నుంచి డబ్బులు తెచ్చుకోవాలని మేమూ వ్యాపారం చేస్తున్నాం. డిస్ట్రిబ్యూషన్‌లో నాకు ఎన్నో డబ్బులు పోయాయి. అయినా... సినిమాపై ఉన్న ప్రేమతో ప్రొడక్షన్, డిస్ట్రిబ్యూషన్ చేస్తున్నా. ఆరు నెలల క్రితం విడుదల తేదీలు ప్రకటించిన తెలుగు సినిమాలకు థియేటర్లు ఉండాలా? వద్దా? రామ్ చరణ్‌గారి సినిమా భారీ బడ్జెట్‌తో వస్తుంది. అటు 'యన్.టి.ఆర్' బయోపిక్, 'ఎఫ్ 2' ప్రతిష్టాత్మక చిత్రాలు. వీటికి థియేటర్లు అడ్జస్ట్ చేయలేక... రాజీ పడి మేం ఒక అండర్‌స్టాండింగ్‌తో వెళ్తున్నాం. మధ్యలో వచ్చి వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తే ఎలా?" అని అన్నారు.


కల్యాణ్‌రామ్, బాలకృష్ణ, విద్యాబాలన్ తదితరులు

కొత్త కోణాలను పరిచయం చేస్తాం!

- నందమూరి బాలకృష్ణ

"ఎన్.టి.ఆర్ అనే మూడు అక్షరాలు వింటే ప్రతి తెలుగు వాడి రోమాలు నిక్కబొడుచుకుంటాయి. ప్రజల హృదయాల్లో మరణం లేని మహామనిషి ఆయన" అని నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. నిమ్మకూరులో సోమవారం ఆయన పర్యటించారు. తన తల్లిదండ్రులు బసవతారకం, ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ "ప్రాచీనాంధ్రులకు గౌతమీపుత్రశాతకర్ణి మహానాయకుడైతే, ఆధునిక తెలుగు జాతి మహానాయకుడు ఎన్టీఆర్. ఆయన చరిత్ర, తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలు భావి తరాలకు అందించడమే లక్ష్యంగా బయోపిక్ తీశాం. ఎన్టీఆర్ బయోపిక్‌ను ఏ రాజకీయ పార్టీకి అనుకూలంగా తీయలేదు. ఆయన తెలుగుజాతి అంతటికీ ఆరాధ్యుడు. ఎన్టీఆర్ జీవితంలో సామాన్యులకు తెలియని ఎన్నో కోణాలు ఈ చిత్రం ద్వారా పరిచయం అవుతాయి. ఎన్టీఆర్‌కు జన్మనిచ్చిన నిమ్మకూరు గడ్డకు రుణపడి ఉన్నాం. చిత్రం విడుదలకు ముందు జన్మభూమిని సందర్శించి అమ్మా నాన్న, కుటుంబసభ్యుల ఆశీస్సులు తీసుకోవడానికి వచ్చాను. నిజజీవితంలో మాదిరే సినిమాల్లోనూ మహిళాభ్యుదయానికి పెద్దపీట వేశారు మా నాన్న. మహిళల సమస్యలే ఇతివృత్తాలుగా సమాజానికి ఎన్నో సందేశాత్మక చిత్రాలు అందించారు. ఎన్టీఆర్ విజయం వెనుక మా అమ్మ బసవతారకం చేసిన త్యాగం ఉంది. వారిరువురి నడుమ అనుబంధం తెరపై ఆవిష్కృతమవుతుంది. ఈ చిత్రంలో డిప్యూటీ స్పీకర్ మండలి బుద్ధప్రసాద్ ఆయన తండ్రి మండలి వెంకటకృష్ణారావు పాత్ర ధరించారు. మాజీ సీఎం కోట్ల విజయభాస్కరరెడ్డి పాత్రలో ఆర్టీసీ ఛైర్మన్ వర్ల రామయ్య కనిపిస్తారు. ఎందరో సినీ, టీవీ, నాటక రంగ కళాకారులు సినిమాలో పలు పాత్రల్లో జీవించారు. వారందరికీ ధన్యవాదాలు. మా అన్న హరికృష్ణ 17సంవత్సరాల వయస్సు వచ్చే వరకూ నిమ్మకూరులోనే పెరిగారు. కొమరవోలులోనూ మాకు అత్యంత సన్నిహిత బంధువులు చాలా మంది ఉన్నారు. వారందరితో మాట్లాడి పరిశోధనలు చేసి చిత్రాన్ని రూపొందించాం.

ఎన్టీఆర్ కాలం నుంచి మా కుటుంబాన్ని ఆదరిస్తున్న అభిమాన దేవుళ్లందరి ఆశీస్సులు చిత్ర విజయానికి దోహదపడాలి. ఈ చిత్రం కార్యరూపం దాల్చడంలో విష్ణు ఇందూరి, సాయి కొర్రపాటి పాత్రలు అద్వితీయం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నటి విద్యాబాలన్, హీరో కల్యాణ్ రామ్ తదితరులు పాల్గొన్నారు.

- గుడివాడ, (ఆంధ్రజ్యోతి)

సంపూర్ణంగా ఆస్వాదిస్తున్నా!

- అమల



"మాతృత్వాన్ని అటు వెండితెరమీద, కెమెరా వెనుక కూడా ఆస్వాదిస్తున్నా. నా వయసున్న మహిళలకు రాసే పాత్రల్లో పెద్దగా ప్రాముఖ్యత ఉండటం లేదన్నది అంగీకరించాల్సిన వాస్తవం. అయినా ఈ దశను కూడా ఆస్వాదించాలి. దర్శకుడు, రచయిత కనుక పాత్రకు ప్రాధాన్యం పెంచాలనుకున్నప్పుడు కాస్త బలమైన సన్నివేశాలను రాస్తున్నారు. అమ్మ పాత్రలు చిన్నవిగా ఉన్నప్పటికీ తృప్తిగా, సౌకర్యవంతంగా ఉంటున్నాయి" అని అన్నారు అమల అక్కినేని. ఓ వైపు నటిగా, మరోవైపు తల్లిగా, బ్లూ క్రాస్ నిర్వాహకురాలిగా తీరిక లేకుండా ఉంటున్న అమల అక్కినేని మాట్లాడుతూ "ఆ మధ్య 'కర్వాన్' కోసం ఆకర్ష్ ఖురానా నన్ను సంప్రదించినప్పుడు వద్దని చెప్పడానికి నాకు ఎలాంటి కారణాలు కనిపించలేదు. అలాగే ఈ ఏడాది ఓ వెబ్ సిరీస్‌లో ఓ ఆసక్తికరమైన పాత్రలో చేస్తున్నా. మంచి పాత్రలు వచ్చిన ప్రతిసారీ కెమెరా ముందుకు రావడానికి సిద్ధంగా ఉన్నా. మిగిలిన సమయాల్లో అర్థవంతమైన పనుల్లో నిమగ్నమవుతున్నా. మా బ్లూ క్రాస్‌కు పాతికేళ్లు పూర్తయ్యాయి. మా మావగారు అక్కినేని నాగేశ్వరరావుగారు నెలకొల్పిన ఫిల్మ్ స్కూల్ బాధ్యతలను నిర్వర్తిస్తున్నా. మావారు నాగార్జునగారు నా బలం. నా జీవిత ప్రయాణం సంతోషంగా, సుగమంగా సాగడానికి సిసలైన కారణం ఆయన. మేమిద్దరం కలిసి ఎక్కువగా ట్రావెల్ చేయడానికి ఇష్టపడతాం. 'మంచి పాత్ర వస్తే బావుంటుంది' అని నేను అనుకున్న ప్రతిసారీ నాకోసం ఏవో పాత్రలు ఎదురొస్తుంటాయి. వాటిని అందిపుచ్చుకోవడానికి నేనెప్పుడూ సిద్ధంగానే ఉంటా" అని అన్నారు.


తాప్సీ

షూటింగ్ జరుగుతున్న చోట జనాలు గుమిగూడటం మామూలే. అందులోనూ తమకు నచ్చిన హీరోగానీ, హీరోయిన్‌గానీ లొకేషన్‌లో ఉన్నారనే వార్త బయటకు పొక్కినప్పుడు మరింత రద్దీ ఉంటుంది. అయితే తాజాగా 'మిషన్ మంగళ్' యూనిట్ సభ్యులు తమ షూటింగ్ స్పాట్‌లో ఓ విషయానికి విస్మయం చెందారట. ఆ విషయాన్ని చిత్ర యూనిట్ మీడియాతో పంచుకుంది. ముంబైలోని గోర్గాన్-మలాడ్ బ్యాక్ రోడ్‌లో ఇటీవల 'మిషన్ మంగళ్' షూటింగ్ చేశారు. ఆ ప్రాంతంలో ఎక్కువగా జనసంచారం ఉండదు. అత్యధికంగా కాల్ సెంటర్లు ఉండటంతో నిశ్శబ్దంగా ఉంటుంది. అయితే

వచ్చింది.. మహిళాలోకం!

తాప్సీ స్పాట్‌లో ఉన్నారని తెలుసుకున్న మహిళలు అత్యధిక సంఖ్యలో షూటింగ్ లొకేషన్‌కు చేరుకున్నారట. తాప్సీని కలవాలనీ, ఆమెతో ఒక ఫొటో తీయించుకోవాలని యూనిట్ సభ్యులను కోరారట. ఇటీవలి కాలంలో అత్యధిక మంది మహిళా అభిమానులను సంపాదించుకున్న ఘనత తాప్సీకే సొంతమని, ఆమె కోసం మహిళాలోకం తరలి వచ్చిందని యూనిట్ సభ్యులు కితాబిచ్చారు. 'మిషన్ మంగళ్'ను ఆర్.బాల్కీ, అక్షయ్‌కుమార్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. జగన్ శక్తి దర్శకుడు. అక్షయ్‌కుమార్, విద్యాబాలన్, తాప్సీ, నిత్యామీనన్, సోనాక్షి సిన్హా కీలక పాత్రధారులు.



బెలూన్‌లో పైకెగిరిన 'ఇసైరాజా'

భారత సినీ సంగీత సామ్రాజ్యంలో తనపేరుని సువర్ణాక్షరాలతో లిఖించుకున్న ఇసైజ్ఞాని ఇళయరాజా 75వ వసంతంలో అడుగుపెట్టిన సందర్భంగా ఆయనకి గౌరవం చేకూర్చేలా తమిళ సినీ నిర్మాతల మండలి వచ్చే ఫిబ్రవరి 2, 3 తేదీల్లో 'ఇళయరాజా 75' పేరుతో చెన్నైలో భారీ సంగీత కార్యక్రమం నిర్వహించనుంది. ఆ కార్యక్రమానికి టిక్కెట్ల విక్రయాలను ఇళయరాజా ఆదివారం రాత్రి ప్రారంభించారు. పొంగల్ పండుగను పురస్కరించుకుని జనవరి 15 నుండి నిర్వహించనున్న ఇంటర్నేషనల్ బెలూన్ ఫెస్టివల్ సన్నాహాల్లో భాగంగా చెంగ్పట్టులో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఇళయరాజా, నిర్మాతల మండలి అధ్యక్షుడు విశాల్ హాట్‌ఎయిర్ బెలూన్‌లో పైకెగిరి వినూత్నంగా టిక్కెట్లు విక్రయించారు. సినీసంగీత వినీలాకాశంలో ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్న ఇళయరాజా బెలూన్‌లో పైకెగరడం చూసి ముచ్చటపడ్డారు. ఆయన హాట్‌ఎయిర్ బెలూన్‌లో ఎగరడం ఇదే తొలిసారట.

-ఆంధ్రజ్యోతి, చెన్నై

నిన్ను తలచి...


వంశీ యాకసిరి, స్టెఫీ పటేల్

వంశీ యాకసిరి, స్టెఫీ పటేల్ జంటగా నటించిన చిత్రం 'నిన్ను తలచి'. అనిల్ తోట దర్శకుడు. నేదురుమల్లి అజిత్‌రెడ్డి, ఓబులేశ్ నిర్మాతలు. ఈ సినిమా ఫస్ట్ లుక్, మోషన్ పోస్టర్ సోమవారం విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ "అందమైన ప్రేమకథతో రూపొందిన చిత్రమిది. చిత్రీకరణ పూర్తయింది. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఫిబ్రవరిలో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నాం" అన్నారు. నిర్మాత అజిత్‌రెడ్డి మాట్లాడుతూ "నిర్మాతగా నాకు, హీరో హీరోయిన్లకు, దర్శకుడికి తొలి చిత్రమిది. మంచి ప్రయత్నం చేశాం. ప్రేక్షకులు విజయంతో ఆశీర్వదిస్తారని ఆశిస్తున్నా" అన్నారు. ఈ కార్యక్రమంలో వంశీ, స్టెఫీ, పాటల రచయిత పూర్ణాచారి పాల్గొన్నారు.

'వనవాసం'లో ఏం జరిగింది?



"నాకు సినిమా టైటిల్ నచ్చింది. టైటిల్‌లా సినిమా కూడా బావుంటుందని ఆశిస్తున్నా" అని దర్శకుడు త్రివిక్రమ్ అన్నారు. పి. భరత్‌కుమార్ దర్శకత్వంలో బి. సంజయ్‌కుమార్ నిర్మించిన సినిమా 'వనవాసం'. నవీన్‌రాజ్ శంకరాపు, శశికాంత్, బందెల కారుణ్య, శ్రావ్య, శృతి హీరో హీరోయిన్లుగా పరిచయం అవుతున్నారు. త్రివిక్రమ్ చేతుల మీదుగా ఈ సినిమా ఫస్ట్ లుక్, టైటిల్ పోస్టర్ విడుదలయ్యాయి. "వాస్తవ సంఘటనల ఆధారంగా రూపొందిన చిత్రమిది. 'వనవాసం'లో ఏం జరిగింది? అనేది ఆసక్తికరం!" అన్నారు భరత్‌కుమార్. త్వరలో చిత్రాన్ని విడుదల చేయాలనుకుంటున్నామని నిర్మాత తెలిపారు. ఈ చిత్రానికి ఎం.ఎం. కుమార్ సంగీత దర్శకుడు.

కుంభమేళా కోసం జియో ప్రత్యేక యాప్

న్యూఢిల్లీ : అలహాబాద్‌లో ఈ నెల 15 నుంచి మార్చి 4 వరకు జరగనున్న కుంభమేళాలో ప్రత్యేకమైన సేవలను అందించనున్నట్లు రిలయన్స్ జియో ప్రకటించింది. ప్రపంచంలోనే అతిపెద్ద సమ్మేళనమైన కుంభమేళా కోసం ఫ్యామిలీ లొకేటర్, కస్టమైజ్ సర్వీసుల కోసం ప్రత్యేకమైన యాప్‌ను విడుదల చేసినట్లు తెలిపింది. జియో స్టోర్ నుంచి యాప్ కుంభ్ జియో ఫోన్‌ను డౌన్‌లోడ్ చేసుకోవటం ద్వారా ఈ సేవలను అందుకోవచ్చని పేర్కొంది. ఫ్యామిలీ లొకేటర్ ఫీచర్‌తో తీసుకువచ్చిన యాప్ ద్వారా కుటుంబ సభ్యులు, స్నేహితులు ఎక్కడ ఉన్నారో తెలుసుకోవటమే కాకుండా వారిని కలిసేందుకు తోడ్పాటునందిస్తుందని రిలయన్స్ జియో తెలిపింది. ఉత్తరప్రదేశ్ పోలీసులు, కాశ్ ఐటీతో జియో కలిసి పనిచేయనుందని పేర్కొంది.

నగదు లభ్యత ఓకే..

కొరత ఏర్పడితే సర్దుబాటు చేస్తాం.. మోతాదు మించితే దుష్పరిణామాలు


- **ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ వెల్లడి**
- **నేడు ఎన్‌బీఎఫ్‌సీ ప్రతినిధులతో భేటీ**

న్యూఢిల్లీ: ఆర్థిక వ్యవస్థలో ద్రవ్య అవసరాలను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నట్లు, ఒకవేళ కొరత ఏర్పడిన పక్షంలో తగిన చర్యలు చేపడతామని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీల (ఎన్‌బీఎఫ్‌సీ) రంగంలో ద్రవ్య కొరతపై ఓ అవగాహనకు వచ్చేందుకు మంగళవారం నాడు ఆ రంగ ప్రతినిధులతో ముంబైలో సమావేశం కానున్నట్లు దాస్ వెల్లడించారు. సోమవారం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ(ఎంఎస్ఎంఈ) రంగ ప్రతినిధులతో భేటీ అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆ సందర్భంగా గవర్నర్ ప్రస్తావించిన ముఖ్యాంశాలు..

- వ్యవస్థలో ద్రవ్య లభ్యతను ఆర్‌బీఐ నిరంతరం పర్యవేక్షిస్తుంటుంది. కొరత ఏర్పడినప్పుడు తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అయితే, అవసరానికి మించిన ద్రవ్య లభ్య పరిస్థితులు వాంఛనీయం కాదు. ఎందుకంటే, ద్రవ్య లభ్యత అవసరానికి మించితే దుష్పరిణామాలకు దారి తీయవచ్చు. కాబట్టి మార్కెట్ ద్రవ్య సరఫరాను జాగ్రత్తగా పరిశీలించి, అవసరమైన మేరకే సమకూర్చడం జరుగుతుంది.
- ఏదేని ఒక రంగంలో ద్రవ్య అవసరాలను ప్రస్తావించడం సరికాదు. ఎందుకంటే, నా వ్యాఖ్యలు ఈక్విటీ మార్కెట్ ట్రేడింగ్‌పై ప్రభావం చూపే అవకాశం ఉంది.
- డిసెంబర్-జనవరి నెలల్లో ఓపెన్ మార్కెట్ ఆపరేషన్స్ (ఓఎంఓ) ద్వారా రూ.60 వేల కోట్ల అదనపు ద్రవ్యాన్ని సమకూర్చనున్నట్లు ఆర్‌బీఐ ఇప్పటికే ప్రకటించడం జరిగింది. సంబంధిత మార్కెట్‌వర్గాలు అవసరాలపై సేకరించిన సమాచారం ఆధారంగా ఈ నిర్ణయం తీసుకోవడం జరిగింది.
- ఎన్‌బీఎఫ్‌సీ రంగ ప్రతినిధులతో ఆర్‌బీఐ సమగ్రంగా చర్చించనుంది. ఈ రంగంలో ద్రవ్య సమస్యలపై గడిచిన కొద్ది నెలల్లో పలు అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. కాబట్టి నేరుగా ఈ రంగ ప్రతినిధుల వైఖరిని తెలుసుకునేందుకే మంగళవారం సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.

పంట రుణాల మాఫీతో ప్రతికూల ప్రభావం

వ్యవసాయ రంగ రుణ మాఫీలు రుణ సంస్కృతి, రుణగ్రహీతల వైఖరిపై ప్రతికూల ప్రభావం చూపవచ్చని ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంత దాస్ అభిప్రాయపడ్డారు. ఈమధ్యనే అధికారంలోకి వచ్చిన మూడు రాష్ట్రాల ప్రభుత్వాలతోపాటు గడిచిన కొన్నేళ్లలో పలు రాష్ట్రాల ప్రభుత్వాలు వేల కోట్ల రూపాయల పంట రుణాలను మాఫీ చేశాయి. ఈ నేపథ్యంలో ఆర్‌బీఐ గవర్నర్ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఏ ప్రభుత్వమైనా పంట రుణాల మాఫీపై నిర్ణయం తీసుకునేముందు తమ ఖజానా పరిస్థితిని జాగ్రత్తగా పరిశీలించుకోవాలని దాస్ పేర్కొన్నారు. పంట రుణ మాఫీ ప్రకటించేందుకు ప్రభుత్వం వద్ద తగినన్ని నిధులు ఉన్నాయా అని ముందుగానే సమీక్షించుకోవాలన్నారు. ఈమధ్య ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగాయి. అందులో మధ్యప్రదేశ్, రాజస్థాన్, చత్తీస్‌గఢ్‌లో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వాలు మొత్తం రూ.1.47 లక్షల కోట్ల పంట రుణమాఫీ ప్రకటించాయి. 2017లో ఉత్తర ప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్ ప్రభుత్వాలు కూడా అక్కడి రైతులకు పెద్ద మొత్తంలో పంట రుణాలను మాఫీ చేశాయి. ఈ మధ్యనే కర్ణాటకలోని సంకీర్ణ ప్రభుత్వం కూడా రుణ మాఫీ ప్రకటించింది.



ఎంఎస్ఎంఈ ప్రతినిధులతో 2 గంటలపాటు భేటీ

ఎంఎస్ఎంఈ రంగ ప్రతినిధులతో శక్తికాంతదాస్ రెండు గంటలపాటు భేటీ అయ్యారు. ప్రస్తుతం ఈ రంగ పరిస్థితులను తెలుసుకోవడంతోపాటు ఈమధ్యనే వారి కోసం ప్రకటించిన రుణ పునర్వ్యవస్థీకరణ పథకం అమలుపై చర్చించేందుకే సమావేశమైనట్లు ఆయన చెప్పారు. "వారు ప్రస్తావించిన అంశాలన్నింటినీ నోట్ చేసుకోవడం జరిగింది. ఆ అంశాలను పరిశీలిస్తాం. అయితే, అందులోని పలు అంశాలు ప్రభుత్వ పరిధిలోనివి" అని దాస్ పేర్కొన్నారు. ఒత్తిడిలో ఉన్న ఎంఎస్ఎంఈలకు రూ.25 కోట్ల వరకు రుణాలను పునర్వ్యవస్థీకరించేందుకు గతవారం ఆర్‌బీఐ ప్రత్యేక పథకాన్ని ప్రకటించింది. అయితే, ఆచరణ సాధ్యత అంశాన్ని పరిగణలోకి తీసుకున్నాకే రుణాన్ని పునర్వ్యవస్థీకరించాలని బ్యాంకులను ఆర్‌బీఐ కోరింది.


ఎన్‌పీఏలు తగ్గుముఖం



బ్యాంకింగ్ రంగ పనితీరుపై ఆర్‌బీఐ గవర్నర్ సంతృప్తి వ్యక్తం చేశారు. బ్యాంకింగ్ రంగంలో ముఖ్యంగా ప్రభుత్వ బ్యాంకుల్లో మొండి బకాయిలు (ఎన్‌పీఏ) తగ్గుముఖం పట్టాయన్నారు. బ్యాంకింగ్ రంగంలో పాలనాపరమైన సంస్కరణలపై సంబంధిత వర్గాలతో సంప్రదింపులు మొదలుపెట్టామని అన్నారు. 2018 మార్చి చివరినాటికి రూ.9.62 లక్షల కోట్లకు చేరిన ఎన్‌పీఏలు సెప్టెంబర్ నాటికి రూ.23 వేల కోట్లకు పైగా తగ్గాయి.

నేను చెప్పేదేమీ లేదిక!

రూ.రెండు వేల నోటు ముద్రణ నిలిపివేతకు సంబంధించి మీడియా వర్గాలు అడిగిన ప్రశ్నకు ఆర్‌బీఐ గవర్నర్ స్పందిస్తూ.. "ఆర్థిక వ్యవహారాల డిపార్ట్‌మెంట్ ఇప్పటికే ఈ విషయంపై వివరణ ఇచ్చింది. అంతకుమించి నేను చెప్పేదేం లేదు" అని అన్నారు. పెద్ద నోట్ల రద్దు తర్వాత ప్రవేశపెట్టిన రూ.2,000 నోటు ముద్రణను ప్రస్తుతానికి నిలిపివేసినట్లు కేంద్రం ఈమధ్యనే సంకేతాలిచ్చింది.



వ్యవసాయ రుణ మాఫీ పిచ్చి ఆలోచన కాదు

రైతుల కడగండ్లు తీర్చే ఉపశమన సాధనం

బెంగళూరు: వ్యవసాయ రుణాల మాఫీని ప్రముఖ ఆర్థికవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత అమర్త్యసేన్ సమర్థించారు. కొంత మంది దీన్ని ఓట్లు దండుకునే ప్రజాకర్షక పథకాలుగా అభివర్ణించడపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతాంగాన్ని కొంతలో కొంతైనా ఆదుకునేందుకు ఈ 'రుణ మాఫీ'లు ఉపయోగపడతాయన్నారు. ఇన్ఫోసిస్ సైన్స్ ఫౌండేషన్ సమావేశాల్లో పాల్గొనేందుకు వచ్చిన అమర్త్యసేన్ ఒక వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయం చెప్పారు. అప్పుల ఊబిలో చిక్కుకున్న రైతాంగం కొన్ని ప్రత్యేక సమస్యలు ఎదుర్కొంటోందన్నారు. ఇందులో కొన్ని సమస్యలకు రైతులు కారణమైనా, వారిపట్ల సానుభూతి చూపాల్సిన అవసరం ఉందన్నారు. అయితే రుణ మాఫీ రైతులందరికి కాకుండా సన్న, మధ్యకారు రైతులకు మాత్రమే వర్తింపజేయాలన్నారు. ఏ కారణం చేతనైనా చిన్న కమతాల రైతులు సాగు చేయలేకపోతే, ఆ కమతాల నుంచి వచ్చే ఆదాయానికి సమానమైన మొత్తాన్ని వారికి సహాయంగా అందించాలన్నారు.

ఉపాధి అవకాశాలు

దేశ జనాభాలో ఇప్పటికీ ఎక్కువ మందికి వ్యవసాయ రంగమే జీవనాధారం కావడమూ ప్రస్తుత సమస్యకు కారణమని అమర్త్యసేన్ అన్నారు. పారిశ్రామిక రంగంలో చాలినన్ని ఉద్యోగ అవకాశాలు ఏర్పడకపోవడం సమస్యను మరింత తీవ్రం చేస్తోందన్నారు. యుపీఏ ప్రభుత్వంతో పోలిస్తే, ఎన్‌డీఏ హయాంలో ఉద్యోగాల కల్పన మరింత దెబ్బతిన్నట్టు చెప్పారు. విద్య, ఆరోగ్య విషయాల్లో అంతంత మాత్రంగానే ఉన్నా ఉద్యోగాల కల్పన విషయంలో యూపీఏ ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వం కంటే మెరుగ్గా ఉందన్నారు. ఉద్యోగాల కల్పన విషయంలో ప్రభుత్వానికి పెద్దగా ఆసక్తి కూడా లేదని విమర్శించారు. ఆర్థిక విస్తరణ 'మానవ సామర్థ్యం'పైనే ఆధారపడి ఉంటుందని అమర్త్య సేన్ స్పష్టం చేశారు. ప్రాథమిక విద్య, ఆరోగ్య విషయాలపై శ్రద్ధ పెట్టడం వలనే చైనా ఆర్థికంగా ప్రచండ శక్తిగా ఎదిగిన విషయాన్ని గుర్తు చేశారు.

రూ.40,000 కోట్ల మధ్యంతర డివిడెండ్!



ఈ ఏడాది మార్చి చివరికల్లా కేంద్ర ప్రభుత్వానికి ఆర్‌బీఐ రూ.30-40 వేల కోట్ల మేర మధ్యంతర డివిడెండ్ చెల్లించే అవకాశం ఉంది. ఈ విషయంపై తుది నిర్ణయం తీసుకున్నాక వెల్లడిస్తామని ఆర్‌బీఐ గవర్నర్ అన్నారు. అయితే, ఫిబ్రవరి 1న ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టే కంటే ముందే మధ్యంతర డివిడెండ్‌పై ప్రకటన వెలువడవచ్చని సమాచారం. పన్ను వసూళ్ల గణనీయంగా తగ్గిన నేపథ్యంలో అదుపు తప్పిన ద్రవ్యలోటును నియంత్రించుకోవడంలో ప్రభుత్వానికి ఈ డివిడెండ్ ఆదాయం కీలకం కానుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2018-19)లో ద్రవ్యలోటును జీడీపీలో 3.3 శాతానికి కట్టడి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. గత ఆర్థిక సంవత్సరం(2017-18)లో ఆర్‌బీఐ కేంద్రానికి రూ.10 వేల కోట్ల మధ్యంతర డివిడెండ్‌తో పాటు రూ.40 వేల కోట్ల తుది డివిడెండ్ కూడా చెల్లించింది. ఈ ఏడాది కూడా ఆర్‌బీఐని మధ్యంతర డివిడెండ్ కోరతారా అని ఈమధ్య మీడియా వర్గాలు అడిగిన ప్రశ్నకు ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి ఎస్‌సీ గార్గ్ 'అవును' అని సమాధానం ఇచ్చారు.

జీడీపీ వృద్ధి 7.2 శాతం

2018-19 సంవత్సర అంచనాను ప్రకటించిన సీఎస్ఓ

వృద్ధికి వ్యవసాయం, తయారీ రంగాల ఊతం

న్యూఢిల్లీ: భారత ఆర్థిక వ్యవస్థ అంచనాలకన్నా తక్కువ వృద్ధి రేటును నమోదు చేసుకునే అవకాశం ఉందని కేంద్ర గణాంకాల కార్యాలయం (సీఎస్ఓ) భావిస్తోంది. 2018-19 ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీలో వృద్ధి 7.2 శాతంగా నమోదుకావచ్చని పేర్కొంది. క్రితం ఆర్థిక సంవత్సరం (6.7 శాతం) కన్నా ఇది 0.5 శాతమే అధికం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో దేశ జీడీపీలో వృద్ధి 7.4 శాతంగా ఉంటుందని భారత రిజర్వు బ్యాంక్ అంచనా వేసింది. అయితే తాజాగా సీఎస్ఓ ప్రకటించిన అంచనాలు ఆర్‌బీఐ అంచనాకన్నా కాస్త తక్కువగా ఉన్నాయి. 2016-17లో జీడీపీ వృద్ధి 7.1 శాతం, 2015-16 లో 8.2 శాతంగా నమోదైంది. 2018-19 సంవత్సర జాతీయ ఆదాయం తొలి ముందస్తు అంచనాలను సీఎస్ఓ సోమవారం విడుదల చేసింది.

- ⇛ ఇందులోని వివరాల ప్రకారం.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్-సెప్టెంబరు మధ్యకాలంలో భారత ఆర్థిక వ్యవస్థ 7.6 శాతం వృద్ధిని నమోదు చేసింది. దీన్ని దృష్టిలో ఉంచుకుని అక్టోబరు-మార్చి మధ్యకాలంలో 6.8 శాతం వృద్ధికి అవకాశం ఉండవచ్చని సీఎస్ఓ భావిస్తోంది.
- ⇛ వ్యవసాయం, తయారీ రంగాల్లో పురోగతి జీడీపి వృద్ధికి దోహదపడనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వాస్తవ స్థూల విలువ జోడింపు (జీవీఏ) 7 శాతానికి పెరగవచ్చు. క్రితం ఆర్థిక సంవత్సరంలో ఇది 6.5 శాతంగా ఉంది.
- ⇛ వ్యవసాయ, అటవీ, చేపల వేటలో వృద్ధి 3.4 శాతం నుంచి 3.8 శాతానికి పెరగవచ్చు.
- ⇛ తయారీ రంగంలో వృద్ధి 5.7 శాతం నుంచి 8.3 శాతానికి చేరుకోవచ్చు.
- ⇛ మైనింగ్, క్వారీయింగ్ రంగంలో వృద్ధి రేటు మాత్రం 2.9 శాతం నుంచి 0.8 శాతానికి తగ్గవచ్చు.
- ⇛ ట్రేడ్, హోటళ్లు, ట్రాన్స్‌పోర్ట్, కమ్యూనికేషన్, బ్రాడ్‌కాస్టింగ్‌కు సంబంధించిన సర్వీసుల్లో వృద్ధి 8 శాతం నుంచి 6.9 శాతానికి తగ్గడానికి అవకాశం ఉంది.
- ⇛ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రక్షణ, ఇతర సర్వీసుల రంగాల్లో వృద్ధి తగ్గి 10 శాతం నుంచి 8 శాతానికి చేరవచ్చు.
- ⇛ ఎలక్ట్రిసిటీ, విద్యుత్, నీటి సరఫరా ఇతర యుటిలిటీ సర్వీసుల్లో వృద్ధి మాత్రం 7.2 శాతం నుంచి 9.4 శాతానికి పెరిగే అవకాశం ఉంది.
- ⇛ నిర్మాణ రంగంలో వృద్ధి 5.7 శాతం నుంచి 8.9 శాతానికి పెరగవచ్చు.
- ⇛ ఫైనాన్షియల్, రియల్ ఎస్టేట్, ప్రొఫెషనల్ సర్వీసెస్ రంగాల్లో వృద్ధి 6.6 శాతం నుంచి 6.8 శాతానికి పెరిగే అవకాశం ఉంది.



తలసరి ఆదాయం రూ.1,25,397

సీఎస్ఓ అంచనాల ప్రకారం.. 2018-19 సంవత్సరం లో తలసరి నికర జాతీయ ఆదాయం రూ.1,25,397గా ఉండనుంది. 2017-18 ఆర్థిక సంవత్సరం (రూ.1,12,835)తో పోల్చితే ఇది 11.1 శాతం అధికం.

- పెట్టుబడులకు ప్రామాణికంగా ఉండే స్థూల ఫిక్స్‌డ్ క్యాపిటల్ ఫార్మేషన్ (జీఎఫ్‌సీఎఫ్) ప్రస్తుత ధరల వద్ద రూ.55.58 లక్షల కోట్లుగా ఉంటుందని అంచనా. అంతకు ముందు ఆర్థిక సంవత్సరం (2017-18)లో ఇది రూ.47.79 కోట్లుగా ఉంది.
- స్థిర ధరల (2011-12) వద్ద ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో జీఎఫ్‌సీఎఫ్ రూ.45.86 లక్షల కోట్లు ఉంటుందని అంచనా. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో ఇది రూ.40.88 లక్షల కోట్లుగా ఉంది.
- జీడీపీ పరంగా ప్రస్తుత, స్థిర ధరల వద్ద జీఎఫ్‌సీఎఫ్ రేట్లు ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి వరుసగా 29.5 శాతం, 32.9 శాతంగా ఉంటుందని అంచనా. అంతకు ముందు ఆర్థిక సంవత్సరంలో ఇవి వరుసగా 28.5 శాతం, 31.4 శాతంగా ఉన్నాయి.
- ప్రస్తుత ధరల వద్ద ప్రభుత్వ తుది వినియోగ వ్యయం (జీఎఫ్‌సీఈ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం లో రూ.21.70 లక్షల కోట్లు ఉంటుందని అంచనా.

ఆరోగ్యకరమైన వృద్ధే : గార్గ్

సీఎస్ఓ అంచనా వేసిన 7.2 శాతం వృద్ధి ఆరోగ్యకరమైనదేనని ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి సుభాష్ చంద్ర గార్గ్ అన్నారు. అంతేకాకుండా భారత్ రానున్న కాలంలో కూడా ప్రపంచంలో అత్యంత వేగవంతంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగే అవకాశం ఉందన్నారు. జీఎఫ్‌సీఎఫ్ అంచనాలు పెట్టుబడులు పుంజుకున్నాయనడానికి సంకేతమని చెప్పారు. చాలా పరిశ్రమలు మంచి వృద్ధిని నమోదు చేసుకున్నాయని, ఇది ఆర్థిక వ్యవస్థ వృద్ధికి దోహదపడుతోందని తెలిపారు.

9 నెలలు.. రూ.8.74 లక్షల కోట్లు

14 శాతం పెరిగిన ప్రత్యక్ష పన్ను వసూళ్లు

న్యూఢిల్లీ: వర్తమాన ఆర్థిక సంవత్సరం తొమ్మిది నెలల కాలంలో (ఏప్రిల్-డిసెంబరు) ప్రత్యక్ష పన్ను వసూళ్లలో 14.1 శాతం వృద్ధి నమోదయింది. మొత్తం రూ.8.74 క్షల కోట్లు వసూలైనట్టు ప్రభుత్వం ప్రకటించింది. డిసెంబరు 31నాటికి రూ.1.30 లక్షల కోట్లు రిఫండ్‌గా ఇచ్చామని, గత ఏడాదితో పోల్చితే ఇది 17 శాతం అధికమని పేర్కొంది. ఇదే కాలంలో అడ్వాన్స్ టాక్స్ వసూళ్లు 14.5 శాతం పెరిగి రూ.3.64 లక్షల కోట్లకు చేరాయి. రిఫండ్లను సద్దుబాటు చేయగా నికరంగా ప్రత్యక్ష పన్ను వసూళ్లు 13.6 శాతం వృద్ధితో రూ.7.43 లక్షల కోట్లకు చేరినట్టు ప్రభుత్వం తెలియచేసింది. 2018-19 ఆర్థిక సంవత్సరానికి రూ.11.50 లక్షల కోట్ల ప్రత్యక్ష పన్ను వసూళ్లు బడ్జెట్‌లో లక్ష్యంగా నిర్దేశించగా 9 నెలల కాలంలో వసూలైనవి అందులో 64.7 శాతం మేరకు ఉన్నాయి. కార్పొరేట్ టాక్స్ వసూళ్లు 14.8 శాతం, ఆదాయపు పన్ను వసూళ్లు 17.2 శాతం పెరిగాయి. కాగా ఇదే కాలంలో అడ్వాన్స్ టాక్స్ వసూళ్ల విభాగంలో కార్పొరేట్ టాక్స్ వసూళ్లు 12.5 శాతం, ఆదాయపు పన్ను వసూళ్లు 23.8 శాతం పెరిగాయి.

సమ్మెకు బ్యాంకులు దూరం!

కోల్‌కతా: కేంద్ర కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన రెండు రోజుల సాధారణ సమ్మె ప్రభావం బ్యాంకు కార్యకలాపాలపై అంతగా పడే అవకాశాలు కనిపించటం లేదు. ఈ నెల 8, 9 తేదీల్లో దేశవ్యాప్త సమ్మెకు కార్మిక సంఘాలు పిలుపునిచ్చిన సంగతి తెలిసిందే. ఎస్‌బీఐకి దేశవ్యాప్తంగా 85 వేల శాఖలుండగా రెండు రోజుల సమ్మె కాలంలో బ్యాంకు కార్యకలాపాలు యధావిధిగా సాగే అవకాశం ఉందని యునైటెడ్ ఫోరమ్ బ్యాంక్ యూనియన్స్ కన్వీనర్ సిద్ధార్థ ఖాన్ తెలిపారు. ఎస్‌బీఐతో ఇతర జాతీయ బ్యాంకుల్లో కార్యకలాపాలు కొనసాగుతాయని భావిస్తున్నట్లు ఆయన చెప్పారు. తొమ్మిది సంఘాలతో కూడిన సమాఖ్యలో కేవలం రెండు యూనియన్లు మాత్రమే సమ్మెలో పాల్గొంటున్నాయని, దీంతో బ్యాంకింగ్ కార్యకలాపాలకు పెద్దగా విఘాతం కలగకపోవచ్చని ఆయన పేర్కొన్నారు. ఎస్‌బీఐ, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా సహా పలు బ్యాంకుల కార్యకలాపాలు యధావిధిగా సాగుతాయని ఆయన చెప్పారు. కాగా ఆర్‌బీఐకి చెందిన రెండు ఉద్యోగుల సంఘాలు కూడా సమ్మెకు మద్దతునిస్తున్నట్లు ప్రకటించాయి.

రూ.138 లక్షల కోట్ల గండి!

నిపుణుల కొరతపై యాక్సెంచర్ నివేదిక



న్యూఢిల్లీ: నిపుణుల కొరతను పూడ్చుకోలేకపోతే వచ్చే దశాబ్దకాలంలో ఆధునిక టెక్నాలజీలతో సమకూరనున్న 1.97 లక్షల కోట్ల డాలర్ల (రూ.138 లక్షల కోట్లు) జీడీపీ వృద్ధిపై భారత్ ఆశలు వదులుకోవాల్సిందేనని యాక్సెంచర్ తాజా నివేదిక అంటోంది. కృత్రిమ మేధ, అగుమెంటెడ్ లేదా వర్చువల్ రియాల్టీ, బ్లాక్ చైన్ వంటి ఆధునిక టెక్నాలజీలు కొత్త నైపుణ్యాల్లో వేగంగా, సమర్థవంతంగా, తక్కువ ఖర్చుతో శిక్షణ పొందేందుకు తోడ్పడగలవని సంస్థ పేర్కొంది. " మరింత అనుభవపూర్వక ఆన్ జాబ్ ట్రైనింగ్ అందించడంతోపాటు జాబ్ మార్కెట్ శరవేగ మార్పులకు లోనవుతున్నందున ఎప్పటికప్పుడు కొత్త నైపుణ్యాలను నేర్చుకునేలా ఉద్యోగులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. సరికొత్త విధానాల్లో శిక్షణకు డిజిటల్ టూల్స్‌తోపాటు కృత్రిమ మేధ, అనలిటిక్స్, బ్లాక్ చైన్ వంటి అప్లికేషన్లు ఎంతో కీలకం" అని యాక్సెంచర్ ఇండియా చైర్మన్, సీనియర్ ఎండీ రేఖా ఎం మీనన్ అన్నారు.

రూ.13,500 కోట్లకు ఆప్కాబ్ టర్నోవర్

గుంటూరు (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో ఆప్కాబ్ టర్నోవర్ రూ.13,500 కోట్లకు చేరుకుందని సంస్థ చైర్మన్ పిన్నమనేని వెంకటేశ్వర రావు తెలిపారు. సోమవారం నాడిక్కడ ఆప్కాబ్ 14 వ శాఖను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన సమయంలో సంస్థ టర్నోవర్ రూ.7,500 కోట్లుగా ఉండగా ఇప్పుడు రూ.13,500 కోట్లకు చేరిందని చెప్పారు. కాగా సీఆర్‌డీఏ పరిధిలోని నేలపాడులో ఆప్కాబ్ ప్రధాన కార్యాలయ నిర్మాణానికి ప్రభుత్వం మూడున్నర ఎకరాలు కేటాయించిందని ఆయన తెలిపారు. త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నూతన భవనానికి భూమి పూజ చేయనున్నారని చెప్పారు.

ఎరిక్సన్ ఫిర్యాదుపై అనిల్ అంబానీకి నోటీసులు

నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలన్న 'సుప్రీం'

న్యూఢిల్లీ: రిలయన్స్ కమ్యూనికేషన్స్ (ఆర్‌కామ్) చైర్మన్ అనిల్ అంబానీకి జస్టిస్ ఆర్‌ఎఫ్ నారిమన్ నాయకత్వంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం సోమవారం నోటీసులు జారీ చేసింది. కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారన్న ఎరిక్సన్ ఇండియా ఫిర్యాదుపై నాలుగు వారాల్లోగా సమాధానం ఇవ్వాలని ఆ నోటీసుల్లో కోరింది. తమకు చెల్లించాల్సిన రూ.550 కోట్ల బకాయిలను గత ఏడాది డిసెంబరు 15 నాటికి చెల్లించాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించినా, అనిల్ అంబానీ నాయకత్వంలోని ఆర్‌కామ్ ఇప్పటి వరకు చెల్లించలేదని ఎరిక్సన్ సుప్రీం కోర్టులో కోర్టు ధిక్కార పిటిషన్ దాఖలు చేసింది. ఇందుకు అనిల్ అంబానీతో పాటు, అడాగ్ గ్రూపునకు చెందిన మరో ఇద్దరు ఉన్నతాధికారుల దేశం విడిచి పోకుండా అరెస్టు చేసి జైల్లో పెట్టాలని కోరింది.

ఆర్‌కామ్ తరపున వాదించిన కపిల్ సిబల్, ముకుల్ రోహతగి, ఎరిక్‌సన్‌కు చెల్లించాల్సిన బకాయిల్లో రూ.118 కోట్లు వెంటనే చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నట్టు, మిగతావి తర్వాత చెల్లించేందుకు అనుమతించాలని కోర్టును కోరారు. దీంతో ఎరిక్‌సన్ కోర్టు ధిక్కార పిటిషన్‌పై నాలుగు వారాల్లో సమాధానం చెప్పాలని సర్వోన్నత న్యాయస్థానం అనిల్ అంబానీకి నోటీసులు జారీ చేసింది.

8కే రిజల్యూషన్‌తో ఎల్‌జీ డిస్‌ప్లే



లాస్‌ఏంజెల్స్‌లో జరుగుతున్న వార్షిక టెక్నాలజీ ప్రదర్శన 'సెస్ 2019'లో ఎల్‌జీ డిస్‌ప్లే ఆవిష్కరించిన ఓఎల్‌ఈడీ స్క్రీన్లు ప్రధాన ఆకర్షణగా మారిపోయాయి. ఇంతకు ముందెన్నడూ చూడని 8కే రిజల్యూషన్‌తో కూడిన 88 అంగుళాల ఓఎల్‌ఈడీ డిస్‌ప్లేతోపాటు 65 అంగుళాల 8కే ఓఎల్ఈడీ డిస్‌ప్లేను కూడా కంపెనీ ప్రదర్శించింది. అంతేకాకుండా 12.3 అంగుళాల ట్రాన్స్‌పరెంట్ ఓఎల్‌ఈడీని ఆటోమొబైల్ రంగం కోసం తెచ్చింది. 27 అంగుళాల నియో ఆర్ట్ డిస్‌ప్లే, 27 అంగుళాల 4కే మానిటర్‌తో పాటు లాప్‌టాప్స్ కోసం 13.3 అంగుళాల 4కే స్క్రీన్‌ను కూడా కంపెనీ ప్రదర్శనకు ఉంచింది.

చమురు అన్వేషణలో రూ.40 వేల కోట్లు

ధర్మేంద్ర ప్రధాన్ ఆశాభావం



న్యూఢిల్లీ: చమురు, సహజవాయు నిల్వల అన్వేషణకు ప్రవేశపెట్టిన ఓపెన్ యాకరేజ్ లైసెన్సింగ్ విధానం (ఓఏఎల్‌పీ) రెండో విడత కార్యకలాపాల్లో 14 బ్లాక్‌లలో రూ.40 వేల కోట్ల పెట్టుబడులు రావచ్చునని ప్రభుత్వం ఆశిస్తోంది. సోమవారం ఇక్కడ రెండో విడత బిడ్డింగ్‌ను ప్రారంభించిన సందర్భంగా ఆయిల్ శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ మాట్లాడుతూ గత ఏడాది 55 బ్లాక్‌లకు నిర్వహించిన తొలి విడత బిడ్డింగ్‌లో రూ.60 వేల కోట్ల పెట్టుబడికి కంపెనీలు ముందుకు వచ్చాయని చెప్పారు. కాగా 5 కోల్ బెడ్ మిథేన్ బ్లాకులు సహా మరో 12 బ్లాక్‌లలో అన్వేషణకు మూడో విడత బిడ్డింగ్ కూడా ఈ నెలలోనే ప్రారంభించే ఆస్కారం ఉన్నదని ఆయన అన్నారు. 2014 సంవత్సరంలో కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొన్ని చిన్న క్షేత్రాల్లోను, ఓఏఎల్‌పీ విధానం కింద మరికొన్ని క్షేత్రాల్లోను చమురు, సహజవాయువుల అన్వేషణకు రెండు విడతల వేలం పాటలు నిర్వహించగా రూ.1.20 లక్షల కోట్ల పెట్టుబడి ప్రతిపాదనలు వచ్చాయని ఆయన చెప్పారు. దేశంలో 28 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఎలాంటి తవ్వకాలు జరగలేదని గుర్తించిన ప్రభుత్వం 2017 సంవత్సరంలో ఆయా క్షేత్రాల్లో తమకు నచ్చిన బ్లాకులు ఎంచుకునే స్వేచ్ఛ కంపెనీలకు ఇస్తూ ఓఏఎల్‌పీ విధానం ప్రవేశపెట్టింది. ఈ ఓఏఎల్‌పీ రెండో విడత వేలంలో కృష్ణా గోదావరి బేసిన్‌లోని ఒక డీప్ వాటర్ బ్లాక్, అండమాన్, కచ్, మహానది బేసిన్లలోని 5 బ్లాక్‌లు, మరో 8 ఆన్‌లైన్ బ్లాక్‌లు ఉన్నాయి. వీటన్నింటిలోనూ కలిపి 1260.9 కోట్ల టన్నుల ఆయిల్ నిల్వలుంటాయని అంచనా.

ప్రైవేటు భాగస్వామ్యంపై నిర్ణయం చమురు కంపెనీలదే

దేశీయంగా ముడిచమురు ఉత్పత్తిని పెంచడం కోసం ప్రైవేటు, విదేశీ భాగస్వాములను చేర్చుకునే విషయంలో ఓఎన్‌జీసీ, ఆయిల్ ఇండియాకు స్వేచ్ఛ ఇస్తున్నట్టు ధర్మేంద్ర ప్రధాన్ తెలిపారు. అలాగే సంక్లిష్టమైన ప్రాంతాల్లో తవ్వకాలకు ప్రత్యేక ప్రోత్సాహకాలివ్వనున్నట్టు ప్రకటించారు. అయితే ఆ ప్రత్యేక ప్రోత్సాహకాలేవి అన్నది ఆయన వెల్లడించలేదు. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, ముంబై ప్రాంతాల్లోని క్షేత్రాల్లో ఓఎన్‌జీసీకి ప్రస్తుతం 3500 కోట్ల క్యూబిక్ మీటర్ల నిల్వలున్న క్షేత్రాలు చేతిలో ఉన్నాయి. ఆయిల్ ఇండియాకు కృష్ణా గోదావరి బేసిన్‌లో 300 కోట్ల క్యూబిక్ మీటర్ల నిల్వలున్న క్షేత్రాలు చేతిలో ఉన్నప్పటికీ ఉత్పత్తిని ప్రారంభించాలంటే అధిక ధర కావాలని ఆ సంస్థ కోరుతోంది.

సెన్సెక్స్	నిఫ్టీ	బంగారం	వెండి	రూపాయి డాలర్	ముడి చమురు
155.06 ↑	44.45 ↑	5 ↓	105 ↑		
35850.16	10771.80	31,880	38,905	69.68	58.27

ముంబై 10 గ్రాములు (99.9 స్వచ్ఛత)



111 రూట్లకు 15 ఎయిర్‌లైన్స్ పోటీ

న్యూఢిల్లీ: ఉడే దేశ్ కా ఆమ్ నాగరిక్ (ఉడాన్) పథకం కింద మూడో విడతగా చేపట్టిన వేలంలో భాగంగా 111 రూట్ల కోసం 15 ఎయిర్‌లైన్స్ కంపెనీలు బిడ్‌లను దాఖలు చేసినట్లు పౌర విమానయాన మంత్రిత్వ శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారి తెలిపారు. ఈ పథకం కింద విమాన టికెట్లను తక్కువ ధరలకు అందిస్తారు. అంతేకాకుండా చిన్న పట్టణాలకు విమాన ప్రయాణ సదుపాయాన్ని కల్పిస్తాయి. దీని వల్ల ఎక్కువ మంది విమాన ప్రయాణం చేసే అవకాశం ఉంటుందన్నది ప్రభుత్వ ఉద్దేశం. తాజా రౌండ్‌లో స్పైస్‌జెట్, ఇండిగో సంస్థలు 37 రూట్లు, 20 రూట్లకు బిడ్స్ వేశాయి.

గువహతికి మొదటి అంతర్జాతీయ విమానం!

ఉడాన్ పథకం కింద అస్సాం రాజధాని గువహతి తొలి అంతర్జాతీయ విమాన సర్వీసు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. గువహతి-ఢాకా, గువహతి-బ్యాంకాక్ రూట్లకు సంబంధించిన బిడ్స్‌ను ప్రభుత్వం ఖరారు చేసింది. ఇందుకు సంబంధించిన ఫైల్ విమానయాన శాఖ మంత్రి వద్ద ఉందని, ఆయన సంతకం చేయగానే ప్రకటన వెలువడుతుందని పౌర విమానయాన శాఖ ఉన్నతాధికారి ఒకరు తెలిపారు. గువహతి-ఢాకా, గువహతి-బ్యాంకాక్ రూట్లలో నడిచే విమానాల్లో కొన్ని సీట్లకు అస్సాం ప్రభుత్వం వరుసగా రూ.2,370, రూ.4,400 రాయితీని ఇవ్వనుంది.

ముగింపు నిలకడ

టెక్ వ్యూ

నిఫ్టీ సోమవారం కీలక నిరోధం 10800 స్థాయిని దాటి వెళ్లినా ఇంట్రాడే కరెక్షన్‌లో పడి రోజంతా అదే ధోరణిలో గడిపింది. చివరికి డే కనిష్ఠ స్థాయిలో క్లోజ్ కావడం అప్రమత్త ట్రెండ్ సంకేతం. కాని మద్దతు స్థాయిల కన్నా పైనే ఉన్నందువల్ల తక్షణ ముప్పు మాత్రం లేదు. ఇంకా మార్కెట్లో సైడ్‌వేస్ ధోరణి కొనసాగుతుంది. అనిశ్చిత ధోరణి కారణంగా గత కొద్దిరోజులుగా బ్రేకౌట్ సాధించలేకపోతోంది. ప్రధాన మద్దతు స్థాయిల్లో బలాన్ని ప్రదర్శించడం అవసరం.

మంగళవారం స్థాయిలివే...

నిరోధం : 10800 మద్దతు : 10700

- మరింత అప్‌ట్రెండ్ కోసం ఇంట్రాడే నిరోధం 10800 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 10850. ఆ పైన మాత్రమే మరింత పురోగమిస్తుంది. మరో ప్రధాన నిరోధం 11000.
- మైనర్ మద్దతు స్థాయి 10700 కన్నా దిగజారితే మరింత బలహీనతను ప్రదర్శిస్తుంది. ప్రధాన మద్దతు స్థాయి 10650. ఇక్కడ కూడా విఫలమైతే స్వల్పకాలిక కరెక్షన్‌లో పడుతుంది.
- బ్యాంక్ నిఫ్టీకి కీలక స్థాయి 27500 వద్ద రియాక్షన్ ఏర్పడినా మద్దతు స్థాయి 27000 కన్నా పైనే ఉంది.

■ వి.సుందర్ రాజా

మిడ్‌సెషన్ మెరుగు

ఆస్ట్రో వ్యూ


తిథి: పుష్య శుక్ల తదియ
నక్షత్రం: శ్రవణం
పునర్వసు, విశాఖ, పూర్వాభాద్ర నక్షత్ర జాతకులు, కుంభ, మిథున రాశులవారు అప్రమత్తంగా ఉండాలి.
నిఫ్టీ: 10771.80 (+44.45)
ట్రెండ్ మార్పు వేళలు: 10.05; 2.43; 3.14
ధోరణి: నిఫ్టీ ఫ్యూచర్స్ నిస్తేజంగా ప్రారంభమై 11.15 నుంచి 2.35 మధ్యలో మెరుగ్గా ట్రేడవుతూ 2.45 నుంచి చివరి వరకు తిరిగి నిస్తేజంగా మారే ఆస్కారం ఉంది.
ట్రేడింగ్ వ్యూహం : నిఫ్టీ ఫ్యూచర్స్ 11.15 సమయానికి ప్రారంభ స్థాయి/సగటు (ఎటిపి) కన్నా పైన ట్రేడవుతుంటే తగు స్టాప్‌లాస్‌తో లాంగ్ పొజిషన్లు తీసుకుని 2.30 సమయానికి క్లోజ్ చేసుకోవాలి. 2.45 తర్వాత ఎటిపి కన్నా దిగువకు వస్తే షార్ట్ పొజిషన్లు తీసుకుని ముగింపు సమయంలో క్లోజ్ చేసుకోవాలి.

నిరోధం: 10810, 10845

మద్దతు స్థాయిలు: 10730, 10695

ఇంట్రాడే ట్రేడింగ్‌కు ప్రారంభ స్థాయి కీలకం. అంత కన్నా దిగువన మాత్రమే షార్ట్ పొజిషన్లు శ్రేయస్కరం.
గమనిక: ఇది పూర్తిగా ఆస్ట్రోటెక్నికల్ అంశాల ఆధారంగా ఇచ్చిన సూచన. మార్కెట్ వాస్తవిక కదలికల ఆధారంగా నిర్ణయాలు తీసుకోవాలి.


■ డా.భువనగిరి అమరనాథశాస్త్రి
www.thefinanciala strologer.blogspot.in



బులియన్


బంగారం (10 గ్రాములు)	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	ప్రొద్దుటూరు	చెన్నై
24 క్యారెట్లు	32,700	32,650	---	32,450	31,900
క్రితం ముగింపు	32,660	---	32,850	31,430	31,700
22 క్యారెట్లు	30,280	30,020	---	30,030	30,440
క్రితం ముగింపు	30,240	---	30,220	30,090	30,240
వెండి (కిలో)	40,000	40,200	---	40,000	42,600
క్రితం ముగింపు	39,900	---	40,000	40,000	42,200

రిటైల్ (ఒక గుడ్డు) ధర రూ. 5.15 — నెక్ (100 గుడ్లు)



హైదరాబాద్	453	చిత్తూరు	453
వరంగల్	455	చెన్నై	460
విజయవాడ	453	నమక్కల్	445
గోదావరి	453	బెంగళూరు	452
విశాఖపట్నం	458	ముంబై	508

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	87	విజయవాడ	90
కరీంనగర్	87	గుంటూరు	91
వరంగల్	87	ఒంగోలు	92
మహబూబ్‌నగర్	87	చిత్తూరు	91
కర్నూలు	87	నెల్లూరు	91
విశాఖపట్నం	80	అనంతపురం	84
గోదావరి	86		

స్పెషాలిటీ ఔషధాలపై 'అరబిందో' ఫోకస్

మూడేళ్లలో 150 ఉత్పత్తులతో పోర్టుఫోలియో



న్యూఢిల్లీ: వచ్చే మూడు ఆర్థిక సంవత్సరాల్లో స్పెషాలిటీ పోర్టుఫోలియోలో 150కి పైగా ఉత్పత్తులు ఉండేలా దృష్టి పెట్టనున్నట్లు అరబిందో ఫార్మా వెల్లడించింది. ఈ ఉత్పత్తుల మార్కెట్ పరిమాణం 11,820 కోట్ల డాలర్లుగా ఉండనుందని, ఉత్పత్తుల వివిధీకరణలో భాగంగా సుమారు 150 ఉత్పత్తులు స్పెషాలిటీ పోర్టుఫోలియోలో ఉండే విధంగా చర్యలు తీసుకోనున్నట్లు ఇన్వెస్టర్ ప్రెజెంటేషన్‌లో అరబిందో ఫార్మా వివరించింది. ఈ స్పెషాలిటీ పోర్టుఫోలియోలో అంకాలజీ, హార్మోన్స్, బయోలాజిక్స్, టోపికల్స్, నాసల్స్, పెప్టైడ్స్, డిపోట్ ఇంజెక్షన్, ఇన్‌హేలర్స్, వాక్సిన్లు సహా మరికొన్ని ఉత్పత్తులు ఉండేలా చూస్తున్నట్లు పేర్కొంది. ప్రస్తుతం 147 ఉత్పత్తులు అభివృద్ధి దశలో ఉన్నాయని అరబిందో వివరించింది. ఇందులో 79 ఉత్పత్తులు అంకాలజీ, హార్మోన్లకు సంబంధించినవి కాగా 22 టోపికల్స్, 5 నాసల్స్, 14 పెప్టైడ్స్, 4 డిపోట్ ఇంజెక్షన్ విభాగానికి సంబంధించినవని పేర్కొంది. వీటితోపాటు ట్రాన్స్‌డెర్మల్ ప్యాచెస్‌కు సంబంధించి 8 ఉత్పత్తులు, ఇన్‌హేలర్ విభాగంలో 8, బయోలాజిక్స్‌లో 6, వాక్సిన్ విభాగంలో ఒక ఔషధం అభివృద్ధి దశలోనే ఉన్నాయని తెలిపింది.

అంకాలజీదే అగ్రస్థానం

స్పెషాలిటీ పోర్టుఫోలియోలోని అంకాలజీ, హార్మోన్స్ ఉత్పత్తుల మార్కెట్ పరిమాణమే 4,500 కోట్ల డాలర్లుగా ఉందని అరబిందో తెలిపింది. బయోలాజిక్స్ మార్కెట్ 3,500 కోట్ల డాలర్లు, పెప్టైడ్స్ 1,220 కోట్ల డాలర్లుగా ఉందని అరబిందో ఫార్మా తన ప్రెజెంటేషన్‌లో వివరించింది. కాగా ఇన్‌హేలర్స్ మార్కెట్ పరిమాణం 750 కోట్ల డాలర్లు, వ్యాక్సిన్లు 620 కోట్ల డాలర్లు, టోపికల్స్ 500 కోట్ల డాలర్లు, డిపోట్ ఇంజెక్షన్లు 360 కోట్ల డాలర్లు, ట్రాన్స్‌డెర్మల్ ప్యాచెస్ 320 కోట్ల డాలర్లు, నాసల్స్ 5 కోట్ల డాలర్లుగా ఉందని పేర్కొంది.

2019-20 నుంచి రాబడులు షురూ

అంకాలజీ, హార్మోన్స్ ఔషధాలు వచ్చే ఆర్థిక సంవత్సరం (2019-20) తొలి త్రైమాసికం నుంచి వాణిజ్యపరంగా అందుబాటులోకి రావటమే కాకుండా రాబడులు మొదలుకానున్నాయని అరబిందో తెలిపింది. కాగా పెప్టైడ్స్, టోపికల్స్, ట్రాన్స్‌డెర్మల్ ప్యాచెస్ ఔషధాల రాబడులు 2020-21 నుంచి, నాసల్స్ ఔషధాల నుంచి 2019-20, 2020-21లో రాబడులు రానుండగా, డిపోట్ ఇంజెక్షన్స్ ఔషధాలు, ఇన్‌హేలర్స్, బయోలాజిక్స్, వ్యాక్సిన్ల నుంచి మాత్రం 2021-22 ఆర్థిక సంవత్సరం నుంచి రాబడులు వస్తాయని అంచనా వేస్తున్నట్లు తెలిపింది.

మూడేళ్లలో అన్ని ఔషధాలకు అనుమతులు

వచ్చే మూడేళ్లలో అంకాలజీ, హార్మోన్స్, టోపికల్స్ విభాగంలోని అన్ని ఉత్పత్తుల అనుమతి కోసం దరఖాస్తు చేసేందుకు ప్రణాళికలు రచిస్తున్నట్లు అరబిందో ఫార్మా వెల్లడించింది. నాసల్స్‌కు సంబంధించి వచ్చే ఆర్థిక సంవత్సరం (2019-20)లో దరఖాస్తు చేయాలని చూస్తున్నట్లు తెలిపింది. కాగా పెప్టైడ్స్ విభాగంలో వచ్చే ఏడాదిన్నర కాలంలో ఐదుకు పైగా డీఎంఎఫ్ దాఖలు చేయాలని యోచిస్తున్నట్టు పేర్కొంది. డిపోట్ ఇంజెక్షన్, ఇన్‌హేలర్స్ విభాగంలో అన్ని ఔషధాలకు, బయోలాజిక్స్‌లో తొలి దశ ఉత్పత్తుల అనుమతి కోసం 2021-22నాటికల్లా దరఖాస్తు చేయాలని చూస్తున్నట్లు అరబిందో ఫార్మా తెలిపింది.

సెన్సెక్స్‌కు అంతర్జాతీయ దన్ను

కొనసాగిన రిలీఫ్ ర్యాలీ



దేశీయ స్టాక్ మార్కెట్లో వరుసగా రెండో సెషన్‌లోనూ లాభాలు నమోదయ్యాయి. కొనుగోళ్ల మద్దతు కొనసాగడంతో సెన్సెక్స్ 155.06 పాయింట్ల లాభంతో 35850.16 వద్ద, నిఫ్టీ 44.45 పాయింట్ల లాభంతో 10771.80 వద్ద ముగిశాయి. ఒక దశలో సెన్సెక్స్ 36000 పాయింట్లు, నిఫ్టీ 10,800 పాయింట్ల బెంచ్‌మార్క్‌ను అధిగమించాయి. అయితే ట్రేడింగ్ చివర్లో లాభాల స్వీకరణ అమ్మకాల ఒత్తిడి పెరగడంతో, సూచీలు ఆ స్థాయిలో నిలదొక్కుకోలేకపోయాయి. ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లన్నీ లాభాలతో ట్రేడవడం, సోమవారం భారత మార్కెట్‌కు బాగా కలిసొచ్చింది. ఈ సంవత్సరం వడ్డీ రేట్ల పెంపు జోరు పెద్దగా ఉండకపోవచ్చన్న అమెరికా కేంద్ర బ్యాంక్ ఫెడరల్ రిజర్వు చైర్మన్ పోవెల్ సంకేతాలు, వాణిజ్య యుద్ధం పరిష్కార దిశగా అమెరికా-చైనా మధ్య జరుగుతున్న చర్చలతో, ప్రధాన అంతర్జాతీయ మార్కెట్లన్నీ సోమవారం లాభాలతో ట్రేడయ్యాయి. దేశీయ మార్కెట్‌లో నిధుల లభ్యత (లిక్విడిటీ) పెరగడం, క్యూ3 ఆర్థిక ఫలితాలు బాగానే ఉండొచ్చనే అంచనాలు కూడా ఇందుకు తోడయ్యాయి. 'అంతర్జాతీయ సానుకూల అంశాలతోపాటు డాలర్‌తో రూపాయి మారకం రేటు పుంజుకోవడం, నిధుల లభ్యత పెరగడం, క్యూ3 ఆర్థిక ఫలితాలు బాగానే ఉంటాయన్న అంచనాతో కొన్ని ఎఫ్ఎంసీజీ, ఐటీ, ప్రైవేట్ బ్యాంకుల షేర్లలో కొనసాగిన కొనుగోళ్లు, మార్కెట్‌ను ముందుకు నడిపించాయి' అని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు.

ఏజీసీ నెట్‌వర్క్‌లో కొనసాగిన ర్యాలీ

ఐటీ కన్సల్టింగ్, సాఫ్ట్‌వేర్ కంపెనీ ఏజీసీ నెట్‌వర్క్స్ షేర్లలో ర్యాలీ సోమవారమూ కొనసాగింది. బీఎస్ఈలో ఈ కంపెనీ షేర్లు సోమవారం మరో 19.76 శాతం లాభంతో రూ.118.20 దగ్గర ముగిశాయి. గత నెల రోజుల్లోనే ఈ కంపెనీ షేర్ల ధర 97 శాతం పెరిగింది.

నష్టాల్లో బంధన్ బ్యాంక్, గృహ ఫైనాన్స్ షేర్లు

విలీన వార్తలతో బంధన్ బ్యాంక్, గృహ ఫైనాన్స్ కంపెనీల షేర్లు నష్టాల బాట పట్టాయి. బీఎస్ఈలో బంధన్ బ్యాంక్ షేర్లు 5.21 శాతం నష్టంతో రూ.501.10 దగ్గర, గృహ ఫైనాన్స్ కంపెనీ షేర్లు 3.86 శాతం నష్టంతో రూ.306.20 వద్ద ముగిశాయి.

సిమెంట్‌కు పెరగనున్న డిమాండ్

గృహ, మౌలిక వసతులే దన్ను



ముంబై: ధరల పరంగా కొంత ఒత్తిడి ఉన్నా, ఈ ఆర్థిక సంవత్సరం (2018-19), వచ్చే ఆర్థిక సంవత్సరం (2019-20) దేశీయ సిమెంట్ రంగం డిమాండ్‌కు ఢోకా ఉండదని రేటింగ్ సంస్థ ఇక్రా తెలిపింది. గిరాకీ ఈ ఆర్థిక సంవత్సరం (2018-19) ఏడు శాతం, వచ్చే ఆర్థిక సంవత్సరం (2019-20) ఎనిమిది శాతం మేర పెరుగుతుందని అంచనా వేసింది. గృహ నిర్మాణ రంగం ముఖ్యంగా గ్రామీణ గృహ నిర్మాణ రంగం, అందుబాటు ధరల్లో ఉండే గృహాలకు పెరుగుతున్న ఆదరణ, రోడ్లు, మెట్రో రైల్వేలు, సాగు నీటి ప్రాజెక్టుల వంటి మౌలిక సదుపాయాల ప్రాజెక్టులతో, సిమెంట్ డిమాండ్ వచ్చే రెండేళ్లలో 2.2 కోట్ల టన్నుల నుంచి 2.6 కోట్ల టన్ను ల మేర అదనంగా పెరగనుంది. ఇదే సమయంలో కొత్తగా 1.5 కోట్ల టన్నుల నుంచి 1.8 కోట్ల టన్నుల అదనపు ఉత్పత్తి సామర్థ్యం అందుబాటులోకి రానుంది.

ఉత్పత్తి సామర్థ్య వినియోగం

డిమాండ్ ఏడెనిమిది శాతం పెరిగినా, వచ్చే ఆర్థిక సంవత్సరం వరకు కంపెనీల ఉత్పత్తి సామర్థ్య వినియోగం 67 నుంచి 70 శాతం మించక పోవచ్చని ఇక్రా తెలిపింది. ఉత్పత్తి పెరిగినంత వేగంగా డిమాండ్ పెరగకపోవడం, ఇప్పటికే డిమాండ్‌ను మించి ఉత్పత్తి సామర్థ్యం ఉండడం... ఇందుకు ప్రధాన కారణం. దీని వల్ల ధరలపై ఒత్తిడి పెరిగి కంపెనీల లాభాలపైనా ప్రభావం చూపే అవకాశం ఉందని అంచనా వేసింది. గత ఏడాది ఆగస్టు నుంచి పెట్‌కోక్ ధర కొద్దిగా తగ్గింది. ఈ ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికంలో కంపెనీల ఆర్థిక ఫలితాల్లో ఈ ప్రభావం కనిపిస్తుందని ఇక్రా పేర్కొంది. అయితే గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే మాత్రం ఈ ఆర్థిక సంవత్సరం (2019-20) సిమెంట్ కంపెనీల ఇంధన, విద్యుత్ ఖర్చులు ఎక్కువగానే ఉంటాయని తెలిపింది.

బంధన్ బ్యాంక్ చేతికి గృహ ఫైనాన్స్


న్యూఢిల్లీ: గృహ రుణాలందించే సంస్థ గృహ ఫైనాన్స్‌ను కొనుగోలు చేస్తున్నట్లు బంధన్ బ్యాంక్ ప్రకటించింది. షేర్ల మార్పిడి ద్వారా ఈ ఒప్పందం జరగనున్నట్లు సోమవారం వెల్లడించింది. తాకట్టుపై రుణాలిచ్చే అతిపెద్ద సంస్థ హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్ ప్రమోట్ చేస్తున్న గృహ ఫైనాన్స్. అందుబాటు ధరల్లో ఉండే గృహాలకు (అఫర్డబుల్ హౌజింగ్) ఈ సంస్థ రుణాలు సమకూరుస్తుంది. ఈ విలీన ఒప్పందంలో భాగంగా గృహ ఫైనాన్స్ షేర్‌హోల్డర్లకు ప్రతి 1000 షేర్లకు బంధన్ బ్యాంక్‌కు చెందిన 568 షేర్లు లభించనున్నాయి. ప్రస్తుతం బంధన్ బ్యాంక్, గృహ ఫైనాన్స్‌ల మార్కెట్ విలువ రూ.59,800 కోట్లు, రూ.23,224 కోట్లుగా ఉంది.

BSE — బీఎస్ఈలో తెలుగు రాష్ట్రాల కంపెనీల షేర్లు

ACI INFOCOM .62(.62)1628
ADITYA SPIN. 7.44(7.83)281
AGRO TECH FO 603.8(606.25)270
AISHWARYA TE 2.8(2.7)1443
ALPHAGEO (I) 467.05(469.3)150
ALU FLUORIDE 123.05(122)2429
AMAR RAJA BA 735.65(724.1)17170
ANDHRA BANK 29.75(29.75)46812
ANDHRA CEMEN 5.8(5.8)11633
ANDHRA PETRO 68.8(63.6)214926
ASTRA MICRO 80.9(80.8)67913
AUROB PHARMA 723.6(725.4)38675
AVANTEL LTD 230.3(227.95)1947
AVANTI FEEDS 382.85(374.55)20763
B.N.RATHI SE 25.75(26.05)6924
BALAJI AMINE 448.5(450.75)2765
BAMBINO AGRO 192.45(192.15)356
BARTRONICSIN 7.5(7.2)16185
BCG 2.69(2.67)55074
BHAGIRA.CHEM 429(433.4)942
BHAGYA INL 34(33.5)1261
BHARATFIN 993.3(989.3)24305
CAMBRIDGE 50.65(46.25)86600
CCHHL 7.49(7.65)10221
CCL PRODUCTS 267.65(269.7)1341
CELESTIAL 8.52(8.38)1211
COROM INTER 462.9(468.8)10881
CUBEX TUBING 15(14.4)3000
CYBERMATE 2.25(2.36)41612
CYIENT 608.25(608.7)5663
DANLAW TECH. 103.35(105)608
DECAN CEMENT 402.15(398)480
DHAN ROTO SP 29.45(28.1)780
DIAMONPOWER 1.52(1.59)6775
DIVI'S LAB. 1483.7(1458.7)26232
DIVYA.GRANIT 85.05(84)602
DR.REDDY'S 2556.55(2601.65)57321
EVEREST ORG. 113.65(105)5437
FACOR ALLOYS 2(2.08)33406
FOURTH GEN. 1.9(2)563
GATI LTD. 84.65(83.65)40964
GAYATRI PROJ 177.8(178.25)1019
GENNEX LAB 3.7(3.69)25498
GMR INFRASTR 15.85(15.85)56976
GODAVARI DRU 23.1(22.9)1039
GOLDSTONE EN 16.15(16.25)2619
GRANULES (I) 88.65(89.85)32124
GVK POWERINF 7.77(7.82)293153
HBL P SYS 27.4(27.55)14609
HERITGFOOD 527.9(521.5)1497
HIND.FLUROCA 16.3(16.85)850
IKF TECHNO .28(.29)39650
INCAP LTD. 40(40.95)152
IPAPPM 448.35(451.1)4009
IVRCL LTD 1.01(1.02)51744
KAKATIYA CEM 197.15(198)781
KALLAM 18.35(18.2)2360
KAVERI SEED 546.55(550.05)18903
KCP LTD 90.9(89.85)4133
KERNEX MICRO 23.75(23.15)352
KNR CONST 217.5(217.65)8927
LOKESH MACH 45.5(45.45)5783
LOTUS CHOC 24.15(24.05)1816
MADHUCON PRJ 6.64(6.6)5200
MOLD-TEK TEC 44.05(43)676
MOSCHIP SEMI 23.5(24.15)22862
MSR INDIA 12.63(12.07)11578
NACLIND 28(27.45)3217
NATCO PHARM 692.45(702.95)5270
NCC 88.1(88.9)616781
NEHA INTER. 4.43(4.32)4567
NETTLINX LTD 51.65(52.3)22898
NEULAND LAB. 488.25(486.3)394
NIHAR INFO 15(14.75)103
NILE LTD. 376.45(377.35)463
NTL 1.05(1)500
OIL COUNTRY 16.2(16.2)2005
OLECTRA 242.7(241.9)18433
PADMALAYA TE 2.48(2.38)2605
PALRED 43.55(42.65)1824
PANYAM CEMEN 13.55(13.7)4363
PENNAR STEEL 37(36.55)4979
PHYTOCHEM I. 47.75(46.5)509
PITTIENG 66.85(68.45)4965
POKARNA LTD 158.8(154.55)585
PRAJAY ENGS. 8.85(8.75)4615
PREMIER EXPL 242.2(246.05)2389
PRSMJOHNSN 87.6(90.3)35973
RAIN 121.35(127.15)138583
RAJ PACKAGIN 28(27.75)355
REG.CERAMIC 3.55(3.53)10
RESTILE CER. 3.8(3.74)6090
SAGAR CEM. 668.55(673.05)292
SAMKRG PIST. 189.25(187.5)913
SANGHI IND. 60.95(60.7)3905
SATVAH.ISPAT 9.65(9.8)6103
SAVEN TECHNO 26.35(25.15)7736
SIBAR AUTO 33.75(34.9)601
SMPL .39(.39)6161
SMS PHARMACE 71.7(70.75)1381
SREE RAYALA 151.5(155.45)599
STEEL EXCH 14.8(14.8)3290
SURANATP 4.75(4.6)2002
SURYACHAKRA .37(.37)1390
SURYAMBA SP 68.25(70)200
SURYLAK.COTT 43(42.75)1708
SUVEN LIFE S 230.65(232.55)11669
TAJ GVK HOTL 174.6(172.6)14
TANLA 30.65(31.25)4846
TCI INDUS. 715(688.1)23
TRANSCORP IN 22.35(22.25)7657
TRANSGENE BI 3.55(3.51)18341
TRANSPORT CO 284.6(282.9)7885
USHER AGRO 2.27(2.38)5000
VICEROY HOTE 4.87(5)24032
VIJAY TEXTIL 42.2(41.6)557
VIMTA LABS 303.65(306.6)5883
VIRAT CRANE 33.55(34.45)268
VIRINCHI 81.75(81.5)7319
VISAKA IND. 431.75(423.15)2394
VISTA PHARMA 28.9(30.4)23295
VIVIMED LABS 35.9(36.1)37323
VST INDUS. 3231.4(3069.5)142
WATERBASE 161.6(159.6)28328
XLENERGY 1.02(1.07)1
ZEN TECH 73.8(73.25)1198
ZENOTECH 35.6(36.1)1867

ఎన్ఎస్ఈ-500 NSE — షేర్ల ప్రస్తుత, క్రితం ముగింపు ధరలు, వాణిజ్య పరిమాణం వరుసగా

AARTIDRUGS 580.1(572.4)4004
AARTIIND 1471.8(1463.35)58991
ABAN 73.65(73.25)312744
ABB 1301.8(1303.65)30115
ABFRL 207.15(198.45)2573635
ABGSHIP 1.95(1.9)48330
ACC 1477.95(1469.1)438357
ADANIENT 151.25(152.55)2714218
ADANIPORTS 381.65(382.15)1260331
ADANIPOWER 50.35(50.05)8717066
ADANITRANS 199.8(200.1)69516
AEGISCHEM 209.1(208.4)147443
AHLUCONT 336.55(321.8)177151
AIAENG 1658.65(1648.45)9899
AJANTPHARM 1177.4(1129.1)389485
AKZOINDIA 1796.7(1785.8)37292
ALBK 46.15(46.7)2566539
ALLCARGO 106.1(106.65)40377
ALOKTEXT 3.85(3.9)3213093
AMARAJABAT 735.55(723.65)351507
AMBUJACEM 218(216.55)1280088
AMTEKAUTO 3.1(3.25)53520
ANANTRAJ 35.85(34.7)869727
ANDHRABANK 29.85(29.85)1041266
APARINDS 637.6(646)5895
APLLTD 581.9(579.1)9385
APOLLOHOSP 1282.1(1293)69314
APOLLOTYRE 230.15(233.4)929054
ARVIND 96.1(96.55)908212
ASHIANA 119.85(118.5)78491
ASHOKA 127.05(126.4)43369
ASHOKLEY 93.45(96.8)34348346
ASIANPAINT 1396(1385.85)1074373
ASTRAL 1139.65(1178.9)621393
ASTRAZEN 1468.45(1466.5)8036
ATUL 3449(3459.85)30030
AUROPHARMA 724.75(725.85)1413246
AXISBANK 637.45(619.6)11735286
BAJAJ-AUTO 2658.55(2734.2)462215
BAJAJCORP 384.55(382.5)139651
BAJAJELEC 494.05(490.05)146116
BAJAJFINSV 6407.15(6410.45)103217
BAJAJHIND 9(9.1)2101433
BAJAJHLDNG 2953.8(2951.65)4452
BALKRISIND 883(891.8)302648
BALLARPUR 5.4(5.45)218800
BALMLAWRIE 200.65(200.15)37318
BALRAMCHIN 108(109.2)2706995
BANKBARODA 122.7(121.7)14244449
BANKINDIA 106.4(108.7)8123090
BASF 1535.45(1543.6)2263
BATAINDIA 1125.1(1116.5)740031
BBTC 1312.75(1297.85)565622
BEML 910.75(880.6)634171
BERGEPAINT 318.1(323.1)4258530
BFUTILITIE 232.75(220.55)2126888
BGRENERGY 61(59.95)36970
BHARATFIN 991.7(988.65)647501
BHARATFORG 479.7(487.15)4043811
BHARTIARTL 324.95(322.45)4966909
BHEL 72.25(71.4)8163279
BIOCON 620.65(618.55)535308
BIRLACORPN 575.8(585.65)32710
BLISSGVS 166.2(162.45)799087
BLUEDART 3320.3(3348.85)2198
BLUESTARCO 615.25(621.55)6989
BOMDYEING 110.9(111.1)693062
BOSCHLTD 19510.4(19438.75)8827
BPCL 355.55(359.45)2895410
BRFL 9.1(9.35)165948
BRIGADE 211.6(212.8)59762
CADILAHC 348.9(344.2)516834
CANBK 278.25(282.95)3551975
CARERATING 984.5(976.2)65903
CASTEXTECH 1.15(1.15)207587
CASTROLIND 150.55(148.25)1665037
CCL 265.25(270.8)34144
CEATLTD 1284.8(1309.55)390250
CENTRALBK 35.35(35.75)661375
CENTURYPLY 172.75(171.3)91297
CENTURYTEX 905.15(908.35)360208
CERA 2608.25(2465.4)5758
CESC 653.7(656.45)340481
CHAMBLFERT 157.1(155.25)184367
CHENNPETRO 284(288.3)228690
CHOLAFIN 1197.65(1207.6)240466
CIPLA 514.05(512.8)1168002
CLNINDIA 409(410.55)10704
COALINDIA 234.5(236.5)7347326
COLPAL 1303(1310.1)416743
COROMANDEL 464.3(469.55)172409
CORPBANK 28.7(29.05)124220
COX&KINGS 167.25(171.2)18089
CRISIL 1639.8(1626.4)6337
CUB 190.1(195)354031
CUMMINSIND 842.15(831.9)376036
CYIENT 609(609)38873
DABUR 420.45(419.25)1394010
DBCORP 168.1(167.85)15353
DBREALTY 33.3(30.65)3475776
DCBBANK 174.15(173.8)2810693
DCMSHRIRAM 352.05(347.6)39623
DEEPAKFERT 144.35(143.25)760701
DELTACORP 260.3(259.05)2677768
DEN 70.15(70.35)79078
DENABANK 13.7(14.3)4510939
DHANUKA 418(428.6)19894
DHFL 228.8(238.05)6243654
DISHTV 41.6(39.35)17953610
DIVISLAB 1486(1460.5)456830
DLF 179.8(175.15)10127291
DREDGECORP 460.75(436.45)284548
DRREDDY 2558.65(2600)542415
DYNAMATECH 1470.15(1458.95)270
ECLERX 1069.95(1074.4)1113
EDELWEISS 182.9(182.25)2698023
EICHERMOT 19830.4(20103.6)215668
EIDPARRY 214.7(208.05)117928
EIHOTEL 187.25(188.15)519497
ELECTCAST 21.2(21.05)169455
ELGIEQUIP 249.6(252.45)9465
EMAMILTD 418.7(418.75)50930
ENGINERSIN 125.7(126.9)949595
EROSMEDIA 84.8(84.15)134982
ESSDEE 20.55(21.55)16090
EVEREADY 182.55(182.05)77023
EXIDEIND 262.35(258.75)904616
FCONSUMER 44.25(44.4)860611
FDC 172.55(173.7)22725
FEDERALBNK 94.6(94.8)6098289
FINCABLES 450.8(451.85)15936
FINPIPE 530.15(533.5)8782
FLFL 395.95(390.2)29281
FORTIS 139.9(140.3)578155
FSL 46.85(46.8)943404
GAIL 357.1(353.15)1704243
GATI 84.6(83.7)21863
GDL 121.35(121.9)60023
GEPIL 820.85(815.9)2177
GESHIP 309.3(319.45)42004
GET&D 306.15(303.1)31283
GILLETTE 6485.65(6494.15)4727
GLAXO 1457.9(1450)8561
GLENMARK 653.65(664.25)1079160
GLOBOFFS 13.85(13.7)7026
GMDCLTD 86.95(89.45)87602
GMRINFRA 15.85(15.85)6373303
GODFRYPHLP 899.3(893.3)171639
GODREJCP 800.55(803.4)31788
GODREJIND 536(540.7)235475
GODREJPROP 712.25(679.3)829841
GPPL 95.3(100.45)196331
GRANULES 88.9(90.3)780837
GREAVESCOT 118.55(117.9)201534
GREENPLY 137.4(136.6)73155
GRINDWELL 559.5(556.15)6919
GRUH 306.35(319.5)594321
GSFC 112.75(112.6)922911
GSKCONS 7487.7(7449.85)30431
GSPL 175.05(170)303805
GUJFLUORO 921.9(907.75)78397
GUJGASLTD 657(661.15)4470
GULFOILLUB 838.5(827.95)45993
GVKPIL 7.75(7.8)1160820
HATHWAY 30.7(30.75)224061
HAVELLS 693.55(678.55)657814
HCC 13.45(13.35)5879967
HCL-INSYS 25.05(24.95)503857
HCLTECH 941.5(932.35)1172376
HDFC 1972.9(1972.6)2255477
HDFCBANK 2120.65(2117.45)1346753
HDIL 27.25(25.5)14987646
HEIDELBERG 150.05(150.85)49892
HEROMOTOCO 2957.95(2987.85)361881
HEXAWARE 331.5(331.85)696145
HFCL 21.3(21.1)2291919
HIMATSEIDE 215.3(214.8)118371
HINDALCO 208.55(210.9)8143876
HINDCOPPER 50.4(50.1)574353
HINDPETRO 249.8(248.2)2274016
HINDUNILVR 1784.95(1781.7)909032
HINDZINC 274.55(271.7)472131
HMT 20(20.7)1956
HMVL 128.8(127.7)411
HONAUT 21660.95(21608.8)270
HOTELEELA 15.3(15.4)191388
HSIL 234.25(231.6)11489
HTMEDIA 39.3(39.2)45566
IBREALEST 89.4(87.1)4517441
IBULHSGFIN 793.9(829.8)5265183
ICICIBANK 367.7(365.2)12719847
ICRA 3189.15(3187.45)392
IDBI 61.3(61.45)5901189
IDEA 36.65(36.2)8261827
IDFC 44.45(43.45)7351139
IFBIND 842.35(830.4)3066
IFCI 14.75(14.7)4684828
IGARASHI 550.95(559.8)4811
IIFL 494.3(501.1)244089
IL&FSTRANS 12.15(12.65)903274
INDHOTEL 144.95(143)392266
INDIACEM 91.5(92.65)5003547
INDIANB 246.95(249.75)1357982
INDOCO 217.1(219.2)2579
INDUSINDBK 1559.15(1548.2)3991996
INEOSSTYRO 697.95(692.75)1812
INFRATEL 293.75(285.05)5453037
INFY 671.7(661.05)8046340
INGERRAND 587.4(594.4)6061
INOXLEISUR 256.6(260.95)212787
INOXWIND 75.7(76.2)29395
INTELLECT 220.05(217.9)213887
IOB 14.6(14.55)320055
IOC 133.45(133.95)10623470
IPAPPM 450.6(452)42509
IPCALAB 784.1(787)370121
IRB 158(158.05)715798
ITC 281.65(280.95)9757529
J&KBANK 37.55(37.8)581911
JAGRAN 115.35(114.45)20015
JAICORPLTD 112.8(112.05)1019126
JBFIND 21.7(21.75)33423
JCHAC 1735.75(1757.05)788
JETAIRWAYS 246.2(245.2)8624216
JINDALPOLY 239.55(237.75)19000
JINDALSTEL 152.2(152.35)8738534
JISLJALEQS 67.1(66.35)3736845
JKCEMENT 713.7(715.4)7266
JKIL 127.85(128.65)42240
JKLAKSHMI 314.1(313.65)66192
JKTYRE 104(103.35)573913
JMFINANCIL 90.2(90.1)314786
JPASSOCIAT 7.6(7.55)19093005
JPINFRATEC 3.9(3.9)4009889
JPPOWER 2.05(2.05)2222320
JSWENERGY 70.1(68.7)480932
JSWHL 2778.4(2765.15)6466
JUBILANT 710.45(707.35)147878
JUBLFOOD 1217.05(1212.1)1211290
JUSTDIAL 489(497.05)1042439
JYOTHYLAB 205.5(204)92266
KALPATPOWR 377.85(379)15941
KANSAINER 466.7(479.55)81527
KEC 292.55(291.65)125471
KESORAMIND 83.25(83.9)171338
KIRLOSENG 201.3(200.6)8100
KITEX 109.3(109.55)17905
KOLTEPATIL 270.95(262.35)614340
KOTAKBANK 1246.6(1247.95)1211456
KPIT 207.95(210.45)1209137
KRBL 291.25(279.7)70451
KSCL 546.3(550.05)303050
KSK 1.55(1.55)432505
KTKBANK 113.6(114.95)2015906
KWALITY 8.2(7.85)1769142
L&TFH 145.7(144.4)4202422
LAKSHVILAS 83.1(85.85)992813
LAOPALA 212.6(215.3)23474
LAXMIMACH 5710.7(5708.4)1057
LICHSGFIN 479.35(488.1)1090142
LT 1383.8(1388.05)1851513
LUPIN 820.45(828.9)948727
M&M 729.55(725.6)2792255
M&MFIN 466.75(464.2)1012550
MAGMA 109.65(109.05)29850
MAHINDCIE 243.45(244.4)64354
MAHLIFE 393.55(394.5)19314
MANAPPURAM 94.45(95.35)1923639
MANPASAND 85.25(85.7)205512
MARICO 386.8(378.85)3660860
MARKSANS 27.65(27.75)562088
MARUTI 7362.05(7234.5)687845
MAYURUNIQ 395.25(394.15)7634
MCLEODRUSS 112.55(112.95)100087
MERCK 3175.55(3053.85)52063
MHRIL 202.1(200.3)174511
MINDACORP 147.2(149.85)73076
MINDTREE 835.35(815)1238344
MMTC 29.65(29.65)840198
MOIL 168.05(167.05)72598
MONSANTO 2571.85(2564.5)558
MOTHERSUMI 157.1(158.65)3882717
MOTILALOFS 673.6(672.9)167045
MPHASIS 925.3(930.45)203261
MRF 66978.55(66603.15)6823
MRPL 71.9(72.15)493801
MTNL 15.95(16.65)2466696
MUTHOOTFIN 513.4(501.95)1073922
NATCOPHARM 699.05(703.4)486342
NATIONALUM 63.95(63.85)2983061
NAUKRI 1622(1557.05)542045
NAVKARCORP 53.05(53.6)143560
NCC 87.95(88.65)5679618
NETWORK18 39.8(40.5)132224
NHPC 25.95(25.55)2658007
NIITTECH 1141.4(1122.7)399650
NITINFIRE 1.8(1.8)87783
NLCINDIA 68.3(68.15)734772
NMDC 94.95(93.95)3393526
NTPC 148.6(145.75)11768203
OBEROIRLTY 457.55(463.35)542900
OFSS 3596.2(3598.2)14801
OIL 174.6(174.55)1275303
OMAXE 214.05(213.85)251051
ONGC 147.85(145.7)12700566
ORIENTBANK 97.55(98.95)3146316
ORIENTCEM 82.8(83)101929
ORISSAMINE 930.55(929.2)7200
PAGEIND 21907.55(22663)169813
PARSVNATH 8.05(7.5)741191
PCJEWELLER 80.75(81)8943373
PEL 2279.55(2358.65)471723
PERSISTENT 570.2(577.3)230558
PETRONET 217.05(220.9)4616473
PFC 106.65(106.95)9048707
PFIZER 2743.75(2777.25)24252
PFS 17.8(17.1)1355393
PGHH 9804.2(9784.95)2124
PHOENIXLTD 586.5(583.45)6793
PIDILITIND 1102.6(1105.7)225286
PIIND 864.4(849.9)29279
PNB 80.55(81.3)21061552
POWERGRID 198.45(195.9)2020789
PRAJIND 122.15(120.6)1318020
PRESTIGE 229.15(231.9)394502
PRSMJOHNSN 87.4(90.35)215400
PTC 92.35(91)1072476
PUNJLLOYD 4.05(4)792750
PURVA 79.8(76.05)342020
PVR 1583.15(1573.2)283601
RADICO 395.45(394.3)206736
RAIN 121.05(127.05)938035
RAJESHEXPO 576.3(574.45)473587
RALLIS 170.2(171.25)172272
RAMCOCEM 628.6(627.1)117473
RAMCOSYS 270.9(269.55)8410
RATNAMANI 909.25(913)2004
RAYMOND 813.9(822.3)202634
RCF 63.1(62.75)557720
RCOM 13.9(14)95262182
RECLTD 119.9(121.55)8751596
REDINGTON 86.1(86.95)107930
RELAXO 753.7(749.8)12617
RELCAPITAL 217.05(216.7)4908782
RELIANCE 1104.75(1098.65)5513559
RELINFRA 299.45(296.8)3068380
RENUKA 10.8(11)475604
REPCOHOME 418.8(394.55)1755306
RIIL 341.75(339.9)260480
RKFORGE 521.9(524.25)11617
RNAVAL 13.9(13.8)899411
ROLTA 7.95(7.6)4552514
RPOWER 29.1(27.65)19212100
RTNPOWER 3.5(3.5)735632
RUCHISOYA 8.5(8.1)3190269
SADBHAV 220.1(217)53391
SADBHIN 97.75(98.4)1556
SAIL 53.4(53.15)7375254
SANOFI 6105.6(6128.25)2042
SBIN 296.3(297.65)14579399
SCHAEFFLER 5686.8(5666.9)1793
SCHNEIDER 100.05(100.25)39676
SCI 45.8(45.55)319056
SHARDACROP 302.7(309.15)3778
SHILPAMED 383.75(381.2)10669
SHK 171.65(172.3)41903
SHOPERSTOP 519.8(519.85)25170
SHREECEM 16921.7(16737.1)11758
SHRIRAMCIT 1574.25(1589.35)2200
SIEMENS 1062.05(1062.7)221617
SIMPLEXINF 191.95(192.55)70955
SINTEX 11.75(11.7)766819
SITINET 10.65(10.85)11481
SJVN 25.5(25.5)1851530
SKFINDIA 1915.1(1907.2)3801
SMLISUZU 650.65(650.15)3508
SNOWMAN 34.6(34.65)105199
SOBHA 452.25(440.55)580144
SOMANYCERA 367.7(360.2)323653
SONATSOFTW 295.75(295.55)35909
SOUTHBANK 15.25(15.3)13471836
SPARC 182.6(185.6)265565
SREINFRA 33.1(33)2393012
SRF 1997.85(1993.15)324402
SRTRANSFIN 1176.3(1162.65)900132
STAR 454.35(457.3)673778
STCINDIA 136.7(134.95)262139
SUNDARMFIN 1507.65(1480.05)9340
SUNDRMFAST 525.5(529.95)51108
SUNPHARMA 430.8(433.8)4118235
SUNTV 595.35(592.2)854838
SUPREMEIND 1060(1085.55)72197
SUVEN 230.6(233)163368
SUZLON 5.35(5.45)23677578
SWANENERGY 98.9(99.45)324370
SYMPHONY 1142.5(1153.5)7646
SYNDIBANK 39.75(40.6)7054851
SYNGENE 550.85(544.45)15766
TAKE 144.75(145.2)39786
TATACHEM 699.9(698.45)233122
TATACOFFEE 97(97.4)147086
TATACOMM 528.85(531.45)214381
TATAELXSI 978.45(1003.9)1225753
TATAGLOBAL 214.95(213.8)871903
TATAMOTORS 175.35(170.95)21438351
TATAMTRDVR 93.9(91.5)3790291
TATAPOWER 74.7(75.05)1691362
TATASPONGE 813.4(813.75)27353
TATASTEEL 485.5(487.65)8406787
TATASTLBSL 37.45(37.5)951992
TBZ 67.05(66.15)176483
TCS 1897.9(1876.85)1856423
TECHM 687.5(681.1)1885000
TEXRAIL 57.45(57.35)103559
THERMAX 1145.1(1140.3)115880
THOMASCOOK 234.9(239.05)497371
TIDEWATER 5394.4(5401.25)325
TIMKEN 587(590.75)6271
TITAN 944.05(928.45)5337211
TNPL 242.8(244.1)18475
TORNTPHARM 1823.75(1817.15)145441
TORNTPOWER 264.05(261.7)1847402
TREEHOUSE 4.5(4.6)5755
TRIDENT 67.25(66.75)358499
TRITURBINE 110.9(109.15)96461
TTKPRESTIG 7543.7(7454.9)1417
TTML 3.95(3.95)505721
TV18BRDCST 37.85(37.45)2112905
TVSMOTOR 534.75(540.95)629458
TVSSRICHAK 2472.65(2462.6)824
TVTODAY 371.65(364)14941
UBL 1389.8(1371.15)453214
UCOBANK 21.25(21.75)849720
UFLEX 272.25(275.45)57062
ULTRACEMCO 3926.75(3914.55)220371
UNICHEMLAB 193.2(192.5)23233
UNIONBANK 90.6(92.25)9581302
UNITECH 2.05(2.1)1752081
UPL 763.75(756.4)1589933
VAIBHAVGBL 718.2(708.6)4710
VAKRANGEE 36.1(34.4)1801398
VEDL 193.45(192.9)11020289
VIDEOIND 3.15(3.2)76239
VIJAYABANK 48.45(48.05)815121
VINATIORGA 1625.7(1620.05)6295
VIPIND 515.25(519.65)154645
VOLTAS 541.75(536.15)877380
VRLLOG 280.2(281.85)12394
VSTIND 3227.45(3100.65)7846
VTL 1096.2(1096.75)7831
WABAG 267.6(262.65)249519
WABCOINDIA 6474.55(6708.55)4915
WELCORP 137.85(133.75)369160
WELSPUNIND 61.3(60.85)252967
WHIRLPOOL 1428.6(1390.75)69973
WIPRO 324.25(324.45)1903604
WOCKPHARMA 506.7(510.7)554024
WONDERLA 265(265.25)191398
ZEEL 462.95(463.95)3020561
ZEELEARN 35.55(35.55)50856
ZYDUSWELL 1334.75(1339.3)13228



రిజర్వేషన్ల కోసం పోరు

న్యూఢిల్లీ, జనవరి 7: హరియాణాలో జాట్‌లు, గుజరాత్‌లో పటీదార్లు, మహారాష్ట్రలో మరాఠాలు, రాజస్థాన్‌లో గుజ్జర్లు, ఆంధ్రప్రదేశ్‌లో కాపులు... దేశంలో రిజర్వేషన్లు డిమాండ్ చేస్తున్న ప్రధాన కులాలు. గతంలో హరియాణా, గుజరాత్ రాష్ట్రాలు ఆందోళనలతో అట్టుడికిపోయాయి.



హరియాణా- జాట్‌లు

2016 నాటి లెక్కల ప్రకారం దేశంలో జాట్ కులస్థుల సంఖ్య సుమారు 8.25 కోట్లు. హరియాణా రాష్ట్ర జనాభాలో 29 శాతం మంది వీరే. పంజాబ్‌లో 25, రాజస్థాన్‌లో 15, ఢిల్లీలో 10 శాతం ఉన్నారు. వీరిలో అత్యధికులు వ్యవసాయదారులు. ఓబీసీ హోదా కోసం జాట్‌లు డిమాండ్ చేస్తున్నారు. ఉన్నత సామాజిక వర్గమైన వారిని ఓబీసీలుగా గుర్తించరాదంటూ జాట్‌యేతరులు అడ్డుతగిలారు. ఇది ఇరు వర్గాల మధ్య యుద్ధానికి కారణమైంది.

గుజరాత్- పటీదార్లు

2015లో గుజరాత్‌ను పటీదార్ల ఉద్యమం అట్టుడికించింది. ఓబీసీ హోదా కోరుతూ వారి ఆందోళన ఉవ్వెత్తున ఎగిసింది. పటీదార్ అనామత్ ఆందోళన సమితి నాయకుడు హార్దిక్ పటేల్ ఉద్యమానికి సారథ్యం వహించారు. వేర్వేరు ఘటనల్లో 14 మంది మరణించారు. రాష్ట్ర జనాభా ఆరు కోట్లు కాగా... పటీదార్ల సంఖ్య సుమారు కోటీ 60 లక్షల వరకు ఉంది. రాజకీయంగా ప్రాబల్యం కలిగిన సామాజిక వర్గమిది.

మహారాష్ట్ర- మరాఠాలు



మహారాష్ట్ర గ్రామీణ ప్రాంతాల్లో మరాఠా వర్గానికి గట్టి పట్టు ఉంది. రాష్ట్ర జనాభాలో వీరు 30 శాతం మంది ఉన్నారు. 2014లో అసెంబ్లీ ఎన్నికలకు కొద్ది నెలల ముందు అప్పటి కాంగ్రెస్-ఎన్‌సీపీ ప్రభుత్వం మరాఠాలకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ప్రకటించింది. అదే ఏడాది అక్టోబరులో బీజేపీ అధికారంలోకి రాగా... రెండు వారాలకే బొంబే హైకోర్టు మరాఠాలకు ప్రత్యేక కోటా చెల్లదని తీర్పునిచ్చింది. రిజర్వేషన్ల కోసం వీరు మళ్లీ ఉద్యమిస్తున్నారు.

రాజస్థాన్- గుజ్జర్లు



2015 మేలో గుజ్జర్ వర్గీయుల ఆందోళనలతో పది రోజుల పాటు రాజస్థాన్ స్థంభించింది. ప్రత్యేక వెనుకబడిన కులంగా 5 శాతం, ఉన్నత కులాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి మరో 14 శాతం రిజర్వేషన్లు ఇస్తామని ప్రభుత్వం హామీ ఇవ్వడంతో నాడు గుజ్జర్లు ఆందోళన విరమించారు. 2008, 2010లో కూడా వీరు రిజర్వేషన్ల కోసం ఉద్యమాలు నిర్వహించారు. మరోవైపు రాజ్‌పుట్‌లు కూడా రిజర్వేషన్ల కోసం గళమెత్తుతున్నారు.

ఆంధ్రప్రదేశ్-కాపులు



ఆంధ్రప్రదేశ్‌లో ప్రధాన సామాజిక వర్గమైన కాపులు మూడు దశాబ్దాలుగా ఓబీసీ హోదా కోసం డిమాండ్ చేస్తున్నారు. 1960 వరకు తాము బీసీలుగానే ఉన్నామని, ఆ తర్వాతే తమకు రిజర్వేషన్ ప్రయోజనాలను దూరం చేశారని వాదన వినిపిస్తున్నారు. వీరికి రిజర్వేషన్లపై అధ్యయనానికి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం కమిషన్‌ను నియమించింది. రాష్ట్ర జనాభాలో కాపులు 29 శాతం మంది ఉన్నారు.

తెలంగాణ-ముస్లింలు



ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని టీఆర్‌ఎస్ 2014లో హామీ ఇచ్చింది. ఈ మేరకు టీఆర్‌ఎస్ ప్రభుత్వం అసెంబ్లీలో ఒక తీర్మానం చేసి... కేంద్ర ప్రభుత్వ ఆమోదం కోసం పంపింది. దాన్ని కేంద్రంలోని మోదీ సర్కారు తిరస్కరించింది. ప్రస్తుతం ముస్లింలలో వెనుకబడిన తరగతుల వారికి ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రొఫెషనల్ కోర్సుల్లో నాలుగు శాతం రిజర్వేషన్ అమలవుతోంది. అయితే ఈ కోటా సుప్రీం కోర్టు తుది తీర్పుపై ఆధారపడి ఉంటుంది.

మోదీ మాస్టర్ స్ట్రోక్

» అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లను వ్యతిరేకించలేని స్థితిలో ప్రతిపక్షాలు



న్యూఢిల్లీ, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్ల నిర్ణయంతో విపక్షాలను డిఫెన్స్‌లో పడేశారు. కొంతకాలంగా వివిధ రాష్ట్రాల్లో అగ్రవర్ణాలు తమకు కూడా రిజర్వేషన్లు కావాలంటూ ఉద్యమాలకు దిగాయి. వాటి కారణంగా గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో బీజేపీ ప్రయోజనాలకు దెబ్బ తగిలింది. ఈ నేపథ్యంలో గుజరాత్‌లో పటీదార్లు, ఉత్తరాది రాష్ట్రాల్లో ఠాకూర్లు, గుజ్జర్లు రాజపుత్రులు, వైశ్యులు, బ్రాహ్మణులు... ఇలా దేశ వ్యాప్తంగా అగ్రవర్ణాలను తమకు అనుకూలంగా తిప్పుకొనేందుకు బీజేపీ బ్రహ్మాస్త్రం ప్రయోగించిందని రాజకీయ వర్గాలు భావిస్తున్నాయి. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను పొడిగించడం, ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టేస్తే దాన్ని కొనసాగిస్తూ చట్టసవరణ చేయడం వల్ల తమకు ఓటుబ్యాంకుగా ఉన్న ఇతర వర్గాలు దూరమవుతున్నాయని భావిస్తున్న బీజేపీ వారిని బుజ్జగించేందుకు తాజా సంచలన నిర్ణయం తీసుకుందని భావిస్తున్నారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ ఎన్నికల్లో అగ్రవర్ణాలు తమ పట్ల విముఖంగా ఉన్నారని తేలడంతో బీజేపీ జాగ్రత్త చర్యలు మొదలెట్టింది. ఈ నిర్ణయం వల్ల లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పెద్ద ఎత్తున ప్రయోజనం కలుగుతుందని, దీన్ని గేమ్ చేంజర్‌గా భావించవచ్చని పార్టీ వర్గాలు ఆశిస్తున్నాయి. బిల్లును వ్యతిరేకించడం కాంగ్రెస్‌కు కష్టమవుతుందని, వ్యతిరేకిస్తే అగ్రవర్ణాలు ఆ పార్టీకి దూరమవుతాయని బీజేపీ అంచనా వేస్తోంది.

అంతా సానుకూలమే

అన్ని కులాల వారికి వర్తిస్తుంది కనుక ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించడాన్ని అందరూ సమర్థించే అవకాశాలు ఉన్నాయని బీజేపీ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటివరకూ ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు 10 శాతం రిజర్వేషన్ కల్పించడాన్ని ఏ పార్టీ వ్యతిరేకించలేదని గుర్తు చేస్తున్నాయి. 2007లో మాయావతి అగ్రవర్ణాలు, దళితుల కూటమిని ఏర్పాటు చేసి అధికారానికి వచ్చారు. అప్పుడామె అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించాలన్నారు. 2014 ఎన్నికలకు ముందు ఎస్పీ ఇదే డిమాండ్‌ను తలకెత్తుకుంది. 2016లో ఏపీ సీఎం చంద్రబాబు కూడా అగ్రవర్ణ పేదలకు త్వరలో రిజర్వేషన్లు ఇస్తానని చెప్పారు. సీపీఎం కూడా ఆర్థిక ప్రాతిపదికన రిజర్వేషన్లకు సానుకూలంగా స్పందించింది.

రిజర్వేషన్లు కల్పించవచ్చు

ప్రజాభ్యున్నతి దృష్ట్యా కోటా ఇవ్వొచ్చు.. సమానత్వం ప్రాతిపదిక కావాలి.. విస్పష్టంగా చెప్పిన రాజ్యాంగం

ఆర్టికల్ 15:


(1) మతం, జాతి, కులం, ప్రాంతం, స్త్రీ-పురుష ప్రాతిపదికన ప్రజలపై వివక్ష చూపరాదు

(2) మతం, జాతి, కులం, లింగ, ప్రాంత ప్రాతిపదికన ప్రజలను హోటళ్లు, సినిమా హాళ్లు, షాపింగ్ మాల్స్‌లోకి ప్రవేశాన్ని అడ్డుకోరాదు. వారిని భారంగా చూడరాదు. ఆంక్షలు పెట్టరాదు. ఊరిలో అందరూ ఉపయోగించే బావులు, చెరువులు, స్నాన ఘట్టాలు, ప్రజా వినోద, విలాస ప్రాంతాల్లోకి అనుమతిని నిషేధించరాదు.

(3) ఈ ఆర్టికల్‌లోని అంశాలను ప్రాతిపదికగా చేసుకొని ప్రభుత్వం మహిళలు, పిల్లలకు ప్రత్యేక సదుపాయాలు కల్పించవచ్చు.

(4) సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల లేదా ఎస్సీలు, ఎస్టీల అభ్యున్నతికి ప్రభుత్వం తీసుకొనే ఏ చర్యనైనా ఈ అధికరణ అడ్డుకోరాదు. అంటే ఆయా వర్గాల అభివృద్ధి నిమిత్తం ఏ చర్యనైనా ప్రభుత్వం చేపట్టవచ్చు. ఆర్టికల్ 29 (2)కు కూడా ఇదే వర్తిస్తుంది.

రాజ్యాంగ స్ఫూర్తి సమానత్వమేనని, ఏ వర్గానికైనా అవకాశాల్లో ప్రాతినిధ్యం తగ్గిందని పార్లమెంటు నిరభ్యంతరంగా రిజర్వేషన్లు కల్పించవచ్చని రాజ్యాంగం స్పష్టం చేస్తోంది. అధికరణాలు 15, 16 ఈ విషయాన్ని విపులీకరించాయి.



ఆర్టికల్ 16:

దీని ప్రకారం ఉద్యోగావకాశాల్లో సమానత్వం పాటించాలి

(1) ప్రభుత్వం చేసే ఏ నియామకంలోనైనా లేక ఉపాధి కల్పనలోనైనా సమాన అవకాశాలు కల్పించాలి

(2) మతం, జాతి, కులం, వర్గం, లైంగిక, ప్రాంతీయ, నివాస ప్రాతిపదికన ఏ వ్యక్తికీ ఉపాధి కల్పనలో వివక్ష చూపరాదు

(3) ఏ వర్గానికైనా ఉద్యోగావకాశాల కల్పించాలని పార్లమెంటు భావిస్తే ఈ అధికరణ అడ్డుకాబోదు. కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలు లేక స్థానిక సంస్థలు... ఎక్కడైనా ఏ వర్గానికైనా ఉపాధి కల్పనకు ఇది అడ్డంకి కాదు.

(4) ప్రభుత్వ విభాగాల్లో వెనుకబడ్డ వర్గాలకు నియామకాల్లో సరైన ప్రాతినిధ్యం లేదని ప్రభుత్వం భావించినపుడు నియామకాల్లో వారికి రిజర్వేషన్లు కల్పించవచ్చు. దానికి ఈ అధికరణ అడ్డుకాదు.

రాజ్యాంగసభలో చర్చ

వెనుకబాటుతనం సామాజికమా? ఆర్థికమా?

రిజర్వేషన్లు సామాజికంగా వెనకబడ్డ వర్గాలకు కల్పించాలా లేక ఆర్థికంగా వెనుకబడ్డ వర్గాలకా? అన్న చర్చ దాదాపు 70 ఏళ్లుగా సాగుతూనే ఉంది. 1948లో రాజ్యాంగసభలో దీనిపై ఆసక్తికర చర్చే జరిగింది. అసలు వెనకబడ్డ (బ్యాక్‌వర్డ్) అనే పదాన్ని ఎలా నిర్వచించాలి? అన్న అంశంపైనే గంటన్నరకు పైగా చర్చ జరిగింది. రాజ్యాంగంలో ఎక్కడా వెనకబడ్డ అన్న పదాన్నే నిర్వచించలేదని హెచ్.ఎన్.కుంజ్రూ అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై టీటీ కృష్ణమాచారి లేచి 'ఈ పదం అస్పష్టం, సందిగ్ధం. దీనికి రకరకాల వ్యాఖ్యానాలు చెప్పుకోవచ్చు. పుట్టుకతో వెనకబాటుతనమా, సామాజికంగానా, ఆర్థికంగానా, నిరక్షరాస్యత వల్లా... ఇలా దేనికని వెనకబాటుతనం?" అని వ్యాఖ్యానించారు. రాజ్యాంగ రచనలో పాలుపంచుకొన్న కేఎం మున్షీ స్పందిస్తూ "ఇది అసలు కులానికి చెందినది కాదు.. వర్గానికి చెందినది. కాబట్టి షెడ్యూల్డ్ కులాలు, తెగలు అనకుండా వెనకబడ్డ వర్గాలు అని సంబోధించాలి. అప్పుడు అధికరణం 16(4)లో పేర్కొన్న దానికి సరైన అర్థం, సార్థకత వస్తాయి" అన్నారు. దీనికి అంబేద్కర్ సమాధానమిస్తూ 'ఉదాహరణకు నిర్దిష్ట పోస్టుల్లో ఓ వర్గానికి లేదా అన్ని వెనకబడ్డ వర్గాలకీ కలుపుకొని 70 శాతం రిజర్వేషన్లు ఇస్తే.. జనరల్ కేటగిరీలో మిగిలేది 30 శాతమే. ఇది సమానత్వం కిందకు వస్తుందా? అందువల్ల మనం సమానత్వపు హక్కు కల్పించాలి. ఇన్నాళ్లూ ప్రాతినిధ్యం దొరకని కొన్ని కులాలకు అవకాశాలూ కల్పించాలి. ఏ ప్రాతిపదికన..? అవి సామాజికంగా, సాంస్కృతికంగా వెనుకబడి ఉన్నవి. బ్యాక్‌వర్డ్ పదాన్ని వాడితే అది అధికరణం మొత్తాన్ని తినేస్తుంది. రిజర్వేషన్లు పరిమితిని మించి ఇస్తే అది మంచిదా కాదా.. అన్నది న్యాయవ్యవస్థే తీర్పిస్తుంది" అన్నారు.



రిజర్వేషన్లు.. సమానత్వం రెండూ అవసరమే: అంబేద్కర్



న్యూఢిల్లీ, జనవరి 7: సామాజిక రుగ్మతలు అంతమైతేనే ఆర్థికాభివృద్ధి, మేధో పరిణితి సాధ్యమని బలంగా నమ్మిన సామాజిక సైనికుడు బీఆర్ అంబేడ్కర్. పూనా ఏక్ట్‌లో గానీ తదనంతర రాజ్యాంగ రచనలో గానీ ఇదే ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. సతి, అస్పృశ్యత, విధవలపై ఆంక్షలు, కులాధిపత్యం... మొదలైన వాటికి వ్యతిరేకంగా ఆయన పోరాడాడు. రాజ్యాంగ నిర్మాణంలో కూడా ఆయన సామాజిక వెనుబాటుతనాన్నే ప్రాతిపదిక చేసుకున్నారు తప్ప ఆర్థిక వెనుకబాటుతనం కాదు. వివక్షను దునుమాడుతూ- రిజర్వేషన్లు కల్పించాలని ప్రతిపాదించిన ఆయనే అది సమానత్వాన్ని దెబ్బతీయకుండా చూసుకోవాలని గట్టిగా అభిప్రాయపడ్డారు. " సమానత్వాన్ని సమర్థించాల్సిందే. అదే సమయంలో మన విధానానికి ఆవల, ఇతర మార్గాల ద్వారా... కొన్ని వర్గాల ప్రవేశానికి వీలు కల్పించాల్సిందే" అని ఆయన సూచన చేశారు. "చాలా సమాజాల్లో మేధావి వర్గమే ప్రభావశీల పాత్ర పోషిస్తుంది. దేశానికి దిశానిర్దేశం చేసేది మేధావి వర్గమే. ఆ వర్గం నిజాయితీగా, చిత్తశుద్ధితో అన్ని వర్గాల అభ్యున్నతికి ప్రణాళికలు రూపొందించాలి. దురదృష్టవశాత్తూ మన దేశంలో అది జరగడం లేదు" అని ఆయన నిర్మొహమాటంగా అన్నారు. మనది రాజకీయ ప్రజాస్వామ్య కారాదు... సామాజిక ప్రజాస్వామ్యమవ్వాలన్న ఆయన మాటల్లో అంతరార్థం వెనుకబడ్డ వర్గాల (అది సామాజిక లేదా సాంస్కృతిక) అభ్యున్నతేనని నిపుణులు వ్యాఖ్యానించారు.

రిజర్వేషన్లపై ఆయన అన్నదేమంటే...

- రిజర్వేషన్ అనేది అపప్రయోగం. దీనికి రాజ్యాంగంలో ఇచ్చిన సమానార్థకం: ప్రాతినిధ్యం
- పార్లమెంటు, అసెంబ్లీల్లో దళితులకు రిజర్వేషన్లు కల్పించాలి. అయితే దాన్ని పదేళ్ల తర్వాత సమీక్షించాలి. రాజ్యాంగసభలోనే దీనిపై ఆర్టికల్ 295 (ఎ)ను ఎందుకు ప్రతిపాదించినదీ ఆయన రాజ్యాంగ సభలోనే వివరించారు
- పెద్ద ఎత్తున రిజర్వేషన్లు కల్పిస్తూ పోతే అది సమానత్వపు హక్కును హరించడమే
- నిమ్నవర్గాలు కూడా ఎల్లకాలం ఇతర సాయాలపై ఆధారపడకూడదు. స్వశక్తితో ఎదగాలి.

మొట్టమొదట ట్రావెన్‌కోర్‌లో...

అగ్రవర్ణ పేదలకు మొట్టమొదట కేరళలో రిజర్వేషన్లు కల్పించారు. దేవస్వోమ్ (దేవస్థానం) బోర్డుల్లో ఆర్థికంగా వెనుకబడ్డ వర్గాలకు పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ నిరుడు జనవరి మొదటివారంలో పినరయి విజయన్ నేతృత్వంలోని వామపక్ష ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎస్సీ, ఎస్టీలకు, వెనుకబడ్డ వర్గాలకు కూడా ఈ బోర్డుల్లో రిజర్వేషన్ల పరిమాణాన్ని పెంచారు. దీని ప్రకారం కేరళలో అగ్రవర్ణాలకు చెందిన ఎళవా వర్గానికి రిజర్వేషన్లు 14 నుంచి 17 శాతానికి పెరిగాయి. ఎస్సీ-ఎస్టీ-బీసీలకు 10 నుంచి 12 శాతానికి పెరిగాయి.

లక్ష్మణ రేఖ దాటకూడదా?

రిజర్వేషన్లకు 50% పరిమితి తప్పనిసరా?..

» ఎన్ని రాష్ట్రాలు సుప్రీం గీత దాటాయి?

» తమిళనాట 69% ఎలా సాధ్యమైంది?

» కేంద్రం బాటన రాష్ట్రాలు నడవొచ్చా?

» ఈబీసీ రిజర్వేషన్లతో సరికొత్త ప్రశ్నలు

కేంద్రం ఈబీసీలకు 10 శాతం రిజర్వేషన్లు ప్రకటించడంతో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థల్లో రిజర్వేషన్లు సుప్రీంకోర్టు విధించిన 50 శాతం పరిమితిని దాటుతున్నాయి. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో రిజర్వేషన్లు 50 శాతం దాటేశాయి. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్సాహంతో మరిన్ని రాష్ట్రాలు ఆ బాటన పయనించే అవకాశం ఉంది. 1980లోనే తమిళనాడులో రిజర్వేషన్లు 69 శాతం దాటాయి. 50శాతం ఓబీసీలకు, 18% ఎస్సీలకు, 1% ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించారు. ఓబీసీల్లో బీసీలకు 26.5%, ఎంబీసీలకు 20, బీసీ ముస్లిములకు 3.5 శాతం కేటాయించారు. రిజర్వేషన్లు 50 శాతం దాటరాదని సుప్రీంకోర్టు 1992లోనే ఒక కేసులో తీర్పు ఇచ్చింది. దాంతో తమిళనాడు రిజర్వేషన్లకు గండి పడింది. జయలలిత ఒత్తిడి మేరకు 1994లో అప్పటి ప్రధాని పీవీ నర్సింహారావు తమిళనాడు రిజర్వేషన్ల చట్టాన్ని 9వ షెడ్యూల్‌లో చేర్చారు. దాంతో దానిపై న్యాయ సమీక్షకు అవకాశం లేకుండా పోయింది. 2007లో సుప్రీంకోర్టు మరో రూలింగ్ ఇచ్చింది. ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే 9వ షెడ్యూల్‌లోని అంశాల్లోనూ జోక్యం చేసుకుని సమీక్షిస్తానని ప్రకటించింది. అసలు రాజ్యాంగంలో తొమ్మిదో షెడ్యూల్ పెట్టిన లక్ష్యం వేరు. 1951లో నెహ్రూ ప్రధానిగా ఉండగా ఈ షెడ్యూల్‌ను చేర్చారు. ఆస్తి హక్కు ప్రాథమిక హక్కుల్లో ఒకటిగా ఉన్న రోజుల్లో భూసంస్కరణల కోసం రాష్ట్ర ప్రభుత్వాలు పెద్ద ఎత్తున చట్టాలు తెచ్చాయి. వాటిని ప్రాథమిక హక్కులకు భంగమంటూ కోర్టులు కొట్టేసేవి. దానికి విరుగుడుగా రాజ్యాంగంలో 9వ షెడ్యూల్ తీసుకొచ్చారు. ఇందులో పెట్టిన చట్టాల మీద కోర్టులు సమీక్ష జరపరాదు. తర్వాత కాలంలో ఆస్తి హక్కునే ప్రాథమిక హక్కుల జాబితా నుంచి ఎత్తేశారు. కానీ, 9వ షెడ్యూల్‌ను ఇతర అవసరాలకు కూడా ప్రభుత్వం వినియోగించడం మొదలెట్టింది. ఇందిరాగాంధీ హయంలో దాన్ని 'జ్యుడీషియల్ డస్ట్‌బిన్'గా మార్చేశారని ప్రచారం ఉంది.



రాష్ట్రం	రిజర్వేషన శాతం
హరియాణా	70
తమిళనాడు	69
మహారాష్ట్ర	68
తెలంగాణ	50
జార్ఖండ్	60
కర్ణాటక	50
కేరళ	50
ఉత్తరప్రదేశ్	50
బిహార్	50
మధ్యప్రదేశ్	50
రాజస్థాన్	54
ఆంధ్రప్రదేశ్	50
పశ్చిమబెంగాల్	35
అరుణాచల్‌ప్రదేశ్	80
మేఘాలయ	80
నాగాలాండ్	80
మిజోరం	80

రాజ్యాంగ మౌలిక స్వభావాన్ని మార్చకూడదని(డాక్ట్రిన్ ఆఫ్ బేసిక్ స్ట్రక్చర్) 1973లో కేశవానంద భారతి కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దాన్నే 2007 తీర్పు సందర్భంగా సుప్రీంకోర్టు ప్రస్తావించింది. 1973కు ముందు తొమ్మిదో షెడ్యూల్‌లో పెట్టిన చట్టాలను సమీక్షించబోమని ప్రకటించింది. తమిళనాడు రిజర్వేషన్లు 1994లో పెట్టారు కనుక వాటి రాజ్యాంగబద్ధతను సమీక్షించేందుకు సిద్ధమైంది. 2010లో సుప్రీంకోర్టు మరో తీర్పు ఇచ్చింది. వెనుకబాటుతనానికి సంబంధించి పక్కా గణాంక ఆధారాలు సేకరించగలిగితే 50 శాతం పరిమితిని కూడా దాటొచ్చని చెప్పింది. ఇప్పుడు రాష్ట్రాలు అదే పనిలో ఉన్నాయి. రిజర్వేషన్లు ఇవ్వాల్సిన వర్గాల వెనుకబాటుతనానికి సంబంధించి పక్కా గణాంక ఆధారాలను సేకరించడానికి సమాయత్తం అవుతున్నాయి. ఏపీ 55 శాతం, కర్ణాటక 70 శాతం, తెలంగాణ 62 శాతం రిజర్వేషన్ల అమలు కోసం తమ వంతు ప్రయత్నం చేస్తున్నాయి. ఇప్పటిదాకా రిజర్వేషన్లకు కులం, సామాజిక, విద్యాపరమైన వెనుకబాటుతనం ప్రాతిపదికగా ఉంది. కేంద్ర ప్రభుత్వ తాజా నిర్ణయంతో రాజ్యాంగంలో ప్రస్తావన లేని ఆర్థిక వెనుకబాటుతనం కూడా రిజర్వేషన్లకు ప్రాతిపదికగా వచ్చి చేరుతోంది.

- సెంట్రల్‌డెస్క్



మండల్ కమిషన్‌కు వ్యతిరేకంగా రాజీవ్ గోస్వామి ఆత్మాహుతి (ఫైల్)



మండల్ కమిషన్‌కు అనుకూలంగా (ఫైల్)

మలుపు తిప్పిన 'మండల్'

దేశంలో రిజర్వేషన్ల వ్యవస్థను కీలక మలుపు తిప్పింది, అదే స్థాయిలో మంటలు రేపిందీ... మండల్ కమిషన్! ఈ కమిషన్ సిఫారసుల ఫలితంగా కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థల్లో విద్యా, ఉద్యోగాల్లో ఓబీసీలకు 27 శాతం కోటా లభించింది. మండల్ కమిషన్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా తీవ్రస్థాయిలో ఆందోళనలు జరిగాయి. అసలు ఏమిటీ 'మండల్'...

ఏర్పాటు ఇలా...

సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాల కమిషన్! దీనిని 1979 జనవరి 1న నాటి జనతా ప్రభుత్వ సారథిగా ఉన్న మొరార్జీ దేశాయ్ ఈ కమిషన్‌ను ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా బిహార్ మాజీ సీఎం, అప్పటి ఎంపీ బీపీ మండల్‌ను నియమించారు. దీంతో... ఇది మండల్ కమిషన్‌గా పేరొందింది.

సత్వర నివేదిక

బీపీ మండల్ కమిషన్ కేవలం రెండేళ్లలోనే... అంటే 1980 డిసెంబరు 31న కేంద్ర ప్రభుత్వానికి తన నివేదిక సమర్పించింది. అయితే... అప్పటికి మొరార్జీ సర్కారు పడిపోయింది. ఇందిరాగాంధీ ప్రభుత్వం వచ్చింది. మండల్ నివేదిక మరుగున పడిపోయింది. ఆ తర్వాత ప్రధాని అయిన రాజీవ్‌గాంధీ కూడా దీనిని పట్టించుకోలేదు.

వీపీ సింగ్‌తో మళ్లీ...

జనతా పార్టీ హయాంలో ఏర్పాటు చేసిన మండల్ కమిషన్ నివేదికకు... మళ్లీ అదే పార్టీ మూలాలున్న వీపీ సింగ్ ప్రధాని అయ్యాకగానీ మోక్షం రాలేదు. 1990 ఆగస్టు 7వ తేదీన వీపీ సింగ్ మండల్ నివేదికను పార్లమెంటులో ప్రవేశపెట్టారు. విద్యా ఉద్యోగాల్లో ఓబీసీలకు 27 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలన్న సిఫారసులను ఆమోదించారు.

మండల్... మంటల్...

మండల్ కమిషన్‌కు వ్యతిరేకంగా తీవ్రస్థాయిలో ఆందోళనలు చెలరేగాయి. ఢిల్లీలో రాజీవ్ గోస్వామి ఆత్మాహుతి యత్నంతో మరింత ఉద్ధృతమయ్యాయి. అయినా వీపీ సింగ్ వెనక్కి తగ్గలేదు. మండల్ కమిషన్ సిఫారసుల అమలుకే కట్టుబడ్డారు. అదే సమయంలో బీజేపీ 'అయోధ్య'ను తెరపైకి తెచ్చింది. వీపీ సింగ్ సర్కారుకు మద్దతు ఉపసంహరించింది. ఆయన ప్రభుత్వం పడిపోయింది కానీ,మండల్ సిఫారసులు మాత్రం అమలులోకి వచ్చాయి.

1953లోనే కమిషన్..

1953లోనే వెనుకబడిన వర్గాల కమిషన్ ఏర్పడింది. దీనికి సంఘ సంస్కర్త కాకా కలేల్కర్‌ను అధ్యక్షుడిగా నియమించారు. ఈ కమిషన్ 2399 కులాలను 'వెనుకబడినవి'గా గుర్తిస్తూ 1955లో నివేదిక సమర్పించింది. ఇందులో 837 కులాలను అత్యధిక వెనుకబడినవిగా నిర్ధారించింది. ఈ కమిషన్ నివేదికను ప్రభుత్వాలేవీ పట్టించుకోలేదు.

మేం మద్దతిస్తాం

- అగ్రవర్ణ పేదలకు వారి వాటా దక్కాల్సిందే.. కాంగ్రెస్ పార్టీ ప్రకటన
- ఎన్నికల్లో ఓడిపోతామన్న భయమే కారణం: సుర్జేవాలా
- నాలుగేళ్ల ఎనిమిది నెలలు ఏం చేశారు?: అభిషేక్ సింఘ్వీ

న్యూఢిల్లీ, జనవరి 7: అగ్రవర్ణ పేదలకు 10% రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు తాము మద్దతు ఇస్తామని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అయితే, లోక్‌సభ ఎన్నికల ముందు ప్రజలను పిచ్చివాళ్లను చేయడానికి చేసిన 'గిమ్మిక్కు'గా అభివర్ణించింది. ఉద్యోగాలు ఇవ్వకుండా రిజర్వేషన్లు కల్పించడం అంటే మరోసారి మోసం చేయడమని తప్పుబట్టింది. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోతామని బీజేపీ భయపడుతోందని, అందుకు ఇదే నిదర్శనమని ఆ పార్టీ అధికార ప్రతినిధి రణదీప్ సుర్జేవాలా చెప్పారు. ఆర్థికంగా వెనకబడి ఉన్న ప్రతి ఒక్కరికీ విద్య, ఉద్యోగాల్లో వారి వాటా దక్కాలని, ఇందుకు తీసుకునే అన్ని చర్యలకూ మద్దతు ఇస్తామని తెలిపారు. ఈ రిజర్వేషన్లు కల్పించాలంటే రాజ్యాంగ సవరణ చేయాలని, బీజేపీకి తగినంత బలం లేదని, ఈ విషయం తెలిసినా ప్రజలను మరోసారి వంచించడానికి బీజేపీ సిద్ధమైందని మరో అధికార ప్రతినిధి అభిషేక్ మను సింఘ్వీ మండిపడ్డారు. ఎన్ని గిమ్మిక్కులు చేసినా వచ్చే ఎన్నికల్లో బీజేపీ ఓటమి తథ్యమని హరీశ్ రావత్ అన్నారు.

● ఆర్థిక ప్రాతిపదికన కుదరదు: అసదుద్దీన్ ఒవైసీ

హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): తరతరాలుగా దళితులు, అణగారిన వర్గాలకు సామాజికంగా జరిగిన అన్యాయాన్ని సవరించేందుకు ఉద్దేశించిన రిజర్వేషన్లు అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు వర్తింపజేస్తామనడం ప్రధాని మోదీ ఓట్ల కోసం ఆడుతున్న రాజకీయ నాటకమని మజ్లిస్ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ విమర్శించారు. ఆర్థిక ప్రాతిపదికన అమలును రాజ్యాంగం అంగీకరించదన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం ముస్లింలకు రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

● 25 శాతం ఇవ్వాలి: అథవాలే

న్యూఢిల్లీ, జనవరి 7: ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పించడం మంచి ఆరంభమని కేంద్ర మంత్రి, రిపబ్లికన్ పార్టీ నేత రామ్‌దాస్ అథవాలే అన్నారు. "అగ్రవర్ణ పేదలకు 25% ఇవ్వాలన్నది నా డిమాండ్. ముందు 10 శాతం ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నా" అని వ్యాఖ్యానించారు.

చరిత్రాత్మక నిర్ణయం: బీజేపీ

ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాలకు రిజర్వేషన్లు కల్పించడం చరిత్రాత్మక నిర్ణయమని బీజేపీ వ్యాఖ్యానించింది. మోదీ ప్రభుత్వ నిర్ణయాన్ని ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి, ఉత్తరాఖండ్ ముఖ్యమంత్రి త్రివేంద్ర సింగ్ రావత్ స్వాగతించారు. ఈ నిర్ణయంతో సామాజిక న్యాయం మరింత ఎక్కువ మందికి లభిస్తుందని బీజేపీ ఉపాధ్యక్షుడు వినయ్ సహస్రబుద్ధే వ్యాఖ్యానించారు.

● మా పోరాటానికి ఫలితం: ఆర్యవైశ్య మహాసభ

చెన్నై, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆర్థికంగా వెనుకబడిన అగ్రవర్ణాల్లోని పేదలకు 10% రిజర్వేషన్ కల్పించాలని కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ హర్షం వ్యక్తం చేసింది. మహాసభ అధ్యక్షుడు తంగుటూరి రామకృష్ణ చెన్నైలో సోమవారం విలేకరులతో మాట్లాడారు. ఇదో శుభ పరిణామమని, ఈ విషయమై కొన్నేళ్లుగా చేస్తున్న తమ పోరాటానికి ఫలితం దక్కిందని పేర్కొన్నారు. ఇకనైనా అగ్రవర్ణ పేదలకు విద్య, వైద్య, ఇతర రంగాల్లో తగిన న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

● రిజర్వేషన్లతో మేలు: బ్రాహ్మణ జాతీయ ఫ్రంట్

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణాల్లో ఆర్థికంగా వెనుకబడిన వారికి 10% రిజర్వేషన్ కల్పించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని బ్రాహ్మణ జాతీయ ఫ్రంట్ స్వాగతించింది. అగ్రవర్ణాల్లో పేదలకు ఇది ప్రయోజనం చేకూరుస్తుందని తెలిపింది. గత అక్టోబరులో తాము తీర్మానం చేసి, కేంద్రానికి లేఖ పంపిన విషయాన్ని ఫ్రంట్ ఉపాధ్యక్షుడు గంగు ఉపేంద్ర శర్మ గుర్తుచేశారు. పంచాయతీ ఎన్నికల్లోనూ అగ్రవర్ణాలకు ప్రత్యేక రిజర్వేషన్ కల్పించాలని ఫ్రంట్ కన్వీనర్ పవన్ కుమార్ రాష్ట్రప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

● మంచి నిర్ణయమే: జయప్రకాశ్ నారాయణ



అమరావతి, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయం ఒకందుకు మంచిదేనని, దాని అమలు ఎలా ఉన్నా, మంచి చర్చకు దారితీస్తుందని లోక్‌సత్తా వ్యవస్థాపక అధ్యక్షుడు జయప్రకాశ్ నారాయణ అన్నారు. సోమవారం ఆయన విజయవాడలో మాట్లాడుతూ... కేంద్రం నిర్ణయం రిజర్వేషన్ల సమస్యపై సమగ్ర పరిష్కారానికి దారి చూపొచ్చని, సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో న్యాయపరంగా చిక్కులు ఎదురయ్యే అవకాశాలున్నాయని అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం రిజర్వేషన్లు పొందుతున్న వర్గాల్లోనూ వాస్తవంగా అర్హులైన వారిని గుర్తించి, ఏదో ఒక ప్రామాణికాన్ని పెట్టుకుని లబ్ధిని పరిమితం చేయాలన్నారు. ఇలాంటివారిలో ఐఏఎస్‌లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ధనికుల పిల్లలకు రిజర్వేషన్లు తప్పించాలన్నారు. ఇదే అంశంపై హైదరాబాద్‌లో 'ఏబీఎన్-ఆంధ్రజ్యోతి'తోనూ జేపీ తన అభిప్రాయాలను పంచుకున్నారు. పేదరికంలో ఉన్నవారికే రిజర్వేషన్లు ఉపయోగపడాలన్నారు. తల్లిదండ్రుల అవిద్య, అభ్యర్థులు చదివిన పాఠశాలల ఆధారంగా పేదరికాన్ని నిర్ధారించి, రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు.



అగ్రవర్ణ పేదలకు 10% రిజర్వేషన్

(మొదటి పేజీ తరువాయి)

రిజర్వేషన్లు 60 శాతానికి చేరనున్నాయి. అయితే, కులాలవారీగా ఇచ్చే రిజర్వేషన్లు 50 శాతం దాటరాదంటూ సుప్రీం కోర్టు గతంలోనే ఆదేశాలు జారీ చేసింది. దీనికితోడు, ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించే అంశం రాజ్యాంగంలో లేదని తెలిపింది. ఈ నేపథ్యంలో.. అగ్రవర్ణ పేదల కోటాకు సంబంధించి కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని ఆర్టికల్స్ 15, 16లను సవరించాల్సి ఉంది. రాజ్యాంగ సవరణకు వీలుగా శీతాకాల సమావేశాలకు చివరి రోజైన మంగళవారమే మోదీ ప్రభుత్వం పార్లమెంటులో బిల్లును ప్రవేశపెట్టనుంది. దాంతో, లోక్‌సభ సమావేశాలకు తప్పనిసరిగా హాజరు కావాలంటూ పార్టీ ఎంపీలకు కాంగ్రెస్, బీజేపీ విప్ జారీ చేశాయి. కాగా, తమకు కూడా రిజర్వేషన్లు కల్పించాలంటూ మరాఠాలు, కాపులు, జాట్‌లు తదితర అగ్ర వర్గాలు కొన్నేళ్ల నుంచి ఆందోళనలు చేస్తున్న విషయం తెలిసిందే. కొన్ని సందర్భాల్లో ఇవి హింసాత్మకంగా మారాయి కూడా. ఈ నేపథ్యంలోనే, హరియాణా, రాజస్థాన్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల్లో ఆయా వర్గాలకు రిజర్వేషన్లు కల్పిస్తూ అక్కడి ప్రభుత్వాలు చట్టాలు చేశాయి. వాటిని ఎప్పటికప్పుడు కోర్టులు కొట్టివేశాయి. కాగా, రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందాలంటే పార్లమెంటులో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. అయితే, రాజ్యసభలో బీజేపీకి పూర్తి మెజారిటీ లేదు. దాంతో, అగ్రవర్ణ పేదల కోటాకు ప్రతిపక్ష పార్టీలు కూడా సహకరిస్తాయని బీజేపీ అంచనా వేస్తోంది. ఈ బిల్లును పార్లమెంటు ఆమోదిస్తే.. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలు, కేంద్ర ప్రభుత్వ విద్యా సంస్థల్లోనే రిజర్వేషన్లు అమలవుతాయి. ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రానికి ప్రత్యేక చట్టాలు ఉన్నందున రాష్ట్రాల స్థాయిలో ఇవి అమలు కావు. కేంద్ర ప్రభుత్వ చట్టాన్ని రాష్ట్రాలు కూడా అడాప్ట్ చేసుకుంటే ఇవే రిజర్వేషన్లు రాష్ట్రాల్లోనూ అమల్లోకి వస్తాయి.

రాజ్యసభ మరో రోజు పొడిగింపు

పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో రాజ్యసభ కార్యకలాపాలను ప్రభుత్వం మరో రోజు పొడిగించింది. జనవరి తొమ్మిదో తేదీ బుధవారం వరకూ సమావేశాలు జరగనున్నాయి. ఈ మేరకు ప్రభుత్వ వినతిని రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు అంగీకరించారని అధికార వర్గాలు తెలిపాయి.

క్రైస్తవులూ, ముస్లిములూ లబ్ధిదారులే: విజయ్ సంప్లా

"సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్ ఇది. మోదీ ప్రభుత్వం మాత్రమే దీనిని సాకారం చేయడానికి సాహసం చేసింది. బ్రాహ్మణులు, బనియాలు, క్రైస్తవులు, ముస్లిములు తదితరులంతా ఈ నిర్ణయంతో లబ్ధి పొందనున్నారు" అని కేంద్ర మంత్రి విజయ్ సంప్లా చెప్పారు. మంత్రి మండలి సమావేశం తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ నిర్ణయాన్ని రాజకీయ కోణంలో చూడరాదన్నారు. ప్రజల మనోభావాలను అర్థం చేసుకోవడం, వారి ఆకాంక్షలను నెరవేర్చడం ప్రభుత్వ బాధ్యత అని చెప్పారు.

చేతులు దులుపుకోడానికేనా?

- రిజర్వేషన్లు అమలు చేస్తారా?
- కేంద్రం మదిలో ఏముంది?
- బిల్లు చూశాకే స్పందించాలి
- తెలంగాణ సర్కార్ యోచన

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణ పేదలకు పది శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయంపై ఆచితూచి స్పందించాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ఈబీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్రం చిత్తశుద్ధితో వెళుతోందా? ఎన్నికల ముందు చేతులు దులుపుకొనే వ్యవహారమా? అనే విషయంలోనే రాష్ట్ర ప్రభుత్వ వర్గాలు కచ్చితమైన అంచనాకు రాలేక పోతున్నాయి. ఈబీసీ రిజర్వేషన్ల బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టే వరకు దాని స్వరూపాన్ని అంచనా వేయలేమని, ఆ తర్వాతే భవిష్యత్తు కార్యాచరణను ఖరారు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయానికి వచ్చింది. బిల్లులో అంశాలను అధ్యయనం చేసిన తర్వాతే తెలంగాణ ప్రభుత్వం ప్రతిపాదించిన ముస్లిం రిజర్వేషన్ల బిల్లుపై తగు విధంగా ముందుకు వెళ్లాలని భావిస్తున్నారు. ఈబీసీ రిజర్వేషన్ల ప్రకటన వెలువడగానే రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు కొంత చర్చించినట్టు తెలిసింది. ముస్లిం మైనారిటీలకు 12%, ఎస్టీలకు 10% రిజర్వేషన్లు కల్పించాలని కోరుతూ తెలంగాణ అసెంబ్లీ తీర్మానాలను కేంద్రానికి పంపించినప్పటికీ వాటిపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. పైగా 50% దాటితే సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమవుతుందని రాష్ట్రానికి సమాచారం ఇచ్చింది. ఈ నేపథ్యంలో 50% నిబంధనను పక్కనబెట్టి కేంద్రమే ఈబీసీలకు పది శాతం రిజర్వేషన్లను ప్రకటించడంతో ఇందులో ఉన్న వ్యూహంపైనే రాష్ట్ర ప్రభుత్వానికి అనుమానాలు ఉన్నాయి. పార్లమెంటులో బిల్లు పెట్టి చేతులు దులుపుకొని, తమ పని పూర్తి అయ్యిందనే సిగ్నల్ ప్రజలకు ఇవ్వడానికి కేంద్రం పరిమితం అవుతుందా? దానికి చట్టరూపం తెస్తుందా? అనే అంశంపై స్పష్టత లేనందున తొందరపాటు అభిప్రాయానికి రావద్దనే ఉద్దేశంలో టీఆర్ఎస్ పెద్దలు ఉన్నట్లు సమాచారం. ఈబీసీలకు 10% రిజర్వేషన్లను కల్పించడం ద్వారా, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు అన్యాయం జరగకుండా ఎలాంటి చర్యల్ని తీసుకుంటారు? వంటి విషయాలపై కూడా స్పష్టత రావాల్సి ఉందని ప్రభుత్వ పెద్దలు భావిస్తున్నారు. రాష్ట్రాలు తమ పరిస్థితులకు అనుగుణంగా సొంత రిజర్వేషన్ విధానాన్ని అమలు చేసే అవకాశం ఉండాలని సీఎం కేసీఆర్ పలు మార్లు డిమాండ్ చేశారు. కేంద్రం తాజా నిర్ణయం నేపథ్యంలో రాష్ట్రాల్లో 50% పైన మరో పది శాతం రిజర్వేషన్లు ఆయా వర్గాలకు ఇచ్చే స్వేచ్ఛను రాష్ట్ర ప్రభుత్వాలకు కల్పిస్తారా? అనే ప్రశ్నా ఉదయిస్తోంది.

రాష్ట్రంలోనూ ఈబీసీ రిజర్వేషన్లు?

కేంద్ర ప్రభుత్వం జాతీయ స్థాయిలో ఈబీసీ రిజర్వేషన్లు ప్రకటించిన నేపథ్యంలో తెలంగాణలోనూ రాష్ట్ర స్థాయిలో ఈబీసీ రిజర్వేషన్ల కోసం ఆయా వర్గాల నుంచి ఒత్తిడి రావొచ్చు. రాష్ట్రంలోనూ ఈబీసీ రిజర్వేషన్లు కల్పిస్తే అందులో ముస్లిములకు కోటా ఉంటుంది కాబట్టి ముస్లిములకు రిజర్వేషన్లు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈబీసీ రూటును ఆశ్రయిస్తుందా? అన్న కోణంలోనూ ఊహాగానాలు సాగుతున్నాయి.

న్యాయ సమీక్షకు నిలిచేనా?

రిజర్వేషన్లకు ఆర్థిక వెనుకబాటుతనం ఒక్కటే కొలమానం కాదు

- 1992లో ఇందిరా సహానీ కేసులో తేల్చిచెప్పిన సుప్రీం కోర్టు
- 9వ షెడ్యూల్లో పెట్టినా.. రాజ్యాంగ మౌలిక సూత్రాలకు విరుద్ధమైతే సమీక్షార్హమే

న్యూఢిల్లీ, జనవరి 7: అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ల నిర్ణయం న్యాయపరీక్షకు నిలవాలని రాజ్యాంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రిజర్వేషన్లకు సంబంధించి గతంలో సుప్రీం పలు తీర్పులు ఇచ్చిందని... ప్రత్యేకించి, రిజర్వేషన్లు 50 శాతానికి మించకూడదని ఇందిరా సహానీ కేసులో సుప్రీం రాజ్యాంగ ధర్మాసనం తేల్చిచెప్పిందని గుర్తుచేస్తున్నారు. సామాజికంగా, ఆర్థికంగా వెనుకబడినవారి అభ్యున్నతికే రిజర్వేషన్లు తప్ప.. ఆర్థిక వెనుకబాటుతనం ఒక్కటే రిజర్వేషన్లు ఇవ్వడానికి ఏకైక కారణం కాకూడదని, కేవలం 'ఆర్థిక స్థితి ఆధారంగా రిజర్వేషన్లు' అనే అంశం రాజ్యాంగంలో లేదని ఆ కేసును విచారించిన తొమ్మిదిమంది సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం స్పష్టం చేసింది. ఈ అభిప్రాయం ధర్మాసనంలోని సభ్యులందరి ఏకగ్రీవ అభిప్రాయమని కూడా ప్రత్యేకంగా వెల్లడించింది. నిజానికి.. ఆర్థికంగా వెనుకబడినవారికి రిజర్వేషన్లు ఇచ్చే ప్రయత్నం ఇదే మొదటిది కాదు. 1991 సెప్టెంబరులో నాటి పీవీ నరసింహారావు ప్రభుత్వం కూడా.. పేదలకు రిజర్వేషన్ ఫలాలు అందేలా ఆఫీస్ మెమొరాండం జారీ చేసింది. కానీ, సుప్రీం కోర్టు దాన్ని 'అమల్లోకి తేదగనిది'గా ప్రకటించింది. ఈ నేపథ్యంలో.. "విధిగా అమలు చేయాల్సిన ప్రాథమిక హక్కుల పరిధిలో అగ్రవర్ణాలకు ఈ బిల్లు కోటా కల్పించనుంది. రాజ్యాంగాన్ని సవరించడానికి పార్లమెంటుకు ఉండే హక్కును రిజర్వేషన్లు 50 శాతం దాటరాదన్న సుప్రీం కోర్టు ఆదేశాలు నిలుపు చేయలేవు" అని కేంద్ర మంత్రి ఒకరు చెప్పారు. అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు కల్పించాలని రాజ్యాంగసభ కూడా పేర్కొందని ఆయన తెలిపారు. చరిత్రలో తొలిసారిగా అగ్రవర్ణ పేదలకు తాము రాజ్యాంగపరంగా గుర్తింపు ఇస్తున్నామని వివరించారు. ఈ నిర్ణయానికి సంబంధించి చేసే రాజ్యాంగ సవరణ న్యాయసమీక్షకు నిలబడుతుందా అంటే... అది న్యాయసమీక్షకు రాకుండా రాజ్యాంగంలోని షెడ్యూల్ 9లో చేర్చితే సరిపోతుందని కొందరు పేర్కొంటున్నారు. కానీ.. షెడ్యూల్ 9లో చేర్చిన చట్టాలు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు లోబడి ఉండకపోతే వాటిని సమీక్షించే హక్కు అత్యున్నత న్యాయస్థానానికి ఉన్నదని సుప్రీంకోర్టు గతంలోనే ఒక తీర్పులో వెల్లడించింది.

ఏమిటీ 9వ షెడ్యూలు..

భూసంస్కరణలకు రాజ్యాంగ రక్షణ కల్పించే ఉద్దేశంతో 1951లో నాటి నెహ్రూ సర్కారు మొదటి రాజ్యాంగ సవరణ ద్వారా ఈ తొమ్మిదో షెడ్యూలును ప్రవేశపెట్టింది. ఈ షెడ్యూలులో చేర్చే చట్టాలపై న్యాయసమీక్ష చేయడానికి అవకాశం ఉండదు. ఇప్పటివరకూ 280కి పైగా చట్టాలు ఈ షెడ్యూలులో ఉన్నాయి. రిజర్వేషన్లు 50% దాటకూడదంటూ 1992లో ఇంద్రాసాహ్నీ కేసులో సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చేనాటికే తమిళనాడులో 69% రిజర్వేషన్లు అమల్లోకి వచ్చాయి. తమిళనాడు రిజర్వేషన్ల చట్టాన్ని రద్దు చేయకుండా ఉండేందుకు నాటి కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేసి దాన్ని 9వ షెడ్యూలులో చేర్చింది. అయితే, 1973 ఏప్రిల్ 24 లోపు ఆ షెడ్యూలులో చేర్చిన చట్టాలకు మాత్రమే న్యాయసమీక్ష వర్తించదని.. ఆ తర్వాత చేర్చే చట్టాలు రాజ్యాంగ మౌలిక సూత్రాలకు భంగం కలిగించే విధంగా ఉంటే న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని పలు కేసుల విచారణలో పేర్కొంది. 2007 నాటి ఐఆర్ కోయెల్‌హో వర్సెస్ తమిళనాడు కేసు విచారణలో భాగంగా నాటి సీజేఐ వైకే సభర్వాల్ నేతృత్వంలోని ధర్మాసనం.. 9వ షెడ్యూలులో చేర్చిన చట్టాలు న్యాయసమీక్షకు అతీతం కావని స్పష్టంచేసింది.



ఆర్థిక రిజర్వేషన్ల దిశగా అడుగులు!

న్యూఢిల్లీ, జనవరి 7: ప్రపంచవ్యాప్తంగా అవకాశాల్లో ప్రధానంగా రెండు రకాల రిజర్వేషన్లు కల్పిస్తున్నారు. ఒకటి స్థానికత. రెండు ఆర్థిక వెనుకబాటుతనం. భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల వల్ల కులం ఆధారంగా ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించారు. ఆ తర్వాత రాష్ట్రాల్లో సామాజికంగా, విద్యాపరంగా వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు కల్పించారు. 1990ల్లో కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లోనూ ఓబీసీ రిజర్వేషన్లు వచ్చాయి. ఈ రిజర్వేషన్ల పరంపరలోనే అగ్రవర్ణ పేదలకు రిజర్వేషన్లు ఇవ్వాలని డిమాండ్లు వచ్చాయి. ఈబీసీ రిజర్వేషన్లు ఇస్తామని వీపీ సింగ్ సహా పలువురు రాజకీయ నాయకులు ప్రకటించారు. వివిధ కారణాల వల్ల అది కార్యరూపం దాల్చలేదు. తొలిసారి అగ్రవర్ణ పేదలకు పదిశాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మోదీ సర్కారు నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం క్రమక్రమంగా దేశాన్ని ఆర్థిక ప్రాతిపదికగా రిజర్వేషన్ల వైపు తీసుకెళ్తుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం దేశంలో కులం, జాతి ప్రాతిపదికన రిజర్వేషన్లు కొనసాగుతున్నాయి. ఇప్పటివరకు రిజర్వేషన్లు అందని వర్గాలకు మాత్రమే ఈబీసీ రిజర్వేషన్లు వర్తిస్తాయి. ఫ్రెంచ్ ఆర్థిక వేత్త థామస్ పికెటీ 2015లో ఒక పత్రికకు ఇంటర్వ్యూ ఇస్తూ, "కుల ప్రాతిపదికన రిజర్వేషన్లు ఇప్పటికిప్పుడు పోవాలని అనను. దీర్ఘకాలిక ప్రణాళికలో భాగంగా ఆర్థిక ప్రాతిపదిక రిజర్వేషన్లను కొంచెం కొంచెంగా ప్రవేశపెట్టాలి" అన్నారు. మోదీ రిజర్వేషన్లను ఇందులో తొలి అడుగుగా విశ్లేషకులు భావిస్తున్నారు. అరవింద్ పనగాడియా నేతృత్వంలో 1994-2012 మధ్యకాలంలో పేదరిక నిర్మూలన మీద అధ్యయనం చేయించగా, ఓబీసీలతో పోలిస్తే అగ్రవర్ణాల్లో పేదరికం నిర్మూలన వేగం తక్కువగా ఉందని తేలింది. దేశం ఏదో ఒక దశలో రిజర్వేషన్లకు ఆదాయాన్ని ప్రాతిపదికగా తీసుకోక తప్పదని విశ్లేషకులు అంటున్నారు. ఈబీసీ రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాత ఇప్పటికే రిజర్వేషన్లు పొందుతున్న ఇతర వర్గాల్లోనూ ఆర్థిక ప్రాతిపదికన అవకాశాలు కల్పించాలనే డిమాండ్లు పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

నేడు, రేపు కార్మికుల సార్వత్రిక సమ్మె

- ఏకపక్ష కార్మిక సంస్కరణలకు నిరసన
- 20 కోట్ల మంది విధులకు దూరం
- సింగరేణి, ఆర్టీసీ కార్మికులూ సమ్మెకు సై

న్యూఢిల్లీ/హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా వ్యవస్థీకృత, అసంఘటిత రంగాలకు చెందిన దాదాపు 20 కోట్ల మంది ఉద్యోగులు, కార్మికులు మంగళ, బుధవారాల్లో సమ్మె చేయనున్నారు. కేంద్రం ఏకపక్ష నిర్ణయాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు ఈ సమ్మెకు పిలుపునిచ్చాయి. వైద్య, బ్యాంకింగ్, రవాణా రంగాల సేవలకు అంతరాయం కలిగే అవకాశం ఉంది. సంస్థాగత, అసంఘటిత రంగాలకు చెందిన ఉద్యోగులు, కార్మికులు ఇంత భారీ సంఖ్యలో సమ్మెకు దిగడం ఇదే ప్రథమమని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి అమర్‌జీత్ కౌర్ మీడియాకు తెలిపారు. ఆరెస్సెస్ అనుబంధ సంస్థ బీఎంఎస్ మినహా సమ్మెకు పిలుపునిచ్చిన 10 ప్రధాన కేంద్ర కార్మిక సంఘాల నేతలు సోమవారం ఢిల్లీలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టెలికం, వైద్య, విద్య, బొగ్గు, ఉక్కు, విద్యుత్, బ్యాంకింగ్, బీమా, రవాణాతో పాటు మరికొన్ని రంగాల ఉద్యోగులు, కార్మికులు ఈ సమ్మెలో పాల్గొంటారని కౌర్ చెప్పారు. యూనియన్లు పెట్టిన 12 ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం తిరస్కరించిందని, కార్మిక సంఘాలతో చర్చించకుండా మోదీ ప్రభుత్వం ఏకపక్షంగా సంస్కరణలను తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తోందని ఆమె అన్నారు.

ఆర్టీసీ యూనియన్ల మద్దతు, ధర్నాలు

సమ్మెకు మద్దతు ప్రకటిస్తున్నామని తెలంగాణ మజ్దూర్ యూనియన్(టీఎంయూ)అధ్యక్షుడు తిరుపతి, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఎం.థామస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఇ.అశ్వత్థామరెడ్డి, కోశాధికారి రాజలింగం, కార్యదర్శి వి.యాదయ్య ఓ ప్రకటనలో తెలిపారు. ఈ రెండు రోజులు అన్ని డిపోల ఎదుట భోజన విరామ సమయాల్లో ఎర్ర బ్యాడ్జీలు ధరించి గేట్ ధర్నాలు నిర్వహించనున్నామని వారు వివరించారు. కేంద్రం మోటారు వాహన సవరణ బిల్లును ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, అన్ని డిపోల్లో సమ్మెను చేపట్టనున్నామని ఎంప్లాయిస్ యూనియన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్, స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్, కార్మిక పరిషత్, బహుజన వర్కర్స్ యూనియన్‌లతో కూడిన ఆర్టీసీ జేఏసీ తెలిపింది. ప్రైవేటు వాహనాలను కట్టడి చేయాలని ఈయూ ప్రధాన కార్యదర్శి కె.రాజిరెడ్డి, ఎస్‌డబ్ల్యూఎఫ్ ప్రధాన కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సమ్మెకు తాము పూర్తి మద్దతును ప్రకటిస్తున్నామని, అన్ని యూనిట్ల ముందు గేటు ధర్నాలు నిర్వహించనున్నట్లు తెలంగాణ జాతీయ మజ్దూర్ యూనియన్ ప్రధాన కార్యదర్శి హన్మంతు ముదిరాజ్ తెలిపారు. సమ్మెలో తాము కూడా పాల్గొంటున్నామని తెలంగాణ ట్యాక్సీ అండ్ డ్రైవర్స్ సంఘాల జేఏసీ చైర్మన్ షేక్ సలావుద్దీన్ ఓ ప్రకటనలో తెలిపారు. కాగా, సింగరేణిలో కొన్ని కార్మిక సంఘాలు సమ్మెకు దిగనున్నాయి. ఈ సమ్మెకు సింగరేణి గుర్తింపు సంఘం తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం దూరంగా ఉండగా... ప్రాతినిధ్య సంఘం ఏఐటీయూసీ నేతృత్వంలోని కార్మిక సంఘాల మహాకూటమి సమ్మెలో పాల్గొనే అవకాశాలున్నాయి. సమ్మెను బలపరుస్తున్నట్లు యూసీసీఆర్ఐ(ఎం-ఎల్) రాష్ట్ర కమిటీ కార్యదర్శి వినోద్ ఒక ప్రకటనలో తెలిపారు.

అనిల్ కోసం 'హాల్'కు షాక్!

- రక్షణ మంత్రివి అబద్ధాలు: రాహుల్
- మండిపడ్డ నిర్మలా సీతారామన్



న్యూఢిల్లీ, జనవరి 7: ప్రభుత్వ రంగ సంస్థ హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హాల్) స్థితిగతులపై సోమవారం లోక్‌సభ లోపల, వెలుపల రచ్చ జరిగింది. పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ కోసం ఈ సంస్థను ప్రభుత్వం బలహీనపరుస్తోందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఆరోపించారు. రక్షణ మంత్రి నిర్మలా సీతారామన్ సభలో అబద్ధాలు చెప్పారన్నారు. తన ప్రకటనపై సందేహాలు లేవనెత్తుతూ దేశాన్ని తప్పుదోవ పట్టిస్తున్నారని నిర్మల సభలోనే దుయ్యబట్టారు. 'హాల్‌కు రూ.50 వేల కోట్లతో 83 తేజస్ విమానాలు, 20 వేల కోట్ల తో 200 హెలికాప్టర్లు, రూ.3,400 కోట్ల తో 19 డోర్నియర్ విమానాలు, రూ.15 వేల కోట్లతో ఇతర రకాల హెలికాప్టర్లు, రూ.8,400 కోట్లతో ఏరో-ఇంజన్ల తయారీకి ప్రొక్యూర్‌మెంట్ ఆదేశం ఇచ్చాం. ఇవన్నీ కలిపి రూ.లక్ష కోట్ల వరకు ఉన్నాయి. వీటికి సంబంధించిన పత్రాలు చూస్తే కాంగ్రెస్ సందేహాలకు సమాధానం లభిస్తుంది' అన్నారు. అయితే హాల్‌కు ఒక్క రూపాయి కూడా చేరలేదని, మంత్రి అబద్ధాలాడారని రుజువైందని రాహుల్ సోమవారం లోక్‌సభ వెలుపల అన్నారు. రూ.73 వేల కోట్ల కాంట్రాక్టులు క్లియరెన్సు దశలో ఉన్నాయనడం బోగస్‌గా పేర్కొన్నారు. జరిగిన దొంగతనానికి చౌకీదార్ (మోదీ) సత్కారం పొందారని ఆరోపించారు.

'నవోదయ'లో మరో 5 వేల సీట్లు

న్యూఢిల్లీ, జనవరి 7: జవహర్ నవోదయ విద్యాలయాల్లో మరో 5 వేల సీట్ల పెంపుదలకు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ సోమవారం ఆమోదముద్ర వేశారు. ఈ అదనపు సీట్లను 2019-20 విద్యా సంవత్సరం నుంచి భర్తీ చేస్తారు. దేశవ్యాప్తంగా ఉన్న నవోదయ రెసిడెన్షియల్ స్కూళ్లలో గత నాలుగేళ్లలో 9 వేల సీట్లు పెరగడంతో మొత్తం సీట్ల సంఖ్య 51 వేలకు చేరింది. కొత్త జిల్లాల్లో నవోదయ విద్యాలయాలను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది.



పౌరసత్వ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ గౌహతిలో కాంగ్రెస్ కార్యకర్తల నిరసన

ఈశాన్యంలో గేట్లెత్తిన భారత్!

ముస్లిమేతరులకు పౌరసత్వం.. 3 దేశాల అక్రమ వలసదారులకు 'పౌరసత్వ' బిల్లుకు కేబినెట్ ఓకే

- నేడు లోక్‌సభకు బిల్లు
- తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విపక్షాలు
- అసోంలో వెల్లువెత్తిన నిరసనలు
- బీజేపీ సర్కారుకు ఏజీపీ గుడ్‌బై
- నేడు 'ఈశాన్య' బంద్‌కు పిలుపు

న్యూఢిల్లీ, జనవరి 7: కేంద్ర ప్రభుత్వం ఈశాన్య రాష్ట్రాల్లో 'పౌరసత్వ' గేట్లు ఎత్తేసింది! బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్ దేశాల నుంచి వలస వచ్చిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వాన్ని కల్పించేందుకు వీలుగా సవరణలు చేస్తూ రూపొందించిన 'పౌరసత్వ చట్టసవరణ బిల్లు-2016'కు కేంద్ర కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ప్రధాని మోదీ అధ్యక్షతన సోమవారమిక్కడ జరిగిన మంత్రివర్గభేటీలో ఈ బిల్లును ఆమోదించారు. మంగళవారం లోక్‌సభలో బిల్లును ప్రవేశపెట్టనున్నారు. భారత పౌరసత్వాన్ని మతం ఆధారంగా కేటాయించరాదని, అది రాజ్యాంగ విరుద్ధమని జేపీసీలోని ప్రతిపక్ష సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేశారు. శివసేన, జేడీయూ కూడా ఈ బిల్లును వ్యతిరేకించాయి. బీజేపీ ఎంపీ రాజేంద్ర అగర్వాల్ నేతృత్వంలోని జేపీసీ మాత్రం కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాన్ని అభినందిస్తున్నట్లు తెలిపింది. బంగ్లా, పాక్, అఫ్గాన్‌ల్లో మైనారిటీలుగా ఉంటూ వివక్షకు గురైన ప్రజలకు ఈ నిర్ణయంతో ఊరట లభిస్తుందని 440 పేజీల నివేదికలో వెల్లడించింది. పౌరసత్వ చట్టం-1955 ప్రకారం బంగ్లాదేశ్, అఫ్గానిస్థాన్, పాకిస్థాన్‌ల నుంచి వచ్చిన హిందువులు, సిక్కులు, బౌద్ధులు, జైనులు, పార్శీలు, క్రైస్తవులకు గతంలో 12 ఏళ్ల నివాసం ఉంటేనే భారత పౌరసత్వం ఇచ్చేవారు. ఇకపై వారు భారత్‌లో ఆరేళ్లు నివాసం ఉంటే చాలు.. ఎలాంటి ధ్రువపత్రాలు లేకపోయినప్పటికీ భారత పౌరసత్వాన్ని ఇచ్చేలా సవరణ చేస్తూ తాజా బిల్లును రూపొందించారు. 2014 ఎన్నికల్లో బీజేపీ ఇచ్చిన హామీ మేరకు ఈ సవరణ చేశారు. పౌరసత్వ చట్ట సవరణ బిల్లును ఆమోదించకపోతే అసోంలో రాబోయే ఐదేళ్లలోనే హిందువులు మైనారిటీలుగా మారిపోతారని ఆ రాష్ట్ర ఆర్థిక మంత్రి హిమంత బిస్వా శర్మ వ్యాఖ్యానించారు. బిల్లు ఆమోదం పొందకపోతే అసోం మరో కశ్మీరులా మారాలని కోరుకునే శక్తులకు ఉపయుక్తంగా ఉంటుందని చెప్పారు.

నిరసనల హోరు..

పౌరసత్వ బిల్లును వ్యతిరేకిస్తూ విద్యార్థి సంఘాలు ఈశాన్య రాష్ట్రాల బంద్‌కు పిలుపునిచ్చాయి. మంగళవారం 11 గంటల పాటు బంద్ చేయనున్నట్లు ప్రకటించాయి. అసోంలో కాంగ్రెస్ సహా పలు పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శనలు చేపట్టారు. ప్రధాని మోదీ, సీఎం సోనోవాల్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. క్రిషక్ ముక్తి సంగ్రామ సమితి(కేఎంఎస్ఎస్), మరో 30 తెగల సంబంధిత సంస్థలు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనకు దిగాయి.

బీజేపీపై ఏజీపీ ఆగ్రహం..

మరోవైపు బిల్లును వ్యతిరేకిస్తూ ఎన్డీయే భాగస్వామ్య పక్షం అసోం గణపరిషత్(ఏజీపీ) అసోంలో బీజేపీ ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరిస్తున్నట్లు ప్రకటించింది. లోక్‌సభలో ఈ బిల్లును ఆమోదించి తీరతామని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ స్పష్టం చేయడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఏజీపీ అధ్యక్షుడు, మంత్రి అతుల్ బోరా తెలిపారు. సర్బానంద సోనోవాల్ ప్రభుత్వంలో ఏజీపీకి ముగ్గురు మంత్రులుండగా.. ఎవరూ రాజీనామాలు చేయకపోవడం గమనార్హం. ఏజీపీ నిర్ణయం బాధాకరమని, ఆ పార్టీ కాంగ్రెస్ ఉచ్చులో పడిందని బీజేపీ పేర్కొనగా.. ఏజీపీ నిర్ణయాన్ని కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు స్వాగతించాయి. ఏజీపీ వైదొలగడం వల్ల బీజేపీ సర్కారుకు వచ్చిన ఇబ్బందేమీ లేదు. అసోంలో 126 స్థానాలకుగాను బీజేపీకి 61, ఏజీపీ 14, బీపీఎఫ్ 12 సీట్లున్నాయి. బీజేపీకి బీపీఎఫ్‌తో పాటు ఓ స్వతంత్ర ఎమ్మెల్యే కూడా మద్దతిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి స్పోర్ట్స్
నిజామాబాద్ • మంగళవారం 8 జనవరి 2019



చరిత మరువదు మీ ఘనత!

1
భారత్ తరఫున అత్యధిక (4) విదేశీ టెస్టు సిరీస్‌లు గెలిచిన కెప్టెన్‌గా గంగూలీతో సమంగా నిలిచాడు విరాట్. అలాగే ఆసీస్‌లో సిరీస్ నెగ్గిన తొలి ఆసియా కెప్టెన్ కోహ్లీనే.

- భారత్ చిరస్మరణీయ విజయం
- ఆస్ట్రేలియాపై 2-1తో సిరీస్ కైవసం
- ఆఖరి రోజు సాగని ఆట • నాలుగో టెస్టు డ్రా



సాహోరే.. టీమిండియా..సాహో!
చరిత మరువదు..మీ అసమాన ఘనత!!
సిరీస్ సాధనతో మీకు దక్కేను ఎనలేని భవిత!!!
అభిమాని మదిలో మీ ఎడల మెదలు సదా కృతజ్ఞత..!!!!

ఆహా.. ఏమని వర్ణించగలం ఈ విజయాన్ని..
ఎంతని చెప్పగలం భారత క్రికెటర్ల పోరాటాన్ని..
ఒకటా.. రెండా ఏకంగా ఏడు దశాబ్దాల ఎదురుచూపులకు
తెర పడిన రోజు ఇది..

1947-48లో లాలా అమర్‌నాథ్ నుంచి మరెంతో మంది దిగ్గజాలు జట్టును నడిపించినా ఎవరికీ సాధ్యం కాలేదు.. ఇదిగో.. ఇన్నాళ్లకు విరాట్ కోహ్లీ సేన మనందరినీ తలెత్తుకునేలా చేసింది. 71 ఏళ్లుగా కంగారూ నేలపై టెస్టు సిరీస్ కోసం సాగిస్తున్న వేట 12వ ప్రయత్నంలో ఫలించింది. అవును.. భీకర బ్యాటింగ్, బౌలింగ్‌తో పాటు మునుపెన్నడూ కనిపించని ఆత్మవిశ్వాసంతో ఆడిన టీమిండియా 2-1 తేడాతో ఆతిథ్య జట్టును మట్టికరిపించింది.

ఇన్నాళ్లుగా విదేశీ పర్యటనలకు వెళ్లామా.. వచ్చామా.. అంతే ముఖ్యంగా ఆసీస్ గడ్డపై టెస్టు సిరీస్ అంటే చాలు.. గెలుపు గురించి ఆలోచనే ఉండేది కాదు.. కానీ ఈసారి అలా కాదు.. ఇన్నాళ్లూ ఒకేలా సాగిన స్క్రిప్ట్‌ను తిరగరాసి, ఆసీస్‌కు కొత్త సినిమా చూపించింది. నాలుగు టెస్టుల సిరీస్‌లో తొలి మ్యాచ్‌లో విజయం సాధించినపుడే ప్రత్యర్థికి ప్రమాద ఘంటికలు మోగాయి. నయా వాల్ పుజారా తిరుగులేని ఫామ్.. వణికించే బౌలింగ్ బలగంతో ఆసీస్‌ను కంగారెత్తించారు. టెస్టుల్లో నెంబర్‌వన్‌గా ఉన్నా విదేశీ గడ్డపై రాణించడం లేదనే విమర్శలకు టీమిండియా సమాధానమిచ్చింది. ఇక్కడ సిరీస్ గెలిచిన తొలి భారత జట్టే కాదు.. తొలి ఆసియా జట్టుగానూ నిలిచింది. అందుకే ఈ విజయం మధురం.. మధురాతి మధురం.

జయహో.. భారత్!

ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం

భారత క్రికెట్ చరిత్రలో విరాట్ కోహ్లీ సేన సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. ఆస్ట్రేలియా గడ్డపై తొలిసారి టెస్టు సిరీస్‌ను గెలుచుకున్న టీమిండియాగా నిలిచింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన కొద్ది రోజుల నుంచి ఎదురుచూస్తున్న కల చివరికి 71 ఏళ్ల తర్వాత ఫలించింది. సోమవారం సిడ్నీ క్రికెట్ మైదానంలో నాలుగో టెస్టు డ్రాగా ముగిసింది. ఇప్పటికే రెండు విజయాలతో ఉన్న భారత్ సిరీస్‌ను 2-1తో గెలుచుకుని బోర్డర్-గవాస్కర్ ట్రోఫీని ముద్దాడింది. అడిలైడ్‌లో జరిగిన తొలి టెస్టులో భారత్ నెగ్గగా ఆ తర్వాత పెర్త్‌లో ఆస్ట్రేలియా మ్యాచ్ గెలిచి సిరీస్‌ను సమం చేసింది. ఇక మెల్‌బోర్న్ టెస్టులో చెలరేగిన భారత్ రెండో విజయంతో పట్టు సాధించిన విషయం తెలిసిందే. 6/0 స్కోరుతో ఫాలో ఆన్‌లో ఉన్న ఆసీస్‌ను చివరి రోజు ఆలౌట్ చేసి మరో విజయాన్ని ఖాతాలో వేసుకుందామని భావించిన భారత్‌కు మళ్లీ వరుణుడు అడ్డు తగిలాడు. ఉదయం నుంచే భారీ వర్షం కురవడంతో రెండు సెషన్ల ఆట వీలు కాలేదు. చివరికి నాలుగున్నర గంటల తర్వాత అంపైర్లు మ్యాచ్ రద్దును ప్రకటించారు. ఈ మ్యాచ్‌లో భారత్ తొలి ఇన్నింగ్స్‌ను 622/7 పరుగుల వద్ద డిక్లేర్ చేయగా ఆసీస్ 300 రన్స్‌కు ఆలౌటైంది. 322 పరుగుల లోటుతో ఆసీస్ ఫాలోఆన్‌కు బరిలోకి దిగగా రెండు రోజుల పాటు కురిసిన వర్షంతో మ్యాచ్ డ్రాగా ముగించాల్సి వచ్చింది. చటేశ్వర్ పుజారాకు మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్‌తో పాటుమూడు శతకాలతో రాణించినందుకు మ్యాన్ ఆఫ్ ద సిరీస్ కూడా దక్కింది.

ఉత్తమ పర్యాటక జట్టే...: భారత టెస్టు చరిత్రలో ఆసియాకు ఆవల సాధించిన సిరీస్ విజయాలను వేళ్ల మీద లెక్కపెట్టవచ్చు. వీటిలో అజిత్ వాడేకర్ నేతృత్వంలో 1971లో వెస్టిండీస్, ఇంగ్లండ్‌లలో సిరీస్.. కపిల్ కెప్టెన్సీ (1986), ద్రావిడ్ (2007) కెప్టెన్సీలో ఇంగ్లండ్‌పై టెస్టు సిరీస్‌లు ముఖ్యమైనవి. ఇప్పుడు వీటిని తలదన్నే విజయం భారత్ ఖాతాలో చేరింది. గతేడాది జట్టు దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ టూర్‌లకు వెళ్లి 1-2, 1-4 తేడాతో ఓడింది. విమర్శలు తీవ్రమైన నేపథ్యంలో కోచ్ రవిశాస్త్రి ఘాటుగా స్పందించాడు. గత 15ఏళ్లలో భారతే అత్యుత్తమ పర్యాటక జట్టుగా తేల్చి చెప్పాడు. ఈ కామెంట్‌పై అప్పుడు విమర్శలు వచ్చినా ఇప్పుడు జట్టు న్యాయం చేసింది. ఆసియా జట్లలో ఇప్పటివరకు సాధ్యం కాని విజయం దక్కించుకుంది. 12సార్లు ఆస్ట్రేలియాలో పర్యటించిన భారత్ మూడుసార్లు (1980-81, 1985-86, 2003-04) సిరీస్‌ను డ్రా చేసుకుంది. ఇన్నాళ్లకు సిరీస్ విజయాన్ని అందుకుంది. ఇక్కడ చివరిసారి పర్యటించినప్పుడు కోహ్లీ తొలిసారి కెప్టెన్‌గా వ్యవహరించాడు. బ్యాటింగ్‌లో పరుగుల వరద పారించినా జట్టును గెలిపించలేకపోయాడు. ఈసారి కథ మారింది. పుజారా, పంత్, బుమ్రా, షమి, మయాంక్‌ల విలువైన సహకారం జట్టును ఉన్నతస్థితికి చేర్చింది. స్మిత్, వార్నర్ లేని బలహీన జట్టుపై గెలిచిందనే విమర్శలు వినిపిస్తున్నా.. ఇప్పటికీ ఆసీస్ జట్టు పేస్ బలం తక్కువేమీ కాదనే విషయం గమనించాలి.

తేడా పుజారానే..: ఈ సిరీస్ విజయానికి గట్టి పునాది వేసింది పుజారానే.. సిరీస్‌కు ముందు అంతా కోహ్లీ జపం చేసినా అతడు నిశ్శబ్దంగా యుద్ధాన్ని ముగించాడు. తొలిటెస్టు నుంచే జట్టు బ్యాటింగ్‌కు వెన్నెముకలా నిలబడ్డాడు. ఆసీస్‌లో సిరీస్ ఆరంభ టెస్టును గెలవడం పుజారా పుణ్యమే. అడిలైడ్‌లో జరిగిన తొలి టెస్టులో 123, 71 రన్స్ చేసి కీలకపాత్ర పోషించాడు. అయితే రెండో మ్యాచ్‌లో అతడు విఫలమవడం జట్టును దెబ్బతీసింది. తిరిగి పెర్త్, సిడ్నీలో అతడి భారీ సెంచరీలు జట్టును తిరుగులేనిస్థాయిలో నిలిపాయి. మొత్తంగా 74.43 సగటుతో 521 పరుగులు సాధించాడు.

పంత్ తక్కువేమీ కాదు..: 25, 28, 36, 30, 39, 33, 159 నాటౌట్.. ఇవీ ఏడు ఇన్నింగ్స్‌లో రిషభ్ పంత్ సాధించిన స్కోర్లు. అలాగే ఈ సిరీస్‌లో 20 క్యాచ్‌లు పట్టాడు. సిడ్నీ టెస్టులో పుజారాతో కలిసి ఇన్నింగ్స్ నిర్మించిన తీరు అతడిలోని పరిణతిని చాటింది. నెమ్మదిగా ఇన్నింగ్స్ ఆరంభించి ఆ తర్వాత పిడుగుల్లాంటి షాట్లతో విరుచుకుపడ్డాడు. ఆసీస్‌లో సెంచరీ సాధించిన తొలి భారత వికెట్ కీపర్‌గా నిలిచాడు. ఇక మయాంక్ రూపంలో టెస్టుల్లో ఓపెనింగ్ సమస్య తీరినట్టే.

అత్యుత్తమ బౌలింగ్ ..: బుమ్రా, షమి, ఇషాంత్ సమష్టిగా ఆస్ట్రేలియా వెన్నువిరిచారు. దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్ పర్యటనల్లోనూ అంచనాలకు మించి రాణించారు. ముఖ్యంగా ఎంసీజీలో 6 వికెట్లతో జట్టుకు కీలక విజయాన్ని అందించిన బుమ్రా.. మొత్తం 21 వికెట్లతో టాప్‌లో నిలిచాడు. పెర్త్ టెస్టులో షమి కెరీర్‌లో తొలిసారిగా ఆరు వికెట్లతో రాణించి మొత్తం 16 వికెట్లు పడగొట్టగా.. ఇషాంత్ 11 వికెట్లు తీశాడు. ఈ ముగ్గురు కలిసే 48 వికెట్లు తీయడం భారత పేస్ బలాన్ని చూపుతోంది.

సంక్షిప్త స్కోర్లు

భారత్ తొలి ఇన్నింగ్స్: 622/7 డిక్లేర్డ్.
ఆసీస్ తొలి ఇన్నింగ్స్: 300 ఆలౌట్; రెండో ఇన్నింగ్స్ (ఫాలో ఆన్): 6/0



విరుష్క 'విక్టరీ వాక్'

టీమిండియా సిరీస్ గెలిచాక మైదానంలో కోహ్లీ, అనుష్క శర్మ దంపతులు విజయగర్వంతో నడిచిన తీరు అభిమానులను విపరీతంగా ఆకర్షించింది. సిరీస్ గెలిచిన అనంతరం అనుష్క మైదానంలోకి వచ్చి కోహ్లీని గట్టిగా హత్తుకుంటూ 'నిన్ను చూస్తుంటే గర్వంగా ఉంది మైలవ్' అంటూ అభినందించింది. గతంలో టీమిండియా మ్యాచ్‌లకు అనుష్క హాజరైతే 'ఐరెన్ లెగ్' అని కామెంట్లు వినిపించాయి. కానీ, ఆసీస్‌లో విజయం తర్వాత అనుష్క భుజంపై చెయ్యి వేసి కోహ్లీ మాట్లాడుకుంటూ వెళ్తున్న వీడియో వైరల్‌గా మారింది. వారిద్దరూ 'విక్టరీ వాక్' చేస్తున్నారంటూ నెటిజన్లు పొగుడుతున్నారు.



కోహ్లీ సేన స్టెప్పులు

విక్టరీ సంబరాలను కోహ్లీ సేన వినూత్న రీతిలో జరుపుకొంది. సిడ్నీ గ్రౌండ్‌లో కీపర్ పంత్ కొరియోగ్రాఫర్‌గా డ్యాన్స్ కంపోజ్ చేయగా.. భారత ఆటగాళ్లు అనుగుణంగా స్టెప్పులేసి సందడి చేశారు. శతకాలతో అదరగొట్టిన పుజారా మాత్రం కాలు కదిపేందుకు ఇబ్బందిపడ్డాడు. పుజారా స్టెప్పుల గురించి అడిగితే.. విరాట్ కూడా నవ్వు ఆపుకోలేకపోయాడు. 'అది పుజారా డ్యాన్స్. అతడు నడిచేటప్పుడు చేతులు కదిలించడ'ని మీడియా సమావేశంలో కోహ్లీ చెప్పాడు. ఆ తర్వాత భారత్ ఆర్మీతో కలిసి కోహ్లీ సేన భాంగ్రా స్టెప్పులేసి అలరించింది.

చరిత్రాత్మక సిరీస్ విజయంలో స్టార్ల ప్రదర్శన ఇలా..

బ్యాట్స్‌మన్	మ్యా	ఇ	ప	అ.స్కో	స
పుజారా	4	7	521	193	74.42
పంత్	4	7	350	159*	58.33
కోహ్లీ	4	7	282	123	40.28
బౌలర్	**మ్యా**	**వి**	**అత్యు**	**స**	**ఎ**
బుమ్రా	4	21	6/33	17.00	2.27
షమి	4	16	6/56	26.18	3.06
ఇషాంత్	3	11	4/41	23.81	2.54

గమనిక: మ్యా- మ్యాచ్‌లు; ఇ-ఇన్నింగ్స్; ప-పరుగులు; అ.స్కో- అత్యధిక స్కోరు; స-సగటు; వి: వికెట్లు; అత్యు- అత్యుత్తమం; ఎ-ఎకానమీ

ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, ఇంగ్లండ్‌లలో భారత్ సిరీస్ విజయాలు

ఎప్పుడు	ఎవరితో	ఎంత తేడా
1967-68	న్యూజిలాండ్‌పై	3-1
1971	ఇంగ్లండ్‌పై	1-0
1986	ఇంగ్లండ్‌పై	2-0
2007	ఇంగ్లండ్‌పై	1-0
2008-09	న్యూజిలాండ్‌పై	1-0
2018-19	ఆస్ట్రేలియాపై	2-1

విదేశాల్లో కోహ్లీ కెప్టెన్సీలో విజయాలు

2015	శ్రీలంకపై	2-1
2016	వెస్టిండీస్‌పై	2-0
2017	శ్రీలంకపై	3-0
2018-19	ఆస్ట్రేలియాపై	2-1

వరల్డ్ కప్ కంటే ప్రత్యేకం

ఆస్ట్రేలియాపై సిరీస్ విజయం నా కెరీర్‌లో పెద్దది. 2011 వరల్డ్‌కప్ కంటే ఈ విజయం నాకు ఎంతో ప్రత్యేకమైంది. విశ్వకప్ నెగ్గినా ఇంతటి భావోద్వేగానికి లోనుకాలేదు. ఆసీస్‌లో నెగ్గడం ఎంత కష్టమో తెలుసు. 12 నెలలుగా పడిన కష్టానికి దక్కిన ప్రతిఫలం. మెల్‌బోర్న్‌లో విహారి ఓపెనర్‌గా 70 బంతులు ఆడడం భారీ ఇన్నింగ్స్ కంటే తక్కువేం కాదు. వన్‌మ్యాచ్ వండర్‌గా కాకుండా సిరీస్ నెగ్గాలని జట్టంతా పట్టుదలతో పోరాడింది. వ్యూహం ప్రకారం ఆడి ఫలితాన్ని సాధించాం. బౌలర్ల అద్భుత ప్రదర్శనను చూసి గర్విస్తున్నా. ప్రస్తుత బౌలర్లపై భారం తగ్గించడానికి మరో ముగ్గురు పేసర్లు అవసరం. వారిని వెలికితీసి జట్టు అవసరాలకు అనుగుణంగా సానబెట్టుకుంటాం. బుమ్రా లాంటి వారికి తగినంత విశ్రాంతి నివ్వాలని భావిస్తున్నాం.

- విరాట్ కోహ్లీ

భారత్ మహాన్..!

71 ఏళ్లు.. 31 సిరీస్‌లు.. 98 టెస్టులు.. 272 మంది ఆటగాళ్లు.. 29 మంది కెప్టెన్లు.. ఇదీ ఇప్పటిదాకా ఆస్ట్రేలియా గడ్డపై ఆసియా జట్ల పర్యటన టెస్ట్ చరిత్ర. కానీ.. వీళ్లెవరికీ సాధ్యం కాని ఘనతను విరాట్ కోహ్లీ సారథ్యంలోని టీమిండియా సాధించింది. కంగారూలను వాళ్ల స్వదేశంలో చిత్తు చేసి సిరీస్ అందుకున్న ఏకైక జట్టుగా కోహ్లీసేన కొత్త చరిత్ర లిఖించింది.

ఆస్ట్రేలియాలో ఆసియా జట్ల రికార్డు

జట్టు	ఆ.సి	గె	ఓ	డ్రా
భారత్	12	1	8	3
పాకిస్థాన్	12	0	9	3
శ్రీలంక	6	0	6	0
బంగ్లాదేశ్	1	0	1	0

గమనిక: జ- జట్టు; ఆ.సి-ఆడిన టెస్ట్ సిరీస్‌లు; గె-గెలుపు; ఓ-ఓటమి

అద్భుతం..ఈ విజయం!

ఆస్ట్రేలియాలో తొలిసారి సిరీస్ నెగ్గిన కోహ్లీ, భారత జట్టుకు శుభాకాంక్షలు. పట్టుదలతో బ్యాటింగ్.. అద్భుతమైన బౌలింగ్, సమష్టి కృషితో మమ్మల్ని గర్వపడేలా చేశారు. **- రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్**

భారత జట్టుకు అభినందనలు. ఇది తప్పకుండా కోహ్లీ నేతృత్వంలోని జట్టు సమష్టి కృషి. **- ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు**

టీమిండియాకు శుభాకాంక్షలు. ఆస్ట్రేలియాలో క్రికెట్ చరిత్ర సృష్టించారు. సమష్టి పోరాటం, చిరకాలం గుర్తుండే ప్రదర్శనకు ఈ సిరీస్ తార్కాణం. అద్భుత విజయానికి టీమిండియా ఎంతో అర్హమైనది.

- ప్రధాని నరేంద్ర మోదీ

భారత క్రికెట్‌కు ఎంతో అద్భుతమైన రోజు. పట్టుదలతో అడ్డంకులను అధిగమించిన టీమిండియా సంబరాలను అందించింది. మిమ్మల్ని చూసి గర్విస్తున్నాం. జూనియర్లు, సీనియర్లు అందరూ బాధ్యతలను పంచుకొని అద్వితీయ విజయాన్ని అందించారు. రిషభ్ పంత్ రాటుదేలుతుండగా.. కుల్దీప్ ఆకట్టుకున్నాడు.

- సచిన్ టెండూల్కర్

అపూర్వ విజయం సాధించిన టీమిండియాకు శుభాకాంక్షలు. మైదానంలో మీ ప్రతిభ ఎంతో సంతృప్తి, ఆనందాన్నిచ్చింది.

-వీవీఎస్ లక్ష్మణ్

చిరస్మరణీయ విజయానికి అభినందనలు. ఈ గెలుపుతో దేశంలోని ప్రతి క్రికెట్ అభిమాని గర్విస్తున్నాడు.

-వీరేంద్ర సెహ్వాగ్



'83' విజయంతో సమానం: శాస్త్రి

భారత జట్టుపై తరచూ విమర్శలు చేస్తున్న వారికి కోచ్ రవిశాస్త్రి కౌంటర్ ఇచ్చాడు. టీమిండియా సెలెక్షన్, ట్రైనింగ్‌ను ప్రశ్నించిన గవాస్కర్ సహా అనేక మందికి ఘాటుగా సమాధానమిచ్చాడు. 'పరిస్థితులపై అవగాహన లేకుండా విమర్శలు చేస్తున్నారని మెల్‌బోర్న్‌లో నేను చేసిన కామెంట్ జోక్ కాదు. జట్టు ఎంత కష్టపడిందో నాకు తెలుసు. ఎక్కడి నుంచో విమర్శలు విసిరితే అవి గాల్లోనే కలసి పోతాయ'ని మ్యాచ్ అనంతరం శాస్త్రి వ్యాఖ్యానించాడు. గత భారత జట్లతో పోల్చితే ఈ టీమ్‌కు ఓ ప్రత్యేక గుర్తింపు ఉందని తాను గర్వంగా చెప్పగలనన్నాడు. సిరీస్ విజయం 1983 వరల్డ్‌కప్ అంతటిదని అన్నాడు.

వాళ్లిద్దరూ ఆడకపోతే.. మన తప్పా!: సునీల్ గవాస్కర్

టీమిండియా చారిత్రక విజయాన్ని తక్కువ చేసి చూపే ప్రయత్నం చేస్తున్న విమర్శలను సునీల్ గవాస్కర్ తిప్పికొట్టాడు. స్మిత్, వార్నర్‌పై నిషేధం పడకుండా ఉండి ఉంటే.. పరిస్థితులు మరో రకంగా ఉండేవని వ్యాఖ్యానించిన కొందరికి చురకంటించాడు. వాళ్లిద్దరికీ ఆసీస్ జట్టులో చోటు లభించక పోవడంలో భారత జట్టు తప్పిదమేమీ లేదని ఘాటుగా సమాధానమిచ్చాడు.



సన్ వాన్ హో

అవధె.. అదిరె

చెన్నైపై వారియర్స్ గెలుపు

బెంగళూరు: ప్రీమియర్ బ్యాడ్మింటన్ లీగ్ (పీబీఎల్)లో చెన్నై స్మాషర్స్‌తో జరిగిన పోరులో 4-3 తేడాతో అవధె వారియర్స్ నెగ్గింది. 3-3తో స్కోరు సమంగా ఉన్న దశలో మాజీ నెంబర్‌వన్ సన్ వా న్ హో 15-6, 15-6తో రాజీవ్ ఔసెఫ్‌పై నెగ్గి జట్టుకు విజయాన్ని అందించాడు. అంతకుముందు పురుషుల డబుల్స్‌ను అవధె ట్రంప్ మ్యాచ్‌గా తీసుకోగా ఆ జట్టు జోడీ లీ యాంగ్-మథియాస్ 15-8, 15-6తో అడ్‌కాక్-సుమీత్ జంటపై నెగ్గింది. పురుషుల సింగిల్స్‌లో లీ డాంగ్ కూన్ 15-7, 15-13తో చోంగ్ వీ ఫెంగ్‌పై గెలిచి అవధెకు 3-0 ఆధిక్యం అందించాడు. మహిళల సింగిల్స్‌ను చెన్నై ట్రంప్ మ్యాచ్‌గా తీసుకోగా సంగ్ జి హ్యాన్ 15-13, 15-8తో జాంగ్‌పై నెగ్గి 2పాయింట్లు అందించింది. ఆ తర్వాత మిక్స్‌డ్‌లో అడ్‌కాక్-గాబ్రియెల్ 15-13, 15-9, 15-14తో మథియాస్-అశ్విని పొన్నప్పపై గెలిచి స్కోరును 3-3తో సమం చేశారు. దీంతో ఆఖరి మ్యాచ్ కీలకంగా మారినా అవధె గట్టెక్కింది.

పీబీఎల్‌లో నేడు
బెంగళూరు x ముంబై
స్టార్ స్పోర్ట్స్-1లో
(రా. 7 గం)

ఆంధ్ర 132 ఆలౌట్

ఇండోర్: రంజీ గ్రూప్ దశలోని తమ ఆఖరి మ్యాచ్‌ను కూడా ఆంధ్ర జట్టు పేలవంగా ఆరంభించింది. సోమవారం ప్రారంభమైన మ్యాచ్‌లో టాస్ కోల్పోయి బ్యాటింగ్‌కు దిగిన ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 54.3 ఓవర్లలో 132 పరుగులకే కుప్పకూలింది. ఈశ్వర్ పాండే (4/15), గౌరవ్ యాదవ్ (3/21), కార్తికేయ (3/23) పర్యాటక బ్యాట్స్‌మెన్‌కు చుక్కలు చూపించారు. ప్రశాంత్ కుమార్ (76 బంతుల్లో 29) టాప్ స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం బరిలోకి దిగిన మధ్యప్రదేశ్ బ్యాట్స్‌మెన్ కూడా తడబడ్డారు. తొలి రోజు ఆట ముగిసేసరికి ఎంపీ జట్టు 13 ఓవర్లలో మూడు వికెట్ల నష్టానికి 24 పరుగులు చేసింది. గిరినాథ్ రెడ్డి, విజయ్ కుమార్, మనీష్ తలో వికెట్ తీశారు. క్రీజులో రజత్ పటేదార్ (19) ఉన్నాడు.

ఐన్‌స్టీన్ సిద్ధాంతాలన్నీ తప్పే

- గురుత్వ వికర్షణ శక్తులను.. న్యూటన్ అర్థం చేసుకోలేకపోయాడు
- 106వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్‌లో భారత శాస్త్రవేత్తల వాదన

న్యూఢిల్లీ, జనవరి 7: సాపేక్ష సిద్ధాంతం.. e=mc^2.. కాంతి విద్యుత్తు ప్రభావం.. ఇలా ఎన్నో ప్రతిపాదనలకు, ఆవిష్కరణలకు మూల పురుషుడు ఆల్బర్ట్ ఐన్‌స్టీన్. ఓ విధంగా చెప్పుకోవాలంటే ఆయన వల్లే భౌతిక శాస్త్రం కొత్త పుంతలు తొక్కింది. కానీ, ఆయన సిద్ధాంతాలు తప్పుల తడకగా ఉన్నాయని అంటున్నారు కొందరు భారత శాస్త్రవేత్తలు. ఇక, న్యూటన్ కూడా గురుత్వ వికర్షణ శక్తులను అర్థం చేసుకోవడంలో దారుణంగా విఫలమయ్యాడని వాదిస్తున్నారు. 106వ ఇండియన్ సైన్స్ కాంగ్రెస్ వేదికగా పలువురు భారత శాస్త్రవేత్తలు చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం సంచలనం సృష్టిస్తున్నాయి. దక్షిణ భారత్‌కు చెందిన ఓ వర్సిటీ అధ్యాపకుడు మూలకణ పరిశోధనను వేల ఏళ్ల క్రితమే ప్రాచీన హిందువులు కనుగొన్నారని, పరిశోధనలు చేశారని చెబుతూ అందుకు ఓ హిందూ గ్రంథాన్ని రుజువుగా పేర్కొన్నారు. ఆంధ్రా వర్సిటీ వైస్ చాన్సలర్ జీ.నాగేశ్వర్‌రావు మాట్లాడుతూ రామాయణంలో 24 రకాల విమానాల తయారీ పద్ధతులు ఉన్నాయని, దానికి సంబంధించిన నెట్‌వర్క్ ల్యాండింగ్ స్ట్రిప్స్ శ్రీలంకలో ఉన్నాయని చెప్పారు. తమిళనాడుకు చెందిన ఓ వర్సిటీ అధ్యాపకుడు డాక్టర్ కేజే కృష్ణన్ మాట్లాడుతూ న్యూటన్, ఐన్‌స్టీన్ ఇద్దరి సిద్ధాంతాలూ తప్పేనని, గురుత్వాకర్షణ తరంగాలకు నరేంద్ర మోదీ తరంగాలు అని పేరు పెట్టాలని అన్నారు. ఐన్‌స్టీన్ సిద్ధాంతాలు తప్పుదారి పట్టించేలా ఉన్నాయని, న్యూటన్ గరుత్వ వికర్షణ శక్తులను అర్థం చేసుకోవడంలో విఫలమయ్యాడని తెలిపారు. కాగా, ఈ శాస్త్రవేత్తల అభిప్రాయాలపై భారత సైంటిఫిక్ కాంగ్రెస్ అసోసియేషన్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆ వ్యాఖ్యలు వారి వ్యక్తిగతమని, వాటి నుంచి తాము దూరంగా ఉంటున్నట్లు పేర్కొంది.



సీఈఆర్‌సీ వద్దే తేల్చుకోండి!

‘ఉమ్మడి’ విద్యుత్ వివాదాలపై హైకోర్టు ఉమ్మడి ధర్మాసనం ఉత్తర్వు.. వ్యాజ్యాల కొట్టివేత.. 51 పేజీల తీర్పు

హైదరాబాద్, జనవరి 7(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి రాష్ట్రంలోని విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు(పీపీఏ), ఉత్పత్తి, పంపిణీ సంబంధిత వివాదాలు సెంట్రల్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(సీఈఆర్‌సీ) పరిధిలోకే వస్తాయని ఉమ్మడి హైకోర్టు తీర్పు చెప్పింది. సీఈఆర్‌సీ ఇచ్చిన ఆదేశాలను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలను కొట్టివేసింది. మెరిట్స్ ప్రకారం ఆదేశాలు జారీచేయవచ్చని సీఈఆర్‌సీకి స్పష్టం చేసింది. ఏపీఆర్ ఈఆర్‌సీ, టీఎస్‌ఈఆర్‌సీలు వేర్వేరు కేసుల్లో జారీచేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన వ్యాజ్యాలను ధర్మాసనం అనుమతించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ వి. రామసుబ్రమణియన్, జస్టిస్ పి. కేశవరావుతో కూడిన ధర్మాసనం తుది ఉత్తర్వులు జారీచేసింది. ఉమ్మడి రాష్ట్రంలోని స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డును 1998లో ఏపీ జెన్‌కో, ఏపీ ట్రాన్స్‌కోగా విభజించారు. అంతర్రాష్ట్ర విద్యుత్ వివాదల పరిష్కారానికి సీఈఆర్‌సీ, రాష్ట్రంలో వివాదల పరిష్కారానికి ఏపీఈఆర్‌సీని ఏర్పాటు చేశారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(టీఎస్‌ఈఆర్‌సీ) ఏర్పాటైంది. అదేవిధంగా ఏపీ సర్కారు ఏపీఎస్‌ఈఆర్‌సీ తెచ్చింది. దీంతో ట్రాన్స్‌కో, జెన్‌కోలు విడిపోయాయి. ఉమ్మడి రాష్ట్రంలో కేంద్ర విద్యుత్ పంపిణీ కంపెనీ కర్నూల్‌లో విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మించి పంపిణీ చేయడానికి ప్రణాళిక రచించింది. రాష్ట్ర విభజన తర్వాత కర్నూలు జిల్లా ఏపీకి వెళ్లడంతో సబ్‌స్టేషన్ నిర్మాణ సంస్థకు బిల్లులు నిలిపివేసింది. బిల్లులు నిలిపివేయడంతో నిర్మాణ సంస్థ సీఈఆర్‌సీలో కేసు వేసింది. తెలంగాణకు సంబంధించిన కేసులను బదిలీ చేయాలని టీఎస్‌ఈఆర్‌సీ ఏపీఈఆర్‌సీకి లేఖ రాసింది. దీంతో 43 కేసులను ఏపీఈఆర్‌సీ బదిలీ చేసింది. తమ పరిధిలోని కేసుల్లో ఏపీఈఆర్‌సీ, టీఎస్‌ఈఆర్‌సీలు జారీచేసిన ఆదేశాలపై హైకోర్టులో పెద్ద ఎత్తున పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ వ్యాజ్యాలను విచారించిన ధర్మాసనం డిసెంబరు 31న 51 పేజీల తీర్పు వెలువరించింది.

తీర్పులోని కీలక అంశాలు

- అంతర్రాష్ట్ర వివాదాలు సీఈఆర్‌సీ పరిధిలోకి వస్తాయి. మెరిట్స్ ప్రకారం సీఈఆర్‌సీ ఆదేశాలు జారీ చేయవచ్చు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఏపీ ఈఆర్‌సీలో కేసులను టీఎస్‌ఈఆర్‌సీకి బదిలీ చేయాలన్న వ్యాజ్యాలను కొట్టివేసింది. అవి సీఈఆర్‌సీ పరిధిలోకే వస్తాయని స్పష్టం చేసింది.
- రెండు రాష్ట్రాల మధ్య వివాదాలను వేరుచేస్తూ 2016లో టీఎస్‌ఈఆర్‌సీ ఇచ్చిన ఆదేశాలను కొట్టివేసింది. ఉమ్మడి రాష్ట్రంలో చేసుకున్న పీపీఏలపై వివాదాలను సీఈఆర్‌సీకి బదాలించాలన్న వ్యాజ్యాలను అనుమతించింది. ఇవి సీఈఆర్‌సీ పరిధిలోకే వస్తాయని స్పష్టం చేసింది.
- ఉమ్మడి రాష్ట్రంలోని చేసుకున్న పీపీఏ బకాయిల కోసం దాఖలు చేసిన మరో వ్యాజ్యాన్ని కొట్టివేసింది. వీటికోసం సీఈఆర్‌సీని ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛ నిచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో ఏపీసీపీడీసీఎల్ కర్నూలులో నిర్మిస్తున్న సబ్‌స్టేషన్‌కు ఏపీ ఎస్పీడీసీఎల్ బిల్లులు చెల్లించకపోవడాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. నిర్మాణ సంస్థ పెట్టుకున్న దరఖాస్తును మళ్లీ పరిశీలించాలని కోర్టు సూచించింది.

పార్లమెంటులో నిరసనల హోరు

- ‘అఖిలేశ్-సీబీఐ’పై ఏకమైన ఎస్పీ, బీఎస్పీ
- కాంగ్రెస్, టీడీపీ, అన్నాడీఎంకే నినాదాలు
- కేరళలో హింసపై బీజేపీ ఆందోళన

న్యూఢిల్లీ, జనవరి 7: పార్లమెంటు ఉభయ సభల్లో నిరసనలు కొనసాగాయి. ‘రాఫెల్’పై సభలను ఇప్పటి వరకూ కాంగ్రెస్ ప్రధానంగా స్తంభింపచేస్తుండగా... సోమవారం ఆ పాత్రను ఎస్పీ, బీఎస్పీ పోషించాయి! మైనింగ్ కుంభకోణం కేసులో ఎస్పీ అధ్యక్షుడు అఖిలేశ్‌ను సీబీఐ విచారించనున్నదని వార్తలు రావడంతో.. ఎస్పీ, బీఎస్పీ ఏకమై సోమవారం లోక్‌సభను స్తంభింపచేశాయి. వీరికితోడు ఉదయం సభ ప్రారంభమైనప్పటి నుంచే ‘రాఫెల్’పై జేపీసీ కోసం కాంగ్రెస్, కావేరి నదిపై ప్రతిపాదిత డ్యామ్‌కు వ్యతిరేకంగా అన్నాడీఎంకే సభ్యులు, రాష్ట్ర విభజన హామీల అమలు కోసం టీడీపీ నిరసనకు దిగడంతో మూడుసార్లు వాయిదా పడిన లోక్‌సభ... తర్వాత రోజంతా వాయిదా పడింది. సభ్యులు ఆందోళన చేస్తున్నా దేశంలో ప్రకృతి విపత్తులపై చర్చను స్పీకర్ చేపట్టడంతో ఎస్పీ సభ్యులు కాగితాలు చింపి ఆమెపైకి విసిరారు. అధికారుల వద్ద ఉన్న పత్రాలను కూడా లాగేసుకున్నారు. ఈ చర్యతో స్పీకర్ సుమిత్రా మహాజన్ సభను మంగళవారానికి వాయిదా వేశారు. కాగా, రాష్ట్రాలకు మరింత స్వయం ప్రతిపత్తి ఇవ్వాలని టీఆర్ఎస్ సభ్యుడు జితేందర్‌రెడ్డి కోరారు. మరోవైపు, రాజ్యసభలోనూ నిరసనలు కొనసాగాయి. ఆయా అంశాలపై ఆప్, ఆర్‌జేడీ, తృణమూల్, కేరళలో బీజేపీ హింసను ప్రేరేపిస్తోందని వామపక్షాలు నిరసనకు దిగాయి. దీంతో, రెండుసార్లు వాయిదా పడిన సభ... మూడోసారి రోజంతా వాయిదా పడింది. కాగా, కేరళలో అధికారం పోతుందేమోనన్న భయంతో వామపక్షాలు హత్యా రాజకీయాలకు పాల్పడుతూ బీజేపీ కార్యకర్తలను చంపేస్తున్నాయని బీజేపీ సభ్యుడు నిషికాంత్ దూబే లోక్‌సభలో ఆరోపించారు.

ఈబీసీలకు రిజర్వేషన్లు మోదీ ఘనతే: లక్ష్మణ్

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణాల్లో ఈబీసీలకు రిజర్వేషన్లు కల్పించిన ఘనత ప్రధాని నరేంద్ర మోదీకే దక్కుతుందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె. లక్ష్మణ్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అగ్రవర్ణాల్లోని వెనకబడిన వారికి విద్య, ఉద్యోగాల్లో సమాన అవకాశాలు లభిస్తాయన్నారు.

● చారిత్రాత్మక నిర్ణయం: వల్లపురెడ్డి

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణ పేదలకు 10% రిజర్వేషన్లు కల్పించాలని కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు ఈబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు వల్లపురెడ్డి రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇది ప్రధాని మోదీ తీసుకున్న చారిత్రక నిర్ణయమని కొనియాడారు.

● రిజర్వేషన్లను స్వాగతిస్తున్నాం: తమ్మినేని

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): ఈబీసీలకు విద్య, ఉద్యోగాల్లో 10% రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని సీపీఎం తెలంగాణ కమిటీ స్వాగతించింది. అగ్రవర్ణ పేదల రిజర్వేషన్లకు, కర్పూరి ఠాకూర్ ఫార్ములాను అమలు చేయాలని తమ పార్టీ ఎప్పటినుంచో డిమాండ్ చేస్తున్నదని పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

● మోదీ సర్కారు కొత్త నాటకం: నారాయణ

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల వేళ మోదీ ప్రభుత్వం అగ్రవర్ణాల పేదలకు రిజర్వేషన్లు అంటూ కొత్త రాజకీయానికి తెరతీసిందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ విమర్శించారు. బీజేపీ నాయకులు అమలుకు సాధ్యం కాదని తెలిసీ రిజర్వేషన్ల ప్రకటన చేసిందన్నారు.

● కేవలం ఎన్నికల జిమ్మిక్కు: శ్రీధర్‌బాబు, వీహెచ్

ఈబీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తూ కేంద్ర కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని.. కేవలం ఎన్నికల జిమ్మిక్కుగా కాంగ్రెస్ ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో కుర్మీలు, జాట్‌లు, పటేల్‌లు తదితర అగ్రవర్ణాలకు చెందిన వారి ఓట్లను పొందడానికే ఓబీసీలకు రిజర్వేషన్లు అంటూ మోదీ డ్రామా ఆడుతున్నారని కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ విమర్శించారు.

● కేంద్ర నిర్ణయానికి మేం వ్యతిరేకం: కృష్ణయ్య

రవీంద్రభారతి/హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణాలకు రిజర్వేషన్లపై కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని బీసీ సంక్షేమ సంఘం వ్యతిరేకిస్తోందని ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. రిజర్వేషన్ అనేది పేదరిక నిర్మూలన కోసం కాదని, సామాజిక వివక్ష దృష్ట్యా పుట్టిందన్నారు.

● పార్లమెంట్‌ను ముట్టడిస్తాం: జాజుల

హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల్లో లబ్ధికోసం బీజేపీ ఈబీసీలకు రిజర్వేషన్లు కల్పిస్తోందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆరోపించారు. కేంద్రం తన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోకుంటే వారం రోజుల్లో పార్లమెంటును ముట్టడిస్తామని హెచ్చరించారు.

● సమానత్వ ఉనికికే ముప్పు: రామచంద్రరావు

అగ్రవర్ణాల్లో ఈబీసీలకు విద్యా, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్లు కల్పించాలన్న ఉద్దేశం మంచిదే అయినా.. దీనివల్ల సమానత్వ ఉనికికే ముప్పు వాటిల్లే అవకాశం ఉందని సీనియర్ న్యాయవాది ఎస్.రామచంద్రరావు అన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలని బీసీలు కూడా కోరే అవకాశం ఉందని అభిప్రాయపడ్డారు.

● లోక్‌సభ కోసమే 10% రిజర్వేషన్లు: గుజ్జ కృష్ణ

రాంనగర్/హైదరాబాద్, జనవరి 7 (ఆంధ్రజ్యోతి): అగ్రవర్ణ పేదలకు 10% రిజర్వేషన్లు కల్పిస్తామన్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేదంటే దేశవ్యాప్త ఆందోళన చేపడతామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ కేంద్రాన్ని హెచ్చరించారు. బీసీలకు 50 శాతం రాజకీయ రిజర్వేషన్లు కల్పించాలని ఎన్నో ఏళ్లుగా ఉద్యమాలు చేస్తున్నా స్పందించని ప్రధాని, లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొనే అగ్రవర్ణ పేదలకు 10 శాతం రిజర్వేషన్ నిర్ణయాన్ని తీసుకున్నారని ఆరోపించారు.

ఆకలికి తాళలేక.. పురుగుమందు తాగి..

- ఆస్పత్రిపాలైన గిరిజన బాలుడు
- విచారణకు ఆదేశించిన బాలల హక్కుల కమిషన్

న్యూఢిల్లీ, జనవరి 7: ఆకలి బాధను తాళలేక ఓ గిరిజన బాలుడు పురు గుల మందు తాగి ఆస్పత్రి పాలయ్యాడు. ఆకలిగా ఉందంటూ బాలుడు డిసెంబరు 31న స్థానిక రేషన్ డీలరు వద్దకెళ్లి గోధుమలు ఇవ్వాలన్నాడు. అతడు స్పందించకపోవడంతో ఆ చిన్నారి పురుగుల మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్థానికులు ఆస్పత్రికి తరలించగా బాలుడి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. ఈ ఘటన వైరల్ కావడంతో జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ విచారణకు ఆదేశించింది.

ఈవీఎంల టాంపరింగ్ అసాధ్యం

- సాంకేతిక నిపుణుల పర్యవేక్షణలో యంత్రాలు: సీఈసీ

చండీగఢ్/న్యూఢిల్లీ/చెన్నై, జనవరి 7: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల (ఈవీఎం)ను టాంపరింగ్ చేయడం అసాధ్యమని, వాటిని టాంపర్‌రహితంగా తయారు చేశామని కేంద్ర ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ సునీల్ అరోడా అన్నారు. ఈవీఎంల పనితీరును అత్యున్నత సాంకేతిక నిపుణుల కమిటీ ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని తెలిపారు. ఇటీవల ముగిసిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కొన్ని చోట్ల ఈవీఎంల టాంపరింగ్ జరిగిందంటూ ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో సోమవారం చండీగఢ్‌లో ఓ కార్యక్రమంలో ఆయన ఈ అంశంపై మాట్లాడారు. ఈ సందర్భంగా.. రానున్న లోక్‌సభ ఎన్నికలకు సంబంధించిన పంజాబ్, హరియాణా రాష్ట్రాలు, చండీగఢ్‌లో సన్నాహకాలపై ఆయా ఎన్నికల ప్రధానాధికారులతో చర్చించారు. ఇదిలా ఉండగా.. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి, డీఎంకే వ్యవస్థాపకుడు ఎం.కరుణానిధి మృతితో ఖాళీ అయిన తిరువారూర్ అసెంబ్లీ స్థానానికి ఈ నెల 28న నిర్వహించాలనుకున్న ఉప ఎన్నికను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) రద్దు చేసింది.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao**, on behalf of Aamoda Publications Pvt. Ltd., at the Aamoda press at Gollapalli road.,Dharmaram(B)Village,Dichpally Mandal, Nizamabad- 503230. Editor: **K. Srinivas**, Ph. Nos. 08461-245301, 245306. Fax 245307, RNI NO: AP TEL /2004/12975 .**Managing Director : Vemuri Radha Krishna**, Founder: K.L.N.Prasad.